# మణిప్రవాళం

## (ఆధునిక తెలుగు కథ - ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ)

*ప్రధాన సంపాదకులు*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

ఆగు నీ అరికేతా
BE BOUNDLESS

బెంగళూరు సిటీ విశ్వవిద్యాలయం
బెంగుళూరు

# మణిప్రవాళం

## (ఆధునిక తెలుగు కథ - ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ)

*ప్రధాన సంపాదకులు*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు సిటీ విశ్వవిద్యాలయం

బెంగుళూరు

**MANI PRAVALAM (ADHUNIKA TELUGU KATHA, ADHUNIKA TELUGU SAHITYA VIMARSHA) :** A Prescribed Telugu Textbook for IV Semester Degree Classes, Chief Editor: Prof. K. Asha Jyoti; Chairperson, Department of Studies in Telugu, Bangalore University, Jnanabharati, Bengaluru; Published by Bangalore City University, Bengaluru; pp viii + 134.

© బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం

ప్రథమ ముద్రణ**:** 2021

*ప్రధాన సంపాదకులు:*

**ఆచార్య కె. ఆశాజ్యోతి**

**అధ్యక్షులు,** తెలుగు అధ్యయన శాఖ

బెంగళూరు విశ్వవిద్యాలయం

జ్ఞానభారతి, బెంగుళూరు-560056

*ప్రకాశకులు* **:**

నిర్దేశకులు

ప్రసారాంగ మరియు ముద్రణాలయ విభాగం

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం

బెంగుళూరు

---

ముద్రణ:

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం, బెంగుళూరు

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
అధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగుళూరు-560056

# ముందుమాట

బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం డిగ్రీ కళాశాలలో బి.ఏ. / బి.ఎస్సి / బి.ఎస్సి. (ఫాడ్) / బి.కాం. / బి.బి.ఎమ్ / బి.హెచ్.ఎమ్ / బి.బి.ఎ. కోర్సులు చేస్తూ, తెలుగు రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థులకు తెలుగు పాఠ్యాంశాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. పాఠ్య ప్రణాళికా సంఘం వారు విద్యార్థుల కోసం నిర్దేశించిన ఆధునిక తెలుగు కవిత్వం, ఆధునిక తెలుగు నాటకం, "మణికర్ణిక" అను పేర మూడవ సెమిస్టర్‌కు, ఆధునిక తెలుగు కథ, ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ "మణిప్రవాళం" అను పేర నాలుగవ సెమిస్టర్‌లకు పాఠ్యాంశాలు.

నాల్గవ సెమిస్టర్‌కు "మణి ప్రవాళం" అనే తెలుగు పాఠ్య గ్రంథంలో ఆధునిక తెలుగు కథ అనేది మొదటి భాగం కాగా, రెండవ భాగం ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ. ఆధునిక తెలుగు కథలో భాగంగా పి. సత్యవతిగారి "ఇల్లలకగానే...", బుచ్చిబాబుగారి "నన్ను గురించి కథ వ్రాయవూ", నాగప్పగారి సుందరరాజుగారి "నడిమిండి బోడక్క బసివిరాలయ్యేద", మహమ్మద్ ఖదీర్‌బాబుగారి "మాయమ్మ పూల యాపారం", జూపాక సుభద్రగారి "శుద్ధిచెయ్యాలె" అనే కథలను చేర్చడం ద్వారా ఆధునిక తెలుగు కథ గురించి ఆయా కవుల కథాకథన పద్ధతి, రచనా శైలి విద్యార్థులకు అవగతం అవుతుంది. అలానే రెండవ భాగమైన ఆధునిక తెలుగు సాహిత్య విమర్శలో ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారి "ఉపాధ్యాయ విమర్శకుడు ఎఫ్.ఆర్. లీవిస్", వల్లంపాటి వెంకటసుబ్బయ్యగారి "మంచికథ - నాలుగు లక్షణాలు", ఆచార్య కొలకలూరి ఇనాక్‌గారి "ఆధునిక సాహిత్య విమర్శ", వాడ్రేవు వీరలక్ష్మిదేవిగారి "అడవి బాపిరాజుగారి-తుఫాను", ఆచార్య కాత్యాయిని

విద్మహేగారి “తెలంగాణ పోరాటం–తెలుగు కథ” అనే వ్యాసాల ద్వారా తెలుగు విద్యార్థులు సాహిత్య విమర్శకు సంబంధించి వివిధ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోగలుగుతారు.

కళాశాల స్థాయిలో డిగ్రీ మొదటి, రెండు విద్యా సంవత్సరాల నాలుగో సెమిస్టర్లలో తెలుగు ఉండడం వల్ల బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం విద్యార్థులకు పాఠ్య ప్రణాళికా సంఘం ద్వారా ఆమోదించబడిన పాఠ్యాంశాలను ప్రారంభించడమైంది.

తెలుగును రెండవ భాషగా ఎన్నుకున్న విద్యార్థుల అభివృద్ధిని ఆకాంక్షిస్తున్న బెంగళూరు సిటి విశ్వవిద్యాలయం కులపతి ఆచార్య లింగరాజు గాంధీగారికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలుపుతున్నాను.

**ఆచార్య కె. ఆశాజ్యోతి**
శాఖాధ్యక్షులు, తెలుగు అధ్యయన శాఖ
బెంగళూరు విశ్వవిద్యాలయం
జ్ఞానభారతి, బెంగుళూరు–560056

## సెమిస్టర్-1V

## తెలుగు పాఠ్యపుస్తకం

## (బి.ఎ., బి.ఎస్సి., బిఎస్సి(ఫాడ్), బి.కాం., బి.బి.ఎమ్., బిహెచ్.ఎమ్., బి.సి.ఎ., బి.బి.ఎ.)

# విషయ సూచిక

## I. ఆధునిక తెలుగు కథ


1. ఇల్లలకగానే... - పి. సత్యవతి 3

2. నన్ను గురించి కథ వ్రాయవూ - బుచ్చిబాబు 8

3. నడిమింటి బోడక్క బసివిరాలైయెద-నాగప్పగారి సుందరరాజు 24

4. మాయమ్మ పూల యాపారం - మహమ్మద్ ఖదీర్ బాబు 41

5. శుద్ధిచెయ్యాలె - జూపాక సుభద్ర 51


## II. ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ


1. ఉపాధ్యాయ విమర్శకుడు ఎఫ్.ఆర్.లీవిస్
   - ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం 61
2. మంచి కథ-నాలుగు లక్షణాలు
   - వల్లంపాటి వెంకటసుబ్బయ్య 68
3. ఆధునిక సాహిత్య విమర్శ
   - ఆచార్య కొలకలూరి ఇనాక్ 80
4. అడవి బాపిరాజు గారి "తుపాను"
   - వాడ్రేవు వీరలక్ష్మిదేవి 102
5. తెలంగాణ పోరాటం - తెలుగు కథ
   - ఆచార్య కాత్యాయిని విద్మహే 109

# తెలుగు పాఠ్య పుస్తకం

# నాల్గవ సెమిస్టర్

## ఆధునిక తెలుగు కథ

**కథలు**


1. ఇల్లలకగానే...
   – పి. సత్యవతి 3

2. నన్ను గురించి కథ వ్రాయవూ
   – బుచ్చిబాబు 8

3. నడిమింటి బోడక్క బసివిరాలైయెద
   – నాగప్ప గారి సుందరరాజు 24

4. మాయమ్మ పూల యాపారం
   – మహమ్మద్ ఖదీర్ బాబు 41

5. శుద్ధిచెయ్యాలె
   – జూపాక సుభద్ర 51

# ఇల్లలకగానే...

**-పి. సత్యవతి**

ఇల్లాలు కాక పూర్వం ఓ యువతి చదువూ సంధ్య తెలివీ చాకచక్యం, సమయస్ఫూర్తీ, హాస్యం, లాస్యం అన్నీ కలిగిన అమ్మాయి.

అమ్మాయి అందం తెలివీ, వాళ్ళ నాన్న ఇచ్చిన కట్నం బాగా నచ్చిన ఓ చిన్నవాడు ఆ అమ్మాయి మెడలో మూడుముళ్ళూ వేసి, ఓ ఇంటికి ఇల్లాల్ని చేసి, "ఇదిగో అమ్మడూ ఈ ఇల్లు నీది!' అని చెప్పేడు. ఆ ఇల్లాలు వెంటనే పయిట నడుముకి బిగించి, ఇంటిని అందంగా అలికి ముగ్గులు పెట్టింది. ఆ చిన్నవాడు వెంటనే ఆ ఇల్లాల్ని మెచ్చుకుని, "నువ్వు ఇల్లు అలకడంలో నేర్పరివి – ముగ్గులు వెయ్యడంలో అంతకన్నా నేర్పరివి – సెభాష్ కీప్ ఇట్ అప్' అని ఇంగ్లీషులో మెచ్చుకుని భుజం తట్టాడు.

దాంతో ఆ ఇల్లాలు తెగ మురిసిపోయి, ఇల్లలకడమే ధ్యేయంగా తన జీవితాన్ని కొనసాగించింది. ఎల్లప్పుడూ ఇంటిని పరిశుభ్రంగా అలికి రంగురంగుల రంగవల్లికలు తీర్చిదిద్దింది. ఆ విధంగా ఆమె జీవితం మూడు అలుకు గుడ్డలూ – ఆరు ముగ్గుబుట్టలుగా సాగిపోతూ వచ్చింది. కానీ ఒకనాడా ఇల్లాలు ఇల్లలుకుతూ అలుకుతూ 'నా పేరేమిటి చెప్మా!' అనుకుంది. అలా అనుకుని ఉలిక్కిపడింది. చేతిలో అలుకు గుడ్డా, ముగ్గు బుట్టా అక్కడ పడేసి కిటికీ దగ్గర నిలబడి తల గోక్కుంటూ 'నా పేరేంటి నా పేరేమిటీ!' అని తెగ ఆలోచించింది. ఎదురుగా ఇంటికి నేమ్ బోర్డు వ్రేలాడుతోంది. మిసెస్ ఎం.సుహాసిని ఎం.ఎ., పిహెచ్.డి. – ప్రిన్సిపాల్ 'ఎక్స్' కాలేజీ అని – అవును అలాగే తనకీ ఓ పేరుండాలి కదా – ఇలా మర్చిపోయానేమిటి? ఇల్లలికే సంబరంలో పేరు మరిచిపోయాను – ఇప్పుడెలాగ అనుకుని ఆ ఇల్లాలు కంగారుపడిపోయింది. మనసంతా చికాగ్గా అయిపోయింది. ఎలాగో ఆ పూటకి ఇల్లలకడం కానిచ్చింది. అంతలో పనిమనిషి వచ్చింది– పోనీ ఆమెకైనా గుర్తుందేమోనని, 'అమ్మాయ్ నా పేరు నీకు తెలుసా!'

అని అడిగింది.

'అదేమిటమ్మా అమ్మగార్ల పేర్లతో మాకేమిటి పని! మీరంటే మాకు అమ్మగారే! ఫలానా తెల్లమేడ క్రిందభాగంలో అమ్మగారంటే మీరు' అన్నది ఆ అమ్మాయి.

'అవున్లే పాపం నీకేం తెలుసు!' అనుకుంది ఇల్లాలు.

స్కూల్ నుంచి పిల్లలు మధ్యాహ్న భోజనానికి వచ్చారు. పిల్లలకైనా గుర్తుందేమో నా పేరు అనుకుంది ఇల్లాలు.

'ఓరే పిల్లలూ, నా పేరు మీకు తెలుసా? అని అడిగింది వాళ్లు తెగ ఆశ్చర్య పడిపోయి 'నువ్వు అమ్మవి – నీ పేరు అమ్మే – మేం పుట్టినప్పటినించీ మాకు తెలిసింది అదే – నాన్నగారి పేరుతో ఉత్తరాలొస్తాయి. ఆయన్నంతా పేరుతో పిలుస్తారు గనుక మాకు తెలుసు. నీ పేరు నువ్వు మాకెప్పుడూ చెప్పలేదు గదా! పోనీ నీ పేరుతో ఉత్తరాలు కూడా రావు' అనేశారు వాళ్ళు. అవును తనకెవరు ఉత్తరాలు రాస్తారు? అమ్మా నాన్న వున్నారు గానీ నెలకో రెండు నెలలకో ఓసారి ఫోన్ చేస్తారు – చెల్లెళ్లు, అక్కలూ కూడా వాళ్ళ వాళ్ల ఇళ్లు అలుక్కోపడంలో నిమగ్నమై వున్నారు. వాళ్ళంతా ఏ పెళ్ళిలోనో పేరంటంలోనో కలిస్తే కొత్త ముగ్గుల్ని గురించో – వంటల్ని గురించో మాట్లాడుకోడమే గానీ ఉత్తరాలు లేవు. ఇల్లాలు నిరాశపడింది కానీ ఆమెకి అశాంతి ఎక్కువైంది. తన పేరెలాగైనా గుర్తు తెచ్చుకోవాలనే తపన ఎక్కువైంది. అంతలో పక్కింటావిడ పేరంటం పిలవడాని కొచ్చింది. పోనీ ఆవిడకేమైనా గుర్తుందేమోనని అడిగితే ఆవిడ కిసుక్కున నవ్వేసి,

'మరే! మీ పేరు నేనడగలేదు – మీరు చెప్పలేదు. కుడిచేతి వైపు తెల్లమేడావిడ. అల్లదుగో ఆ మందుల కంపెనీ మేనేజరు గారి భార్య అనో లేకపోతే తెల్లగా పొడుగ్గా వుంటుందే ఆవిడ అనో చెప్పుకుంటాం – అంతే' అనేసింది ఆ ఇల్లాలు.

ఇంక లాభం లేదు – పిల్లల స్నేహితులు మాత్రం ఏం చెప్తారు – వాళ్ళకి కమలా వాళ్ళ అమ్మ అనో, ఆంటీ అనో తెలుసు – ఇక భర్తగారొక్కరే శరణ్యం – ఆయనకే గుర్తుంటే వుండాలి.

రాత్రి భోజనాల దగ్గర అడిగింది 'ఏవండీ, నా పేరు మర్చిపోయానండి – మీకు గుర్తుంటే చెప్పరా!

భర్తగారూ పెద్దగా నవ్వేసి 'అదేమిటోయ్ ఎన్నడూ లేనిదివ్వాళ్ల పేరు సంగతి ప్రస్తావిస్తున్నావు. నిన్ను పెళ్ళయిన్నాటి నుంచీ 'ఏమోయ్' అని పిలవడం అలవాటై పోయింది. నువ్వు కూడా అలా పిలవకండి నా పేరు నాకుంది కదా అని

చెప్పద్దూ – అందుకని నేనూ మర్చిపోయాను ఇప్పుడేం? నిన్నందరూ మిసెస్ మూర్తి అంటారు గదా' అన్నాడు. 'మిసెస్ మూర్తి కాదండీ నా అసలు పేరు నాక్కావాలి ఎలాగిప్పుడు' అన్నది ఆవేదనగా.

'దానికేం పోనీ ఏదో ఒక పేరు పెట్టేసుకో కొత్తది' అని సలహా ఇచ్చాడు ఆయన.

'బావుందండీ – మీ పేరు సత్యనారాయణ మూర్తి అయితే మిమ్మల్ని శివరావు అనో సుందరరావు అనో పెట్టుకోమంటే ఊరుకుంటారా? నా పేరే నాక్కావాలి' అన్నది.

'బాగానే వుంది. చదువుకున్నావు గదా – సర్టిఫికెట్ల మీద పేరుంటుంది గదా – ఆ మాత్రం కామన్ సెన్స్ లేకపోతే ఎలా చూసుకో వెళ్ళి' అని సలహా ఇచ్చాడాయన మళ్ళీ.

ఇల్లాలు సర్టిఫికెట్ల కోసం హెూరాహెూరీ వెతికింది – బీరువాలో పట్టుచీరెలు షిఫాన్ చీరలు, నేత చీరెలు, వాయిల్ చీరెలు వాటి మాచింగ్ జాకెట్లు, లంగాలు గాజులు, పూసలు, ముత్యాలు, పిన్నులు, కుంకుమ భరిణెలు, గంధం గిన్నెలు, వెండి కంచాలు, బంగారు నగలు అన్నీ పొందికగా అమర్చివున్నాయే గానీ అందులో సర్టిఫికెట్ల జాడలేదు. అవును – తను పెళ్ళయిన తరువాత ఇక్కడికొచ్చేటప్పుడు అవి తెచ్చుకోలేదు.

'అవునండీ – నేను అవి ఇక్కడికి తెచ్చుకోలేదు నేను మా ఊరు వెళ్ళి ఆ సర్టిఫికెట్లు వెతుక్కుని నా పేరు అడిగి తెలుసుకుని రెండు రోజుల్లో వచ్చేస్తాను' అని అడిగింది భర్తని.

'బాగానే వుంది పేరుకోసం ఊరెళ్ళాలా ఏం? నువ్వు ఊరెడితే ఈ రెండు రోజులూ ఇల్లెవరలుకుతారు?' అన్నాడు నాథుడు. అవును నిజమే మరి తనందరికన్నా బాగా అలుకుతుందని గదా – ఆపని ఎవర్నీ చెయ్యనివ్వలేదు ఇన్నాళ్ళూ – ఎవరి పన్లు వాళ్ళకున్నాయి. ఆయనకి ఉద్యోగం – పిల్లలకి చదువులు – వాళ్ళకెందుకులే శ్రమపాపం అనుకుని తనే ఆ పనిచేస్తూ వచ్చింది. వాళ్ళకి అసలు చేతకాదుమరి. అయినా పేరు తెలీకుండా ఎలా బ్రతకడం.

ఇన్నాళ్లు ఆ విషయం గుర్తురాలేదు గనుక సరిపోయిందిగానీ గుర్తొచ్చాక కష్టంగానే వుంది.

'రెండురోజులెలాగైనా కష్టపడండి – నే వెళ్ళి నా పేరు కనుక్కుని రాకపోతే బ్రతకలేకుండా వున్నాను' అని బ్రతిమిలాడి బయటపడింది ఇల్లాలు.

'ఏమ్మా ఇంతర్జంటుగా వచ్చావు? ఆయనా పిల్లలూ బావున్నారా! ఒక్క దానివే వచ్చావేం' అని అమ్మా నాన్నా ఆప్యాయంగానే పలకరించినా అందులో కొంత సందేహాన్ని కూడా జోడించారు. వచ్చిన పని వెంటనే గుర్చుకొచ్చి 'అమ్మా నా పేరేమిటో చెప్పమ్మా' అనడిగింది. ఎంతో దీనంగా ఇల్లాలు. 'అదేమిటమ్మా నువ్వు మా పెద్దమ్మాయివి. నీకు బి.ఏ. దాకా చదువు చెప్పించి యాభైవేలు కట్నం ఇచ్చి పెళ్ళి చేశాం. రెండు పురుళ్ళు పోశాం. ప్రతి పురిటికీ ఆస్పత్రి ఖర్చులు మేమే భరించాం. నీకిద్దరు పిల్లలు. మీ ఆయనకి మంచి ఉద్యోగం, చాలా మంచివాడు కూడానూ, నీ పిల్లలు బుద్ధిమంతులు'.

'నా చరిత్రకాదమ్మా, నా పేరు కావాలమ్మా నాకు – పోనీ నా సర్టిఫికెట్లు ఎక్కుడున్నాయో చెప్పు'.

'ఏమోనమ్మా ఈ మధ్య అలమారల్లో పాత కాగితాలు, ఫైళ్ళు అన్ని ఖాళీ చేసేసి గాజు సామాన్లు సర్దించాం. కొన్ని కొన్ని ముఖ్యమైన ఫైళ్లు అటకమీద పడేశాం, రేపు వెతికిద్దాంలే – ఇప్పుడు వాటికేం తొందర? హాయిగా స్నానం చేసి భోజనం కానియ్యమ్మా' అన్నది ఆ ఇల్లాలి తల్లి. ఇల్లాలు హాయిగా స్నానం చేసి భోజనం చేసి... కానీ నిద్రరాలేదు. ఆడుతూ పాడుతూ ఇల్లలుకుతూ ముగ్గువేస్తూ పేరు మర్చిపోవడం వల్ల ఇలా ఇన్ని కష్టాలొస్తాయని ఎప్పుడూ అనుకోలేదు.

తెల్లవారింది గానీ అటక మీద ఫైళ్ళలో సర్టిఫికెట్లు వెతకడం పూర్తికాలేదు ఈలోగా ఆ ఇల్లాలు కనపడ్డ మనిషినల్లా అడిగింది. చెట్టునడిగి, పుట్టనడిగీ చెరువునడిగి, తను చదివిన స్కూలు నడిగీ, కాలేజినడిగి, అరచీ ఆక్రోశించి ఎట్టకేలకు ఓ మిత్రురాలిని కలిసి తన పేరు సంపాదించింది. ఆ స్నేహితురాలు తనలాగే, తనతోనే చదువుకుని తనలాగే పెళ్ళి చేసుకుని, తనలాగా బ్రతుకు ఇల్లలకడంగా కాకుండా, ఇల్లలకడం బ్రతుకులో ఓ భాగంగా బ్రతుకుతూ తన పేరునూ, తన స్నేహితుల పేర్లనూ కూడా గుర్తుంచుకున్న వ్యక్తి ఆ స్నేహితురాలు ఈవిణ్ణి చూడగానే గుర్తుపెట్టి, 'ఓ, హెూయ్ శారదా! నా ప్రియమైన శారదా!" అని కేకలు పెట్టి కౌగిలించుకుంది. అప్పుడా ఇల్లాలిని దాహంతో ఆర్చుకుపోయి, ఎండిపోయి ప్రాణం పోవడానికి సిద్ధపడిన వాడికి కొత్త కూజాలో నీళ్లు నోట్లోపోసి బ్రతికించిన చందంగా, బ్రతికించింది ఆ స్నేహితురాలు.

'నువ్వు శారదవి, నువ్వు మన స్కూల్లో టెన్త్ క్లాసులో ఫస్ట్ వచ్చావు, కాలేజీలో జరిగిన మ్యూజిక్ పోటీలో ఫస్టొచ్చావు. అప్పుడప్పుడు మంచి మంచి బొమ్మలు వేసేదానివి. మనందరం పదిమంది స్నేహితులం. వాళ్ళందర్నీ నేను అప్పుడప్పుడూ కలుసుకుంటూనే వున్నాను. మేం ఉత్తరాలు రాసుకుంటూనే వున్నాం. నువ్వొక్కదానివే మాకు అందకుండా పోయావు. చెప్పు ఎందుకు అజ్ఞాతవాసం చేస్తున్నావు' అని నిలదీసింది ఆవిడ.

అవును ప్రమీలా – నువ్వు చెప్పింది నిజం. నేను శారదనే. నువ్వు చెప్పేదాకా నాకు జ్ఞాపకం రాలేదు. నా మెదడులోని అరలన్నీ కూడా ఇల్లు ఎంత బాగా అలకాలీ అనే విషయం మీదే కేంద్రీకృతం అయిపోయాయి. ఇంకేం గుర్తులేదు. నువ్వు కనపడకపోతే నాకు పిచ్చెక్కిపోయేది' అంది శారద అనే పేరుగల ఆ ఇల్లాలు. శారద సరాసరి ఇంటికివచ్చి అటక ఎక్కి పాత ఫైళ్లు తిరగదోడి తన సర్టిఫికెట్లు తను వేసిన బొమ్మలు – పాత ఆల్బంలు అన్నీ సాధించింది. తను స్కూల్లో కాలేజీలో గెలుచుకున్న ప్రైజులు కూడా వెతికి పట్టుకుంది.

కొండంత సంతోషంతో ఇంటికి తిరిగివచ్చింది. 'నువ్వు లేక ఇల్లు చూడెలా వుందో. సత్రంలా వుంది. అమ్మయ్య నువ్వొచ్చావు ఇంక మాకు పండగేనోయ్' అన్నాడు శారద భర్త. 'ఇల్లలకగానే పండగ కాదండీ, అవును గానీ ఇక నుంచి నన్ను ఏమోయ్‌గీమోయ్ అనకండి నా పేరు శారద – శారదా అని పిలవండి తెలిసిందా' అని కూనిరాగాలు తీస్తూ హుషారుగా లోపలికి వెళ్ళింది. ఏమూల దుమ్ము వుందో ఎక్కడ సామాన్లు ఆర్డర్‌లో లేవోనని చాలా సీరియస్ గా వెతుకుతూ, డిసిప్లిన్ కోసం తపనపడే శారద రెండురోజులుగా దులపని సోఫాలో హాయిగా చేరబడి, తను తెచ్చిన బొమ్మల్ని పిల్లలకి చూపిస్తుంది.

# నన్ను గురించి కథ వ్రాయవూ!

## - బుచ్చిబాబు

'నన్ను గురించి కథ వ్రాయవూ?' అని అడిగింది కుముదం.

ఈ ప్రశ్న నాకు కొంత ఆశ్చర్యం కలుగజేసింది. ఎందుకంటే కొద్ది మార్పుతో ఇదే ప్రశ్న ఎనిమిది సంవత్సరాల క్రితం అడిగింది. నాకు బాగా జ్ఞాపకం మా మేనమామగారింట్లో కుముదం తండ్రి కాపురం వుండేవాడు. అద్దె తీసుకురమ్మని అప్పుడప్పుడు నన్ను పంపేది మా అత్తయ్య. ఆ రోజు సాయంత్రం కర్రకు మేకు దిగేసి ఇనపచక్రం దొర్లించుకుంటూ దొడ్లో పరుగులెత్తింది కుముదం. నాకప్పుడు పన్నెండో ఏడు. ఆమె నాకంటె రెండు సంవత్సరాలు చిన్నదని వాళ్ళమ్మ నాకు చెప్పింది. నేను అద్దెమాట మరచి కుముదంతో కబుర్లు చెబుతూ కూర్చుండేవాడిని. చెట్టెక్కి జామపండు కోసి పెట్టమని వేధించుకు తినేది. పూర్తిగా పండని జామపండు రంగులా వుండేది ఆ పిల్లచాయ. నేనేవో కల్పించి కథల కింద చెప్పేవాడిని. వీటిల్లో పాత్రలు మా వూళ్లో యిరుగు పొరుగు అబ్బాయిలూ, అమ్మాయిలు. ఈ కబుర్లు అమాయకంగా చూస్తూ విన్నా, కుముదం కళ్ళల్లో ఎక్కడో యీర్ష్య మసకగా మెదిలినట్లు భ్రమించి, నేను గర్వపడే వాడిని. అతిశయోక్తి కల్పన కథకుడి జన్మ లక్షణం కాబోలు! యదార్థ విషయాలు మానేసి, కల్పిత గాథలను యథార్థాలుగా చెప్పడం ఊహా సృష్టి లక్షణం అనుకుంటా. ఇవన్నీ కుముదం నమ్మినట్లుగానే కొంటెగా నిట్టూర్పు విడిచేది. నేనూ, యీ వ్యక్తులు, ఘట్టాలు యథార్థాలుగా స్మరించుకొని తెచ్చి పెట్టుకొన్న మౌనంలో పడేవాడిని. ఆ నిశ్శబ్దంలో కుముదం కంఠం వినిపించింది. 'నన్ను గురించి కథ చెప్పవూ?' అంది. ఆ ప్రశ్న వెయ్యకపోతే ఆమె కథ మరొకరి దగ్గర చెప్పివుందునేమో నాకు తెలీదు. నే అనుకోవడం ఆమె కథ ఎవరితోనూ చెప్పివుండను. ఎందుకంటే, ఆమె నిజంగా మనిషి – ఊహాలో వ్యక్తికాదు. అదే ప్రశ్న మళ్ళా అడగడం నాకు ఆశ్చర్యం కలగజేసింది. ఐనా నేను కథలు వ్రాస్తానన్న సంగతి ఆమెకెట్లా తెలుసో నాకర్థంకాలేదు. నా కథలు వొకటి

రెండు తప్ప అచ్చుకాలేదు. వాటిని గురించి నేనెవ్వరితోనూ ముచ్చటించలేదు. ఇరవై సంవత్సరాల యువక అజ్ఞానంలో వున్న నన్ను ఎన్నుకోతగ్గ రచయితగా యీ సంఘం గుర్తించిందని నా భయం. ముదుసలే జ్ఞాని కాగలడని భారతీయుల వెర్రి నమ్మకం. పెద్దలన్నా, ప్రాచీనులన్నా, పాత విషయాలన్నా, మనవాళ్ళకి అంత గౌరవం. ఒక విషయం మంచిదా చెడ్డదా అన్న తార్కిక సంశయాలకి సంఘంలో అంతగా తావులేదు. ఎటొచ్చీ ఆ విషయాన్ని ప్రతిపాదించిన వ్యక్తి మృతుడై వుండాలి! శక్తిగల వాళ్ళు ధనార్జనలోనూ, అది లేనివాళ్లు దైవంలోనూ లీనమైన యీ దేశంలో కథకుడికి విలువలేదని నేనారోజుల్లో నమ్మేవాడిని. నేను వ్రాసి తగల పెట్టిన రచనలతో నాకు మరోదేశంలో బ్రహ్మరథం పడుదురు. సంఘం గుర్తించదన్న భయమొకటేకాదు నేను కథలు వ్రాయకపోవడానికి కారణం. నా రచనా విధానానికి పరిపక్వం రాలేదని కూడా నే లోపల అనుకునేవాడిని. నా సృష్టిశక్తుల్ని రగిల్చి నన్ను తన్మయుణ్ణిచేసి నా జీవితంపై వొత్తిడి కలిగించే వ్యక్తులుగాని నా రచనల్ని చదివి, వాటిల్లోని లోతులకి దిగ్భ్రాకి తాత్కాలికంగానైనా ధన్యతచెందే వ్యక్తులుకాని ఆనాటి వరకూ లేరని నాకు తెలుసు. ప్రపంచాన్ని పరిశీలిస్తూ వ్యక్తుల మంచిచెడ్డలని వింత ప్రవర్తనని ప్రేక్షకుడుగా అనుభవించి అర్థంచేసుకొని, అలా సంపాదించిన అంతరంగిక జ్ఞానాన్ని నా తాత్విక దృష్టితో మేళవించి వార్ధక్యంలో మహత్తర గ్రంథం వ్రాసి మరణించాలని నా ఆదర్శం. ఈ రెంటిలో వొకటైనా జరిగితీరుతుంది. మహత్తర గ్రంథం వ్రాయలేకపోవచ్చు. కాని మరణం మాత్రం తప్పదన్న ధైర్యం నాకో నూత్న ఉత్సాహాన్ని ప్రసాదించింది. ఆ రోజుల్లో 'నన్ను గురించి కథ వ్రాయవూ?' అనే ప్రశ్న స్త్రీ నోటినుంచి వినడం అది మొదటిసారి. తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకుని దాని ప్రభావాన్ని ఇతరులకి తెలియచెయ్యాలన్న స్త్రీని మొట్టమొదట కుముదంలో చూడగలిగాను. ఆమెవొక జీవి, ప్రత్యేకమైన ఉనికిగలది. ఆమెని తొలగిస్తే ప్రపంచంలో కొంత పవిత్రమైన ఖాళీ ఏర్పడుతుంది. నేచూసిన స్త్రీలు వివాహం జరిగిన రోజునే జన్మించిన వాళ్ళు. భర్తని పొడిగిస్తే, స్త్రీ ఔతుంది. యింకా పొడిగిస్తే భర్త సంతానంగా మారతాడు. అతను గతించగానే ఆమె స్థూలజీవితం సమాప్తమౌతుంది. సృష్టిని ఆహ్వానిస్తూ తెరుచుకున్న తలుపులు మన స్త్రీలు. తెరచుకోని తలుపులు లేవు. ఏదైనావొక తలుపు తెరచుకోనినాడు, దాన్ని గురించి చెప్పుకొని, మరమ్మతు సంకల్పించాలి. మరమ్మతు చేసినా బాగుపడని తలుపులను నిర్మూలనం చెయ్యాలా, లేక వేరే పనులకు ఉపయోగించుకోవాలా

అన్న సందేహాన్ని సంస్కర్తలు తీర్చాలి. కథకుడు ఏం చెడిపోయిందో చెప్పగలడు. వీలైతే మిగిలినదానితోనే తృప్తిపడుతూ యితరులతో ఆ తృప్తిని పంచుకోగలడు. కాని బాగుచేసే విధానాలతో అతనికి నిమిత్తం లేదు.

'నీలో ఏముందని నిన్ను గురించి కథ వ్రాయనూ?" అన్నాను. అలా అన్నందుకు పశ్చాత్తాప పడినా, ఆ ప్రశ్న నా నమ్మకాన్ని ఆశయాలనీ యథార్థంగా వ్యక్తపరుస్తుంది. ఆమెలో కథావస్తువుగా వుండేటంతటి విశేషం వొక్కటి కూడా లేదు. చూడటానికి చాలా సామాన్యంగా వుంటుంది. పల్చటి శరీరం, వేసంగిలో వర్షం కురిసేముందు దట్టంగా అల్లుకున్న మబ్బురంగు శరీరచ్ఛాయ, సంపూర్ణంగా వికసించని అవయవాలు, ఎవరో దువ్వినట్లుగా వుండే జడకట్టు, చూసిన వస్తువులు తనకోసం కానట్టు చాంచల్యంగా కదిలే బలహీనమైన కనురెప్పలకింద మంచులో కదిలిపోయిన కుందేలులా మెరిసే నేత్రాలు; కంఠంలో కొలవడానికి వీలుగా వుండే పచ్చటి నాళాలు. నీడ కనిపించినట్లు స్ఫురించే వక్షం. శరీరంలో పై భాగాన్ని మోసేందుకు వోపకలేనట్టి అల్పమైన నడుం. కుముదం సాధారణమైన స్త్రీ. ఎవరూ తుదకు వాళ్లమ్మకూడ – ఆమె అందమైందని చెప్పుకోడం నేనెరగను. అందుకనే ఆమెలో నేనేమీ విశేషం చూడలేకపోయ్యానేమో!

'నాలో ఏముండాలి?'

'ఒక ప్రత్యేకత, అందరిలోనూ లేని ఏ ఒక్క విశేషం అయినా సరే' వేలునున్న ఉంగరాన్ని చూచి దాన్ని వేళ్లతో తిప్పింది. పోతపోసి పదును పెట్టినట్లుగా చలించే వేళ్ళు ఆమెవి. ఏ అవయవం కదిలినా, శరీరంలోని శక్తంతా దానిలో పూరించినట్లుగా వుంటుంది. ఒక వస్తువుకేసి చూస్తున్నప్పుడు, పంచప్రాణాలు కళ్లలోకి పరిగెత్తు కొచ్చినంత తీవ్రంగా చూస్తుంది. సిగ్గుపడితే రక్తం చెక్కిళ్లలోనుంచి తొంగిచూస్తున్నట్టుంటుంది. కాని కుముదాన్ని వర్ణించినంత మాత్రాన కథౌతుందా?

'నీ పెండ్లికి నన్ను పిలవలేదం?' అని అడిగాను.

'మా అమ్మ నీకు శుభలేఖ పంపానంది – వొస్తే నలుగుర్నీ చూసి, ఏమన్నా వుంటే కథేనా వ్రాద్దువుగా' అంది కుముదం, కళ్లల్లోంచి పెదవుల మీదికి దిగజారిన నవ్వుని ప్రదర్శిస్తూ.

'నేను తమాషాకి అనడం లేదు. సాధారణ వ్యక్తులను గురించి వ్రాసేటందుకు ఏముంది? పదిమందీ ఒకేలాగున్నప్పుడు వారిలో ఏ ఒక్కర్నీ గురించి చెప్పుకోం.

కానీ అందులో ఏ ఒక్కడైనా పదిమంది చేసినదానికి వ్యతిరేకంగా చేస్తే అతన్ని గురించి చెప్పుకుంటారు. అట్లాంటి వ్యక్తులని గురించి వ్రాయుచ్చు' అన్నాను.

'అయితే అందరూ చేసినదానికి విరుద్ధంగా చేసేవాళ్లే మనుషులన్న మాట...'

'నే అల్లా అనను. అట్లాంటి వాళ్లు చెప్పుకోదగ్గ మనుషులంటాను.'

ఎక్కడో ఎప్పుడో పుట్టడం, ఎవరో ఎవర్నో వొప్పగిస్తే వార్ని పెళ్లాడడం. ఎందుకో తెలీకుండా పిల్లల్ని కనడం, ఎప్పుడో ఎక్కడో చచ్చిపోవడం. ఇది చాలా మంది చేస్తున్నది. దీన్ని గురించి కథగా చెప్పుకునేందుకు ఏముంది? ప్రత్యేకత, వ్యక్తిత్వం లేని యీ జీవితాలు ప్రశాంతాన్ని పొందుతున్నాయి. కాని అది బురద గుంటలో పురుగు పొందే ప్రశాంతం. సంఘాన్ని ధిక్కరించి సాంప్రదాయాలపై విప్లవంచేసి, యితరులకి అవగాహన కాని కొత్త విలువని సాధించి పొందినవాడే ధన్యజీవి. వ్యర్థజీవులు సంఘం అల్లిన వలలో చిక్కుకొని, మర్యాద పేరు చెప్పుకుని కుళ్లిపోతారు. స్థాపితమైన ఆదర్శాలపై విప్లవం చేసినవాడు సంఘాన్ని తనవైపుకు మరల్చయత్నిస్తాడు. కాబట్టి సంఘాభివృద్ధి అలాంటి వాళ్ళపై ఆధారపడుతుంది. కుముదంలో ఈ విప్లవ చిహ్నం వొక్కటి కూడా లేదు. ఆమె చదువుకోలేదు. సంగీతం నేర్చుకోలేదు. కనీసం కూనిదీర్ఘాలు తీస్తుందని చెప్పుకోడమేనా నేనెరగను. జ్ఞానం వొచ్చిం తర్వాత ప్రేమించి చేసుకున్న పెండ్లికాదు. చక్కినిదికాదు పద్యాలు వ్రాద్దామంటే. అనాకారికాదు వికృతాన్ని ఆధునికుల ధోరణిలో చిత్రిద్దామంటే, మంచివాళ్ళని గురించి వ్రాయొచ్చు. చెడ్డవాళ్లని గురించి వ్రాయొచ్చు. కాని సాధారణమైన వాళ్ళని గురించి వ్రాయడం ఎంతో కష్టం. అసలు వ్రాసేటందుకు ఏముంది?

కొందరు వ్యక్తుల తల్లిదండ్రులు ఖ్యాతికెక్కుతారు. కుముదం ఆ తెగకి చెందదు. వాళ్ళ తండ్రి చనిపోయాడు. తల్లి ఏ వూళ్లోనో కొడుకు దగ్గర వుంది. వాళ్ళ కుటుంబానికి చరిత్ర లేదు.

'మీ ఆయన ఏం చేస్తున్నాడు?'

'ఎల్. టి. చదువుతున్నారు'

'స్కూల్ మాస్టరవుతాడన్నమాట – ఏ పని దొరకనివారికి అదే శరణు. మంచివాడేనా?'

నవ్వింది. 'మంచి అంటే ఏమిటో నాకేం తెలుసు? నీకు తెలియాలి. కథలు రాసేవాడవు'.

'ఓస్! దెప్పడం కాబోలు. అది కాదు కుముదం. అందర్లాగే కాపరానికెళ్ళి పిల్లల్ని కంటే ఏం ప్రయోజనం? ఏదో ఓ గొప్పకార్యం సాధించాలి. సంఘాన్ని ముందుకు నెట్టాలి. ఇక్కడికే భారతమాత యీ సంతానాన్ని పోషించలేకపోతోంది'.

'నాకింకా పిల్లలు లేరు. అయితే ప్రతి ఆడదీ పెండ్లి చేసుకోకుండా, పెళ్లి పందిళ్ళలో పికెటింగ్ చెయ్యాలంటావా?'

'పెళ్ళి వొద్దని నేననడం లేదు. వివాహం స్త్రీ జీవితంలో ప్రధాన ఘట్టం. అందులో నువ్వు సాధించింది ఏముంది? ప్రేమా? సౌఖ్యమా? ఆధ్యాత్మికతమా? దేశభక్తా? ఏదీలేదు'

'పెండ్లి చేసుకున్న ప్రతి స్త్రీ భర్తను వొదిలేస్తే నువ్వు కథలు వ్రాస్తానంటావ్ అంతేనా?'

అంత పచ్చిగా అడిగినందుకు నాకు రోషం వచ్చింది.

'వొదిలేస్తే చాలదు – మరో గొప్ప విలువని సాధించాలి'

'అంటే?'

'ప్రేమలేని వివాహానికి విలువలేదనుకుంటాను'

'నీకేం తెలుస్తుంది? నీకు పెళ్ళికాలేదు'

'ఆ విలువని సాధించగల్గితేనే వివాహానికి అర్థం వుంటుంది'

'అట్లాగైతే, ప్రతి స్త్రీ భర్తను వొదిలేసి మరోడితో వుండాలందూ ప్రేమను సాధించేందుకు?'

అట్లా అడిగినందుకు నాకు నవ్వొచ్చింది. 'దానికోసం ఆ త్యాగం చెయ్యగలిగితేనే మెచ్చుకుంటాను' అన్నాను.

కుముదం మాట్లాడలేదు. ఈ భావాలు ఎంతవరకూ ఆమెని కలవర పెట్టాయో నాకు తెలీదు. స్త్రీ ప్రకృతి పైన వొత్తిడి కలిగించేది భావాలో, సహజమైన ఉద్రేకమో నేను చెప్పలేను. అది తెలిస్తే స్త్రీ హృదయం అర్థం చేసుకున్నట్లే.

'కాని... కాని' మాటలకోసం తడుముకుంటూ నిదానించింది.

'ఏమిటి నీ సందేహం?'

'ఏమీలేదు. నాకేదో చెప్పాలనుంది. ఎట్లా చెప్పాలో తెలీడం లేదు. నేను చదువుకున్న దాన్ని కాదు. వుండు ఆలోచించనీ....'

నేను ఆమె కళ్ళకేసి చూస్తూ కూర్చున్నాను. నిదానించి చూస్తే ఆమె మోహంలో వొకవింత ఆకర్షణ వుంది. ఆమె శరీరంలో వొంపులు, ఎత్తుపల్లాలు సూర్యరశ్మి

సోకినప్పుడు తీర్చినట్లుగా విప్పారుకున్నాయి. ఆ కళ్లు ఆమెకి ఉపయోగంలేవు కాబోలు. మనుషులకి ఆత్మవుందో లేదో నాకు తెలీదుకాని, ఆమెకి మాత్రం లేనట్లు నాకనిపించింది. మరో లోకంలో ఆత్మని మరచిపోయి, శరీరాన్ని తనిష్టం లేకుండానే ఇక్కడికి రప్పించినట్లు సంచరిస్తుంది. ఈ ప్రపంచంలో మూసుగుని మరో లోకంలో తెరచుకొన్న నేత్రాలు ఆమెవి. 'కాని... కాని.... సూర్యుడు చంద్రుడు – ఎప్పుడూ చూస్తుంటాను. కాని ప్రతిసారి ఎందుకో క్రొత్తగా కనబడతాయి. మంచినీళ్లు రోజూ త్రాగుతా, కాని ప్రతిసారి ఎంతో క్రొత్తగా వుంటాయి... నక్షత్రాలు...'

నేను వెడతానని లేచాను.

'నక్షత్రాలు....ఉ....మంచిది.....' ఆమెని గురించి ఏం కథ వ్రాయనూ?

* * * *

క్రితంసారి మేం కలుసుగుని నాలుగేండ్లయింది. ఈసారి కుముదంగారి వూరు అద్దెకోసమే వెళ్ళలేదు. వేరే పనుండి వెళ్లాను. మధ్యాహ్నం రెండు గంటలు దాటింది. నడివేసంగి ఎండ నన్ను నీడకి తరిమింది. పోస్టాఫీసు ప్రక్కనున్న మామయ్య గారింటికి ఎప్పుడూ దొడ్డిదోవన వెళ్ళడం అలవాటు. అలవాటు చొప్పున ఆనాడు కూడా అలాగే వెళ్లాను. కుముదం మండువాలో గచ్చుమీద కూర్చుని అనాసపండు తరిగి వెండి పళ్లెంలో వేస్తోంది. నారింజపండు రంగు చీరకట్టుకుంది. నన్ను చూచి లేవడంలో పమిటజారింది. నాకర్థమైనట్లు నవ్వి, వెనక్కి తిరిగి లోపలికెళ్ళి వొక కుర్చీ అమర్చి కూచోమని సంజ్ఞ చేసింది. నే చూసిన దృశ్యం నా కిదివరకులేని కొత్త చనువునిచ్చిందని వొప్పుకోక తప్పదు. మనిషి శీలానికి వ్యక్తిత్వానికి మొహంవొక్కటే నిదర్శనం కాదనుకుంటాను. కొన్ని ఆకస్మిక దృశ్యాలు జీవితకాలం పరిశీలించినా బోధపడని అంతరంగికాలని తేటపరుస్తాయి కాబోలు. కుర్చీలో కూర్చోగానే పుటుక్కుమంది. పాతకుర్చీ లేచి సర్దుకున్నాను. కుముదం పమిటని పళ్ళమధ్య బిగించి నవ్వుని ఆపుకుంటోంది.

'అన్ని కుర్చీలమాదిరి నిన్ను భరించి వూరుకోక, విరిగి కొత్తదారితీసింది. చూచావా? దానికథ వ్రాయవూ?.....' అంది. నాకూ నవ్వొచ్చింది. చాపమీద కూర్చుని స్తంభానికి జారబడ్డాను.

'మనం కలుసుకుని దగ్గర దగ్గర నాలుగేళ్లయింది. తెలుసా? నేనివన్నీ మరచిపొయ్యాను. నీకింకా ఎట్లా జ్ఞాపకం వుంది?' అన్న ప్రశ్నార్థకంగా.

'ఏమో, నువ్వు జీవితాన్ని పరిశీలిస్తావు నేను అనుభవిస్తాను. ఏమో,' అన్నది.

ఆమెకి జీవితం అనుభవించడం అంటే ఏమిటో తెలీదని నా నమ్మకం. కాలం ఆమెపై ఎట్లాంటి మార్పు తేలేకపోయింది. ఇదివరకు చూసినప్పటికంటే యీసారి ఎక్కువ చలాకీ, యవ్వనోద్రేకం చూపగలిగింది. ఆమెలో ఆకర్షణీయమైంది ఎడతెగని యవ్వనమేమో ననిపిస్తుంది. యవ్వనం వొక్కసారి తన శక్తిని ప్రకటించకుండా నిలిపి ప్రజ్వలించినట్లుగా గోచరిస్తుంది. కొన్ని ఉపమానాలు మన నాగరికత, సాంప్రదాయలకి విరుద్ధమని జంకుతున్నాగాని లేకపోతే ఆమె శరీరాన్ని గుఱ్ఱంపిల్ల కదలికలోని లావణ్యంతో పోల్చొచ్చు. లేడి గంతులో శృంగారం వుందికాని, బలంలేదు. కుక్కపిల్ల గంతులో కొంటెతనం వుందికాని శక్తిలేదు. మేకపిల్ల గంతులో వేగం వుందికాని మృదుత్వం లేదు. ఇవన్నీ గుఱ్ఱంపిల్ల అలిగిననాడు చేసిన నాట్యంలో వున్నాయి.

'నువ్వూ, మీ ఆయనా కులాసాగా వుంటున్నారా?' అన్నాను ఏమనడానికి తోచక.

'నీ దయవల్ల'

'ఇంకా నిన్ను గురించి బోలెడు వినాలనుంది'

'నన్ను గురించి వినేందుకేముంది. మాది సామాన్య బ్రతుకు' అంది నీరసంగా.

'అప్పుడే జీవితంపైన విసుగుపుట్టిందా?' అన్నాను.

'ఈ ప్రశ్నలు నన్నింతవరకూ బాధించడం లేదు. నీమాట చెప్పు. ఏం చేస్తున్నావూ? ఎక్కడున్నావూ? ఎల్లా వున్నావూ?....'

మనదేశంలో చదువుకున్న యువకుణ్ణి ఏం చేస్తున్నావూ? అని అడగడం. కంటే ఎక్కువ అపచారం లేదు. పాపం అలా అడిగిన వాళ్లందరూ మేలుకోరేవారే. కాని, దానికి సమాధానం చెప్పడంలో ఉద్యోగం లేని యువకుడు ఎంత బాధపడతాడో పెద్దవాళ్ళకీ తెలీదు. ఏమీ చెయ్యడం లేదని చెప్పడం నాకు చిన్నతనంగా తోచి ఎమీలేదు – కథలు వ్రాయడం మొదలు పెట్టాను' అన్నాను.

'నన్ను గురించా'

నవ్వుకున్నాను. పడుతూ, నడుస్తూ పడుతూ చంటిపిల్ల చక్కా వచ్చి అర్థం లేకుండా ఏడవటం మొదలెట్టింది. నేనాశ్చర్యపడ్డాను.

'మా పాపాయి. ఇంక రెండు నెల్లకి మూడో ఏడొస్తుంది' అంది కొద్ది గర్వంతో.

'నాకెప్పుడూ చెప్పలేదే? ఈ సంగతే తెలీదు' అని ఆశ్చర్యం దిగమింగు కోలేకపోయాను.

'నీకు తెలియజేసేటందుకు యిందులో ఏం విశేషముంది? ఇది సాధారణంగా అందరికీ జరిగే పనేకదా? నీకీ విషయం వేరే చెప్పాలా?' అంది. ఆమె అంతవరకూ తన పిల్లని గురించి చెప్పకపోవడం చూస్తే నాకు మరీ ఆశ్చర్యం కలిగింది.

'దానికో పాపాయి పుడుతుంది. ఎప్పుడో, ఎక్కడో, అది ఎవర్నో ఎక్కడో పెండ్లి చేసుకుంటే, దానికి మరో పాపాయి, ఎప్పుడో, ఎక్కడో పుడుతుంది. అలా జరిగిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడవల్సిన విశేషం ఏముంది....?'

కుముదంలో మాతృత్వం తాలూకు చిహ్నాలేవీ నాకు కనబడలేదు. పిల్లలని చూసుకుని తల్లులుపడే గర్వం ఆమెలో లేదు. ఆ ప్రశంస ఎత్తాలని ఆమెకు తట్టనే లేదు. ఆమె శరీర పటుత్వాన్ని చూస్తే, ఆమె యీ పిల్లని కన్నదా అనిపించింది. పిల్లలూ భర్తా సంసారం – యివేవీ తాకి పంచుకున్నట్లు లేదు.

'నీ పోలికా, వాళ్ళ నాన్న పోలికా?'

'ఏమో నీకే తెలియాలి'

'నాకెట్లా తెలుస్తుంది? నేను వాళ్ల నాన్నని చూడనేలేదుగా!'

'వీధులో వున్నారు. చూడకూడదూ?' వీధులో అరుగుమీద విద్యార్థులతో ఆయన పడుతున్న అవస్థ నాకు వినపడుతూనే వుంది. వెళ్ళేటప్పుడు చూడొచ్చునను కున్నాను. కుముదం పిల్లని లోపలికి తీసుకెళ్ళిపోయింది. ఆకులో అనాన ముక్కలుంచి, మంచినీళ్ళు పెట్టింది.

'పాపం, ఎండలో వొచ్చావు. నీ మొహం మాడిపోయింది'

'నిజంగా?'

'మనం పెద్దవాళ్ళమైపోతున్నాం కదూ?'

'నామాట తెలీదుకాని, నువ్వు మాత్రం యింకా చిన్నదానవవుతున్నావు' అన్నాను.

'అది అబద్ధం. ప్రకృతి విరుద్ధం' కొంతసేపు ఎవ్వరం మాట్లాడలేదు. ఎందుకో కొన్ని కొన్ని సమయాలలో ఆమెతో మాట్లాడుతున్నప్పుడు, బుర్రఖాళీ అయిపోతుంది. సిగరెట్టు పీలుస్తూ, చీట్లాడుకుంటున్న సమయంలో అమాంతం గదిలోకి చిరతపులి వొచ్చినప్పుడు, బుర్ర ఎట్లా పనిచెయ్యదో, అట్లాగే ఆమెతో సంభాషణ.

'దేశంలో సంతానం ఎక్కువైపోతున్నారు. యిట్లా పది సంవత్సరాలు జరిగిందంటే తినేందుకు తిండి వుండదంటున్నారు. సాంఖ్యాశాస్త్రవేత్తలు తెలుసా?' అన్నాను.

'అది నాకు తెలీదు. మనం ప్రకృతికి దాస్యం చెయ్యడం తప్పదు. దాస్యం నేను సహించలేను. కాని అది తప్పదనుకుంటాను. నేను ఎదురు తిరగలేక కాదు నాకదిష్టం లేదు. జీవితానికి తలొగ్గి, ప్రపంచాన్ని అంగీకరిస్తాను.'

'అదే పొరపాటు, అంగీకారం అల్పురాలనని వ్యర్థజీవి విముఖత్వం'

'కావొచ్చు. సృష్టిలో నేనెంతో అల్పురాలనని తోడివాడవైన నీకే తోచినప్పుడు సృష్టిముందు నేనేం తిరుగుబాటు చెయ్యగలను చెప్పు?'

వెడతానని లేచాను.

'అద్దె తీసుకురానా?' అంది, 'నేను దానికోసం రాలేదు. మనియార్డరు చెయ్యొచ్చు'.

పాపిష్టి డబ్బుని ఆమె చేతులు తాకటం నాకిష్టం లేదు. ఆమె భర్తని చూడడం కూడా మరచి బైటకి నడిచాను. నన్ను కుముదం వెనక్కి పిలుస్తుందనుకున్నా అట్లా పిలవలేదు. నా వెనకాల దొడ్డితలుపు గడియ చేసిన చప్పుడు వినిపించింది. కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయనూ?

ఆరు సంవత్సరాలు గడిచాయి. రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. అప్పటికి నా చదువు, ఉద్యోగ యత్నాలు పూర్తయ్యాయి. వొక్క యత్నమూ ఫలించలేదు. మా మామయ్య ఇండియా అంతా యాత్రచేసి రావడం వల్ల ప్రావిడెంట్ ఫండంతా తరిగిపోయింది. నిరుద్యోగ వ్యవస్థను గురించి బోలెడు కథలు వ్రాశాను. సమస్య పరిష్కారం కాలేదు. ఆంగ్లంలో యీ సమస్యను పరిష్కరించడానికి కొన్ని సలహాలిస్తూ వ్యాసాలు వ్రాశాను. ఎవరూ వాటిని గుర్తించినట్లు లేదు. కొన్ని సమయాలలో రాజకీయోద్యమంలో దిగి జైలుకెడదామనిపించేది అప్పుడు భుక్తికి లోటుండదు. కీర్తి దక్కుతుంది. పైగా జైలులో నే తలపెట్టిన మహత్తర గ్రంథాన్ని రచించడానికి మంచి అవకాశాలుంటాయి. కాని రాజకీయాలలో దిగడం ఎట్లా? 'ఫరవాలేదురా అబ్బీ, యుద్ధం వచ్చింది. దేవుని ధర్మమా అంటూ నీకేదో ఉద్యోగం దొరక్కపోదు' అని మామయ్య ఓదార్చేవాడు.

'నాకు నచ్చిన ఉద్యోగం వొకటి ఖాళీ వొచ్చింది మామయ్యా. దరఖాస్తుకి, ఇంటర్వ్యూకి ఏభై రూకలుంటే నాకు లభించొచ్చు' అన్నాను. వెంటనే మామయ్యకి

ఓ భావం తట్టింది.

'ఒరే! కుముదం గారింటికెళ్లి, రెండునెల్ల అద్ది, ముందుగా యిస్తారేమో కనుక్కురా' అని నన్ను సాగనంపాడు.

సూర్యుడు పడమటింట్లో గృహప్రవేశం అవగానే తలుపు వేసి కిటికి కర్టెన్లు దగ్గరగా లాగడానికి సిద్ధపడినట్లు, మేఘాలు చురుగ్గా విహరిస్తున్నాయి. కుముదం గారి దొడ్లో ఎన్నో యిదివరకు చూడని కొత్త మొక్కలు, చెట్లు వున్నాయి. కొబ్బరి చెట్లు మేఘాలతో ఏకీభవిస్తున్నట్లు ఆకాశంలోకి పొడుచుకుని ఆడిపోతున్నాయి. జామచెట్టు వార్ధక్యం వొచ్చినదానిమల్లే ముడుచుకుంది. ఆ అల్ప ప్రకృతిలో వొక్కటీ నా రాక గుర్తించినట్లు లేదు. చెట్ల కొమ్మలకి ఉయ్యాల అమర్చబడి వుంది. నూతి పళ్లెం వేపునుంచి వో పాపాయి పాకుతూ వస్తున్నాడు. వాడితో ఏదో మాట్లాడాను. వాడికేమీ అర్థంకాక, జీవిత రహస్యం తెలుసుకోలేకపోయిన వేదాంతిలా, నిరర్ధకపు ఏడ్పు మొదలు పెట్టాడు. చెట్ల గుబురుమధ్య కుముదం, మేఘాలమధ్య నక్షత్రంలా కదిలింది. నక్షత్ర బృందంలోంచి విడిపోయిన పిల్లకాంతిలా మరో చిన్నపిల్ల పరుగులెత్తింది. కుముదం చేతిలో గునపాన్ని గిరవాటెట్టి, పమిటని పళ్ళమధ్య బిగించి పైకిలాగి, చేతులోవున్న మొక్కని నాముందు పడేసింది.

'చూశావా, యీ ఆకుని ఎట్లా తినేస్తోందో, యీ చిత్రమైన పురుగు? ఈ పురుగు అందమైనదే, మొక్కా అందమైనదే. అందాన్ని చూచి అందం వోర్చలేదు కదా?'

నేనేమీ మాట్లాడలేదు

"నువ్వొచ్చి ఎంతసేపైంది? పిలవలేకపొయ్యావా? లేక నా పేరే మరచి పొయ్యావా?" అంది.

"లేదు లేదు–యీ తోటని చూస్తూ ఆశ్చర్యపడుతున్నాను".

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? విత్తనం వేసి నీళ్లుపోస్తే మొక్కమొలుస్తోంది. ఇవన్నీ సాధారణమైన మొక్కలు" అని కొంటెగా నవ్వింది.

"మా పాపని చూశావా, పెద్దదైంది. నువ్వింత సంబంధాలు చూచిపెట్టే సమయం వస్తోంది. వాడు మా రెండోవాడు. ప్రకృతంటే పడదు. అన్నింటినీ ధ్వంసం చేస్తాడు. వీడు మా మూడోవాడు. వీడికి నాలా ప్రపంచంతో నిమిత్తం లేదు. –పాపా! బకెట్ తీసుకురా...."

అమ్మాయి బకెట్ తీసుకొచ్చింది. కుముదం చిన్నప్పుడు జామపండు తింటున్న దృశ్యం జ్ఞాపకం వచ్చింది.

"కొంచెం నీళ్లు తోడి పెట్టు చేతులు కడుక్కుంటా" అంది.

నేను తోడాను, బకెట్లో సగం నీళ్ళు నూతిలోనే పడిపోయాయి.

"నీళ్ళు తోడడం తెలియకపోతే ఎట్లా? నీ భార్య బైటుంటే నువ్వే తోడుకోవాలి"

"నాకింకా పెండ్లికాలేదు"

నమ్మలేనట్లు చూసి మౌనంలో పడింది.

"నాకు ఉద్యోగం లేదు. ఎందుకు పెండ్లి?" అని స్వగతంలా చెప్పుకున్నాను. కుముదం నా మాట వినిపించుకోలేదు. చీరని పాదాల పైకి తీసింది. ఆమె శరీరానికి మాతృత్వం పరిపూర్ణత వచ్చింది. వయస్సు మొహానికి వైరాగ్యాన్నిచ్చినా, వార్ధక్యాన్నివ్వలేకపోయింది. మట్టిలో నీళ్ళు కలిసిన వింత సువాసన నన్నావరించింది. ఆమె మొహాన్ని పమిటతో తుడుచుకుంది. తడిసిన పమిట, పర్వత శిఖరానికి ఎగబ్రాగే వాడికి పట్టు దొరికినట్లు, వక్షాన్ని అదిమిపట్టుకుంది. సూర్యుడి కడసారి కిరణం, లోయలో నీడని వొక్కసారి వెలిగించి మాయమైంది. సంధ్య అందాన్ని అనుభవించాలన్నవాడు కుముదంతో వుండాలి. సంధ్యలో నేనెప్పుడూ చూడని ప్రత్యేక శోభని అనాడు చూడగలిగాను.

"దా, ఉయ్యాల మీద కూర్చో-వెనక విరిగిన కుర్చీ యింత వరకూ బాగుచేయించనే లేదు... ఏదో ఒకటి వుంటుంది. తీరికలేదు".

కుముదం గడ్డిలో కూర్చుంది, అమ్మాయి, వేదాంతిని ఎత్తుకొని లోపలికెళ్ళింది. రెండోవాడు ధ్వంసం చేసేందుకు మొక్కలు లేవన్నట్లు, గడ్డినే దిమ్మిశాలా మర్దిస్తున్నాడు.

"మనం కలుసుకుని చాలా రోజులైంది. తెలుసా?"

"ఆహా, దగ్గరగా ఆరు సంవత్సరాలైంది"

"నువ్వు చాలా మారిపోయావు"

మంచికా చెడుకా అని అడుగుదామనుకున్నాను. నన్ను మాట్లాడనీకుండానే "ఎక్కడెక్కడికెళ్ళింది. ఏంచేస్తున్నదీ అంతా చెప్పు నిన్ను గురించి" అంది.

"ఉత్తర హిందూస్థానం వెళ్ళా – ఎక్కడా మంచి ఉద్యోగం దొరకలేదు మామూలుగా ఇండియాలో మనిషి ఇరవై ఎనిమిదేండ్లకంటే ఎక్కువకాలం జీవించడంటారు సాంఖ్యశాస్త్రకారులు, దాని ప్రకారం నేను నాలుగేండ్ల క్రితమే

చనిపోయి వుండాల్సింది. అల్పాయువుగలవాళ్ళు సుఖంగా వుండగలరు మన సంఘంలో".

కుముదం సానుభూతి చూపి జాలిపడుతుందని నా ఉద్దేశాన్ని ఎంతో కసితో భయంకరంగా ప్రకటించానేమో!

"ఉద్యోగం లేకపోతేనేం? దానికోసం జీవితాన్ని తిట్టొచ్చా! ఉద్యోగంలో పడ్డావంటే, అదో లోకం, మరి ప్రపంచంతో సంబంధం వుండదు. ఎవరికో బానిసై స్వేచ్ఛ పోగొట్టుకుంటావు. ఆడాళ్ళకి ఉద్యోగం చేసే బాధ లేకపోవడం ఎంతో మెరుగు".

ఉద్యోగం చెయ్యనందుకు నన్ను అందర్లా ఆక్షేపిస్తూ తిట్టకుండా, మెచ్చుకున్నందుకు నేను కుముదాన్ని కొంత గౌరవించాను.

"పాశ్చాత్య దేశాలలో స్త్రీలు పొట్టకూటికోసం భర్తలకు మనవాళ్ళలా అమ్ముడు పోరు" అన్నాను. ఆమె అప్రయత్నంగా రెండు గడ్డి పువ్వులను తెంచి జుట్టులో అమర్చుకుంది.

"మనకీ ప్రపంచంలో ఎవరో వొకరికి దాస్యం చెయ్యడం తప్పదేమోనని పిస్తుంది. దేవుడు సైతం భక్తుడికి దాసుడు కావడం లేదూ?"

"నాకింతవరకూ ఉద్యోగం యివ్వని యీ సంఘాన్ని గౌరవించి ఎందుకు సేవచెయ్యాలో నాకు తెలీడం లేదు".

"నీకు ఉద్యోగం లేకుండా వుంటేనే నువ్వు సుఖపడతావు. ఐనా నీ పిచ్చికాకపోతే, నీకు ఉద్యోగం ఎవరో యిచ్చేదేమిటి? నువ్వేదో గొప్పకార్యం చెయ్యడానికి పుట్టానని వెనక చెప్పావు. అది నేను నమ్ముతాను. అది చెయ్యి స్వతంత్రించి వచ్చిన పని చెయ్యడమే మంచిది. నేను దాస్యం సహించలేను"

"దాస్యం లేకుండా ప్రేమని సాధించటం ఎల్లా? ఈ ప్రశ్న ఎందుకడిగానో నాకు తెలీదు.

"ఔను మనుషులతో చేసే ప్రేమలో దాస్యం వుంది. సంసారంలో బంధనాలు ప్రేమలో బంధనాలు, అసలు పుట్టడమే సృష్టికి దాస్యం. వీటికి దూరంగా వుంటే మంచిది".

కుముదం, హృదయానికి దగ్గరగా వుండే విషయాలని గురించి ముచ్చటిస్తుంటే వినడం అదే మొదటి సారి. నేను అనుకున్నంతటి అమాయకురాలు కాదని స్పష్టమైంది.

"ప్రపంచంతో నిమిత్తం లేకపోతే, అసలు గొప్పకార్యం సాధించటం దేనికి".

"సాధించటంలో మనుషులకు చేసే దాస్యం నుండి విముక్తి దొరుకుతుంది. కాబట్టి ప్రపంచాన్ని మనం ఏదైనా కోరి ఆశిస్తే దాన్ని యివ్వదు. మనం దేన్నీ ఆశించకుండా, దూరంగా వుండి చెయ్యగలిగిన పని చేస్తుంటే ప్రపంచం మన పాదాలముందు వాల్తుంది"

కుముదం స్వతంత్రాన్ని అంతగా కాంక్షిస్తుందని నేనెప్పుడూ అనుకోలేదు. భర్త, పిల్లలు, సంసారం, ఉద్యోగం తుదకి ప్రేమ యివన్నీ కూడా దాస్యమేనంటుంది. స్వతంత్రం లేని బ్రతుకు వృధాట. ఒక విలువని అంతగా కోరినప్పుడు దాన్ని వారు పొందలేకపోతే, నా హృదయం బాధతో క్రుంగిపోతుంది. జనసామాన్యానికి స్వేచ్ఛనిస్తే దుర్వినియోగం చేస్తారు. దాని విలువ తెలియనివాళ్లకి అదివ్వడం మహాపాపం. కాని దేన్నీ, ఉపయోగించుకోకుండా, కేవలం విలువల ఆరాధనతో తృప్తిపడే కుముదంలాంటి వ్యక్తులకి స్వేచ్ఛ లేకపోవడం ప్రపంచానికి అనర్థం.

"నేను నువ్వైతే ఏం చేద్దునో తెలుసా? నదీ తీరాన్ని చిన్న తాటాకు పాక కట్టుకుంటాను. అందులో కూర్చుని ఊరికే చదువు నేర్పుతానని చాటింపు వేయిస్తాను. మొదట ఏ పదిమంది పొలం కాపులో వొస్తారు. సాయంత్రం వాళ్లకి బోధించడం మొదలెడతాను. ఇరుగు పొరుగునుంచి అనేకమంది. కర్షకులు, కూలివాండ్లూ చదువుకోసం వస్తారు. ఉత్తచేతుల్తో రాకుండా, వొకరు వుప్పు, చింతపండు, వొకరు పాలు అల్లా నాక్కావాల్సిన వాటిని వాళ్లే సిద్ధం చేస్తారు. వారు నా శిష్యబృందం. వాళ్ల కష్టసుఖాలు పంచుకుంటా. వారి తగాదాలకి తీర్పు చెపుతా. అంటే అప్పుడు నా జీవితం వృథా అనుకోను".

సూర్యుడు అస్తమించగా అలిసిన తన పరివారం పడమటి లోయలో సేద తీర్చుకుంటున్నట్లు వెలుగు ఛాయలు కరుగుతున్నాయి. ఓపికలేక కదలలేక పోయిన మేఘద్వయం దక్షిణపు గాలి పిలుపుకి కదలిపోతున్నాయి. ఇది నా రాజ్యం అన్నట్లు వొంటి నక్షత్రం కన్ను మీటింది. ప్రకృతిలో నిశీథి కీటకాలు తన్మయపు రొద సాగించాయి. మా సంభాషణ విని విని విసుగెత్తిన పుష్పాలు చీకటి ప్రశాంతంలో ముడుచుకున్నాయి. తూర్పు ఆకాశం జడ విప్పుకుంది. కుముదం తలలో తెల్లవెంద్రుక మెరిసింది.

"తెల్ల వెంద్రుక" అన్నా, వున్నచోట వేలు మెదుపుతూ.

"ఎన్నాళ్లని యవ్వనానికి శరీరం దాస్యం చేస్తుంది? దాని దోవ అది చూచుకుంటుంది".

నా కళ్లు చెప్పలేని విచారంతో తడిసినై, నేను అద్దెమాట అడగడం మరచి పోయాను. ఆ తన్మయతతో బరువెక్కిన వాతావరణాన్ని డబ్బు ప్రశంసతో పాడు చెయ్యటం నాకిష్టం లేకపోయింది. వెడతానని లేచా; మంచిదంది; పోనీ యీ రాత్రి యిక్కడుండి వెళ్లకూడదా అంటుందనుకున్నా కుముదానికి మర్యాదంటే ఏమిటో తెలీదు.

* * *

మరి నాలుగు సంవత్సరాలు గడిచినై. యుద్ధం సాగుతోంది నాకు మాత్రం ఉద్యోగం చిక్కలేదు. నేను దాన్ని గురించి విచారించే రోజులు వెళ్లిపోయాయి. రోజులు గడిచిపోతున్నాయి. నా తిండికీ ఎట్లాంటి లోపమూ రాలేదు. పస్తున్న రోజు వొకటి కూడా లేదు. దుబారా ఖర్చుకి, నాకే అలవాట్లు లేవు. సిగరెట్లు కాల్చను, సినిమాలకెళ్లను, పుస్తకాలు కొనుక్కోను. అవంటే యిష్టంలేక కాదు. అవి నా అందుబాటులో లేవు. మా మామయ్య చనిపోయి ఆరునెలలైంది. మా అత్త తప్ప నాకు 'నా' అన్నవాళ్లు ఎవ్వరూ లేరు. నాకీ సంఘం తిండి పెట్టనక్కరలేదు నా బ్రతుకు నన్ను బ్రతకనిస్తే చాలు. మా అత్తయ్య వున్న యింటికి అద్దె యిచ్చుకోలేక పోతోంది. తుదకి నిశ్చయించుకుంది. సొంత యింట్లోకెళ్లి కాపరం పెట్టడానికి ఖాళీ చేయించే యేర్పాట్లకి నన్ను పంపింది. ఆనాడు ఆదివారం, రాత్రి ఎనిమిది దాటింది. సన్న చంద్రుడు పల్చటి మేఘం వెనక దాక్కున్నాడు. కుముదంగారి యింట్లో దొడ్లో అంతా నిశ్శబ్దం. వీధిలోకొచ్చాను. తలుపు తాళం వేసి వుంది.

ఎక్కడికెళ్లారో నాకు బోధపడలేదు. కాసేపు అరుగు మీద కూర్చున్నా తెలిసినవాళ్లని అడిగి కనుక్కుందామని వీధులోకి నడిచాను. అప్రయత్నంగా బజార్లోకి వెళ్లాను. కిళ్లీ దుకాణం బల్ల ముందు కుముదం పెద్ద కూతురు పాపాయినెత్తుకొని కూర్చుంది. నన్ను కేకేసింది.

"మా ఆఖరు చెల్లాయిని చూశారా? నాలుగోది– దీన్ని స్వరాజ్యం అని పిలుస్తుంది మా అమ్మ. చూడండి. వూ, ఏడుస్తుంది... ఊరుకో నాచిట్టితల్లీ".

"ఇట్లా యిక్కడెందుకున్నావ్? మీ అమ్మ ఎక్కడ?"

"మా అమ్మ ఆస్పత్రిలో వుంది. ఇది ఏడుస్తుంటే ఆడించడానికి తీసుకొచ్చాను. మా నాన్న హొటల్‌కెళ్లాడు".

స్వరాజ్యాన్ని బుజాన్ని వేసుకొని హాస్పిటల్ కి వెళ్లాం. కుముదం మంచంపై పడుకుంది. పైన తెల్లటి గుడ్డ కప్పివుంది. చిన్న బల్ల మంచం దగ్గరగా లాగి కూర్చున్నాను.

"ఏం జబ్బు?"

"న్యుమోనియా"

న్యుమోనియా అంత ప్రమాదకరమైన వ్యాధని నాకంతవరకూ తెలియదు. మాట్లాడేటందుకు ఏమీ కనుపించక, దిగులుగా కూర్చున్నాను. కుముదం నీరసంగా నవ్వడానికి యత్నించింది. మొహం మెలికలు తిరిగింది – పెదవులు పవిత్రంగా వొణికాయి.

"నన్ను గురించి కథ వ్రాయవూ?" అంది. నేనేం చెప్పనూ?

"ఈ జబ్బు విషయం నాకు తెలీనే తెలీదు. పోనీ వో ఉత్తరం ముక్క వ్రాయించకూడదా? డాక్టర్లు ఏమంటున్నారు?"

"జబ్బు చెయ్యడం సాధారణమైంది. పదిమందితోనూ చెప్పుకునేందుకు అందులో ఏం విశేషముంది? ఫరవాలేదంటున్నారు. డాక్టర్లు– కాని వాళ్లకేం తెలుసు?" అని కళ్ళు మూసింది.

నాకక్కడినుంచి వెళ్లిపోవాలనిపించింది. ఏదో చెప్పాలనివుంది. కాని నోరాడదు. నా శరీరం వణికిపోతూంది. అనుకోకుండా, నా చెయ్యి ఆమె చేతి పైన ఆనించబొయ్యాను. అది వేలుకు వుంగరం వున్న చెయ్యి, వెంటనే చేతిని లాగేసుకుని తెల్లదుప్పటిలో దాచేసుకుంది.

"నువ్వెందుకు పెండ్లి చేసుకోలేదో నాకు తెలుసు– నా కోసం" అంటూ మళ్ళా కళ్ళు మూసింది. నాగుండె స్థూలత్వాన్ని పోగొట్టుకొని ద్రవంగా విడిపోయి, దోవతెలియక తిరుగుతూన్న రక్తనాళాలగుండా వుజ్వల వేగంతో ప్రవహిస్తూంది. కన్నీటిని నా వేళ్ళతో తొలగించుకొన్నాను. ఆమె నిశ్చల శరీరంపై నా కన్నీరుపడి మలినం చెయ్యడం పాపం అనిపించింది. మొహాన్ని ప్రక్కకు తిప్పేసుకున్నాను కిటికీ అద్దంలో నుంచి నిశీథి నల్లత్రాచులా లోకాన్ని అల్లుకుంటోంది.

"నీ స్థితి చూస్తే నాకెంతో బాధగా వుంది" అన్నా, కన్నీరు దిగమింగుకుని.

"నాకు నిర్విచారం. ఈ ప్రపంచం నాదైతేగా విచారానికి – నువ్వు మాత్రం....." కళ్ళు మూసి మరి విప్పలేదు. ఈ లోకంలో మూసుకుని మరో లోకంలో తెరుచుకున్న నేత్రాలు కుముదానివి. ఆత్మని దిగవిడిచి వొచ్చిన వ్యక్తి

మళ్ళా దానిలోకే చేరుతుంది. చెట్లు, నదులు, మేఘాలు, చీకటి వెలుగుల సమ్మేళనంతో గిరగిరా తిరిగిపోతున్న విశ్వంలో కలిసిపోయింది. నిశీథిలోకి నడిచి వెళ్ళాను. మహత్తర అనుభవం సంభవించినప్పుడు తార్కిక జ్ఞానం, విమర్శనాబుద్ధి పనిచెయ్యవు. ఇంద్రియాలు శరీరాన్ని వూపి, కొత్త జన్మనిస్తాయి. భావోద్రేకంలో నిమగ్నుడై, చైతన్య ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తి, వొక్కసారి సృష్టి రహస్యాన్ని మెరుపులా ఛేదించి మరో అవతారం దాలుస్తాడు. చచ్చి బ్రతకడంలాంటిది ఆ అనుభవం.

కుముదం నా వివాహాన్ని గురించి చెప్పిన కడసారి మాటలు నాలో అధోలోకాన్ని త్రవ్వి దాని దాపరికాన్ని నాకళ్ళముందు ప్రదర్శించినట్లయింది. ఆమె కోసం పెండ్లి చేసుకోలేదట! మానసిక శాస్త్రజ్ఞులు మానవుడి బుర్రలో అధోలోకం వుందంటారు. అక్కడ అతని రహస్యమైన కోర్కెలు, బైట చెప్పుకోలేని తీరని వాంఛలు అడవిమృగాలలా తిరుగుతాయట. అవి అన్ని సమయాలలోనూ బయటికి రాకుండా బుద్ధి కాపలా కాస్తుంది. అవి బైటికి రాలేకపోయినప్పటికీ, ఎప్పుడో, నిద్రలోనో, బలహీనమైన స్వప్నావస్థలోనో, గర్జించి వాటి వునికిని బాహ్య ప్రపంచానికి వెల్లడిస్తాయట. ఇంతకాలం నా బుద్ధి వాటిని కట్టేసింది. ఆనాడు ఆమె చెయ్యి పైన చెయ్యివేసినప్పుడు బుద్ధిని తొలగించి వాంఛలు బైటికొచ్చినట్లు, కుముదం గ్రహించి, తన చేతిని లోపల దాచుకున్నట్లు, వాటిని వెనక్కి నెట్టి నోరు నొక్కింది. ఆమెలో ఏమీ విశేషం లేదని సమాధానపరుచుకున్నా ప్రాకృతికమైన ఆకర్షణ లోపల దాగివుండి, నా జీవితంపై అంత వొత్తిడి కలిగించినందుకు ఆశ్చర్యపడ్డాను.

తనని గురించి కథ వ్రాయమంది. ఆరు గంటల పరిచయంలో, ఆరువందల మాటలతో, నా ప్రపంచాన్ని తలక్రిందులుచేసి, నా జీవిత పరమావధినే తారుమారు చేసిన కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయను?

# నడిమింటి బోడెక్క బసివిరాలయ్యేద!

-నాగప్పగారి సుందర్రాజు

ఇ పొద్దు బడి తప్పొయ్యేదని సానా సొంతోసుము పడుతుండాను. నిన్న సంకరప్ప అయివారు సెప్పిన సక్రొడ్డి ల్యక్కులు సెయ్యి లేదు. కర్నుము అయివారికి ఇదే సొందు. నన్నితొన్నేకి. యట్లరా దేవుడా! గండుము గడిసేదని అపలాసన సేసుకంట వుంటే నడిమింటి పెద్దమ్మొచ్చి కార్యుములోక పిలిసేద.

మా యమ్మ యేమో "వొవరే! బడికి పోదురా" అని సెప్పు.

"వొప్లే సరసక్కా... నీకింతుగూడ బుద్ధి లేదు సూడు ప్లే. నీ వేమన్నా అనుకో ఇంట్లో కార్యుము పెట్టుకొని ఈ పొద్దన్న ఇంత పొద్దుగాలుగ వొచ్చి ఆ పనీ ఈ పనీ సూసుకోకుపోతే యట్లప్లే. వొక్కొడుకు కొడుక్కాదు వొగు బిడ్డ బిడ్డగాదు అనేర. నాకి సేసే వొళ్ళు యెవురుండారు నువ్వే సెప్పు. ఈ పొద్దన్న నువ్వింత ఆ పిల్ల దెగ్గిరుండి పూజార్లు అడిగినివి అందిస్తే బాగులేదా. అది అసులే తిక్క పిల్లట్లాది. బసివి రాలుని ఇడిస్తాము అనిన పొద్దుట్నుంచి వొగిటే యేడుపు యేడుస్తుండాది. యంత సెప్పినా వూరుకోదు. నన్ని బసిపురాలు ఇడద్దండో.... యెవుడుకన్న కూలి సేసుకొని తినేవోనికి ఇచ్చి పెండ్లి సెయ్యండి. రెక్కులు కస్టిము సేసుకొని బతుకుతామని వొగిటే తరాగా యేడుస్తుండాది. మాకేమొ..... వుండేది వొగితే కదా యాడన్నా బసివిరాల్ని ఇడుసుకుంటే కొండ్లు ముందు వుంటాదని ఆస. నీడ పాట్న సుకంగ వుంటాది. ముసులు ముప్పుతనానికి మమ్ముల్ని మడసనంగా సూసుకుంటా దని మా అపలాసన" అంటాని వొగిటే యతార సేసుకుంట మా యమ్ముకి సుపుతుండాది నడిమింటి బెలిగింటి పెద్దమ్మ.

"పదక్కే... వొస్తాను పదా. పొయ్యి మింద బూవుడుకుతాది గెంజి వొంచి వొస్తాను పదా" అనే మాయమ్మ.

"ఏం ప్లే... ఇంట్లో కార్యుము పెట్టుకుని బూ వొండుకుంట కుసునేవ్నా. సానా యక్కడ దప్పిందానువు వున్నట్లుండావే" అనిడిస నడిమింటి పెద్దమ్మ.

"పిల్లొల్లుండే పని గదిక్కే కార్యమన్నంక యాలా తప్పుతాది కదా. పిల్లొల్లుకి ఆకిలయినప్పుడు ఇంట్లో వుంటే యేసుకొని తింటారు. ల్యాకపోతే పనిసేయినీకుండ గుద్దెనుక యేదుసుకుంట తిరుగుతారు" అంటాని మా యమ్మ పడసాల కట్ట మింద నుంచి పొయ్యి గడ్డతాకి పాయ.

"హొప్పో.. సా(క్రాపొప్పో యల్లల్లు బీలు యల్ల సదివేవగాని ఈ పొద్దు వొగిటి బడికి పోకుంటే ఆడేమి దేసుము కుంటుపడేది లేదు. బోడెక్కని బసివురాలు ఇడుస్తుండాము కదా సుట్టాలంతా వొచ్చేర. వాల్లికి యేమన్న నీళ్ళు గీళ్ళు అందిచ్చుకంట వుండుకుండ బడికి పోతానని పలకా బుక్కులు తీసుకునేవునే" అంటాని బెలిగింటి పెద్దమ్మ మా ఇంట్లో నుంచి బయటికి పొయ్యిడిస.

గాలికాలుము. బయట ఈదురుగాలి ఈస్తుండాది. గవాసులెంట గాలి లోపులికి వొస్తుంటే పొగ బయటికి పొయ్యేకిల్యాక ఇంటినిండ ముసురుకునేద. పొగదెబ్బకి కండ్లు మండుతుంటాయి. కంట్లో నుంచి ముక్కులో నుంచి నీళ్ళు కారుతుంటే మాయమ్మ వొగు సేత్తో సీమిడి సీది పొయ్యిలో యేసి కొంగుతో సమట తూడుసుకుంట గంజి వొంచుతుండాది. ఇదే సొందురా నాయినా బడి తప్పిచ్చుకునేకని సేతిలో పలకా బుక్కాలు గూట్లో సప్పిడి కాకుండ పెట్టిడిసి మెల్లిగ బయటికి జారుకునేన.

పెండ్లికి యేసినట్లు పందిరి యేసిడిసేర. బోడెక్కొళ్ళు ఇంటికాన్నించి మాదిగ్గేరి నిండ యేసిడిసేర. కల్డెన్నొళ్ళు ఇంటి కాన్నుంచి మా ఇంటి వరుకు వొగిటే పందిరి యేసిడిసేర, బుంగులు నాటి తడుకులు యేసి బసిరాకుతో పందిరి యేసింటే గేరంతా యంత బాగుండాదని, పందిరి కింద కుంద్రం గన్నొళ్ళు ఇల్లు, వులిగెమ్మవ్వొళ్ళు ఇల్లు, కల్డెన్నొళ్ళు ఇల్లు, గుంతుకంటి ఆయమ్మొళ్ళు ఇల్లు, మా పెద్దిల్లు, మా సిన్నిల్లు, నట్టనడుమ బోడెక్కొళ్ళు ఇల్లు యంత కళకళలాడుతాదని.

బోడెక్కొళ్ళు ఇంటి ముందు నాలుగు బసిరికట్టు నాలుగు దిక్కులు తుక్క నాటి ఆటికి జమ్మాకు కట్టేర. యరుమొన్ను సున్నము పట్లు పెట్టేర. మద్దిలో కుంకుము బుక్కు పిండితో బొట్లు పెట్టేర. నాలుగు గుంజులు నడిమద్దిలో కమ్మిడి పొరిసి సాసుకుము యేసేర. ముందురు పక్క రెండు దిక్కులు రెండు రాసులు జొండ్లు పోసి మూడు ఆకులు రెండు వక్కులు పెట్టేర. వొగపక్కి కలుసుము పెట్టేర. కలుసుము మట్టిలో ఆకులు పెట్టిన గిన్నిలో ఈబీతిపొందు తీసుకుని

కల్దెన్న కొడుకు మల్లన్న మామ అందిరికి అడ్డబొట్లు పెడుతుండాడు. బోడెక్కొళ్లు వలన్న పులిగెన్న, మల్లన్న మామ పణమింద పెట్టిన ఈబీతిపొందు అడ్డబొట్లు మింద మద్దిలో కుంకుమ బొట్టు. ఇంతులోకి తలారి నాగన్న మల్లన్న మామని అరిసిడిస.

“వొసన్... మల్లగా... పిల్లొల్లుకి ఆడొల్లుకి రెండు రెండు బొట్లు పెట్టు. మొగొళ్ళుకి మూడు మూడు బొట్లు పెట్టు. శ్యాస్త్రుము తప్పుకూడదు. తెలిసేద్నా. అదేమరి. మరిసిపోకుండ సెయ్యి. లేదంటే నాకిట్లీ” ఆనిడిస.

“ఓ తలరాతినీ... నాకి తెలుసులా సామీ. అవుతులు గేర్లో వుసేనక్కని బసివిరాలుని ఇడిసినపుడు నేను కార్యుము సేసేది సూస్తిని. అనమక్కని బసివిరాలుని ఇడిసినప్పుడు నేను దగ్గిరుండి సూస్తిని పులిగెమ్మవ్వని బసివిరాలు ఇడిసినపుడు కూడ సూసేనకాని సరింగ గురుతులేదు. అపుడు నాను సిన్ని పిల్లోన్ని అనుకో. ఇదేమన్న పెద్ద ఇసిత్రుమా. నాకి ఇడిసి పెట్టండి మరి. ఈ పొద్దు బోడెక్కని బసివిరాలు ఇడిసే పనంతా నేనే సేస్తాను. యేమనుకునేర మడినన్ని. మిమ్ముల్ని వొగిటి గూడ అడిగితే అప్పుడు అనండి. అవుర్రా మల్లగాడు పెద్ద ముసులోని లక్క యంత బాగ సేసేడ కార్యుము అనల్ల” అనిడిస మల్లన్న మామ.

“యే మండమ్మా.. ఇంగా అయ్యేద్నా లేదా. యాలా తప్పుతాది. పిల్లని తీసుకురాండమ్మా, కర్నుము సామి సెప్పిన మూర్తానికి కరెట్టుగా ద్వావుర్లు గట్టల్ల. రాండి రాండి. ఇంగా యేటికి పొయ్యి సానుము సేస్కొని రావల్ల. ఇంగా యాడ పొద్దు వుండాదని అలా తాసికారుము సేనస్తూండా”రని లాలప్ప తాత కూతేసిడిస.

“జుమ్ చుక్నక్ – జుమ్ జుమ్ చుక్నక్ – జుమ్ జుమ్ చుక్నక్” అంటాని బ్యల్దాని బైనే ఆయప్ప జమిడికి అనిపిచ్చేతలకాల అందిరి సెవులు నిగిరి బొడిసిడిసేవ.

“ఇంగేమి సూస్తారు తీసుకోండలేయ్. ఇంగా యంతసేపన కాస్తారు ఆ తప్పిట్లుని” – అని కందారప్ప పెద్దప్ప అనే తలకాల... “జగ్గణకణకణ, జగ్గజ కణకణ, జగ్గణకాన్ – జగ్గణకణకణ, జగ్గణకణకణ, జగ్గణకాన్” – అంటాని తప్పిట్లు, తాసాలు వర్రర్రర్రాని మోగుతుండాయి.

యక్కక్కట్నుంచో వొచ్చిన బసిపురాళ్ళంతా ముందు గుంపుగ నిలబడి పాట్లు పాడుతుండారు. మద్దిలో వొగ పెద్ద బసిపురాలు వొడి నింద గింజులు పోసుకుని

రెండు సేతుల్లో రెండు యాపమండ్లు పట్టుకోని యెంటుకులు ఇరుబోసుకుని మకుము నిండ బండారు బూసుకోని పడిమింద కుంకుము బొట్టు పెద్దిది పెట్టుకుని, కండ్లు మూసుకొని మెల్లిమెల్లిగ నడుస్తుండాది. ఇంగా వులిగిమ్మవ్వ పెయ్యిలోకి వొచ్చినట్లు లేదు. అంద్కనేమొ ఆయమ్మ యేమేమి వూగుకోకుండ మట్టసనంగా కదులుకుండ నొడుస్తుండాది.

మొగొళ్ళంతా తమిట్లు సుట్టూర సేరేర. తప్పిట్లొళ్ళు యెగిరెగిరి కొడుతుండారు. బైనే ఆయప్ప జమిడికి సుట్టు బసివురాళ్ళు ముసురుకునేర, జమిడికి శబుదుము, తప్పిట్లు తాసేలు అన్ని కలిసి వొగిటే రొవుసుమింద వాగుతుంటే సుట్టుముట్టు వూర్లుకి ఇనిపిచ్చేతట్లుండాది.

యనకాల బోడెక్క యేడుసుకుంటా ముసుగుసుకోని తలకాయి వొంచుకోని మెల్లిమెల్లిగ నడుస్తుంటే ఆయమ్మ సుట్టు అవుతులు గేర్లో ఆడొళ్ళు ఇవుతులు గేర్లో ఆడోళ్ళు, వూర్లు నుంచి వొచ్చిన సుట్టాలు సానామంది ముగుబడిడిసింటే తిర్నాలు నాడు తేరుసుట్టూరుగ వూరంతమంది కదిలి పొయ్యినట్లుండాది.

సిన్నసిన్న పిల్లకాయలంతా క్యాకులేసుకుంట యెగురుకంట ముందు ముందు పారిపోతుంటారు.

జాతర యల్లబారినట్టు మాదిగ్దేర్లో నుంచి వూరేగింపు బయలుదేదిడిస. సవురమ్మ గుడితాకి వొచ్చి, వొగకాయి కొట్టుకొని గోందిరొడ్డొళ్ళు ఇంటి ముందెళ్ళి ఈడిగి రంగయ్యోళ్ళు ఇంటికాట్నించి సింతమాకుల్లోని బాయితాకి వొచ్చేతలకాల రెండుగంట్లు సేపు అయ్యింటాది.

వక్కుపొడి కొరకికే తలకాల పారిపొయ్యి పారొచ్చేంత దూరములేదు ఇది. అట్లా దానికి ఇదింత వూరేగింపు వొచ్చేదానికి రెండు గంటల టెయిము బట్టేద్నంటే ఇంగ సూస్కో జనుము యెంత యెగురుడుము యంత కుసీసేస్కుంట వొచ్చేర్నో.

ఇంగ తప్పిట్లు ఆపండప్పా తప్పిట్లు అపి తావేవొళ్ళు యెవురో బిరీన కొల్లూ సరాయి తాగండి. బీడీలు గీడీలు తాగి తప్పిట్లు కాపుకోని రెడీగుండల్ల సూడీ. తాసికార్యము సెయ్యికుండ పిలిసే తలకాల యెత్తుకోవళ్ళ – అంటాని సెప్పి దుబ్బీరన్న బాయిగడ్డతాకి పాయ.

తప్పిట్లు కొట్టేవాళ్ళు తప్పిట్లు యండికి పెట్టి ఈడిగి రంగయ్యోళ్ళు ఇంటి ముందు దుమ్ములోనే కుసినిడిసిరి. ఈడిగి రంగయ్యోళ్ళు కుసునేర, దుమ్ములో కుసునేకి ఇస్టుము లేనొళ్ళు నిలబడుకొనే వుండారు.

బాయిగడ్డ మింద ఆడోళ్ళు గుంపులు గుంపులు నిలబడేర. మొగొళ్ళంతా అట్లా దూరుము నిలబడేర. అది సూసేకి అగాదుము లోతు బాయి. నాకి బుద్ధి వొచ్చినప్పట్నించి ఆ బాయిలో సుక్క నీళ్ళు వూరింది లేదు. వాండ్లు కాలము పడిన్నీళ్ళు మూడు దినాలకి, రెట్లు గాలే పెంచుమింది. కేసిన నీళ్ళు లక్క పీరుసుకు పోతాయి. యండ కాలుము అయితే ఆవుర్లావుర్లు వొస్తాయి బాయిలో నుంచి ఇంత నీళ్ళుకి కొరువు వుండే వూరు ఈ దేసుములో యాపూరు వుండుదేమో.

మాదిగ్గేర్లో యేకార్యుము అయినా గంగకంటాని పొయ్యిరావల్లని సెంబనిండో కడుపునిండో నీళ్ళు తీసుకోనొచ్చి, వొట్టి బాయిలోకి దిగి బొట్లు బెట్టిన రాయి మిందే తెచ్చిన నీళ్ళు గుమ్మరిచ్చి శ్యాస్త్రుము అయ్యిపొయ్యిడిసేదని అనిపిస్తారు.

ఇపొద్దు బోడెక్కని బసివిరాల్ని ఇదిసే కార్యుము అంటే సానా పెద్ద కార్యుము. సుట్టుముట్టు పండెండూర్లు మంది సూసేకొచ్చేర. దూరాబారుము నుంచి సుట్టాలు గిట్టాలు వొచ్చింటే వూరంతుటికి పండుగున్నట్లు వుండాది. కల్దేగొట్టు పూజార్లు. గట్టు మల్లయ్య, గొరువయ్యిలు, పులిగి పెద్దమ్మ, ఇంగా రానేరాలేదు. వాళ్ళందరికి బొస్సు అబ్బినట్లు లేదు. వొస్తారు వొస్తార్లే ద్యావుర్లు కట్టే తలకాల అనుకొంటుండారు.

బాయిగడ్డ పెయ్యి మెటికలు మింద మ్యాకు పో తుమ్మడికి యాపాకు మండ్లు కట్టి కుంకుము బుక్కు పిండి పెట్టి దాన్ని దువ్వుతుండారు పెద్ద మనుషులు.

బంగారప్పొళ్ళు ఇంటి ముందుర బసిరి మానుకాడ అయిదేండ్లు నుంచి పులిగెమ్మవ్వకి ఇడిసిన బోడెక్కొళ్ళు దున్నుపోతుని కట్టేసి పెట్టేర.

అయిదేండ్లు కింద ఇన్నూర్రూపాయిలికి పెదరొడ్డాళ్ళు యనుగొడ్డుకి పుట్టిన దున్నుపోతు పిల్లిని బోడెక్కొళ్ళు నాయిన నడిమింటి కందారప్పకొని పులిగెమ్మకని ఇడిసిడిసేద. అది సముచ్చురుము తలకాల నేమికంటొళ్ళు ద్యావురు పోతని సుట్టుముట్టు వూర్లొళ్ళు అందరికి తెలిసేతట్ల తిరిగి మేసి బలిసిడిసేద. వున్నట్లుండి వొగు సొమ్ముచ్చురుము కనబడుకుండ పొయ్యిడిసేద. బోడెక్కొళ్ళు తిరిగిన వూర్లేకుండ తిరిగితే, అక్కడ యక్కడో పడుముటుదిక్కు కనుడు దేసుములో వుండాదని తెలిసి మాదిగొళ్ళందురు ఇంటికో మనిషి పొయ్యి అదిలిచ్చుకొచ్చేర. ఆయిదేండ్లు అయ్యే తలకాల దాన్ని సూసేకి బయిమయ్యేతట్ల వుండాది. బోడెక్కిని యప్పుడు బసివిరాల్ని ఇడుస్తారో ఈ దున్నుపోతు బాద యప్పుడు తప్పుతాదో అంటాని రెయితులు ఆపలాసన సేసుకుంట వుండ్రి.

వొగునాడు బోడెక్కొళ్ళు నాయిన్ని బజార్లోకి పిలిసుకొని వూర్లో వొళ్ళంతా పంచాదపెట్టిడి సేర.

"ఏం కందారప్పా! ద్యవురుపోతు వూరందురు సేండ్లోపడి పయిర్లు పాడు సేస్తుండాదని వూర్లో రెయితులందురు బాదపడుతాండారు. మడి నువ్వు ఏమంటావో సెప్పు" – అంటాని కాలుమింద కాలేసుకుని యడుము సేత్తో మీసుము దువ్వుకుంట పెదరెడ్డి అడిగిడిస.

రేడీ రూము ముందు పందులు పొర్లాడే దుమ్ములో మాకాళ్ళు మద్దిలోకి మాసేతులు పెట్టుకుని కుసినిన నడిమింటి కందారప్ప, నెత్తిమీద రుమాలు తీసి సంకులో పెట్టుకొని రెండు సేతులు యెత్తి మొక్కి మాట్లాడేది మొదులు పెట్టిడిస.

"నిజమే రొడ్డీ! పయిర్లు కాపుకొచ్చిన మాట నిజిమే. నా ద్యావురుపోతు యాటకొచ్చిన మాట నిజిమే. రవుసు మింద వున్నంది రైయ్యిమని పొయ్యి పయిర్లు మింద పడిమేసింది నిజమే. మడి నన్నేమి సెయ్యిమంటావు రొడ్డీ వూరు కట్టిడి పకారుము, మా కులాచారము పకారుము, మా యింటి దేవితి పులిగెమ్మ మొక్కిబడి పకారుము సాతనయిన పనిసేస్తిని. అప్పుడు సెయ్యి తిరుగుతుండా రెండు నూర్లు పెట్టి నీ మాట పకారుము నీ యెసుగొడ్డుకి పుట్టిన దున్నుపోతునే కొని ద్యావరుకి ఇడిస్తిని. ఇప్పుడు కార్యుము సెయ్యల్లంటే సిన్నపనా, మాయట్లా సన్నాళ్ళుకి అయ్యేపని కాదు. పసిపిల్లిని పట్టుకుని బసివిరాలిని ఇడసల్లంటే మొనుసు యెగుదునూడి రొడ్డీ" – అంటాని నడిమింటి కందారప్ప అంటాండగానే...

"యేమలే కందరగా.. యేమంటివి. నీబిడ్డ పసిపిల్లా, నోట్లో యేలుబెడితే కొరుకుదేమతినీ. యదమింద కొంగు తీసేస్తే సారుట్లావు వుండావి సాండ్లు వూర్లో మొగొళ్ళంత ఆ మాదిగి బోడెక్కిని యప్పుడు బసివిరాల్ని ఇడుస్తారా, యప్పుడు బొట్టుకట్టి పెట్టుకుందామని యెదురు సూస్తుంటే, యేమి వగులుమింద మాట్లాడుతుండావు మాదిగతినీ.... దానికేల్యా ఆంటారు పెద్దొళ్ళు 'మాలోన్ని సెప్పుకుండ తన్నల్ల – మాదిగోన్ని సెప్పి తన్నల్ల'ని – సానా రవుసు మింద" మాట్లాడిడిన బాయిగడ్డు అనుమంతు.

పెదిరెడ్డి అతిని మాట్లుకి అడ్డుము తగిలి "నూవ్వుండప్పా అనుమంతూ, నేనుండాను గదా, మాట్లాడేకి.. ఏం కందారప్పా ఇప్పుడు సెయ్యి. నీ బిడ్డికి వొయిసెంత."

“పదేండ్లు రొడ్డీ!”

“అవు(రా మొగోడా! నీ బిడ్డకి పదేండ్లని నువ్వు సెప్పితే నమ్మేకి మేమేమన్నా తిక్కనా కొడుకులు అనుకునేవునా. ఆ పిల్లని సూస్తే పదయిదేండ్లన్నా దాటుంటా యనిపిస్తాది. ఆ పిల్లికి పెండ్లి సేసింటే ఈ పాటికి నలుగురు పిల్లులన్న పుడుతుం(డి అయినా పదేండ్లు అయితేనేమతినీ, పొయ్యి నేడు నాను వులిగి జా(త్రికి పొయ్యింట్ని అడసూస్తే నాకే అచ్చర్యము యేసేద. సిమింత సిమంత పసిపిల్లుల్ని బసివురాళ్ళని ఇడుస్తుండారు. మీరు నిజము సిప్పితే ఇంటారు. అపద్దము సెప్పితే ఇంటారు. మాయమ్మ తోడు సెప్పుతుండాను.... వొగూరొళ్ళు సంకలో పిల్లనే బసివిరాళ్ళు నిడిసిడిసిరి. మగా అంటే మూడేండ్లు వుండువప్పా. దీనికేమంటారు. సెప్పుండప్పా” అంటాని బాయిగడ్ల అనుమంతు లా పాయింటు తీసి కట్టమింద కుసినిన పెద్ద మనుసులు, వూర్లో వొళ్ళని కట్టకింద దుమ్ములో కుసినిన మాలొళ్ళు మాదిగొళ్ళు అందిరిని నిక్కి నిక్కి సూసిడిస.

“నిజమే గద కందారప్పా! అన్ని వూర్లులోన పదేండ్లు గాని లేని పిల్లొల్ని బసివిరాలుని ఇడుస్తుంటే మనూర్లో మా(త్రుము యేంటికి ఇడుసు గూడుదు సెప్పు. మీ మాదిగొళ్ళకి యంత సెప్పినా అర్తుము గాదు, కొమ్ము నరసప్ప బిడ్డ పులిగమ్మని బసివిరాలుని ఇడిసినప్పుడు ఇదే రంకు, మస్తానమ్మ బిడ్డ అనుమక్కని బసివిరాల్ని ఇడిసినప్పుడు ఇదే రంకు. యాటకని మిమ్ముల్ని వొరుసుకునేది సెప్పుండప్పా” అనిడిస రెడ్డి.

“అదిగాదు రొడ్డి. బూము బు(టు లేనోళ్లుము. యాదో మీకింద కూలీనాలీ. సేసుకోని బతికే వొళ్ళుము. మామింద అట్లా కోప్మ అయితే యట్టద్యావురా, మీరే యట్లన్నా దెయిదలసండని” కీసన్న తాత మట్టసనంగా మాట్లాడిడిస.

“నువ్వు సెప్పు కందారప్పా. అస్సులు నీ బాదేందో అందురు ముందు ఇప్పిసెప్పిడి.” అని పెదిరెడ్డి అ(డేసిడిస.

“సరే రొడ్డీ. మీరు సెప్పితే కాదంటానా. కాదని మేము ఈ వూర్లో బూడిదేసేమ్నా. పెట్నా మీరే కొట్నా మీరే. మీ మాట పకారమే నా బిడ్ని బసివిరాల్ని ఇడిస్తాను” – అంటానికొప్పేసుకునిడిస నడిమింటి కందారప్ప.

“అది సరేప్పా, మడిద్యావుర్ని సేసేకి ఇబ్బందులు గిబ్బందులు వుండావంటివి. కీసన్నగూడ అదేమాట్ని సెప్పిడిస. ఆ సంగితి కూడ ఇపిడే కదా తెంపులు సేసుకుంటే

కార్యము సేసేకి కర్నుము సామి మూర్తుము కడుతాడు మడి. కర్నుముసామి గూడ యాయాల్నుంచి కదులుకుండ యేంటికి కుసునేడ అనుకునేర".

కార్యము అంటే మీకి తెలీంది యేముంది రొడ్డీ. కర్చుకందాయిము వుంటాది కదా" అనె కందారప్ప.

"మడి అదేనప్పా. నిన్ని సెప్మనింది. యంత కొర్చు అయితాది. సెప్పితే వూర్లో వాళ్ళు అంతా కలిసి తలాకింత ఇచ్చిడిస్తారు. 'హొందుకొని తినిందానికి హొగిటే రకుమంట, అడుక్కోని తినిందానికి అరవయ్యి అరు వంటకాలంట' అంటాని వూరికే అనేర్నా పెద్దాళ్ళు... అడుగడుగు నీ కర్చు యంతో" అంటాని హొగ శ్యాస్త్రుము యేసి సెప్పిడిస పెదిరెడ్డి.

"అదిగాదు రొడ్డీ. వూరంత మంది ఇచ్చేది హొగెత్తు. మనూరి పెద రొడ్డొళ్ళు ఇచ్చేది హొగెత్తు. అంటాని మాప్యద్దొళ్ళు యప్పట్నుంచో కతులు సెప్తుతుంటే ఇంటుండాము. మా ఆసంతా మీమిందే కద రొడ్డీ. మడి మీ మాటేందో సెప్పునే లేదు" అంటాని అడ్డుము తగిలి మాట్లాడిడిస గుంపులో నుంచి లాలప్పతాత.

"మీ పెద్దొళ్ళు సెప్పితే ఇనే మంటావే. నువ్వు సూల్లేద ఈ వూర్లోనే కాదు ఈ ఆలూరు తాలూకాలోనే నేమికంటి పెదొరొడ్డొళ్ళంటే సానా మంచొళ్ళని పేరు తెచ్చుకునేమ కదా. మేము ఇనాము ఈకుండా ఈ వూర్లో యెవుడన్నా కార్యము సేసుకునేడ్నా యేమి. సెప్పు లాలప్పా.. సెప్పు. అంద్కనే కదా కందారప్పని కర్చెంతో సెప్మని పదిమంది ముందే అడుగుతుండాను" అనిడిస పెదిరొడ్డి.

"హొలేయ్ కందారుగా... నీకేమన్నా మతి పొయ్యేద్నేమిలేయ్. పెదిరొడ్డి పెద్ద నోటికేసుకోని అడుగులే ఇస్తానంటుంటే. అక్కడా ఇక్కడా సూసుకుంటా నెంగిసిల్లిలక్క నెత్తి గీక్కుంటుండావే. అందికే అంటారు మడి 'మాదిగోనికి మల్లిపువ్వు ఇస్తే మడిసి గుద్దులో పెట్టుకునేన్నంట' అంటారు పెద్దొళ్ళు. హొలేయ్... రా... రార్రా ఇట్లుర్రా....." అంటాని నడిమింటాయప్పని గుంపులోకి పిలిసి గుసుగుసుమని సానా సానా ఇసయాలు సెప్తుతుండారు.

మాదిగొళ్ళకి రొవుంత ముందు మాలొళ్ళు గుంపు కుసునేద. వాళ్ళు కేమి పట్టినట్లు లేదు. వూరికే సూసుకుంట కూసునేర. అవుతులు పక్క బాయెళ్ళు గుంపు వుండాది, నబీసాహొళ్ళు వోట్లుపక్క తరుకొళ్ళు గుంపుకుసునేద. వాళ్ళకి యడమవక్క కటికేహొళ్ళు. దూదేకులొళ్ళు కుసునేర. రేడీరూము కాంపొందుని

అనుకొని వున్నిన మంగుళ్ళసాపులు యనకపక్క మంగులొళ్ళు అంతా కుసునేర. మంగులొళ్ళకి యెనికి పక్క సాకులొళ్ళు కుసునేర. రొడ్డొళ్ళు సరిగ్గ పింజిరొళ్ళు, బలిజేవొళ్ళు. బైనేవొళ్ళు, ఈడిగొళ్ళు. క్యామిటోళ్ళు, కమ్మొళ్ళు పెద్ద మనుసులు కట్టమింద వుండారు. మిగిలిన కులాలొళ్ళు అంతా రేడీ రూము సుట్టూరుగ కుసునేర. అన్ని కులుపొళ్ళందురు వున్నీన పండ్లన్నీ ఇడిసి పెట్టుకొని మునిమాపునే రేడీరూముతాకి వొచ్చి కూసునేర.

నడిమింటాయప్ప మా పెద్ద మనుసులు సెప్పినవన్నీ ఇని పైకిలేసి రొడ్డికి సెపుతుండాడు...

"జొన్ను బూకోసుము రెండు మూట్లు జొండ్లు. సామికి యదేసేకి, పెద్ద మనుసులికి సాబూ పెట్టేకి వొగుమూట వొరిబీము, ద్యావురు నంజిరిలోకి యచ్చుము, ఆకులు పూజికి, దీపారాజినికి, పెద్ద మనుసులు ఇనాము, తప్పిడి గొట్టేవాళ్ళు కర్సు – వాళ్ళు తాగే సారాయి కొల్లుకి, పూజార్లు, బసివిరాళ్లుకి ఇచ్చేకి, అదీ ఇదీ కలిసి రెండు వెయ్యిలు అయ్యిదాదేమొ సూడి రొడ్డీ"– అనె.

"దుడ్లేమన్నా సెట్లుకు కాస్తాండా యనుకునేవునా. యేమిరా కందారుగా! నీ బిడ్డిని బసివిరాలుని ఇడిసేకి రెండు వెయ్యిలు అయితాదా? ఇదే రెండు వెయ్యిలికి కర్నాటుకుములో అయితే పదిమందిని బసివిరాల్లునిడచ్చు. నీ బిడ్డేమన్నా బూలోకుము రంబనుకునేవునా. అతి లోకుము సుందరమ్మ అనుకునేవునా. ల్యాకు పోతే వూర్లో యెవ్వురు సూన్నట్లు సూపరమ్మ అనుకునేవునా, నువ్వు రెండు వెయ్యిలు రూపాయిలు అనేతలకాలా ఇచ్చేకి. ఇంతుకు ముందు మీ మాదిగొళ్ళు పిల్లుల్ని యంత మందిని బసివిరాల్ను ఇల్లేదు. మేము దుడ్లు ఈలేదు. యంతిచ్చే వొళ్ళము... మాకి బుద్దొచ్చినపుట్నుంచి బసివిరాలు కర్సుకింద అయిదారు నూర్లు, వెయ్యి రూపాయిలంటే మగా కస్టిము అప్పా! అట్లా దానికి వొగేసారి రొండు యెయ్యిలంటే మమ్మల్ని యేమన్నా తిక్కనా కొడుకులు అనుకునేవునా" అంటాని లేసి అడిగిడిస కమ్మ నారానప్ప.

మీరు వూరుకోండప్పా. నేనుండాను కదా మాట్లాడేకి. అది కందారప్ప వొగిని మాట కాదు గదప్పా. వాళ్ళ మందిగోళ్ళంత కలిసి మాట్లాడుకునిందే మనికి సెప్పేద. అయినా వాళ్లనని యేమి లాబ్ము సెప్పండప్పా. మిండ్లుకు బుట్టిన గోర్మెంటు అనల్లగాని. అమ్ముబోతే అడివయ్యేద కొనుబోతే కొరివయ్యేద. సంచినిండా

దుడ్లు కండానిపోతే సంతులోకి, సారుట్లోకి గూడ రావు సొరుకులు. బసివిరాలు కర్సుకింది కిచ్చే రెండు యెయ్యిలికి లేనిపోనీ మాట్లన్నీ అని యేం లాబ్మ. సూడండప్పా మన వూరి కట్టిడి పకారుము మాదిగి కందారప్ప తన బిడ్నె బసివిరాలు ఇడిసేకి సొంతోసంగ వొప్పుకునేద. ఈ కార్యముకు అయ్యే కర్సులో సొగుబాగుము నేనొకున్నే బరించుకుంటాను. మిగిలింది వూరందురు కలిసి ఇయ్యండి. ఇంటికి రూపాయి యేసుకున్నా ఇట్లా కార్యలు పది సెయ్యచ్చప్పా. దీనికంత రాద్ధాంతుము యేంటికిగ్గాని... కందారప్పా ఇంగ పొయ్యి కర్నుముసామి సెప్పినట్లు మలుకులు పున్నుముకు నీ బిడ్డ పెద్దమనిషి అయితాది కదా. అందుకని ఆరెద్దులు కార్తి అయిన మూడు దినాలుకి నీ బిడ్నె బిసివిరాల్ని ఇడిసిడి. యేమండప్పా వూరందరికి ఇది సమ్ముతుమే కదా'' అని పెదిరొడ్డి పంచాదతెంపే తలకాల యెవురింటికి వాళ్లు యెగురుకుంట పొయ్యిడిసిరి.

ఆ పొద్దు రేడీ రూముకాడ జరిగిన పంచాద పొద్దు నుంచి ఈ పొద్దు బోడెక్కిని బసివిరాల్ని ఇడిసే వొరుకు నెలదినాలు వూరువూరంతటికి పండుగున్నట్లే వుండాది కాకుపోతే సద్దుసంగిట్లోకి జారిపొయ్యిన జొన్నగింజలక్క బోడెక్క వొగితి ఆ పొద్దుట్నుంచి ఈ పొద్దువొరుకు వొగిటే తరాగా యేడుస్తుండాది.

నీళ్ళులేని బాయిలో బోడెక్కకి గంగుసానుమని ఇంటి కాటి నుంచి కడుపులో యెత్తుకొచ్చిన నీళ్లు నెత్తిమింద పోసిడిసిరి. పాత బసివిరాళ్ళంత కలిసి బోడెక్కకి ఇంటికాట్నించి కట్టిచ్చుకొచ్చిన తెల్లిసీర తెల్లిరెయికి ఇప్పిదీసి, ముందుగాలుగునే కట్టి పెట్టిన యాపాకు మండ్లుతో పయ్యంత సుట్టిడిసిరి. వొంటి మింద బట్టల్యాకుండ యాపాకు మండ్లుతోనే కాళ్ళు కాద్నుంచి గొంతుకాటి వొరుకు యాపాకుతో పెయ్యి కనపడకుండ సుట్టిడిసేర, ఇదేదో అదిముకాలములో మనుసులు ఇట్లుండే వొళ్ళంటాని బాయిగడ్డ మింద వుండే ముసులొల్లు అనుకుంటుంటారు.

బోడెక్క వొగిటే తరాగా యెక్కుళ్ళు బట్టేతట్ల యేడస్తుండాది. "వూరుకోమ్మే... వూరుకుండు. "అమ్మ" కార్యమప్పుడు యేడుకూడుదు. పులిగమ్మవ్వకి క్వాప్మొస్తే జీవితాంతుము ఇట్లే యేడుసుకుంట బతుకుమని సొప్మ పెడతాదంట. మట్టసనంగా బసివిరాలు అయినోళ్ళని పచ్చనాకులక్క సల్లుగ బతుకుమని వరము ఇస్తాదంట. యేడద్దులేమ్మే యేడొద్దు. ఇంగ అయిపొయ్యిడిసేద కదా" అంటాని వొగ ముసిలి బసివిరాలు సముదాయిస్తుండాది.

పయినిండ యాపకులుతో కట్టింటే సేతుల్నీ కాళ్ళు కదిలిచ్చేకి కస్టంగా వున్నట్లుండాది బోడెక్కికి. ఇపుడు బిసివిరాళ్ళు యేమిసేసినా సేతులు అడ్డుము పెట్టేకిల్యాక పాయ. బసివిరాలు అనుమక్క డ్యాగురులోని బుక్కుపిండి తీసుకొని బోడెక్క ముకుము నిండ బూసిడిసేద. బసివిరాలు వుసేనక్క కుంకుము బొట్టు పెట్టేద. ఇంగోగాయమ్మ యగ్గట్టిన కొప్పుని ఇప్పిదీసి యెంటుకుల్లు ఇరుబోసేద. యడముకాలు అరికాలికి అరిసేతికి మసిబొట్టు పెట్టిడిసేర. కాళుకి సేతులుకి పోసుపు పూసింటే పూలు పూసిన గూర్నూలు సేన్లక్క వుండాది బోడెక్క. జిట్ట తగులుతాదని మసిబొట్టు పెట్టేర.

"అక్కుల్‌జోవ్... జోక్కుల్ జోవ్.... జోగో జోగో" అంటాని మూడుసార్లు "జోగులు తట్ట" పట్టుకుని బసివిరాళ్ళు అందురు జోగేసిడిసిరి. బోడెక్కతుక్కు తిరిగి మూడుసార్లు, పడుమటు తిక్కు మూడుసార్లు, తూర్పు తిక్కు మూడుసార్లు తిరిగి మొత్తుము తొమ్మిదిసార్లు జోగేసి.. "ఉదోవ్ ఉదో.... ఉదోవ్ ఉదో....." అంటాని జోగులుతట్లు యడమ బుజుమింద పెట్టుకుని కుడిసేత్తో యపాకు మండ్లు పట్టుకుని బసివిరాళ్ళు అందురు క్యాకులేసిడిసే తలకాల బయినే ఆయప్ప జమిడికి బుజానికి తగిలిచ్చుకుని "జుమ్ చుక్‌నక్... జుమ్‌జుమ్ చుక్‌నక్... జుమ్‌చుక్‌నక్" అంటాని వాయించ.

బుడ్డుమారప్ప టంకాయి తీసుకుని పైకెత్తి బాయిగడ్డ మెటికులు మింద యేసి కొట్టే తలకాల పిచ్చులు పిచ్చులు అయ్యిడిసేద, ఆ కొబ్బరి ముక్కులు యేరుకునేకి పిల్లోళ్ళు తండ్లాడు తుంటే తప్పిట్లోళ్ళు "కణ కణ జగ్గణకణకణ... జగ్గణ కణ కణ" అంటాని వూపు అందుకునిడిసిరి. యాడదంటాడే కుసినీన వాళ్ళూ, నిలబడి వోళ్ళు బాయితాకి వురికొచ్చిడిసిరి. బాయిలో నుంచి ఆడొళ్లందురు గుంపుగా నిలబడి బోడెక్కిని మద్దిలోకి యేసుకొని మెల్లి మెల్లిగ మెటికులు యెక్కిచ్చుకుంట పెయికి తీసుకొని వొచ్చేర.

బంగారప్పొళ్లు ఇంటి ముందు బసిరి మానుకింద కట్టేసిన ద్యావురుపోతుని తాళ్ళు ఇప్పి సుమారు నూరుమంది బలుముయిన మొగొళ్ళు ఇగ్గి పట్టుకునేర. దున్నుపోతుని యక్కడ కదులునీకుండ ముక్కులో నులుక్కి రెండు తాళ్లు కట్టేర. కొమ్ములికి రెండు తాళ్ళు కట్టేర. నాలుగు కాళ్ళుకి నాలుగు తాళ్ళు కట్టేర. గొంతుకి రెండు తాళ్ళు కట్టేర. మ్యల్లో నుంచి ముందురు కాళ్ళు మద్దిలోకి గుదిగి కట్టి

కట్టేర. నూరుమంది మొగొళ్లు పెయినే ఇగ్గిగ్గి పట్టుకుంటుంటే దున్నపోతు బుసులు కొట్టుకంట అక్కడా ఇక్కడా సిమ్ముట్లాడుతాండాది.

ద్యావురుకి మూడు దినాలు ముందు పోతుని పట్టుకుని కట్టేసి ముక్కుకుట్టి ముగుతాడు యేసేర. రేపు ద్యావురనంగా తిరిగి ద్యావరుపోతును కాళ్ళుగట్టి కిందికేసి బండిగుటాలు, బానేకట్లు, అనుసుకట్లు తీసుకుని తిరిగీన తుక్కల్లా కొట్టి కడువులుతో సన్నీళ్ళు యెత్తేర. అయిదేండ్లు అద్దుముల్యాకుండ రాజ్జిమేలే వొళ్లు మేసినట్లు మేసి బూంమింద కాలు పొదుబెట్టుకోకుండ సిమ్ముట్లాడు కంట తిరిగీన పోతును కట్టేసి కొట్టిండే కొట్టుడానికి పెయ్యిలోపల యముకులునంజిరి. ముద్దు ముద్దు అయ్యి పొయ్యింటాది. దాని నంజిరిని కురాకు వొండుకుని తినినా రుసి వుండుదు. అట్ల అణగొట్టింటే అది ఇంగా యక్కడబడితే అక్కడ సిమ్ముకొని పొయ్యేకి సూస్తుండాది. పాయిము మొగొళ్ళంతా తాళ్ళు ఇగ్గిపట్టి నిలేస్తుండారు.

ద్యావురుపోతు నంజిరి కాపుదనుమొళ్ళు తింద్రుగదా. వూర్లో నంజిరి తినే వొళ్ళందరికి కలిసి రెండు మ్యాకుపోతుల్ని ద్యావురికి ఇడిసేర. ఇంగా రోంతుమంది కోళ్ళని ద్యాపురికి ఇడిసేర.

ద్యావురికి ఇడిసిన మ్యాకు పోతుల్ని నాకారు పిల్లొల్లు తాళ్ళుతో పట్టుకుని అవిటికి యాపాకు తిని పిచ్చకంట యెగురుకుంట వొస్తుండారు. మ్యాకుపోతులు యనక తప్పిట్లొళ్లు గూడ ఆడేవొళ్ళు సరింగ యెగురుకుంట తప్పిడి కొడుతుండారు.

తప్పిడి రంగన్న అయితే రూపాయి బిల్లులు తప్పిట్లోకి యేపిచ్చుకుని కింది నుంచి సిటుకులు కొడితే తప్పిట్లో దుడ్లన్ని పెయికెగిరి కింద పడుతుండాయి. కిందపడిన దుడ్లుని యేరుకొని యేరుక్కొని జోబులోకి యేసుకుంటుండాడు. అది సూసి తత్తారి గుడ్డాయప్ప రెచ్చిపొయ్యి రూపాయి నోటుని మొంట్లో పడేపిచ్చి తాసే కొట్టకుంట, ఆపుకోకుండ కంటి రెప్పులతో రూపాయి నోటుని పట్టుకుని పెయ్యికి లేసిడిసేత. తప్పిటి రంగన్నకి రోసుమొచ్చి పావులా బిల్లులు న్యాలుమిందేసి తప్పిడి కొట్టుకుంట ఆపుకోకుండ తలకాయి బార్లేసి పొందుకొని ముగుముని మొంట్లో అట్లా ఇట్లా పోర్లాడిచ్చి పావులా బిళ్ళని పణమింద అంటిచ్చుకుని పెయ్యికి లేసి తప్పిట్ని యెగిరెగిరి కోడుతుంటే సుట్టుముట్టు సూసేకి ముసురుకునిన జనుము ఈలులు యేసి క్యాకులు యేసి అరుసుకంట యెగురుతుండారు.

తప్పిట్లోళ్ళుకి యెనకాలే దాసిరి లసమక్క గలుస్తంబుము పట్టుకుని గంట కొట్టుకంట, దీపారాజ్జిము వొత్తిని యెగేసుకంట వొస్తుండాది. ఆయమ్మ యనుకునే

బైనే ఆయప్ప జమిడికి వాయిస్తుండాడు. ఆయప్ప యనకాల్నే జోగులుతట్లు పట్టుకొని జోగీసుకుంట 'ఉదో ఉదో' అంటాని బసిరాళ్లు యనక దుబ్బీరక్క కలుసుము పట్టేద. కడాకి ఆడోళ్ళంత గుంపు గుంపు నడుసుకుంట మద్దిలో బోడెక్కిని నడిపిచ్చుకుంట వొస్తుండారు.

బోడెక్కని సూసేకి యక్కుడక్కుడోళ్ళు యగుబడుతాండారు. గుంపులో వుండే బోడెక్క సరింగ కనబడుదు. దూరుము నుంచి సూసేవొళ్ళుకి బోడెక్క ఇరుబోసుకునిన నెత్తి, బండారు పూసుకునిన ముగుము రోంతురోంత కనబడతాండాది. మద్దిలో మద్దిలో ఆడోళ్ళు అట్లా ఇట్లా కదిలినపుడు పయ్యంత బట్లు ల్యాకుండ సుట్టిన యాపాకు కనబడతాంది. తేరు పరిసట్లా జనుము కండ్లు కొట్టుకోకుండ బోడెక్కిని సూసేకి తండ్లాడుతాండారు. వొగిటేతరాగ బోడెక్క యేడిసీ యేడిసీ కండ్లు యఱ్ఱగ సింతు పిచ్చుకలు అయ్యేవ. కన్నీళ్ళు తూడుసుకునేకి బోడెక్క తలకాయి వొంచుకున్నపుడు ఆ గుంపులో నుంచి యేమేమి కనుపడుదు.

వూరేగింపు బాయిగడ్డతా నుంచి ఈడిగిరంగయ్యోళ్లు కల్లుప్యంటుతాకి వొచ్చే తలకల్ల, గోయిందు రొడ్డొళ్ళు మిద్దిమింద వూర్లో జనుము సేరేర. బోడెక్కిని సూసేకి వొచ్చినవూర్లో అడోళ్ళంతా గోయిందు రొడ్డొళ్ళు ఇంటిమింద బడేసా వొళు ్ళ మిద్దిమింద, ఇంగా తురుకొళ్ళు బాయెళ్ళు, వొడ్డేవొళ్ళు మిద్దులు మింద నగ్గా జనుము నిలబడిడిసేర.

యేమి సిపొరస్తయిన జనుము కలిసేౕరా! ఇట్లా జనము పెద్దరొడ్డొళ్ళు పెండ్లికి గూడ కలిసుంౕడు సూడండప్పా! సూసేమగాని, యంతు మందునో బసివిరాళ్ళుని ఇడిసేది. బోడెక్క అౕదుస్టవే అౕదుస్టుము అంటాని మంది అంతా అనుకుంటుండారు.

వూరేగింపు సవురమ్మ గుడి తాకి సేరేద. మా వూర్లో వులిగెమ్మవ్వగుడి లేదు. అంద్కనే సవురమ్మవ్వ గుడిలోనే వొగుమూలుకు జొండ్లు పోసి, జొండ్లు మింద మరువుపెట్టి మరువు మింద ముంత పెట్టి, ముంత మీద పీసుతీసి ట్యంకాయి పెట్టి దానికి మూడు బండారుతో అడ్డుబొట్లు పెట్టి, దానిమింద పూలుదండ యేసి దేవుతిని సేస్తారు. దానికే కొత్తబట్లు సుట్టి, బట్లు కట్టిచ్చేమ అంటారు. సాతనై నోళ్ళు యెండితో మీసాలు, కండ్లు సేపిస్తే ఇంగా కలిగినోళ్ళు మగుమే సేపిచ్చికొచ్చి కార్యుము సేస్తారు. ఈ పొద్దు బోడెక్కిని బిసివిరాలుని ఇడిసేకి అట్లే సేస్తూండారు.

సల్లునీళ్ళు కడువు తీసుకోనొచ్చి పాదాల కట్టకడిగిడిసిరి. బండారు పూసి కుంకుమ సల్లి నిమ్మకాయిలు వుల్లిగడ్లుకోసి గండ్రాగొడ్లి, యాటకొడివెండ్లుకి పూజ్జేసి ట్యంకాయి కొట్టిడిసిరి. పోతుని, బోడెక్కిని గుడిసుట్టు మూడుసార్లు తిప్పుకోని వొచ్చి గుడికి ముందుగాల పాదాలు కట్టకాడ నిలబెట్టిడిసిరి. ఆడొళ్ళని పిల్లొల్లుని దూరుము జరిపిడిసిరి. "కొత్త వూర్లొళ్లుని ఈ ద్యాడ వుండొద్దండప్పా. మదససంగా సెపుతుండాము దూరుము పోండి. యేమండప్పా ఇది పెద్ద మనుసులు మాట. యేరేవూరొళ్ళు పొలికండాని పొయ్యేకి వొచ్చింటారు. వుండూరొళ్ళంతా పెయినింద కండ్లు బెట్టుకొని ఆయుదాలు పట్టుకొని వుండండ"ని లాలప్పతాత క్యాకేసిడిస.

పదేండ్లు దాటిన పిల్లొల్లు నుంచి ముసిలిముసిలొల్లు వరుకు మొగొళ్ళంతా, కట్లు, కటార్లు, బల్యాలు, బాకులు, పిడికత్తులు, యాటకొడివెండ్లు గండ్రా గొడ్డెండ్లు అనుసుకట్లు పురిబల్యాలు బానేకట్లు, బండిగూటాలు పాదాలు కట్టకాడ పెట్టి పూజ్జేసినవన్నీ తలాకొకిటి మా మాదిగోళ్ళంత తీసుకునిడిసేర. పెండ్లయిన మొగొళ్ళు పెండ్లాల తాలిబొట్టుని కుడి సేతికి కట్టుకునేర. పెండ్లి కానోళ్ళు మలతాడు తీసుకుని కట్టుకునేర. ఇట్లా తప్పుడు యేమన్నా అయ్యిపానుము బోతే మోచ్చుము వొస్తాదని నమ్ముకుము. బాయెళ్ళు గూడ వొగురో ఇద్దరో వొచ్చి నిలబడేర. ద్యావురుపోతుని నరికినపుడు దాని రొగుతుము యంత దూరుము సిట్లుతాదో అంత దూరుములో కొత్తు వూర్లొళ్లుని వున్నీకుండ దూరుము పొమ్మనేరగదా. ఇంగ మిగిలిన మా వూరొళ్ళంత దున్నపోతుని ఈ యేడు యెవుడు మూడేట్లుకి నరుకుతాడోనని సూసేకి తొక్కులాడుతుండారు.

అయిదారేండ్లు నుంచి అదేపనికి గండ్రాగొడ్లి సేపిచ్చుకుని కొబ్బరి బల్లుము, సెలిమిండి ముద్దులట్లా యచ్చుము తినుకంట అయిదారుమంది వుండారు. వూరుము కాలుములో అయితే వొగిటే యేటికి దున్నపోతుని నరికేవాళ్ళు అని మా తాతొళ్ళు సెపుతుండారు. డోనుమొద్దు అట్లా దున్నపోతు మ్యడిని వొగిటే యేటికి తుంట్లుబడేతట్ల యట్ల నకుతారప్పా అంటాని ఆచ్చర్యుము పొయ్యే వొళ్ళుము ఇప్పుడు నానాకు మొందులు కూడు తునే ఈ నాయండ్లు సాతనేమయితాది. అట్లాదానికే మూడేట్లుకి కన్నా మూడేట్లుకి నరకుమని కట్టిడి సేసేర. నరుకు లేనోనికి వొగు మీసుము కొరిగిచ్చి వూరేగిస్తారు. మూడేట్లుకి నరికినోనికి మూడు తులాలు బంగారుము ఇస్తారు. ఇంత కత వుండాది కనుకే మరి వొగినిమింద

వొగుడు పోటీపడి యడీ గం(డగొడ్డెండ్లు అదే పనికి సేపిచ్చుకుని పిక్కమింద కండ పురి తిరిగేతట్లా యచ్చుము తిని బలుస్తారు. పై పందాలు గూడ నగ్గా కాస్తారు.

ఈ యేడు ద్యావురుపోతుని నరికేవొంతు తలారి నాగన్న కొడుకు రామిగిరికి వొచ్చేద. తోడు పెండ్లికొడుకు లక్క వొగురు నరుకు ల్యాకపోతే కార్యుము ఆగిపొయ్యి అపుచారుము అయితాదని మిగిలిన అయిదారుమందిని నరికేకి వుండల్లని పెద్ద మనుషులు వొప్పందమంట. అందక్కని రామగిరి సరిగ్గ, దుబ్బిరన్న కొడుకు ముక్కిడి రామాంజిని, రోగాయప్ప కొడుకు ఈరుగాడు, సిన్నాయప్ప కొడుకు మల్లికార్జిని, కీసన్న కొడుకు నరసప్ప, యెదిరింటి కందారప్ప కొడుకు ఇసువురప్ప, గోసులు పోసుకుని అగీలు వుప్పేసి రెక్కలికి తాయెత్తులు కట్టుకుని, కుడిసేతి కంకణానికి పెండ్లాలు తాలిబొట్టు కట్టుకుని, మీసాలు పురి పెట్టి తొడగొట్టి ఆయుదాలికి మొక్కి గం(డాగొడ్డెండ్లు తీసుకొనెర.

దున్నుపోతు ముందుకాళ్ళు కింది నుంచి కాడేమాను యేసి గొంతుని కాడేమాను మింద పెట్టి యక్కుడొళ్ళు అక్కడ బిగబట్టేర. యెనకిపక్కి కూడ దున్నుపోతుని కదిల్నీకుండ కడుపుకిందికి అవుతులు నించి, ఇవుతులు నించి కాడే మాండ్లు యేసి ఇరుగు బట్టుకునేర.

రామిగిరి వొచ్చి ద్యావురుపోతు మ్యడకాడ నిలబడి రెండు సేతులుతో గం(డాగొడ్లిని పైకెత్తి ద్యావురుపోతు మ్యడమింద మెల్లిగ ఆనిచ్చి పైకెత్తి, అట్ల రెండుసార్లు సామిని మొక్కినట్లు సాంపులు సూసినట్లు సేసి వొగుసారి నిక్కి నీలిగి గం(డాగొడ్లుని బలుముకొద్ది రెండు సేతులుతో పైకెత్తి వాటుము సూసి అడ్డుము బెట్టి వొగిటే యేటు నరికితే సరి, దెబ్బకి దున్నుపోతు తలకాయి తెగితుండు బడిడిస. దున్నుపోతు తలకాయి కాడిమాను మిందు నుంచి యాలడపడేతలకాల గొంతుకింద యేలంత కరుసుకునీన తోలుగూడ తెగిపొయ్యిడిసేద. తప్పిట్లు తాసాలు జమిడికులు, బసివిరాళ్ళ "ఉదో ఉదో" అరుపులు మద్దిలో వొగిటే క్యాకులు ఈలులు యేసుకుంట రామిగిరిని పెయికెత్తి పూలుదండ్లు యేసి యెగురేస్తుండారు అరుసుకుంట.

మూర్తుము దాటిపోతాది పదండప్పా పదండని బోడెక్కిని గుళ్ళోకి తీసుకుని పొయ్యి పూజ్జేసి జోగుళ్ళు యేసి "ఉదో ఉదో" అనిడిసిరి. పయ్యంత సుట్టిన యాపాకుమండ్లు ఇప్పి అదరాబదరా పసుపు పచ్చసీర, రెయికి తొడిగిచ్చి ద్యావరుకట్ట

ముందు నిలిబెట్టిచ్చి కర్నుము సామితో కాలు తొక్కిచ్చి బయినే రామన్నతో దావుర్లు కట్టిపిచ్చిడిసిరి.

అయిపాయ నడిమింట బోడెక్క బసివిరాలు అయ్యేద. ఈ పొద్దుట్నుంచి నడిమింటి బోడెక్కిని యెవుని సాతనైతే వాడు పెట్టుకోవచ్చు. సిత్తకార్తిలో ఆడుకుక్కు సుట్టు అరువయ్యి ఆరు మొగుకుక్కులు సేరినట్ల, యట్లాగో వొగట్ల యేసుకో వళ్ళని సూస్తాయో ఇంగట్లా, బోడెక్కికి కన్నిరికుము పెట్టి సాతనైనన్నాల్లు పెట్టుకునేకి వూర్లో వొళ్ళంత కాపులు కాస్తుంటారు.

సిత్తకార్తిలో అరవయ్యి ఆరు మొగుకుక్కులు సొంగు కారుసుకుంట ఆడుకుక్క తాకి వొచ్చేకి సూసినా సాతనైన వొగిటే వొగు మొగుకుక్క యెక్కి పిట్లేసుకున్నట్ల వొయిసు అయిపొయ్యే వొరుకు ఇంగోర్ని దరికి రానీకుండ బసివిరాలుని వొలుసుకుని తినేకి యక్కడ దప్పిన్నాయాండ్లు అందురు యెదురు సూస్తుండారని మాయమ్మ ఇంగా యేమేమొ సెప్పుతుంటే.....

“బోడెక్క ఇంగా పెద్దమనిషి కూడ అయిలేదు కదమ్మా. ఈ పొద్దు బసివిరాలుని ఇడిసేరకదా. ఆ ద్యావుర్లు గట్టిన పూజారాయప్ప, కాలు దొక్కిన కర్నుము సామి కుంకునుము గట్టిన గొరువయ్య – ముగ్గురు ముసలినాబట్లు కలిసి, సామి కార్యమని ఆ పిల్లిని ఈ రాతిరికే వొగుడయినంక వొగుడు పక్కులో పొందు బెట్టుకుంటారంట అన్నిము పున్నిము యెరుగని నడిమింటి బోడెక్కిని బసివిరాల్ని సేసి బజారికి యేసిడిసిరి. పెద్దమనిషి అయ్యే తలకాలే యంతమంది ముట్టుకుంటారో, పాయిము అయ్యిపొయ్యే తలకాల యంతమంది పిల్లుల్ని పుట్టిస్తారో. ముసిలిముప్పు తనానికి ఆ బగుమంతునికే తెల్ల తల్లోయ్..... తలుసుకుంటేనే బయమయితాది” అంటానీ దీర్గలు తీసిడిస గుంతకంటి మస్తానమ్మ పెద్దమ్మ.

ద్యావురుపోతుని పగులుగోసి తోలు ఇడిపిచ్చి నంజిరి కుప్పులు యేస్తుండారు. ఇంటికొకిటి లక్క కుప్పులేసేర. మేము పెద్దింటి మాదిగొళ్ళుము. మాకి మేలేటు ఇయ్యుల్ల. మా నాయిన సానా పగులు మొగోడు కదా. అట్లా తాకిరాడు. మా పెద్దప్పుకేమొ యంతుసేపు సేన్లు సేన్లు అంటాని సేన్లోపడి సేన్లోనే సచ్చిపోతుండాడు. మా ఇంటికి నేనే పెద్దకొడుకుని. సిమింతున్నా ఈడు సిట్లుపడతాడని మాయమ్మ నాకి బిరుదు ఇచ్చేద.

త్యామ్మే త్యారాదా! గుడికట్టకాడ ద్యావురనంజిరి కుప్పులేసేది అయిపాయ. నీకి ద్యాగురు కడిగేదే కాలేదు. ఎట్లాగో అట్లాగ వుంటే వున్నీ త్యామ్మే అంటని

డ్యాగురు తీసుకుని గుడితాకి పొయ్యి ద్యావురుపోతు నంజిరిలో మా పెద్దింటి కుప్ప యెత్తిచ్చుకుని నెత్తిమింద పెట్టుకుని ఇంటికి వొస్తుంటే పెయిన కాకులు గద్దులు, నడిమింట బోడెక్కిని వూర్లో వొళ్ళు తన్నుకు పొయ్యినట్లు నంజిరికండ్లని తన్నుకుపొయ్యేకి గంగురాటుము తిరిగినట్లు తిరుగుతుండాయి.

నేనేమన్నా సిన్నమొగోన్ని అనుకునేర్నా. నెత్తిమింద నంజిరిడ్యాగిరి పెట్టుకుని యడమసేత్తో డ్యాగురు పట్టుకుని కుడిసేతులోని సిల్లా కట్టితో సాము కట్టి తిప్పుకంట కాకులు గద్దుల్ని నంజిరికండ్లని తన్నుకు పోనీకుండా ఇల్లు సేరిడిసేన.

# మాయమ్మ పూల యాపారం

## -మహమ్మద్ ఖదీర్ బాబు

మా అమ్మ కోసే సన్నజాజి పూలని లెక్క పెట్టాలని నాకు బలే కోరిక.

మా అమ్మలాగే మద్యానం మూడు గంటలకల్లా మా మిద్దెనెక్కి మా వరండా శ్లాబుకు పొదలు పొదలుగా అల్లుకున్న మా సన్నజాజి చెట్టు పూలన్నింటినీ నేను కూడా కోయాలనీ, కోసినాక పూవు పూవునా లెక్కబెట్టి నేనే నా సొహస్తాలతో 'పూల రిహానాబీ'కి అమ్మాలనీ ఆ వచ్చే డబ్బుల్ని నా సొంతానికి దర్జాగా వాడుకోవాలని సత్తె ప్రమాణంగా నాకు బలే కోరిక.

కానీ యాడా? మా అమ్మ తీరనిస్తేగా. నన్ననే కాదు మా అన్ననీ, మా చెల్లెల్ని ఆఖరికి మా నాయినమ్మని కూడా మా సన్నజాజుల చెట్టు మీద చేయి వేయనీదామె.

ఎందుకంటే మా చెట్టు మా అమ్మ సొంతం. మా అమ్మ కష్టం.

రోజూ మద్యానం మూడు గెంటలయితే చాలు పెద్ద ఇస్టీలు గిన్నె తీసుకొని మిద్దెనెక్కుతుంది మా అమ్మ. ఆ టయానికి ఆకు కనిపించనంత తెల్లంగా అంగుళం పొడుగు మొగ్గల్ని కోసి, గమగమమనే వాసనలతో మా అమ్మ కోసరం ఎదురు చూస్తావుంటుంది మా సన్నజాజుల చెట్టు.

మా మిద్దెనెక్కిన ఎమ్మటే్నే పూలు కోయదు మా అమ్మ. ముందర ఇస్టీలు గిన్నెని కింద పెట్టి ఒకసారి పూలన్నింటినీ చూసుకుంటుంది. గాలికి అటూ ఇటూ మిడియాలంగా ఊగి చిక్కుబడిన కొమ్మలన్నింటికీ తీరుబడిగా చిక్కులు తీస్తుంది. ఆడాడ యాడైన చిన్నచిన్న ఎండు కొసలు వుంటే పుటుకు పుటుకున తుంచి కింద పారేస్తుంది.

ఆనేక-ఒక్క తీగ కూడా నలగనంత నాజూకుగా- చెట్టు మీదికి వాలి ఒకో పూవూ ఒకో పూవూ కోస్తా గిన్నెలోకి పోయడం మొదలుపెడుతుంది. మెడ నిలవని పసిబిడ్డని ప్రాణాల్లో పెట్టుకుని ఎత్తుకుంటామే అంత బద్రంగా మా సన్నజాజి

కొమ్మల్ని ముట్టుకుంటుంది మా అమ్మ. ఆమె చేతిలో పూలు తెగాలే గానీ ఒక్క పచ్చికొమ్మ కూడా పుటుక్కుమనడానికి లేదు.

పూలు సగానికి కోసేసినాక ఆగి, పూలగిన్నె తట్టు ఓరగా చూసుకుంటుంది. మా అమ్మ. అప్పటికి ఉబ్బెత్తుగా సగానికి నిండి వుంటుందది. మిగిలిన సగానికి కూడా నిండేంత పూలున్నాయేమో ఉరామారీగా చూసుకొని మల్లా కొరవ పూలన్నింటినీ కోసుకుంటుంది.

ఈ కార్యక్రమం అంతా ముగిసేటప్పటికి టైము ఐదయ్యి మా ఇస్కూలు, మా యింటెదురుగా ఉండే గల్లీ స్కూలు విడిచిపెట్టేసినా మా అమ్మ మిద్దె దిగదు చెట్టులోకి చూస్తానే వుంటుంది పూల కోసరం. మా అమ్మ చూపులో చురుకు బలే జాస్తి. సాయంత్రప్పూట, ఒక తట్టు చీకటి పడతా వున్నా కూడ ఒక్కసారి కళ్లు తిప్పి చెట్టునంతా చూసిందంటే చాలు. గుబురు లోపల, ఆకుమాటున, కొమ్మనీడలో యాడన్నా ఒక పువ్వు మిగిలినా చాలు మా అమ్మ కంటికి చిక్కిపోతుంది. ఆ ఒక్క పువ్వుని కూడా వదలకుండా కోసేసినాకగానీ మిద్దె దిగదు మా అమ్మ.

అక్కడికి మా అమ్మ పూలు కోసే కార్యక్రమంలో ఒక అంకం ముగిసిపోతుంది రెండో అంకం మా పూలని లెక్కబెట్టడం.

మిద్దె దిగినాక, మా వరండా గచ్చు మీద ఒక కాలును సాపుకొని ఒక కాలును ముడుచుకొని కుదురుగా కూచుంటుంది మా అమ్మ. ఆనేక గిన్నెని విదిలిస్తా పూలన్నింటినీ కుప్పగా కిందబోస్తుంది. మెత్తటి శబ్దం చేస్తా యిన్ని పడతాయవి.

ఆ కుప్పలో నుంచి దఫాకు అయిదు పూల లెక్కన యిరవై దఫాలు లెక్కబెట్టి మొత్తం వందపూల కుప్పని పక్కకి జరుపుతుంది మా అమ్మ. అట్టా వంద, వంద వంద లెక్కన ఎన్ని కుప్పలైతే అన్ని కుప్పలని వరుసగా పేర్చి పెడ్తుంది.

పేర్చినాక, చూపులువేలు సాచి ఒకటి... రెండు,.. మూడు అంటా కుప్పల న్నింటినీ లెక్క బెడ్తుంది.

మొత్తం పదహారువందలో పదిహేడు వందలో వుంటాయని! (యిన్ని పూలు పూయడం అంటే చిన్న కత కాదు. మాది చలవగల చెట్టు కాబట్టి యిన్ని పూల బాగ్యం పట్టిందిగానీ మా చుట్టుపక్కల సందుల్లో ఏ సన్నజాజి చెట్టయినా ముక్కీ మూలిగీ ఆరేడువందల పూల కంటే ఎక్కువ పూయదు).

మా అమ్మ మా చెట్టుకి కాసి (హీనపక్షం) పదహారు వందల పూలని మళ్లా గిన్నెలో పోసుకొని, మా యింటికి ఫర్లాంగు దూరంలో వున్న 'పూల రిహానాబీ' యింటికి బయలుదేరుతుంది.

దారిలో మా అమ్మ నడస్తా వుంటే ఆమె చేతిలో ఏముందనేది నరమానవుడు కూడా కనిపెట్టలేడు. పొట్టదగ్గిర, కొంగు కిందుగా కప్పేస్తుంది పూలగిన్నెని, దిష్టి తగలకుండా.

మా అమ్మని చూడంగానే రెండు చేతులూ సాచి గిన్నె అందుకుంటుంది. పూల రిహానా. కళ్ళు నిండుగా పూలు చూసుకుంటానే 'ఎన్నకా?" అని అడుగుతుంది.

'పదహారు' అనంటుంది మా అమ్మ.

రిహానా మళ్లా మా పూలని లెక్కబెట్టదు. మా అమ్మ చెప్పిన లెక్కని బట్టి ఎమ్మట్నే డబ్బులిచ్చేస్తుంది.

వంద పూలొచ్చి యిరవై పైసలు! అంటే పదహారు వందల పూలొచ్చి మూడు రూపాయలా యిరవై పైసలు.

ఆ మూడు రూపాయలా యిరవై పైసలని తీసుకున్నాక, పదిలంగా ముడేసి చీరకొంగులో కట్టుకుంటుంది మా అమ్మ.

అవి మా అమ్మ సొంత డబ్బులు! అదీ మా అమ్మ పూల యాపారం!

నేను ఆరో కిలాస్‌లోకి మారి, మూడు నెలలు గడిచేసరికి పోలేరమ్మ బండకాడ మా నాయిన శ్లాబుబోసి యిల్లు కట్టించినాడుగానీ యిల్లంటే అది పూర్తి యిల్లు కాదు.

ముందొక తలుపు, ఎనకొక తలుపు, లోపల పూతపని... యింతే చేయించింది. ప్రైతోడికి చెప్పినట్టే మా నాయినతో కూడా 'మొత్తం పదేను వేలతో యిల్లయిపోతుంది 'కరీంసాయిబా' అని బేల్దారు మాలకొండయ్య జెప్పినాడంట. ఆ లెక్కన నమ్మి ఏడు వేల రూపాయలతో అమాయకంగా పనిలోకి దిగినాడు మా నాయిన.

ఆ ఏడయినాయి. డెకరేషన్ లైటింగ్ కోసరం మా దగ్గరుండే జనరేటరు అమ్మక నూకగా వచ్చిన డబ్బులయినాయి. మా అమ్మ నగలు కుదవయినాయి. యింక ఆ పనీ, ఈ పనీ చేయగా వచ్చిన డబ్బులన్నీ అయినాయి. యిల్లు మాత్రం అవలా. పదేను వేలనుకున్న కట్టుబడి అప్పట్లోనే (కూలోడికి ఆరు, బేల్దారుకు పన్నెండు రూపాయిలిచ్చే సలీసు రోజుల్లో) ముప్పయి వేలకి చేరుకునింది. పెండం

రవీలాంటి స్నేయితులూ మా తాత మస్తాన్ సాయిబు లాంటి బంధువులూ అడక్క ముందరే వచ్చి సహాయం చేసినా తట్టుకోవడం మా నాయిన వల్లగాలా.

వాడమ్మనాయాల్దిగానీ యిప్పటికి ఆరిపోయింది చాలూ నాలుగు డబ్బులు వచ్చినాక మళ్లా చూసుకోవచ్చు అని, కిటికీలకి రెక్కలు కూడా పెట్టించకుండా మమ్మల్ని దించేసినాడు యింట్లో. ఒకసారి పని పెండింగు పడినాక మానాయిన దరువు తెలిసిందే కదా. 'చూద్దాం చూద్దాం... చేద్దాం చేద్దామే'.

అందుకని మా అమ్మ మా నాయిన్ను నమ్ముకోకుండా 'వాకిలిగోడ ఎత్తుగా లేదు. ఇంటికొక పరదా లేదు, వీధిన పొయ్యే వాళ్లందరికీ మొత్తమంతా అవుపిస్తా ఉంది' అని మా ఇంటి వాకిట్లో ఈ సన్నజాజుల చెట్టు నాటింది.

మా అమ్మ చేతి మహిమో, ఆ టైములోని ముహూర్త బలమోగాని, సంవత్సరం ఆరు నెలల్లోనే మా చెట్టు పాకి, పైకి అల్లుకొని మా వరండా శ్లాబుకి ఈ కొస నుంచి ఆ కొసదాకా పచ్చగా కమ్ముకొనింది. అది ఆకుల పరదాలాగా ఎట్టా అల్లుకునిందంటే బయటి నుంచి చూసేవాళ్లకి మా వరండా సగం కూడా అవుపించేది గాదు.

అప్పట్నించి మా యింట్లో సాయింత్రమయ్యిందంటే చాలు లెక్కలేనన్ని పూలు. గమగమమనే వాసన.

మా పూలని పెట్టుకొని పెట్టుకొని, మా చెల్లెలికి పెట్టీ పెట్టీ, వాళ్ళకీ యీళ్ళకీ యిచ్చీయిచ్చీ. యింకీ పూలతో విసిగిపోయినాను తంట్రీ అని మా అమ్మ అనుకుంటావున్నపుడు పూలరిహానా వచ్చింది మా ఇంటికి.

పూలరిహానా అంటే ఆమెవరో షావుకారో, లక్పతో అనుకునేరు. గోతాం పట్టా మీద నీళ్లు చల్లుకొని, అయిదు లీటర్లో పది లీటర్లో పూలని (మా ఊరిలో పూలని లీటర్లలో – అంటే లీటర్ డబ్బాల లెక్కన అమ్ముతారు) ఆ గోతాం పట్టమీద పోసుకొని మాలలుగా కడ్తా వుంటుందామె. ఆ మాలలని బజారులో వరవకట్టమీద కూచొని వాళ్ళాయన అమ్మతా వుంటాడు. పూలు అమ్ముడుపోతేనే ఆ రోజుకి జరుగుబాటు. లేకపోతేలా.

వరవకట్ట మీదుండే పూలకొట్లకాడ సనజాజి మూరలకి వున్న డిమాండింగును చూసి, మా చెట్టుని చూసి, మా అమ్మకాడికి వచ్చిన పూలరిహానా ఆమె బాధనంతా చెప్పుకునింది.

'అకా, నీకు తెలియనిదేముంది, మా యింటాయన అంతంత మాత్రపోడు. బుట్టకు యిన్నేసి వచ్చే బంతి పూలని కొనడానికి కూడా అల్లాడిపోతా వున్నాడు. తక్కిన పూలరేట్లు చూస్తా వుంటే మాబోటోళ్లం సరుకు వేయించుకునేలా లేము. వెయ్యించుకున్నా పెద్ద పూలకొట్ల మద్యన కూచొని అమ్ముకునేలా లేము. నువు సనజాజులు యిచ్చినావంటే అవి నాలుగు మూరలు ఇవి నాలుగు అమ్ముకొని ఎట్నో గడుపుకుంటాం. నీ సొమ్ము పుణ్యానికి బళ్లా. వందకి ఇరవై పైసలిస్తా' అనింది.

ఆమె బాదల కంటే కూడా వందకి యిరవై పైసలన్న మాటే మా అమ్మను. ఎక్కువ కరిగించింది. 'దానికేం బాగ్యమే రిహానా. అట్లాగే యిస్తా. నీకోసరం యియ్యాల్టి నుంచి తల్లో కూడా పెట్టుకోను పో' అని మాటిచ్చింది.

ఇచ్చినాక ఆ రాత్రే, అన్నం తింటా ఉన్న మా నాయినకాడ నెమ్మదిగా యీ సంగతి కదలేసింది. మా నాయిన బిత్తరపోయాడు.

కరీం సాయిబు బార్య పూలమ్మతా వుందని నలుగురూ నాలుగు మాటలు అనుకోబోతారు. వద్దులేమ్మే కావాలంటే ఊరకనే కోసుకొని పొమ్మని చెప్పు" అనినాడు.

మా అమ్మకు కాలిపోయింది.

'నువు వెంకటగిరి రాజా అయిననాడు అట్నే ఊరకే యిద్దూగానీ ఇప్పుడు మాత్రం నేను పూలమ్మతా నువు గమ్మునుండు, ఒకేల ఏదైనా అనుకునే వాళ్లుంటే అనుకోనీ. వాళ్లు మనకొక రూపాయి యిస్తారా? మన బాధ లేముండాయో అంటా వచ్చి పంచుకుంటారా? అయినా యిందులో దాపరికంలా, దొంగతనంలా. పూలుండాయి... యిస్తా ఉన్నాము. అంతే... మన పూల వల్ల రోజుకి రెండు మూడు రూపాయలొచ్చినా పాలకి పనికొస్తాయి గదా' అని మా నాయిన మనసుకెక్కేలా మాట్లాడింది.

మా నాయిన గమ్మునయిపోయినాడు.

ఆ రోజుటాల్నించి మా వీదిలో వాళ్లకూ మా బందువులకూ కాదు గదా ఆకరికి మా చెల్లెలికి కూడా పుల్లుగా పూల కటకటా. ఒక మొగ్గపోవడానికి లా. ఒక మొగ్గ రాలడానికి లా. అన్నీ గుత్తంగా తీసకెళ్లి రిహానాబీకి అప్పగించాల్సిందే మా అమ్మ. ఎప్పుడైనా మిద్దె మీద నుంచి గాని కిందనుంచి గానీ చేతికందకుండా

గుప్పెడు పూలు నడమధ్యన మిగిలిపోతే మా అమ్మకు ఎంత బాదో, 'నయా పైసల్రా నాయినా.. గాలికి పోతా వున్నాయి' అనేది.

పూల యాపారం మొదలయినాక మా అమ్మ దినచర్యే మారిపోయింది. ఆమె ద్యాసంతా ఒకో పూవూ ఒకో పూవూ లెక్కన మా చెట్టు కాపు పెంచి యాపారాన్ని ఎట్టా అబవృద్ధి చేయాలా అనేదే.

మా ఇంటికి కుడితి నీళ్లకోసరం వచ్చే ఒక ఆడమనిషి. కుడితి తీసుకుని గమ్మనపోకుండా 'మోవ్! మీ చెట్టుకి టీ ఆకెయ్. సత్తువ' అని చెప్పిందంట అప్పట్నించి మొదలయినాయి నా పాట్లు.

నాలుగైదు రోజులకొకసారన్నా, ఇస్కూలు నుంచి రాంగానే 'రే ఖదీరా... స్వామోళ్ల ఓటలు కెళ్లి టీ ఆకు తేపో'' అంటా ప్లాస్టీకు బకెటును నా చేతిలో పెట్టేది. మా అమ్మ. సామీ ఓటల్లో టీ ఆకు మార్చినప్పుడల్లా ఉడికిన ఆకును తీసి రేకుడబ్బాలో పారేస్తారు. గదా దాన్ని తేవాలన్నమాట నేను.

ఆడుకునే టయిములో, సామీ ఓటలు కాడకెళ్ళి టీ ఆకు కోసరం నిలబడాలంటే చానా కష్టంగా అనిపించేది నాకు. ఆ టయిములో కిటకిటలాడతా వుంటుంది ఓటలు. అందరూ నిలబడి టీలు తాగతా వుంటారు. వాల్లందరికీ టీలు ఇచ్చి యింక తాగేవోడెవ్వడూ లేడనుకున్నాకగానీ మనల్ని టీపోసే బండ కాడికి రానీరు. వాళ్లురానిచ్చాక గానీ నాపరాయి బండ కిందున్న టీ ఆకును తెచ్చుకునే దానికి లేదు. ఇంత తతంగం వున్నా 'నేను పోనుమా' అని మా అమ్మకుచెప్పే దానికిలా. బియ్యం తేనన్నా సయిస్తుంది గానీ చెట్టుకి టీ ఆకు తేనంటే మాత్రం సయించదు మా అమ్మ.

మా సన్నజాజుల చెట్టు కుదుళ్ళు ఎప్పుడు చూసినా టీ ఆకు ముద్దలతో తడితడిగా ఉన్నా మా అమ్మకు తృప్తి తీరేది కాదు. చెప్పినానె మా పాతూర్లో రెడ్లూ యవసాయం చేసేవోళ్లూ ఎక్కువని... అందువల్ల ఏ యింటి ముందరయినా ఎరుపు మట్టితో ట్రాక్టరు ఆగిందంటే చాలు చాటెత్తుకొని సిద్ధమయిపోయేది మా అమ్మ. రెండు చాటలే లేమ్మా' అంటూ ఒకటికి రెండు చాటలు జవురుకోనొచ్చి మా చెట్టుకు పోస్తేనే ఆమెకు నిశ్చింత.

యిట్టా ఎరువుమట్టినీ, టీ ఆకునీ నీళ్లతో కలుపుకొని తినీ తాగీ మా సనజాజుల చెట్టు బలిసిపోయింది. పూలు కుప్పలు కుప్పలయినాయి. అప్పుడు మళ్ల ఈ కుప్పల పూలను చూసుకుని మా అమ్మకు దిగులు పట్టుకునింది.

'దారిన పొయ్యేవోళ్ళంతా మన పూలను చూసి కళ్ళల్లో నిప్పులు పోసుకుంటా వున్నారు. దిష్టి చూపు తగలితే బండరాళ్లే పగిలిపోతాయి. పచ్చటి చెట్టుదొక లెక్కా' అని మా నాయినమ్మతో చెప్పుకునింది.

ఆ బయం మా నాయినమ్మకు ఆల్రెడీ ఉన్నట్టుంది... మా అమ్మ ఆ మాటని అనీ అనకముందే నల్లటి మట్టికుండ తెప్పించి, దానిమీద సున్నపు బొట్లు పెట్టించి చెట్టు మద్యలోకి దిష్టికి వేలాడదీసింది.

అంతటితో మా అమ్మకు దిష్టిబయం పోయినా యాపార ఒత్తిడి ఎక్కువయ్యింది. తూర్పు వీధి ఆడోళ్లు కొత్త కోమిటోళ్ళ ఆడోళ్లు వచ్చి 'పూలు మాకీరాదా సత్తారా' అంటా ఆబ్లీగేషన్‌లకు వచ్చినారు. (మా అమ్మ పేరు సర్తాజ్, పాతూరులో చేరినాక ఆమె పేరు 'సత్తార' అయిపోయింది-నోరు తిరగక). కొత్త కోమిటోళ్ళ ఆడోళ్లు యాపార మెళకువలు తెలిసినోళ్ళు కాబట్టి మా పూలరేటును వందొచ్చి ముప్పయ్ పైసలకు పెంచేసినారు. అడ్వాన్స్ పేమెంటును కూడా ఆశ చూపతా.

మా అమ్మ ఒంగలా.

'డబ్బుల కోసరమని కాదమ్మా. పూలు మీకిచ్చినానంటే పాపం మా ఖాతా ఆమె యిబ్బంది పడుతుంది. కావాలంటె రెండు మూడొందలిస్తా తీసుకెళ్ళండి' అనేది. అట్లా రెండు మూడు వందలు, మరీ మొహమాట పెడితే నాలుగైదు వందలతో (వంద పూలు ముప్పయి పైసల లెక్కన) వాళ్ళను వగదెగిచ్చుకునేది మా అమ్మ.

అయితే అలా నాలుగైదు వందల పూలు తగ్గినా కూడా రిహానాబీ నిష్ఠూరమాడేది. 'ఏందక్కా. నువు రీటయిల్లో అమ్మేస్తే బజార్లో మా మూరలు ఎవురు అడగతారు? ఎవురు కొంటారు?' అని కొసెను చేసేది.

పాపం రిహానాబీ కోసరం మా అమ్మ ఎంత మానుకోవాలన్నా రిటెయిలు బిజినెసులో, ముఖ్యంగా హిందువుల పండగలప్పుడు ఎక్కువ పూలు అమ్మాల్సి వచ్చేది. (ఆ టైములో వంద అర్ధరూపాయికి అడిగేవోళ్ళు మా పూలని. అది రికార్డు రేటు!)

పూలు కోస్తామంటే చెట్టుమీద చెయ్యి వేయనివ్వదు కానీ కాయ దూయడానికి మాత్రం ఒకరిద్దరిని పిలిచేది మా అమ్మ. సనజాజుల చెట్టుకి కాయ కట్టేసిందంటే కాపు పడిపోద్దిగదా. అందుకని మా నాయినమ్మని, నన్ను మిద్దె ఎక్కనిచ్చేది. మేము మా అమ్మతో కలిసి యాడాడ కాయున్నా అదంతా దూసేసేవోళ్లం.

ఈ డూటీ మా నాయనకు కూడా తప్పేదిగాదు ఒకోసారి.

ఆయన ఏనాడైనా ఇంట్లో ఖాళీగా వుండి, ఒళ్ళు విరుచుకుంటా ఉంటే మా అమ్మ ఊరుకోకుండా 'అట్టాకాళ్ళు సాపుకొని కూచోకపోతే మిద్దెనెక్కి కాయ దూరాదా?' అనేది.

చెట్టుపని కదా అడ్డం చెప్పేదానికే లా.

గమ్మున మిద్దెక్కి 'యింకచాల్లే....దా' అనేదాకా కాయ దూస్తానే ఉండేవాడు మా నాయిన.

కాయ దూసేకొద్దీ మరి గిన్ని పూలు పూస్తావుండేది మా చెట్టు. మాపూల సంఖ్య నెమ్మదిగా పదిహేడు వందలు, పద్దెనిమిది వందలు ఒకోసారి పందొమ్మిది వందలకు చేరిపోయేది. అయినాగానీ ఏనాడూ నాలుగు పూలకి దారం కట్టి తల్లో పెట్టుకునేది కాదు మా అమ్మ. 'యింకో వంద పూలుకాస్తే అచ్చంగా నాలుగు రూపాయలు చేతిలో పడేవి గదా' అనేది ఆశగా, (రెండు వేల పూలు నాలుగు రూపాయలు)

యిట్టా రెండువేల పూల లక్ష్యానికి మా యాపారాన్ని అభివృద్ధి చేయాలని మా అమ్మా, మేమూ పాటుపడతావుంటే అప్పుడప్పుడు బంధువులు వూడిపడే వోళ్ళు మా పూలకి దుష్మన్లయ్యి.

'అంత పెద్ద చెట్టుంచుకొని కూడా నాలుగు పూలియ్యలేదమ్మా ఆ మహాతల్లి' అని ఇంటికొచ్చిన ఆ అమ్మలక్కలు అంటారుగదా... అందుకని ఆ మాట రానీకుండా ఆరోజు మాత్రం రిహానాబీకి యియ్యాల్సిన కోటాలో రెండు వందల పూలు దగ్గిరుంచుకునేది మా అమ్మ.

ఆ రెండు వందల పూలని అట్టా చేతిలో పెడితే ఎవురికంటికీ ఆనవుకదా. ఆ ఆ సంగతి మా అమ్మకు తెలుసు కాబట్టే మా ఇంటికొచ్చినోళ్ళని నైసుగా మాటల్లో పెట్టి మా పెరట్లో మరువం రెమ్మల్ని, కనకాంబరలనీ కోసుకోనొచ్చేది. ఒక వాయ సన్నజాజులు, ఒక వాయ మరువం, ఒక వాయ కనకాంబరాల లెక్కన అన్నింటినీ కలిపి దూరం దూరంగా మాల కట్టేది. అప్పుడు ఆ రెండొందల పూలే రెండు మూడు మూరలై యింత పొడవున అవుపించేవి.

యిక బందువులు కుష్, మా అమ్మా కుష్.

ఒకోసారి మా అమ్మ ఏరోజు డబ్బులు ఆ రోజు తీసుకునేది కాదు, రిహానా కాణ్ణుంచి. 'అట్టా తీసుకుంటే ఏ పనికీ అక్కరకు రావడం లేదమ్మా. వారం రోజుల

డబ్బులు ఒకేసారి యియ్యి' అనేది రిహానాబీతో. వారం రోజులపాటు వరుసగా పూలిచ్చి ఎనిమిదో రోజున యిరవై అయిదు రూపాయలో, ఇరవై ఆరు రూపాయలో తెచ్చుకుని ఆ డబ్బులతో ఇస్టోరులో చక్కెర తెచ్చుకునేది. అట్టా మా పూల డబ్బులు ఒక వస్తువు కోసరంగా ఉపయోగపడితే మా అమ్మ మొకం సంతోషంతో వెలిగి పోయేది.

'చూసినావా నా చెట్టు తడాఖా. నాలుగు రోజులు ఆగు. నా పూల డబ్బులతో అయిదు వేల చీటి కట్టి చూపిస్తా' అని, మా నాయనతో చతుర్లాడేది మా అమ్మ. మా నాయన ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ చూస్తా ఉండేవోడు.

కత యిట్టా పూలుపూలుగా జరగతా వుండగా ఒకసారి మా అమ్మకూ రిహానాకు తకరారు వచ్చేసింది, ఇరవై రూపాయల పూల డబ్బుల కాడ.

'నా అయిదు రోజుల పూల డబ్బులు యిచ్చెయ్ తల్లా, అవతల నాకు అర్జంటు పనుంది' అంటుంది మా అమ్మ.

యింకో రెంద్రోజులు తాలకా. యీ డబ్బులికి ఆ డబ్బులు కూడా కలిపి మొత్తమంతా యిచ్చేస్తాను' అంటుంది రీహానా. అలా రెండు రోజులు గడిచినాయి. పూల బాకీ యిరవై నుంచి అరవై ఆరు రూపాయిలయ్యింది. మళ్ళా మా అమ్మ డబ్బులడిగింది.

'రేపురా అకా. గారంటీగా యిచ్చేస్తా' అనింది రిహానా.

అట్టాంటి గారంటీలు మళ్ళా మూడయినాయి. యింక లాభం లేదనుకొని మరుసటి రోజు మరేదగానే అడిగింది మా అమ్మ– 'ఏందిమే రిహానా, నేను చెట్టు పెంచుకుని, నీళ్ళు పోసుకొని, పురుగు పట్టకుండా ముదత మందు చల్లుకుని కాయ దూసుకుని, నా పూలని ఒకటికి రెండింతలు చేసుకునింది నీ ఎదాన కొట్టడానికా? నువ్వు డబ్బులియ్యకుండా ఇట్టా ఇబ్బంది పెడితే ఎలాగమే' అనింది.

ఆ మాటలకి రిహానా సర్ది చెప్పబోతా ఉంటే వాళ్ళాయన గమ్మునుండబళ్ళా? యింత పొదుగున పొదుచుకోనొచ్చి 'యిస్తాములేమ్మా... నీ సంబడం డబ్బులా. రేపు రాపో' అన్నాడు రోషంగా.

అంతే. అదే ఆఖరు. ఆ మరుసటి రోజు నుంచి మా అమ్మ రిహానా ఇంటికే వెళ్లలా. పూలు యివ్వలా.

చాన్నాళ్ళ తరువాత మా అమ్మ తలలో, మా చెల్లెలి తలలో యిన్నేసి పూలు

అవుపిస్తా వుంటే మా నాయన దౌటు పడి సంగతి తెలుసుకున్నాడు. 'పోనీలేమ్మే పేదరాలు. ఏమి ఇబ్బందుల్లో వుందో ఏమో' అన్నాడు.

మా అమ్మ ఒదల్లా మనసులోనే పెట్టుకునింది ఆ సంగతి.

రెండు వారాలు గడిచినాయి.

ఒకరోజు సాయంత్రం తల నిండుగా కొంగు కప్పుకొని బితుకు బితుకుమంటూ వచ్చింది రిహానా.

మా అమ్మ వరండాలో కూచొని ఉంది.

'ఏం తల్లా' అనింది రిహానా తట్టు తుస్కారంగా చూస్తా.

'డబ్బులిచ్చి పోదామని వచ్చినానకా' అనింది రిహానా.

'మాకేం ఐళ్ళేదుపో' అనింది మా అమ్మ.

రిహానా పోలా. గమ్ముగా వచ్చి మా అమ్మ పక్కన కూచునింది – కళ్ళనిండా నీళ్ళు నింపుకుంటా.

'సేయ్ పిచ్చిదానా!' అనింది మా అమ్మ రిహానా కళ్ళల్లో నీళ్ళు చూసి.

'అకా సత్తెం చెప్తావున్నా. ఇన్ని రోజులు నీకాడికి రాకపోవడానికి డబ్బులు లేకపోవడమే కారణం. నీకియాల్సింది యియ్యకుండా ఏ మొకం పెట్టుకొని వచ్చేది చెప్పకా? ఈ పది రోజులుగా చేతిలో నయాపైసా లాక నీబోటోళ్ళ దగ్గిర వందా రెండొందల పూలు కూడా కొనడంలా. నేను మా ఇంటాయన పెద్ద పూలకొట్ల కాణ్ణించి పూలు తెచ్చుకొని, పొగులు పొద్దస్తం మూరలు కట్టి, మూరకు పది పైసలు లెక్కన అయిదో పదో సంపాదించినా అవి బిడ్డల జరాలకే అయిపోతా ఉన్నాయి నిజంగానే కర్మ పట్టిందకా మాకు. మొన్న మా ఇంటాయన శ్రావణమాసం సీజను గదా రెడిమేడ్ దండలు అమ్ముడుపోతాయి అని అరువులో పూలు తెచ్చాడు. రెడీమేడ్ దండలు కట్టినాము. బేరాలు రాలా. సగం కూడా అమ్ముడుపోలా. మరుసటి రోజు అమ్ముకునే దానికి అవి కట్టెలు కాదుకదా. ఏంచేసేది? కట్టిన దండలన్నింటినీ చేతులారా వరవలో పారేసినాము. యిట్టా ఏం వస్తదో, ఏం రాదో తెలీని పూలమ్ముకునే బతుకులు పగోనికి కూడా వద్దకా' అంటా కడుపులోని బాదంతా కరిగిపోయేలా ఏడ్చింది రిహానా.

ఆ పూలమ్మే ఆమె బాద చూసి ఈ పూలమ్మే ఆమె ఏమి చేయగలదు కళ్ళమ్మట నీళ్ళు నింపుకోవడం తప్ప.

# శుద్ధి చెయ్యాలె

**–జూపాక సుభద్ర**

ఆఫీసు నుంచి, ఇంటికొచ్చేటప్పటికి "నీకు ఏందో కవరొచ్చింది చూడు" అని ఓ ఎవరు నా చేతికందించింది మా ఓనరు. బ్రౌను కవరు, ఫ్రమ్ అడ్రసు కాలేజ్ సర్వీస్ కమీషన్' అని ఉంది. ఏమొచ్చిందబ్బా అని అనుమానంతో చూస్తే శివదేవపూర్ జూనియర్ కాలేజీలో లెక్చరర్ పోస్టు వచ్చింది. చాలా ఆనందం, ఇప్పుడు నే చేసేది క్లర్క్ ఉద్యోగం. కొన్ని వేల ఏళ్ళ తరాల తర్వాత చదువుకున్నది నేనొక్కదాన్నే మా కుటుంబంలో. ఉద్యోగం చేయడం కూడా నాతోనే మొదలు. ఈ క్లర్కు ఉద్యోగం చేయడమా మానడమా అని ఆలోచిస్తూనే బట్టలు మార్చుకుని, మొహం కడుక్కుని పొద్దున ఆఫీసుకు పోయే హడావుడిలో ఎక్కడివక్కడినే వదిలేసిన బట్టలు వంట సామాను సర్దుకొని గిన్నెలు తోమి, అన్నం వండుకుని పొద్దుటి కూరేసుకుని తిని మళ్ళీ ఆర్డరు కాయితం తీసుకుని కూర్చున్నాను.

నాకు చిన్నప్పట్నించి ఏమేమో చదువుదామని కోరికలుండేవి. డాక్టరు చదువు బావుంటుందని, అందరినీ ఆదుకోవచ్చు. సేవ చేయడానికి మంచి వృత్తికాని నేను సైన్సులో సీటు కోసం ఆప్లై చేయలేదు. సైన్సు అయితే ఫీజులు, రికార్డ్స్, పెన్సిల్స్, ప్రాక్టికల్స్ ఉంటాయి. డబ్బు వ్యవహారం, అదే ఆర్ట్స్ అయితే ఫీజు ఎక్కువగా ఉండదు, రికార్డ్స్ ఉండవు. లైబ్రరీ పుస్తకాలు తెచ్చుకుని చదివి పాస్ కావచ్చు. ఆర్ట్స్ చదివినా పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయొచ్చు అని తెలిసి సంతోషపడ్డా. కాని వీటితో ప్రజలకు నేనేమన్నా సహాయ పడ్డానా? సహాయపడక నాకు నేనే బతకడంలో ఏం ఆనందం, తృప్తి ఉంటుంది అనుకునే దాన్ని. లెక్చరర్ అయితే ఆదర్శ మానవులను, సాంఘిక బాధ్యులను తయారు చేయొచ్చు కదా అని సరిపెట్టుకుని ఆర్ట్స్‌లో యిష్టం లేకున్నా చేరిన. హాస్టల్ ఫుడ్‌తో లైబ్రరీ బుక్స్‌తో ఇంటర్, డిగ్రీ, పీజీలైతే వచ్చాయి. తర్వాత ఏంటి పరిస్థితి? నా యీ పట్టాలు నా మట్టిపని నుంచి దూరం చేశాయి. కార్ఖానాలోని వస్తువుకు వినిమయం లేకుండా

తిరిగి కార్ఖానాకైనా చేరాలి లేదా రోడ్డు మీద చెత్తలాగానైనా పడాలి. అట్లా నేను పి.జి. అయిపోయి బైటకొచ్చి తిరిగి హాస్టల్‌లో వుండేందుకు యింకో సదువులో చేరి ఫుడ్, లైబ్రరీ సంపాదించుకున్నాను. రోజు ఉద్యోగవేటలో అలిసిన నాకు క్లర్కు పోస్టు పిట్ట చిక్కిన ఆనందం అనంతంలో విహరించలేదు. నా ఫ్రెండ్స్ ఏదో ఒక పోస్టు వచ్చింది వదులుకోవద్దు గవర్నమెంటులో రిక్రూట్మెంట్స్ లేవు నిరుద్యోగం సెకనుకు మూడుపువ్వులు ఆరు కాయలుగా విలసిల్లుతుంటే ఏ ఉద్యోగమైతేంటి? ఉద్యోగం ముఖ్యం అది మనకు నచ్చిందా కాదా అనే బేరీజు ఈ రోజుల్లో వేసుకునే అవకాశం లేదు. మనకు నచ్చిందే కావాలంటే ఒక జీవిత కాలం కాదు వేయితరాల కాలం వేచినా దొరికే నమ్మకం లేదు. అంతగా అయితే నీకిష్టమైన లెక్చరర్ పోస్టు వస్తే వదులుకో వచ్చులే. ముందు వెళ్లి జాయినవమని చెబితే ఈ క్లర్కు పోస్టులో జాయినైన అయిష్టంగానే, నా అదృష్టంగా ఇప్పుడు ఈ లెక్చరర్ పోస్టు వచ్చింది. కాని ఈ ఆఫీసులో చేరినంక నాకు చాలా మంది ఫ్రెండ్స్ అయ్యారు. ఇంకోటి డిపార్టుమెంటులో ట్రాన్స్‌ఫర్‌లే ఉండవు. క్లర్కు పోస్టులో చేరేప్పుడు ఎంత ఇబ్బంది పడ్డానో అలవాటైనాక వీళ్లందరిని వదిలి పోవాలంటేనే కష్టంగా ఉంది. కాని పోస్టు ఇష్టమైనది. లీవ్ ఉంటుంది. ప్రాక్టికల్‌గా ఉంటుంది. ఫైల్ తరహా వర్కు ఉండదు. ఎంతసేపు కాగితాలు కలమే వర్కు ఈ క్లర్కు జాబ్‌లో 10-30 నుండి 5.00 గం. వరకు పనిచేయాలి. పైన బాసిజం ఉంటుంది. ఇలా తూకమేసుకుంటూ పోతే మొగ్గంతా లెక్చరర్ పోస్టు వైపే ఉంది. కాని ఫ్రెండ్స్ ముందు అవన్నీ వేస్తే కదా అని ఇంకో ఆలోచన ఎటూ నిర్ణయించుకోకుండానే నిద్రపోయాను.

మరుసటి రోజు ఆఫీసుకు తయారై వెళ్లి సంతకం పెట్టి ఫ్రెండ్స్ అందరికీ లెక్చరర్ పోస్ట్ వచ్చిందని చెప్పిన. అందరూ ఓ వైపు వెళ్తున్నందుకు బాధపడుతూ ఇంకోవైపు "మంచి పోస్ట్ వచ్చింది కంగ్రాట్స్" చెప్పారు. కాని నాకు ఎక్కడో ఓ మూల మళ్లీ జీవితం మొదలు పెట్టాలి మళ్లీ కొత్త పరిచయాలు ఎగ్జిస్టింగ్ సమస్యలు అదీ ఒంటరిగా భయంగా ఉంది. ఈవెనింగ్ స్పెషల్లో మా బస్‌మేట్ పద్మజ అని ఓ మంచి ఫ్రెండ్ ఉంది. నేను ఆఫీసులో చేరిన కొత్తలో బస్లో పరిచయమైంది. ఆమె యం.సి.హెచ్.లో చేస్తుంది. వాళ్లన్న ఇదివరకు విద్యార్థి ఉద్యమాల్లో పనిచేశాడట. ఆ వాసనలు ఆమెక్కూడా ఉన్నాయని ఆమె మాటల్ని బట్టి తెలిసింది.

బస్‌లో రకరకాల రాజకీయాలు మాట్లాడుకునే వాళ్లం. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ఉద్యోగ కార్మిక విధానల మీద, నిరుద్యోగం మీద బాగా మాట్లాడేది. అట్లా ఆమె నాకు సన్నిహితమైంది. బస్ నెక్స్ట్ స్టేజీలో పద్మజ ఎక్కుతూనే 'హాయ్' అని పలకరించింది. "ఏంటి డల్‌గా ఉన్నావు బాలేదా?" "ఏం లేదు పద్మా నాకో సమస్య వచ్చి పడింది. నాకు లెక్చరర్ పోస్ట్ ఓ మారుమూల పల్లెలో వచ్చింది వెళ్లడమా మానడమా అని సందేహిస్తున్నా."

ఇందులో సందేహించడానికేముందోయ్, మంచి పోస్ట్ నీకు తగిన పోస్ట్, వెళ్లి జాయిన్ కా, ఈ సిటీలో ఉద్యోగాలు చేయడం కంటే మారుమూల పల్లెల్లో చేయడం హాయిగా గౌరవంగా ఉంటుంది. సిటీలో మనల్ని ఎవరూ లెక్కచేయరు. అంతా యాంత్రికం. ఇక్కడ పక్క మనుషులంటే లెక్కలేదు. ఎవరు ఎవర్నీ పట్టించుకోరు. పక్కింట్లో వాళ్లు కూడా తెలియదు. బస్‌ల హడావుడి. ఎవరి లైఫ్ వాళ్లది. బొత్తిగా అమానుష జీవితాలు. కాని ఊళ్లల్లో అలాకాదు తెల్సా. నేను ఖమ్మం జిల్లాలో మానెపల్లి అనే ఓ విలేజ్‌లో చేశా. అబ్బో! ఎంత గౌరవం, ఎంత బాధ్యత, ఎంత మానవత్వం, ఊరి పెద్దలు, చిన్నలు నాకు ఎంత మర్యాద చేశారో తెల్సా నాకు ఇల్లు ఏర్పాటు చేయించి వంటకు, పనులకు పనోల్లని పంపించే వాళ్లు, పండగలప్పుడు స్పెషల్ భోజనాలు, ఏ వంటయినా అన్ని పంపించేవారు. అందరు నన్ను కనుల పండువుగా చూసేవాళ్లు. రాజ భోగాలుంటాయ్ తెలుసా, కళ్లు మూసుకొని జాయిన్ అవు", అని తన జ్ఞాపకాలను గుక్క తిప్పుకోకుండా ఊరిస్తూనే ఆదేశించింది. ఒక్క నిమిషం నేను కూడా పద్మజలాగా రాజభోగాలతో అందరి గౌరవ మన్ననలతో ఆత్మీయతలతో ఊరేగుతానని ఉబ్బిపోయి వెంటనే నా నిర్ణయం గట్టి చేసుకొని వెళ్లడానికే సిద్ధపడ్డాను. తలలో రేగే ఊగిసలాట, తుఫాను కాస్త సద్దుమణిగింది. గట్టిగా ఊపిరి పీల్చుకొని నిశ్చింతగా ఇంటికెళ్లి పోయా.

తెల్లవారి ఆఫీసుకెళ్లి ఫ్రెండ్స్‌తో 'నేను లెక్చరర్ పోస్టు కోసం ఈ జాబ్ విడిచి వెళ్తున్నాను అన్నాను. ఒక పెద్దావిడ "ఇక్కడ మా కందరికీ బాగా అలవాటయ్యావు. అందర్నీ వదిలేసి వెళ్తావా కొంత సర్వీస్ చేశావు ఇప్పుడు మళ్లీ ఈ సర్వీసు పోదా," అంది. కానీ పద్మజ చెప్పిన తన ఊరి ఉద్యోగం జ్ఞాపకాలే తొందర పెడ్తున్నాయి. ఊర్నించి తమ్ముడ్ని పిలిపించి, ఆఫీసు నుంచి రిలీవింగ్ ఆర్డర్

తీసుకొని, ఫ్రెండ్స్ అందరి దగ్గర సెలవు తీసుకొని సామాను సర్దుకొని లక్ష్మీదేవ్‌పూర్ బయలుదేరా. హైద్రాబాద్ నుంచి డైరెక్టుగా అక్కడికి బస్సులు లేవు. కరీంనగర్‌లో దిగి అక్కణ్నించి ఇంకో బస్సెక్కాలి. హైద్రాబాద్ నుంచి పొద్దున 5 గంటలకు సామానుతో బయలుదేరా తమ్ముడితో. తొమ్మిందింటికి కరీంనగర్‌లో దిగి అక్కణ్నించి లక్ష్మీదేవ్‌పూర్ బస్ ఎక్కా మధ్యాహ్నానికి చేరుకున్నాం. బస్టాండులో బస్సులు ఎర్రమట్టి దిబ్బల్లో పొర్లాడే జెర్రిపోతుల్లా వస్తూ పోతున్నవి. ఇది 'తాలూకా సెంటరట', కాని అంతా మట్టిరోడ్లే. దాదాపు ఆరు వేల జనాభా వుంటుందట. ఊరి చుట్టూ పెద్ద అడవి. ఓ పక్క మహారాష్ట్ర మరో పక్క మధ్యప్రదేశ్ ఆనుకొని ఉంది. దూరంగా గోదావరి జిల్లా నవ్వుతోంది. అడవి ఆహ్లాదంగా గంభీరంగా ఊరంతా చుట్టు ముట్టినట్లుంది. కొంత ఎర్రనేల, కొంత నల్లనేల, ఎంత ముద్దొస్తుందో ఊరంతా పచ్చగా నల్లగా ఎర్రగా కలగాపులగంగా ఉంది. ప్రయాణీకులు నిలబడ్డానికి చిన్న షెడ్డుంది, దానికి పది గజాల్లో రెండు మూడు బెంచీలు వేసిన తడికల గుడిసెలో నుంచి చాయ్ అందిస్తూ తాగుతూ మనుషులు కన్పించారు. దాని పక్కనే డబ్బా దుకాణం దానికి సీదా ఓ కంకర రోడ్డు దాకా వెళ్లి, "అయ్యా! ఇక్కడ కాలేజీ ఎటువైపు వుందయ్యా" అడిగాను. "ఈ రోడ్డు పొంటి కొంచెం ముందలికి పోతే ఎడమ సెయ్ దిక్కు గేటుంటుంది బోడు గూడ రాసుంటది గదే కాలేజమ్మ" అన్నాడు. సరే మా తమ్ముడిని బస్టాండులోనే ఉంచి "నేను కాలేజీకి పోయి జాయిన్ అయివస్తా సామానుతో కాలేజీకి ఎట్లా వెళ్తామని" చెప్పి కాలేజికి వెళ్లా. నలుగురైదుగురు కూర్చుని ఉన్నారు. ప్రిన్సిపాల్ ఆఫీసు రూమ్. అది కాలేజీలా పక్కాగా లేదు. కూలడానికున్న పాత మట్టిగోడల్తో షెడ్లతో ఉంది. ఒకవైపు ప్రత్యేకంగా కూర్చున్న వ్యక్తి ప్రిన్సిపాల్ అని చెప్పకనే చెప్తుంది కుర్చీ. నమస్కారం చేసి నా గురించి నేను పరిచయం చేసుకొని జాయినింగ్ రిపోర్టు ఇచ్చా. అక్కడ కూర్చున్న వాళ్ళను కూడా లెక్చరర్స్ అని ప్రిన్సిపల్ పరిచయం చేశాడు. లేడీ లెక్చరర్ సరోజ అని హిస్టరీ టీచ్ చేస్తారట. ఆమె నాలుగు రోజుల కిందటే జాయిన్ అయి మళ్ళీ ఇవ్వాల వచ్చిందట. ఏంటి ప్రాబ్లమ్ అంటే ఇళ్ళ ప్రాబ్లమ్ అని చెప్పింది. వచ్చిన లెక్చరర్స్ అంతా ఇళ్లవేటలోనే ఉన్నారట.

నేను సామానుతో వచ్చానని, సామానుతో మా తమ్ముడు బస్టాండులో ఉన్నాడని, నాకిప్పుడో రూము కావాలని చెప్పాను. 'మేడమ్ ఇక్కడ ఇండ్లు ఎవరూ కిరాయిల కోసం కట్టుకోరట. ఒకవేళ కట్టుకున్నా బాత్రూమ్లు, టాయిలెట్లు ఎవరికీ

ఉండవు. అవి లేకుండా మనలాంటోల్లకు కష్టం. బాత్రూమ్లు ఒక్క కోమటిబాపనోల్లకే ఉంటాయి. వాళ్ల ఇండ్లల్ల ఏమన్నా అడగాలె ఇప్పటికైతే సామాను మా ఇంట్లో పెట్టి, మీరు ఇంకో మేడమ్ ఇప్పటికి మా ఇంట్లోనే ఉండుండ్రి' – సరోజు మేడమ్ బాగా మాట్లాడ్తుంది. ఓ అరగంటలోనే బాగా కల్సిపోయింది. నాకు పెద్ద తోడు ఈమె అనుకున్నాను. సరోజ, నేను కలిసి బస్టాండ్ కి తమ్ముడితో కలిసి సామాను ప్రిన్సిపాల్ ఇంట్లో పెట్టి తమ్ముడికి ఇళ్ల విషయం చెప్పి వాణ్ణి బస్సెక్కించాం. ప్రిన్సిపాల్ ఇంట్లో కాల్జేతులు మొకం కడుక్కొని సాయంత్రం ఇళ్ల వేటకు బయలు దేరాం. ఎక్కడా ఇండ్లు దొరకలేదు. అన్నీ పూరిండ్లు. గూనపెంకు లిండ్లు కొన్నున్నయ్. డాబా ఇల్లు మచ్చుకు కూడా లేదు. అంతా దుబ్బదారే. ఎక్కడడిగినా "మాకే సరిపోతలేదు ఇల్లు మీకెక్కడిత్తం,'' "యిల్లు బాగున్నది కాని తానాల అఱ్ఱ లేదు. పాయకానకు సెంబట్టుకొని బైటికి బోవాలె" అని చెప్తుండ్రు. ఈసురోమని మళ్లీ ప్రిన్సిపాల్ ఇంటికి పోయినం, ఆయనకు కూడా రెండు గదుల పెంకుటిల్లు, అది ఒక బి.సి. ఉద్యోగిది. ఆ ఊళ్ళో టాయిలెట్స్ ఉన్న ఒకే బి.సి. ఇల్లది. ప్రిన్సిపాల్ కూడా బి.సి.నే. మాకు ఇల్లొక పెద్ద సమస్యగా మారింది. హైద్రాబాద్లో పద్మ చెప్పిన ఏ విషయాలు అంది రాలేదు. ఎవరూ పట్టించుకోవడం లేదు. కొత్తగా వచ్చిన లెక్చరర్లని కనీసం పలకరింపులు కూడా లేవు. ఆమెకు తేరగా వచ్చిన మర్యాదలు, గౌరవాలు లేకుంటే పాయే తల దాచుకోడానికి ఇల్లన్నా లేదు. అనవసరంగా వచ్చిన్నేమొ హాయిగా హైదరాబాద్లో ఉండక ఈ కొని పెట్టుకున్న కష్టాలేంటీ. "మంచి మాటలిని మార్మానంబోతె మల్లచ్చెటాలకు ఇల్లు గాలిందట" అట్లనే ఉన్నది నా పరిస్థితి. పాపం సరోజు కూడా "ఇల్లు ఈ రోజు దొరకలేదు రేపైనా ఇంకా బాగా తిరుగుదాం" అంది. ఆ రోజు ప్రిన్సిపాల్ ఇంట్లోనే తిని ఉన్నాం. తెల్లవారి మళ్లీ బయలుదేరాం. దారిలో ఓ పెద్ద మనిషి కలిసి, "అమ్మా మీరు మా ఇండ్లల్ల తానాలకు సౌలతులుండయిగా. కోమటి, బాపనిండ్లు అదుగుండ్రి, గాల్లిండ్లలనైతే మీరు సౌలతిగుండొచ్చు" అన్నాడు. తిరగనైతే తిరుగుదాం అంటూ ఇద్దరం మాట్లాడుకుంటూ తిరుగుతున్నాం. సరోజది నిజాంబాదట. తన కులం కుటుంబ విషయాలు అన్నీ చెప్పింది. ఇద్దరం వేరు వేరు కాదన్నమాట. ఒకే నేపథ్యం అయినందుకేమో చాలా దగ్గరయ్యాం. ఇట్లా మూడు రోజులు ప్రిన్సిపాల్ ఇంట్లో సామాను పెట్టి పగలంతా సగం ఇళ్ళ వేటలో, సగం కాలేజిలో గడపడం,

రాత్రి ప్రిన్సిపాల్ రెండు రూముల్లో ఇబ్బందిగా చాలీచాలని నిద్రపోయినట్టని పించినా ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అని ముళ్లమీద నించున్నట్లుంది పరిస్థితి. మా ప్రిన్సిపాల్ వాళ్లకి వీళ్లకి కబురు పెట్టినా సీరియస్‌గా ఎవరూ పట్టించుకుంటలేరు. సమస్య మాది గనుక సీరియస్‌నెస్ కూడా మాకే ఉన్నందువల్ల మాకు ఇంటివేల జీవన్మరణంగా వెతుకుతున్నాం. ఇప్పటికీ నాల్గురోజులు కావస్తున్నా ఇంత చిన్న గ్రామంలో ఇల్లు దొరికే స్థితిలో లేదు. ఏం చేద్దామని, మాట్లాడుకుంటూ నడుస్తుంటే పెంకుటిల్లే అయినా పెద్దగా విశాలంగా ఉండి చుట్టూ ఫెన్సింగ్ ఉన్న ఇల్లు కన్పిస్తే ఏమైనా రూములు ఖాళీ గున్నాయేమోనని లోపలికి వెళ్లాం. పెద్ద అరుగుల మీద కూర్చుని పిల్లలు చదువుకుంటున్నారు. ఫెన్సింగ్ లోపలికొచ్చిన మమ్మల్ని చూసి “ఎవరు ఏం గావాలో” అన్నారు. “మేము ఇక్కడి కాలేజి లెక్చరర్స్‌మి. మీ అమ్మ ఉందా?” అన్నాను. ఓ అబ్బాయి లోపలికెళ్లి ఏం చెప్పాడో లోపల్నుంచి ఓ పచ్చని రంగులో ఎర్రటి బొట్టు దానికింద మరో బొట్టుతో వెంట్రుకల్ని జారు ముడి వేసుకొని టపటప మెట్టలతో 35, 45 మధ్యలో ఉన్న ఒకామె వస్తూ ఓ మారు కాస్త పరిశీలనగా చూస్తూ “ఏంటీ” అంది. “మేము కాలేజి లెక్చరర్స్ మండి, మీ ఇంట్లో రెంట్ కి ఏమైనా రూమ్ దొరుకుతుందా?” అని అడిగాం. ఎక్కడ్నుంచి వచ్చారు. ఎంత మందుంటారు. ఏ వూరు గట్రాలడిగింది కాని యింకా ముందుకు బోయి ఏమడుగలేదు. కులం అడిగితే చెప్పేద్దా మనుకున్నాం. కాని అడగలేదు. అట్లా అడుగుతూ కాళ్ళ నుంచి మెడ వరకు గమనిస్తూంది. మమ్మల్ని చూసి మా గురించి చెప్పాక మా భాష, బట్టలు, మనుషుల్ని చూసి బాపనోల్లనుకోపోయినా ఏ కమ్మ, కాపోల్ల, వెలమనో ఆయుంటారనుకొని, “ఆ పక్క రెండు రూములు ఖాళీగా వున్నాయండి. కాని మీకా రూములు సరిపోతాయా, సిటీలో వున్న వాళ్లు యీ పల్లెటూల్లో వుంటారా, నీళ్ళు తోడుకోవాలె, పంపులుండవు,” అంటూ రెండు రూములు తలుపులు తీసి చూపించింది. ఏదో ఓ నీడ ఉంటే చాలనుకున్నాం. వెనుక బావి, దాన్ని ఆనుకుని వున్న బాత్రూమ్ చూపించి కాంపౌండంతా కలెదిప్పుతూంటే కొంచెం దూరంలో ఆరేసిన వడియాలు డబ్బాలకెత్తుతూ ఓ ముసలామె మమ్మల్ని చూసి “ఎవరే వాండ్లు” అని అడిగింది. “కాలేజికి కొత్తగా వచ్చిన లెక్చరర్లట అత్తయ్యా. యిల్లు కావాలని అడుగుతున్నారు” అంటూ “మా అత్తయ్య ఆమె. మా మామగారు ఈ పూరి దేవాలయ కమిటి

ప్రెసిడెంట్, మా యింటాయన టీచరు" అందామె. ఆ కాంపౌండ్ లో ఓ పెద్ద గద్దె చూపించి, "మీరు కూర్చొండి మా అత్తయ్యతో మాట్లాడొస్తా" అని వెళ్లింది. నేను సరోజు ఫరవాలేదు కదా యిల్లెట్లున్నా మిగతా అంతా బాగానే వుంది. చుట్టూ అన్ని చెట్లు, బావి, బాత్రూమ్, టాయిలెట్లున్నాయ్. యిస్తామంటే బంగారంలా ఉంటాం. ఈ యిల్లు దొరికితే మనకంటే అదృష్టవంతులు లేరని మురుసు కుంటుండగా "మిమ్మల్ని మా నానమ్మ పిలుస్తుందంటూ" పిలుపొచ్చింది. అత్తా, కోడలు అరుగుల మీద కూర్చొని మమ్మల్ని కూడా కూర్చోమన్నారు. 'ఏమమ్మా మీకు యిల్లు నచ్చిందా ఇంకో విషయం మీరు గుడ్లు, మాంసాలు తినేవాళ్లో, కాదో నాకు తెలీదు గాని అట్లాంటివి మా ఇంట్లో వండొద్దు' అంది మా ముఖాలు పరిశీలనగా చూస్తూ, నేను సరోజ ఒకరి మొహాలు ఒకరం చూసుకొని "లేదండీ మేము యింట్లనే తింటామండి, మీకిబ్బందిగా వుంటే అసలే వండుకోమండి. అసలు మాకు అవి వండుకోవడం కూడా రాదండి'' అని వుండే నీడ కోసం ఇష్టమైన తిండిని కూడా లెక్క చేయకుండా 'తినమండి, వండుకోమండి' అని యిద్దరం పోటీపడి ఏక కంఠంతో నమ్మబలికాం. యిద్దరు లోపలికెళ్లి మాట్లాడొచ్చారు. మీకిల్లిస్తాం గాని ఓ సారి మా యింటాయనని, మా మామగార్ని కూడా అడిగి ఏ విషయం చెప్తాం. ముసలావిడ అపనమ్మకంగా, ఆమె కోడలు అద్దె వస్తుందన్న ఆశతో మొత్తానికి యిల్లిస్తామని ఒప్పుకున్నారు. "హమ్మయ్య" అనుకున్నాం. కొసమెరుపుగా, "బామ్మగారూ మీ యిల్లు, మీరు బాగా నచ్చారండి అద్దె విషయం కూడా చేస్తే యిప్పుడే సామాను పట్టుకొస్తామండి మూడు రోజుల్నుంచి తిరుగు తున్నానండి. ఎక్కడా యిల్లు దొరకడం లేదు" అని ఆడపిల్లలమని, దూరం నుంచి వచ్చామని ఎట్లయినా మాకు యిల్లిప్పించండని వాళ్ళ మనసు కరగాలని చాలా చాలా చెప్పింది సరోజ. మా స్నేహితురాలు పద్మ చెప్పిన సీన్ మాకు లేదేంటబ్బా లోపం ఎక్కడ జరిగిందనే విషయం ఓ వైపు తొలుస్తూనే వుంది. మాతోపాటు జాయిన్ అయిన లెక్చరర్స్‌లో ఖాజామొహినుద్దీన్, జేమ్స్ కొమురయ్యలకు యిలు దొరకలేదు. వాళ్ళు రాత్రి కాలేజీలోనే నిద్ర, మిగతా స్నానపానాదులు కానిస్తూ హోటల్లో హాయిగా తింటూ వాళ్ళు బాగానే వున్నారు. అసలు యిల్లు ఓ అవసరంగానే ఫీల్ కావడం లేదు. సాఫీగానే నడుస్తుంది వాళ్ళకు. కాని వాళ్లలా మేము కూడా వుండటానికి సామాజిక పరిస్థితులు సమానంగా లేవు. దుర్భరంగా వుంది.

మధ్యాహ్నం మల్లా యిల్లిస్తున్న వాళ్ళింటికి వెళ్లాం. అత్తాకోడల్లు 'మా ఇంటోళ్ళు సరేనన్నారు. మంచి ఘడియ చూసుకొని రండి' అన్నారు కూడ బలుక్కున్నట్లుగా యిద్దరం ఎగిరి గంతేసినట్లుగా సంతోషపడ్డాం. 'ఏ ఘడియైనా ఫరవాలేదండి సాయంత్రమొస్తాం' అన్నాను. కోడలు 'మీ యిష్టం వుండేది మీరు'. సాయంత్రం సామాను తీసికెళ్ళి పక్కన పెట్టి రెండు గదులు కడిగి సామాను సర్దాం. నాలుగు రోజులు కాలేజి, యిల్లు బాగానే గడిచింది. 5వ రోజున సాయంత్రం క్లాసులు తీసుకుంటూ కాలేజీలో వున్నప్పుడు, మా చప్రాసిని రమ్మాన్నారట మాకిల్లు యిచ్చినోల్లు వాళ్ళు చప్రాసితో 'వాళ్ళు కడజాతోల్లంటగదా. మొకాలు జూసిచ్చినం కులమడగకుండ. ముందు ఆ సామాను తీసికెళ్లమని చెప్పు. యిల్లు శుద్ధి చేయించా లన్నారట. చప్రాసి కాలేజికొచ్చి జరిగిన విషయం చెప్పాడు నొచ్చుకుంటూ. తాతల తరాలున్నట్లు మేము లేము. ఎన్నో ఉద్యమాలు చేసి చదువుకొని యీ స్థితికొచ్చినంక గూడ మా నుదుటి మీద అంటరాని గీతలు చెరిగిపోవడం లేదు. వాళ్లు చేసినవమానం తిరిగి చెవుల్లో సీసం నింపుతున్నట్లు నాలిక చీరుతున్నట్లు, వేళ్లు నరుకుతున్నట్లుగానే వుంది. ఎప్పుడో ఎన్నో పోరాటాలు చేసి మేం పగలకొట్టిన ముంత మల్లి మూతికి కడుతున్నట్లుగా, జారిపోయిన తాటాకు మల్లి మొలకు ముడేస్తున్నట్లే అన్పించింది.

వాళ్ల మొకాలు చూడాలంటేనే అసహ్యం పుట్టింది. అట్లాంటి యింట్ల వుండే కంటే చెట్టుకిందుండడం సుఖమేమో. 'ఛీ' పాడు మనుషులనుకొని చప్రాసిని పంపించి సామాను కాలేజిలో పెట్టించాం. 'శుద్ధి చేయాల్సింది యిల్లును కాదు మిమ్మల్ని మీరు శుద్ధి చేసుకోండి' అని అనుకున్నాం. ప్రిన్సిపాల్ సామాను చూసి బాధగా 'నాకు తెలుసండి వాళ్లు మన లాంటోల్లకు యిల్లియ్యరు ఆల్లబుద్దే అంత. మనమెంత చదువుకున్నా ఎంత స్థితి మంతులమైనా ఆల్లు మనల్ని ఆల్లకిందోల్లుగానే నీచపు మనుషులుగానే చూస్తారండి' అన్న ప్రిన్సిపాల్ మాటలకు, పద్మజ కందిన గౌరవాలు మాకెందుకు దొరకలేదో అప్పుడర్థమైంది.

# తెలుగు పాఠ్యపుస్తకం
# నాల్గవ సెమిస్టర్
# ఆధునిక సాహిత్య విమర్శ


1. ఉపాధ్యాయ విమర్శకుడు ఎఫ్.ఆర్.లీవిస్
- ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం 61

2. మంచి కథ–నాలుగు లక్షణాలు
- వల్లంపాటి వెంకటసుబ్బయ్య 68

3. ఆధునిక సాహిత్య విమర్శ
- ఆచార్య కొలకలూరి ఇనాక్ 80

4. అడవి బాపిరాజు గారి "తుపాను"
- వాడ్రేవు వీరలక్ష్మీదేవి 102

5. తెలంగాణ పోరాటం – తెలుగు కథ
- ఆచార్య కాత్యాయిని విద్మహే 109

# ఉపాధ్యాయ విమర్శకుడు ఎఫ్.ఆర్. లీవిస్

**-ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం**

సాహిత్య విమర్శకూ, సాహిత్య పత్రికలకూ ఈ శతాబ్దిలో పోష్య పోషకసంబంధం బాగా పెంపొందింది. విమర్శలో ప్రయోగం చేయాలన్నా, ప్రతిభను ప్రదర్శించాలన్నా, ఉద్యమం నడపాలన్నా విమర్శకులు తమతమ వ్యాసాలను సాహిత్య పత్రికలలో మొదట ప్రచురించటంద్వారా, ప్రచారంలోకి వచ్చేవారు. ఖండన మండనలకూ, సమీక్షా విమర్శలకూ, వివరణ సవరణలకూ పత్రికలే చర్చావేదికలుగా పనికివచ్చేవి. పత్రికలలో పుట్టి గ్రంథాలలో మెట్టిన విమర్శలే ఈ శతాబ్దిలో ఎక్కువ.

విమర్శకోసం అంకితమై విమర్శకులచేతనే నడపబడిన సాహిత్య పత్రికలలో మొదట చెప్పుకోదగింది The Scrutiny. అది కేంబ్రిడ్జి నుండి వెలువడిన త్రైమాసిక పత్రిక. సంపాదకుడు ప్రసిద్ధ విమర్శకుడు డాక్టర్ ఫ్రాంక్ రేమన్డ్ లీవిస్ (1895 1978). 1932–53 సంవత్సరాల మధ్య అంటే రెండు దశాబ్దాలపాటు వెలువడి ఈ శతాబ్ది సాహిత్యాభిరుచిలోనే ఒక మంచి మార్పును తెచ్చింది స్క్రూటినీ. ఆ కాలంలో ప్రయోగవిమర్శకు – Practical criticism కు – దోహదంగా ఎన్నో గణనీయమైన నిశితవాస్తవాలను సాహిత్యానుశీలనానికి అందించిన విలువైన పత్రికగా ఎంతో ప్రశస్తిని పొందింది.

ఎఫ్.ఆర్.లీవిస్ ఉపాధ్యాయుడు, విమర్శకుడు, పత్రికాసంపాదకుడు, ప్రయోగశీలి. ఈ శతాబ్ది విమర్శకున్న ఈ నాలుగు ముఖాలు ఆయన విమర్శ వ్యక్తిత్వానికున్నాయి. లీవిస్ విశ్వవిద్యాలయాచార్యుడు కావటంచేత విద్యార్థులతో గోష్ఠులు చేసి, నిశిత పరిశీలనానంతరం వినూత్న విమర్శపద్ధతులను వెలికి తీసేవాడు. అదివరకే ప్రచారంలో ఉన్న విమర్శ సూత్రాలను పుటంపెట్టి క్రొత్త పుంతలను సాక్ష్యాధారాలతో ప్రకటించేవాడు. లీవిస్ విమర్శమార్గం ప్రయోగ విమర్శ. అందులో వివేచన విధానాలను విశేషంగా వివరించిన ఉపాధ్యాయ

విమర్శకుడుగా – Teacher - critic గా – ప్రసిద్ధికెక్కాడు. అమెరికాలోని న్యూ క్రిటిసిజం – అంటే – అభినవ విమర్శకు దారులు చూపి, 20వ శతాబ్ది సాహిత్య విమర్శను రూపొందించటంలో విశిష్టమైన కృషిచేశాడు.

ఆయన సంపాదకత్వంలో వెలువడిన The Calendar of Modern Letters - Towards standard of criticism (1933) అనే గ్రంథం ఆ మార్గానికి రూపురేకలు దిద్దింది. New Bearings in English Poetry (1932), For continuity (1933), Revaluation (1936), Education and the University (1940).The great tradition (1948), The common pursuit (1952), D.H. Lawrance-Novelist (1955): అనే గ్రంథాలు లీవిస్ విమర్శ స్వరూప స్వభావాలను వ్యక్తీకరించే విలువైన రచనలు.

సాహిత్య వివేచనలో సంస్కృతికి సమధికస్థానాన్నిచ్చాడు లీవిస్. ఒక నాగరక సంఘాని కుండే ఆదర్శం ప్రకారం వ్యవస్థీకరించబడిందీ, క్రమబద్ధం చేయబడిందీ అయిన జీవన విధానాన్ని 'సంస్కృతి' అని అభివర్ణించాడు. ప్రాచీనకాలంలోని గ్రామాలలో ఉన్న సహజీవన విధానంలో ఇటువంటి సంస్కృతి సుసంపన్నంగా ఉండేదనీ, ఆధునిక యాంత్రిక జీవనవిధానంలో అది లోపించిందని ఆయన భావించాడు. సమాజంలోని ప్రతివ్యక్తికీ నిజమైన సంస్కృతినీ, కృత్రిమ సంస్కృతినీ విడమరచి గుర్తించే వివేకాన్ని సాహిత్యం అందించాలని ఆదేశించాడు. ఉత్తమ రచన సమకాలీన సమాజంలో సంస్కృతి సదవగాహనకు తోడ్పడాలని ఆశించాడు. చరిత్ర ఈపని చేస్తుంది కాని, దానికంటే విలక్షణంగా సాహిత్యం సంస్కృతి పునరుజ్జీవనాన్ని నిర్వహిస్తుందని వివేచించాడు. ఒక కాలంలో లేదా ఒక యుగంలో ప్రవర్తిల్లే సంస్కృతి స్థితిగతుల్ని చరిత్ర వివరించాలి. అయితే అది వాస్తవాల వివరణ మాత్రమే ఇచ్చి ఊరుకుంటుంది. కాని, సాహిత్యం ఆ సంస్కృతిని మూల్యాంకనం చేస్తుంది. ప్రజల అభిరుచుల్లో, అలవాట్లలో ఆ సంస్కృతి కలిగించే మార్పులనూ, జీవితాన్ని మెరుగుపరిచే పద్ధతులనూ సమీక్షిస్తుంది. సాహిత్యం జాతి సంస్కృతిని తన శబ్దార్థ శక్తివలన పునరుజ్జీవింపచేస్తుంది. సంస్కృతిపరమైన వివేకంతో పాటు, దానిని తాదాత్మ్యంతో అనుభవించే ఆత్మీయతను ప్రసాదిస్తుంది అంటాడు లీవిస్. దీనిని నాటకంలోని నటులనూ, ప్రేక్షకులనూ దృష్టాంతంగా తీసికొని వివరించాడు.

రంగం మీద నటుడు అభినయిస్తాడు. నాటకం చూచే ప్రేక్షకులు ఆ అభినయం ద్వారా ఆ నాటకంలో జీవిస్తారు. ఆ సమయంలో నటుడు ఇదివరకెప్పుడో జరిగిన కథనుగాని, ముందే రూపొందించబడిన ఒక ఆలోచనను గాని అందంగా రంగం మీద ఆవిష్కరిస్తున్నట్లు అనుకోరు. అదంతా సాక్షాత్తు అప్పుడే జరుగుతున్నట్లు అనుభవిస్తారు. అలాగే కవికూడా కావ్యంలో శబ్దాలను అనుభవం కోసం ఆలోచనామృతాన్నందించే సృజనాత్మక శక్తులుగా వాడతాడు. అటువంటి రమణీయ శబ్ద ప్రయోగం వలన రూపుకట్టని ఆలోచనలు సైతం అనుభవసత్యాలుగా పరిణమిస్తాయి. కవిత కుండే ఇటువంటి శక్తిని లీవిస్ The explanatory creative use of words upon experience అని పేర్కొ న్నాడు.

ఈ దృక్పథంతోనే లీవిస్ సాహిత్య విమర్శ నిర్వహించే పాత్రను కూడా వివేచించాడు. సాహిత్యంలో వికాసం చెందుతున్న సాహిత్య సంప్రదాయాన్ని గానీ, ఒక ప్రక్రియలో అనుస్యూతంగా విస్తరిల్లుతున్న సాహిత్య సంప్రదాయాన్ని కానీ, తద్వికాసానికి దోహదంచేస్తున్న రచనలనుగాని అనుశీలించటం ద్వారా అధ్యయనం చేయటం విమర్శధర్మమని ఆయన పేర్కొన్నాడు. సాహిత్యం వర్తమానంలోనే జీవిస్తుంది. వర్తమాన సాహిత్యమే మన సమీక్షాక్షేత్రం. వర్తమానంలో సజీవంగా ఉన్నదే సంప్రదాయం. అయితే, వర్తమానసాహిత్యం గతంలోనుండి అవిచ్ఛిన్నంగా అభివృద్ధి పొందుతున్న సంప్రదాయమే. గతంలోని మంచిని మీగడతరగల్లా వర్తమానం గ్రహించి జీర్ణించుకొంటుంది. విమర్శకుడు వర్తమాన సాహిత్యానుశీలనంలో సజీవంగా ఉన్న గతాన్నీ, అది పొందిన మార్పులనూ సమీక్షించగలుగుతాడు. ఈ దృష్టితో సాహిత్యాన్నీ, దాని వాస్తవస్థితినీ విమర్శ నిశితంగా పరిశీలించాలి అంటాడు లీవిస్. ఈ నిశితపరిశీలనమే స్క్రూటినీ, సాహిత్య విమర్శకు ఎలియట్ ఇచ్చిన కానుక Tradition భావన. లీవిస్ తెచ్చిన కానుక 'The great tradition' భావన.

లీవిస్ విమర్శవిధానంలో ముఖ్యంగా మూడు పద్ధతులు కనపడతాయి.

1. విమర్శించటానికి ఎన్నుకొన్న గ్రంథాన్ని ఒక కళాఖండంగా దర్శించి దాన్ని సంపూర్ణ సహృదయస్పందనతో స్వీకరించటం.
2. దాన్ని నిశితంగా పరిశీలించటం, లేదా విశ్లేషించటం.
3. కళాఖండంగా దాని వైశిష్ట్యాన్ని నిర్ధారించటం. ఈ పద్ధతులను విమర్శలో పాటిస్తున్నప్పుడు సంప్రదాయంగా వస్తున్న పూర్వ ప్రమాణాలను కావ్య

వివేచనానికి తోడ్పడినంతవరకే గ్రహించాలి కాని, అవశ్యకర్తవ్యంగా అనుసరించరాదని లీవిస్ అభిమతం.

Scrutiny అంటే నిశితమైన సూక్ష్మపరిశీలన. అది లీవిస్ నడిపిన సాహిత్య పత్రిక పేరే కాదు. సాహిత్య విమర్శ కుండవలసిన ప్రధాన లక్షణ మనే ఆయన ఆశయంకూడా. ఒక కళాఖండాన్ని విమర్శకు డొక్కడే కాకుండా, మరికొంతమంది. విమర్శకులతో కలిసి సామూహికంగా పరిశీలించాలని లీవిస్ అన్నాడు. ఇందులో ఆయన ఎలియట్ వంటివాడే. ఎలియట్ వాడిన The common pursuit అనే పారిభాషికపదానికి ఈయన ప్రాచుర్యం కలిగించాడు. ఒక రచనను గురించి నిజమైన నిర్ధారణ చేయాలంటే విమర్శకుడు ఒక సంఘటితమైన సహకారయత్నం చేయాలి. అనేకమంది అంగీకారానికి పాత్రమైన నిర్ధారణలు చేయాలి. దీన్నే సరైన నిర్ణయాల కోసం చేసే సాముదాయకయత్నం – The common pursuit of true judgement అంటాడు లీవిస్. ఈ సాముదాయక ప్రయత్నంలో విమర్శకుడు తన వ్యక్తిగత రాగద్వేషాలను తగ్గించుకొని, ఇతరులు కూడా అటువంటి మనఃప్రవృత్తితో చేసే పరిశీలనలను సహనంతో స్వీకరించి, ఒక ప్రామాణిక బుద్ధితో తన అస్తిత్వానికి న్యాయం కలిగించుకోవాలి. సాముదాయక పరిశీలనలో కొందరు తనతో భేదించవచ్చు. సహేతుకంగా భిన్నాభిప్రాయాలను ప్రదర్శించే పరిశీలకులతో భేదిస్తూనే, సమర్థవంతంగా తన నిర్ణయాలను అధికసంఖ్యాకులకు ఆమోదయోగ్యమయ్యేటట్లు ప్రపంచించటం ఈ సూక్ష్మపరిశీలన ప్రధానలక్షణం. ఈ పద్ధతివలన విమర్శలో వైయక్తిక అభిరుచులమీద ఆధారపడే పాక్షిక నిర్ణయాలు తగ్గుతాయి. గతంలోకంటె నవీన పరిశీలన పద్ధతులు విమర్శలో వ్యాపిస్తాయి. అన్నింటికీ మించి పరిశీలనలో విమర్శకుడి బాధ్యత గుర్తించబడుతుంది. విమర్శ సాధ్యమైనంతవరకు విశ్వజనీనం కావటానికి బాగా తోడ్పడుతుంది. ఈ శతాబ్ది విమర్శ విశ్వజనీనత వైపు చేసిన ప్రస్థానంలో ఎలియట్, రిచర్డ్సుల తరువాత లీవిస్ మరొక మైలురాయిలా నిలిచాడు.

లీవిస్ తన విమర్శకు తనదైన ఒక సాంద్రమైన శైలిని ఏర్పరచుకొన్నాడు. ఆయన శైలిలో అర్థవంతమైన పట్టును కల్గించేవి ఆయన క్రొత్తగా కల్పించిన పారిభాషిక పదాలు, తనదైన అభివ్యక్తితో, పారిభాషికపద సృష్టితో సాహితీరంగం మీద ప్రవేశించి, విమర్శ సాగించేవాడే ఉత్తమ సృజనాత్మక విమర్శకుడనబడతాడు. అటువంటి ఉత్తమ సాహితీ విమర్శకులలో ఎఫ్.ఆర్. లీవిస్ ఒకడు.

లీవిస్ సాహిత్య విమర్శ కందించిన విలువైన పారిభాషికపదాలలో ముఖ్య మైనవి Enactment, Realisation, Reality, Sincerity, Moral, Tradition అనేవి. వ్యవహారంలో ఈ పదాలకున్న అర్ధాలకంటె వేరైన అర్థాలలో ఇవి వాడబడ్డాయి. లీవిస్ తన విమర్శలో శబ్దార్థ విశ్లేషణలమీదకంటె, కావ్య నిర్మాణ సంవిధానాలమీద ఎక్కువ ఊనిక నిచ్చి, కావ్యంలోని అంతరార్థానికీ, దాన్ని అభివ్యక్తం చేసే బాహిరమైన కవితాశయ్యకూ ఉన్న సంబద్ధతను గురించి ఆయన ఎక్కువగా వివేచించాడు. కావ్యంలో చెప్పబడుతున్న వాస్తవానికి – actual కూ – అందులో వ్యక్తీకరించబడుతున్న సత్యానికి, కావ్యంలో ప్రతిపాదించదలచుకొన్న పరమార్థాలకూ గల విశిష్ట సంవిధానమే కావ్య నిర్మాణం. దాన్నే లీవిస్ organisation అన్నాడు. ఆ నిర్మాణ సంవిధాన విశేషాలను నిశితంగా విశ్లేషించటమే విమర్శప్రధాన కర్తవ్యం.

కవిత్వం అంటే అనేకాంశాలచేత సుసంఘటితమైన వ్యక్తిత్వం యొక్క అభివ్యక్తిగా లీవిస్ అభివర్ణించాడు. కవిత్వంలోని విశిష్ట సాహిత్య మూల్యాలనుగానీ, సాపేక్షకవితాసౌందర్య సూత్రాలనుగానీ విశ్లేషించినదానికంటె సంబద్ధతను గురించి– అంటే Relevance ను గురించి – నిశితంగా పరిశీలించాలని అభిప్రాయపడ్డాడు. సాహిత్యంలో సంబద్ధత అంటే అందంగా భావాలను చెప్పటం మాత్రమే కాదు శబ్దాని కుండే రమణీయార్థ ప్రతిపాదకశక్తిని ఆవిష్కరించే అధికారం. అంతే కాదు విశ్లేషణ వివేచనతో కూడుకొన్న గాఢమైన వ్యుత్పత్తితో సాహితీ మర్యాదలనూ, నిర్మాణ సంవిధానమర్మాలనూ ప్రదర్శించగలిగే వివేకం.

*'Works of art act their moral judgement'* అంటాడు లీవిస్. ఈ వాక్యానికి లోకవ్యవహారాన్ని బట్టి అర్థం చెపితే 'కావ్యాలు నీతిసూత్రాలను ప్రదర్శిస్తాయి' అని అనాలి. ఇక్కడ ఆ అర్థం కాదు. Moral అంటే లీవిస్ పరిభాషలో 'నీతి' కాదు ఆయన దృష్టిలో కావ్యమే Moral. కవి కావ్యంలో చెప్పదలచుకొన్న మానవీయ చైతన్య బిందువే – అంటే Human centrality యే – కావ్యాత్మ రూపం అందులో ఒక భాగం మాత్రమే. రూపమే కావ్యం కాదు. కవులు మౌలికంగా ఉపదేశకులు కారు, కారాదు. వారు వస్తుతః కళాకారులు – అంటాడు లీవిస్. మూర్తీభవించిన కావ్య నిర్మాణ సంవిధాన సమగ్రతయే Moral judgement. దానిని కళారూపంగా ప్రదర్శించటం కావ్యధర్మం అంటాడు లీవిస్.

ఆయన వాడే act, enact, enactment అనే పదాలు ప్రత్యేకంగా గమనించదగినవి. కావ్యం తన నిర్మాణ సమగ్రతను వాచ్యంగా కాకుండా కవితాభాషాభివ్యక్తితో ప్రదర్శిస్తుంది. అటువంటి భాషాభివ్యక్తిని *'The Poetic creative'* అని పిలిచాడు లీవిస్. మనపరిభాషలో చెప్పాలంటే – 'వాక్యం రసాత్మకం కావ్యం' – 'రమణీయార్థ ప్రతిపాదకశబ్దః కావ్యమ్' అనే అలంకారిక సిద్ధాంతాల అపూర్వ మేళనం లీవిస్ కావ్య దృక్పథం.

Enactment అంటే ఉత్తమ కవిత్వ ప్రదర్శనం. Enactmentకూ Realisation కూ అవినాభావ సంబంధం ఉంటుంది. కవితా నిర్మాణ సమగ్ర ప్రదర్శనం ఒక సున్నితమైన సామాజిక సన్నివేశానికి సంబంధించిన ప్రవృత్తిని ఆవిష్కరిస్తుంది. సంబద్ధతను అనుభవంగా పరిణమింపజేస్తుంది. కవితాసమగ్రత అనుభవ సమగ్రత కోసమే. అనుభవ మంటే ఆ కవితను నిర్వచించగలగటం నిరూపించగలగటం, Reality అంటే లౌకికవాస్తవంగానీ, భౌతిక సత్యంగానీ కాదు. అది కళాసత్యం, కళాత్మకభాషలో భావనామయం చేసి చిత్రించే వస్తువును భావుకుడు వాస్తవంగా గ్రహించి దాన్ని అనుభవిస్తాడు. అలా చేయగలిగే కళాసత్యం Reality. అలా కావ్య సత్యాన్ని కల్పించటంలో కవి కుండే నిజాయితీ – లీవిల్ మాటల్లో Sincerity, కావ్య కళానుభూతి Realisation. భావుకుడు కావ్యంలోని పరమార్థాన్ని భావించటం వల్లా, విభావాదులను, సన్నివేశాదులను ఆశ్రయించి వ్యక్తమయ్యే కవి అంతశ్చైతన్యాన్ని మననం చేయటంవల్లా కళానుభవం Realisation కలుగుతుంది.

సాహిత్య సంప్రదాయ భావనలో లీవిస్ ఎలియట్ కు వారసుడంటారు కొందరు విమర్శకులు. కాని Tradition అనే దృక్పథాన్ని ఎలియట్నుండి లీవిస్ గ్రహించినా, ఆత్మప్రత్యయత్యాగాన్ని Impersonality ని అతనికంటే భిన్నంగా భావించాడు. కవి తన ఆత్మప్రత్యయాన్ని కోల్పోయే పద్ధతే కావ్య సృజన వ్యాపారమనీ, కవి స్వీయ భావావేశం నుండి తప్పించు కోవటమే కవిత్వమనీ అన్నాడు ఎలియట్. లీవిస్ కవియొక్క ఆత్మప్రత్యయత్యాగమనే భావనను అంగీకరించలేదు. కవి తన భావావేశాలను కావ్యాంశాల ద్వారా అనుభవిస్తాడు కాబట్టి అతడు తన అనుభవాలనే విశ్వజనీనం చేసికొని తిరిగి ఆస్వాదిస్తాడన్నమాట అందువలన కావ్యం విశ్వజనీనమైన రసానుభూతి– అంటాడు లీవిస్.

పరిశీలించి చూస్తే 'వాక్యం రసాత్మకం కావ్యం' అన్న విశ్వనాథుడి దృక్పథం, 'రమణీయార్థ ప్రతిపాదక శబ్దః కావ్యం' అన్న జగన్నాథుడి దృక్పథం ఎఫ్.ఆర్.లీవిస్ కావ్య దృక్పథంలో సంగమించి సరిక్రొత్తరూపం తాల్చాయి అనిపిస్తుంది మనకు.

ఏ యుగంలోనైనా సిద్ధాంత ప్రవక్తలు ముందువరుసలో నించుంటారు. ప్రయోక్తలు రెండోవరుసలో నిలబడతారు. ఎలియట్, రిచర్డ్స్ సిద్ధాంతాలనూ, అనువర్తిత విమర్శసూత్రాలనూ ప్రతిపాదించి మొదటి వరుసలోవారైనారు. ఎఫ్.ఆర్ లీవిస్ ప్రయోక్తగా, ప్రయోగవిమర్శసూత్రకారుడుగా వారి వెనుకనే వస్తాడు. కాని, ఉపాధ్యాయ విమర్శకుడుగా, పత్రికా సంపాదకుడుగా, ప్రయోక్తగా ఆయన నిర్వహించిన విమర్శక పాత్రను ఈ శతాబ్ది విస్మరించలేదు. సిద్ధాంతాలు చేయకపోయినా విమర్శకున్న నిశితపరిశీలన (scrutiny) అనే చైతన్యానికి ఒక నిలువెత్తు ప్రమాణాన్ని కల్పించిన ఫ్రాంక్ రేమండ్ లీవిస్ చిరస్మరణీయుడు!

(ప్రసారం. 4.6.1999)

# మంచి కథ - నాలుగు లక్షణాలు

## - వల్లంపాటి వెంకట సుబ్బయ్య

మంచి కథకు ఉండవలసిన లక్షణాలు క్లుప్తత, అనుభూతి ఐక్యత, సంఘర్షణ నిర్మాణ సౌష్టవం.

**క్లుప్తత**

క్లుప్తత కథా ప్రక్రియను ఎంత కష్టమైన సాహిత్య ప్రక్రియగా తయారు చేస్తుందో సుప్రసిద్ధ అమెరికన్ రచయితా, నోబెల్ బహుమతి గ్రహీతా విలియం ఫాక్నర్ ఇలా వివరించాడు.

"కథలో (కవిత తరువాతనే ననుకోండి) ప్రతి పదమూ దాదాపు నిర్దుష్టంగా ఉండాలి నవలా రచనలో మీరు అజాగ్రత్తగా ఉండవచ్చు. కానీ కథారచనలో ఉండలేరు. అజాగ్రత్తగా, అశ్రద్ధగా ఉండటానికి కథలో చాలా తక్కువ చోటుంటుంది. చెత్తకు కూడా కథలో చోటు తక్కువే. కవితలో చెత్తకు చోటే లేదనుకోండి."

ఫాక్నర్ అభిప్రాయాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే నవలా రచనలో కంటే కథా రచనలో రచయిత శిల్పం పట్ల ఎక్కువ జాగరూకతనూ, ఎరుకనూ కలిగి ఉండాలని తెలుస్తుంది. అందుచేతనే కాబోలు తక్కువ శిల్ప సామర్థ్యం కలిగిన రచయితలు కథకంటే నవల రాయటమే సులభమని చాలామంది భావిస్తారు.

క్లుప్తత తనంతకు తానుగా రాదు. రచయిత దాన్ని కష్టపడి సాధించవలసిందే.

సుప్రసిద్ధ కథకుడు ఆంటన్ చెకోవ్ క్లుప్తతను తన కథల్లో ఎంతో జాగరూకతతో సాధించాడు. అతడు తాను రాసిన ఒక కథను గురించి తన స్నేహితుడొకనికి ఉత్తరం రాస్తూ ఇలా అన్నాడు, "ఈ మధ్య ఒక కథ రాశాను. రచన నాకు సంతృప్తికరంగా కుదరలేదు. మళ్ళీ దాన్ని లేసులా వచ్చేలాగా సాపు రాయాలను కుంటున్నాను." ఈ ఉత్తరంలో "లేసులాగా" అన్న మాట చాలా అర్థవంతమైంది. దారంతో అల్లిన లేసులో అల్లిన భాగంకంటే అల్లకుండా వదిలేసిన భాగమే ఎక్కువగా

ఉంటుంది. అల్లకుండా వదిలేసిన భాగంవల్లనే, లేసు "డిజైన్" ఏమిటో తెలుస్తుంది లేసులోలాగా కథలో కూడా చెప్పిన విషయాల కంటే చెప్పకుండా సూచించి వదిలి పెట్టిన విషయాలకే ప్రాధాన్యత ఎక్కువ. చెప్పవలసినదాన్నంతా చెప్పటంచేత నిస్సందేహంగా కథకు విలువ తగ్గుతుంది. చెప్పవలసిందాని కంటే ఎక్కువ చెప్పటం కథా ప్రక్రియకే విరుద్ధం. ఈ విషయాన్నే చెకోవ్ మరో సందర్భంలో చమత్కారంగా చెప్పాడు. "కథలో చెప్పవలసిన దానికంటే తక్కువ చెప్పటం మంచిది. ఎందుకంటే.......ఎందుకంటే .... ఎందుకో నాకు తెలియదు," అన్నాడు చెకోవ్. "నాకు తెలీదు" అన్నంత మాత్రం చేత చెకోవ్ కు నిజంగానే తెలీదనుకోవటం మన అమాయకత్వం మాత్రమే. అతడు తన కథల్ని మాత్రమేకాదు తన విమర్శల్ని కూడా లేసులల్లినట్లే రాశాడు.

ముందు క్లుప్తత అంటే ఏమిటో ఆలోచిద్దాం. కథ పొడవు తక్కువగా ఉండటమూ, క్లుప్తతా ఒకటే కాదని ఇంతకు ముందే అనుకున్నాం. ఇతివృత్తాన్ని బట్టి కథ పొడవు ఉంటుంది. కాబట్టి ఇతివృత్తం అవసరాలకు మించి కథ పెరగటాన్ని క్లుప్తత లోపించటంగా మనం భావించవచ్చు. కథలో క్లుప్తత అనేక కారణాల వల్ల లోపించవచ్చు. వాటిలో కొన్ని ముఖ్యమైన వాటిని పరిశీలిద్దాం.

వీటిలో ప్రధానమైనది సందర్భశుద్ధి లేకుండా కథలో వర్ణనల్ని చొప్పించటం చాలామంది తెలుగు కథా రచయితలకు ఒక సుదీర్ఘమైన ప్రకృతి వర్ణనతో కథను ప్రారంభించే అలవాటు ఉంది. ఆ వర్ణనకూ కథాంశానికీ ఎలాంటి సంబంధమూ ఉండదు. అనేక సందర్భాల్లో ఈ ప్రకృతి వర్ణన కాలాన్ని సూచించటం లాంటి చిన్న బాధ్యతను కూడా నిర్వహించదు.

ప్రకృతి వర్ణనలే కాకుండా మన కథల్లో కథాంశంతో సంబంధంలేని ఇతర వర్ణనలు కూడా చాలా తరచుగా దర్శనమిస్తాయి. పాత్రల్ని ఆపాదమస్తకం వర్ణించటం పాత్రలు తిరిగే ప్రాంతాలను వర్ణించటం, వారు ఏం ఆలోచిస్తున్నారని రచయిత ఊహిస్తున్నాడో ఆ భావాలను వర్ణించటం మొదలైన చాపల్యాలు ఎదురౌతూనే ఉంటాయి.

కథలో క్లుప్తత లేకపోవటానికి రెండవ కారణం – రచయితకు పాఠకుని సమర్థత మీదా, ఆలోచనాశక్తి మీదా గౌరవం లేకపోవటం. తాను అన్ని విషయాలను గురించీ వివరంగా చెబితే తప్ప పాఠకునికి ఏమీ అర్థం కాదన్న అభిప్రాయం కొంతమంది రచయితల కుంటుంది. వీరు సర్వసాధారణ విషయాలను

కూడా వివరిస్తారు. వీరిలో కొందరు ఛలోక్తుల్ని కూడా పాఠకుల ఊహాశక్తికి వదిలి పెట్టకుండా తామే వివరిస్తారు. ఇలాంటి కథల్లో పాఠకుడికి క్రియాశీలమైన పాత్ర ఉండదు. తాను ఆలోచించి తెలుసుకున్నదీ, తానుగా అనుభవించింది ఏమీ లేకపోవటం చేత అతనిలో ఎలాంటి సంవేదనా కలగదు.

క్లుప్తత లోపించటానికి మరొక కారణం అనవసరమైన సంభాషణలూ, సంఘటనలూ చోటుచేసుకోవటం. కథ విస్తృతమైన వర్ణన మీద కాకుండా సూచన మీద ప్రధానంగా ఆధారపడ్డ సాహిత్య ప్రక్రియ కాబట్టి అనవసర సంభాషణలూ సంఘటనలు కథలో రూపొందవలసిన అనుభూతి తీవ్రతను శిథిలం చేస్తాయి. అనవసర సంభాషణలూ, సంఘటనలూ కథలో చోటు చేసుకోవటాన్ని కొందరు విమర్శకులు "మందకొడి కథనం" అంటారు. వారి అభిప్రాయం ప్రకారం దానికి కారణం కథారచయిత మనసులో కథానిర్మాణం (డిజైన్) స్పష్టంగా లేకపోవటం. ఈ అభిప్రాయాన్ని కథలో నిర్మాణ సౌష్టవాన్ని గురించి చర్చించేటప్పుడు మరింత లోతుగా ఆలోచిద్దాం. సుప్రసిద్ధ కథారచయిత హెచ్.ఇ.బేట్స్ కథ యొక్క క్లుప్తతను వర్ణించటానికి దాన్ని అగ్గిపుల్లలతో కట్టిన ఇంటితో పోల్చాడు. మనం అగ్గిపుల్లలతో ఇల్లు కడుతున్నప్పుడు అవసరమైన వాటి కంటే ఒక అగ్గిపుల్ల ఎక్కువైనా ఇల్లు కూలిపోతుంది. అలాగే అవసరమైన వాటికంటే ఒక్కసంఘటన, వివరం ఎక్కువైనా కథ కూలిపోతుంది. ఆ మాటకొస్తే వర్ణించటం కూడా పాతబడి పోయిన పద్ధతే. సూచనే కథకు ప్రాణం. ఇది వాతావరణం విషయంలోనే కాదు పాత్రల విషయంలోనూ సత్యమే. ఒక పాత్ర వ్యక్తిత్వాన్ని పాఠకుని మనసులో నిలపటానికి ఆ పాత్ర బహిరంతర రూపాలను సంపూర్ణంగా వర్ణించనవసరం లేదు. ఉదాహరణకు షేక్స్పియర్ తన సుప్రసిద్ధ పాత్ర కార్డీలియా ("కింగ్ లియర్") ను ఎక్కడా వర్ణించడు. ఒకే ఒకసారి ఆమె కంఠమార్దవాన్ని గురించి చెప్పి మిగిలిన అన్ని అంశాలూ పాఠకుని ఊహాశక్తికే వదిలి పెడతాడు.

ఉదాహరణకు మధురాంతకం రాజారాం రాసిన ఎన్నో కథలు క్లుప్తత లోపించటం చేత బలహీనంగా తేలిపోయాయి. కథా ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకొని రచయిత వాటిని నిర్దాక్షిణ్యంగా కుదించి ఉంటే అవి ఇప్పుడున్న రూపం కంటే మెరుగైన రూపంలో ఉండేవి. రావిశాస్త్రి వంటి శిల్ప నైపుణ్యం ఉన్న రచయిత కూడా కథాంశం మీద వ్యాఖ్యానం చేయాలన్న చాపల్యం నుంచి కొన్ని కథల్లో తప్పించుకోలేక పోయాడు. దీన్ని మనం అతడు రాసిన ప్రసిద్ధ కథ

"వేతన శర్మ కథ" లో కూడా చూడవచ్చు. మార్కండేయ మహర్షి లేవదీసిన విప్లవం వేతనశర్మలు పొడిచిన వెన్నుపోటుకు చాలా వరకూ గాయపడ్డా మిగతాది అలసట తీర్చుకొని, మరునాడెప్పుడో చిచ్చుగా మారటానికి వీలుగా అడవుల్లో తల దాచుకుందని చెప్పటంతో ఆగివుంటే బావుండేది. ఎందుచేతనో రావిశాస్త్రి, ఉద్యోగివర్గం ఎక్కువ జీతాల కోసం చేసే పోరాటాలను (ఇకనమిజం) గురించి ఒక పేరా రాశాడు. ఆ పేరా కథాంశాన్ని వాచ్యం చేయటమే కాకుండా కథ సాధించిన గొప్ప ముగింపును బలహీనం చేసింది.

రడ్ యార్డ్ కిప్లింగ్ తాను రాసిన కథల్ని కొంతకాలం పాటు అలాగే ఉంచేసేవాడు. కొన్ని సందర్భాల్లో అవి ఏళ్ళకొద్దీ అతని కత్తిరింపులకు గురౌతూ ఉండేవి. అలా కథల నిడివి తగ్గిపోతూ ఉండేది. తన కథలో అనవసరమైన వాక్యం కానీ, సంఘటన కానీ లేదన్న నమ్మకం కుదిరాక మాత్రమే దాన్ని ప్రచురణకు పంపేవాడు కిప్లింగ్. అతడు "భాషలో మార్పులు చేయటం, అనవసరమైన విషయాలను కథలో నుంచి తొలగించటం కథారచనలో ప్రధాన విషయాలు", అన్నాడు.

చెకోవ్‌లో కనిపించే క్లుప్తత బుచ్చిబాబుకు అంతగా నచ్చదు. "చెకోవ్ కథల్లో మొదట, తుది ప్రధానంగా కనబడవు. ఏదో ఒక గాలి బుడగని ఆకాశంలోకి వదిలి చూడమంటాడు. దానికి కట్టిన దారం, దాన్ని పట్టుకున్న కుర్రాడు కనబడరు. ... చెకోవ్ పద్ధతి కథ, ఇసక మీద కెరటం దిగ విడిచిన చారలాంటిది. నాకది తృప్తినివ్వదు. ఆ కథ కెరటంలా కనబడాలి. ఆ కెరటం వెనుక సముద్రం హోరు వినబడాలి," అంటాడు బుచ్చిబాబు. బుచ్చిబాబుకు వర్ణనలు ముఖ్యంగా ప్రకృతి వర్ణనలూ, స్త్రీ వర్ణనలూ – చాలా ఇష్టం. తన భావ కవితాప్రియత్వాన్ని అతడు వర్ణనల్లో బహిర్గతం చేసుకుంటాడు. "అడవి కాచిన వెన్నెల," "నిరంతర త్రయం," "ఎల్లోరాలో ఏకాంత సేవ" మొదలైన అనేక కథల్లో బుచ్చిబాబు భావకవితా ప్రియత్వం స్పష్టంగా కనిపిస్తుంది. కానీ చెకోవ్ పద్ధతి సూచనే కానీ వర్ణనకాదు. అంతేకాకుండా చెకోవ్ కథలన్నిటికీ నిర్మాణం లేదనటం పూర్తిగా పొరపాటు అభిప్రాయం. చక్కని నిర్మాణంతో, ఆది మధ్యాంతాల సమన్వయంతో చెకోవ్ ఎన్నో కథలు రాశాడు. వర్ణనకూ, వ్యాఖ్యానానికి అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా నిగ్రహించుకోవటం చెకోవ్ పద్ధతి. ఎక్కువగా మాట్లాడే రచయిత

అతని దృష్టిలో అతి ఉత్సాహవంతుడైన ప్రేక్షకుని వంటివాడు. ఇతరుల మధ్యకూచొని వాగుతూ తాను నాటకాన్ని చూడడు, ఇతరుల్ని చూడనివ్వడు.

### అనుభూతి ఐక్యత

మంచి కథకు రెండవ లక్షణంగా అనుభూతి ఐక్యతను చెప్పుకోవచ్చు. దీన్ని ఇంగ్లీషులో "యూనిటీ ఆఫ్ ఇంప్రెషన్" అంటారు. 1842 వ సంవత్సరంలో నథానియల్ హాథార్న్ కథల మీద సమీక్ష చేస్తూ ఎడ్గర్ ఆలన్ పో "అనుభూతి ఐక్యత"ను కథకు ఉండవలసిన ప్రధాన లక్షణంగా చెప్పాడు. ఈ సందర్భంలో "అనుభూతి" అన్న పదాన్ని కథ పాఠకునిలో కలుగజేసే భావప్రకంపనగా అర్థం చేసుకోవాలి.

మొదటి వాక్యం నుంచీ చివరి వాక్యం వరకూ కథ, కథాంశం అన్న తీగ మీదనే నడవాలి. కథనంలో ఏకాగ్రత తప్పినా, అలసత్వం చోటు చేసుకున్నా కథకు తీగమీద నడిచేవాడికి పట్టే గతే పడుతుంది. "పులి తరుముకొస్తున్నవాడు తాను ఏక్క దలుచుకున్న చెట్టు దగ్గరికి ఎలా పరుగెడతాడో అలా తన కథకుడు సూటిగా కథాంశం వద్దకు పరుగెత్తాలి", అన్నాడు హెచ్.జి, వెల్స్. కథల్లో అనుభూతి ఐక్యత, క్లుప్తతలాగే రచయిత కష్టపడి సాధించినప్పుడు మాత్రమే కుదురుతుంది. అప్రయత్నంగానో, అకస్మాత్తుగానో కుదరదు. పాఠకుని ప్రతిస్పందననూ, అనుభూతినీ రచయిత "కంట్రోల్" చేయగలిగి ఉండాలి నవలలో అప్పుడప్పుడూ రచయిత పాఠకుని నుంచి ఆశించే ప్రతిస్పందనకూ, పాఠకునిలో రూపొందే ప్రతిస్పందనకూ తేడా ఉండవచ్చు. కానీ కథలో అలా ఉండకూడదు.

అనుభూతి ఐక్యతను సాధించటానికి ప్రధానంగా రెండు మార్గాలున్నాయి. 1. ఒకే సంఘటనకు పరిమితంగా పాత్రను చిత్రించటం. అంటే కథలో ఒకే పాత్ర లేదా ఒకే సంఘటనా ఉండాలని కాదు. కథాంశం ఒకే సంఘటనలో వెలగాలి. అందుకు ఆ పాత్ర దోహదం చేయాలి. ఇతర సంఘటనలూ, పాత్రలూ అప్రధానంగా ఉంటూ; కథాంశాన్ని వెలిగించే సంఘటనకూ, పాత్రకూ దోహదం చేయాలి. 2. రచయిత ఎన్నుకునే ప్రధాన సంఘటన, పాత్రలో గుణాత్మకమైన మార్పుకు కారణభూత మయ్యేదిగా ఉండాలి.

### సంఘర్షణ

మంచి కథకు మూడవలక్షణం సంఘర్షణ. సంఘర్షణ అనేక రకాలుగా

ఉండవచ్చు ఇద్దరు వ్యక్తుల మధ్యా, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్యా, రెండు భావాల మధ్యా, రెండు వర్గాల మధ్యా, రెండు సిద్ధాంతాల మధ్యా, రెండు జీవిత దృక్పథాల మధ్యా – ఇలా ఎన్నిటి మధ్యనైనా ఉండవచ్చు. అంతే కాకుండా ఈ సంఘర్షణ భౌతికంగా కానీ, మానసికంగా కానీ ఉండవచ్చు. ఈ రెంటిలో ఒకటి సులభమనీ, మరొకటి కష్టమనీ చెప్పటానికి వీల్లేదు. రచయిత తన కథలో ఎన్నుకునే సంఘర్షణ అతని అభిరుచిని బట్టీ, జీవితానుభవాన్ని బట్టీ ఉంటుంది. సాధారణీకరణం చేసిన వ్యక్తుల మధ్య సంఘర్షణను పెద్దిభొట్ల సుబ్బరామయ్య, భావాల మధ్య సంఘర్షణను కొడవగంటి కుటుంబరావు, తాత్విక దృక్పథాల మధ్య సంఘర్షణను రావిశాస్త్రి, ప్రతీకలుగా రూపొందించిన పాత్రల మధ్య సంఘర్షణను కాశీపట్నం రామారావు, మనసులోని రెండు భావోద్రేకాల మధ్య సంఘర్షణను బుచ్చిబాబు గొప్పగా చిత్రించ గలిగారు. అలాగే ప్రకృతికీ, మానవునికి మధ్య రాయలసీమలో జరుగుతున్న సంఘర్షణను సింగమనేని, కేతు విశ్వనాథరెడ్డి, చక్రవేణు, స్వామిలాంటి ఎందరో రచయితలు చిత్రిస్తున్నారు. స్త్రీ పురుషుల మధ్య అసమనైతిక ఆర్థిక సూత్రాలు సృష్టించిన సంఘర్షణను ఓల్గా, సత్యవతి చిత్రిస్తున్నారు. మానవుని సాంఘిక, మానసిక జీవితాలు రానురానూ మరింత క్లిష్టంగా, సంఘర్షణా మయంగా తయారౌతున్నాయి. వ్యవస్థకూ, వ్యక్తికి. మధ్యకూడా సంఘర్షణ పెరిగి పోతూ ఉంది. కాబట్టి సంఘర్షణాత్మకమైన కథా వస్తువుల కరువు లేదు, రాదు.

కథలోని సంఘర్షణ రచయిత దృక్పథానికి సంకేతం. మరొక రకంగా చెప్పాలంటే ఎలాంటి సంఘర్షణా లేని కథను రాసిన రచయితకు ఒక నిర్దిష్ట జీవితదృక్పథం లేదని చెప్పవచ్చు. జీవితంలోని ముఖ్యమైన సంఘర్షణల జోలికి పోకుండా జీవితపు పై పై మెరుగుల్ని చిత్రిస్తూ కథలు రాసిన రచయితలు తెలుగులో చాలా మందే ఉన్నారు. ఎలాంటి సంఘర్షణనూ చిత్రించని కథలు కాలక్షేపం కథలు లేదా వ్యాపార కథలు.

ప్రతిరోజూ మన జీవితాల్లో అనేక సంఘర్షణల్ని ఎదుర్కొంటూ ఉంటాం. ఆ సంఘర్షణల్లో చాలాభాగం అల్పమైనవి మాత్రమే వాటిలో ఎన్నిటినో మనం సులభంగా పరిష్కరిస్తూ ఉంటాం. మనం వాయిదా వేసే వాటిలో ఎన్నిటినో కాలమే పరిష్కరిస్తుంది. కానీ మనం ఎదుర్కొనే సమస్యల్లో కొన్నిటి ప్రభావం జీవితాంతం ఉంటుంది. అవి మన ప్రవర్తనలో, జీవిత దృక్పథంలో, మనం గౌరవించే విలువల్లో, మన ఆదర్శాల్లో దాదాపు శాశ్వతమైన మార్పులకు

కారణభూతమౌతాయి. జీవితంలో అలాంటి సంకట పరిస్థితిని సృష్టించే సంఘర్షణలు కథారచనకు పనికొస్తాయి. అలాంటి సంఘర్షణను ఎదుర్కొన్న తరువాత ఆ సంఘర్షణను ఎదుర్కొన్న పాత్రలు మునుపటిలా ఉండవు. కొన్ని మౌలికమైన మార్పులకు లోనౌతాయి.

సంఘర్షణను గురించి ఆలోచించేటప్పుడు దాని పరిష్కారాన్ని గురించి కూడా ఆలోచించాలి. కథలోని సంఘర్షణకు రచయిత పరిష్కారాన్ని చూపించాలా, అక్కరలేదా అన్న చర్చ అన్ని భాషల్లోనూ ఎంతో కాలంగా సాగుతూనే ఉంది తప్పకుండా పరిష్కారాన్ని చూపించాలి అని కానీ, లేదా చూపించకూడదు అనికానీ, వాదించటం మొరటు వాదాలు. పరిష్కారం కథలో నుంచే సహజంగా రూపొందాలి. పరిష్కారాన్ని బలవంతంగా కథ మీద రుద్దటం శిల్పపరంగా బాధ్యతా రాహిత్యం మాత్రమే. అంతే కాకుండా అన్ని కథలకూ పరిష్కారాన్ని చూపించటం సాధ్యం కాదు. రాయలసీమలో వానలు రాకపోవటం చేత ప్రకృతికీ, మానవుడికీ సాగే సంఘర్షణకు పరిష్కారం వాన రావటమే. కాబట్టి కరువును చిత్రించే ప్రతి కథనూ వానలు రావటంతో ముగించటం సాధ్యం కాదు. అలాగే పీడనను చిత్రించే ప్రతి కథనూ పీడకుణ్ణి నిర్మూలించటంతో ముగించటం కూడా సాధ్యం కాదు.

ముగింపు మాత్రమే పరిష్కారం కాదు. ఇందుకు ఉదాహరణగా కా.రా. రాసిన "యజ్ఞం" అన్న సుప్రసిద్ధమైన, వివాదాస్పదమైన కథనే తీసుకొనవచ్చు. తన కొడుకు బానిసబతుకు బతకటం ఇష్టం లేని సీతారాముడు వాణ్ణి ముక్కలుగా నరికేస్తాడు. "యజ్ఞం" కథకు ఇది ముగింపు. ఆ కథలో వర్ణించబడ్డ పరిస్థితుల్లో సీతారాముడు అన్న తండ్రి తనవంశంలో బానిసత్వాన్ని అంతం చేయటం కోసం వంశాన్నే అంతం చేశాడు. ఈ ముగింపును ప్రతీకగా కూడా అర్థం చేసుకోవాలి. బానిసత్వం కంటే చావు మేలని భావించిన ఒక తండ్రి తన బిడ్డను "దయతో" చంపేశాడు. దీన్ని ఇంగ్లీషులో "మెర్సీ కిల్లింగ్" అంటారు. వాస్తవికత పునాదిగా నడిచిన కథ ప్రతీక సూచనతో ముగింపు కాకూడదన్న సిద్ధాంతం ఎక్కడా లేదు. అలాంటి గొప్ప కథలు ప్రపంచ సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. ఈ కథలోని సమస్యకు దాని ముగింపు పరిష్కారం కాదు. అంటే తమ పిల్లల్ని నరికెయ్యటం ఒక్కటే మార్గం అన్న పరిష్కారాన్ని ఈ కథ ప్రతిపాదిస్తున్నదని భావించకూడదు. "యజ్ఞం" మీద వచ్చిన వ్యతిరేక విమర్శలకు ముగింపే పరిష్కారం అన్న పొరపాటు అభిప్రాయం చాలా వరకూ కారణమని నేను భావిస్తున్నాను. పరిష్కారాన్ని గురించిన

ఈ చర్చను సుప్రసిద్ధ రచయిత్రి ఎలిజబెత్ బోవెన్ అభిప్రాయంతో ముగించటం సమంజసంగా ఉంటుందని భావిస్తున్నాను.

"'Many of my stories are questions asked, many end with a swing, a query or to the readers over - to you.'"

**నిర్మాణ సౌష్టవం**

మంచి కథకు ఉండవలసిన నాలుగవ లక్షణం నిర్మాణ సౌష్టవం. దీన్నే కొంతమంది విమర్శకులు "ప్లాట్" (Plot) అనికూడా అంటారు. "కథ"లోని కథకు చక్కని నిర్మాణం తప్పకుండా ఉండాలనీ, నిర్మాణం ద్వారానే కథాంశం పాఠకుని మనసును తాకుతుందనీ చాలామంది విమర్శకులు, రచయితలూ భావిస్తారు.

ఏనాడో అరిస్టాటిల్ చెప్పిన ఆదిమధ్యాంతాల సిద్ధాంతం ఈనాడు కూడా పనికొస్తుందనీ, అది నాటకానికేకాక కథకు కూడా వర్తిస్తుందనీ, సోమర్సెట్ మాం అంటాడు. ఆది మధ్యాంతాలూ, వాటిని నేర్పుగా "అల్లటం" ఎంతవరకూ అవసరం అన్న చర్చ కూడా లేకపోలేదు. అల్లిక పూర్తిగా లేని కథ నీరసంగానూ, అల్లిక ఎక్కువైనకథ కృత్రిమంగానూ తయారయ్యే ప్రమాదం ఉంది. నిర్మాణ సౌష్టవం పేరుతో అనసరమైన మలుపులు, అసహజమైన కొసమెరుపులు కథనంలో ప్రవేశపెట్టటం చాలా చవకబారు శిల్పం. అలాంటి శిల్పం ఉన్న కథలు అపరాధ పరిశోధక కథల్లా ఉంటాయి. అందుచేత పాఠకుని దృష్టి కథనం మీదా, కథనంలోని వైచిత్రి మీదా ఉంటుందే కానీ కథాంశం మీదికి పోదు.

కొందరి కథల్లో, ఆదిమధ్యాంతాలు స్పష్టంగా కనిపిస్తాయి. కొందరి కథల్లో ఆద్యంతాలు మసకమసకగా ఉంటాయి. అలాంటి కథల్లో మధ్యభాగం మాత్రమే ఉన్నట్టు అనిపిస్తుంది. చెకోవ్ రాసిన ఎన్నో కథలు అలా కనిపిస్తాయి. చెకోవ్ కథలకు ఆద్యంతాలు ఉండవనీ, అవి తాబేళ్ళలా ఉంటాయనీ సుప్రసిద్ధ కథా నవలా రచయిత గాల్స్‌వర్దీ అన్నాడు. చెకోవ్ రాసిన కొన్ని కథలు ఒక సంఘటనల వరసను కాకుండా ఒక "స్థితి" ని వర్ణించే మాట నిజమే. ఆ కథల్లో ఆద్యంతాలు కాగితం మీద కనిపించవు. రచయిత మనసులో ఉంటాయి. పాఠకుని ఊహలో రూపుదిద్దుకుంటాయి. కాబట్టి కథనంలో కనిపించనంత మాత్రాన ఆ కథలకు ఆద్యంతాలు లేదని భావించటం పొరపాటే.

ఆద్యంతాల సమస్యను గురించి చెకోవ్ అభిప్రాయాన్ని కూడా తెలుసుకోవటం మంచిది. అతడు తన మామూలు చమత్కార పద్ధతిలో ఇలా అన్నాడు, “కథ రాయటం పూర్తి చేశాక ప్రారంభాన్నీ, ముగింపునూ తీసెయ్యాలి.” కథకు అంతం ఉండాల్సిన అవసరం లేదనటానికీ, రాసిన తరువాత వాటిని తీసెయ్యాలనటానికీ చాలా భేదం ఉంది. రాసిన తరువాత తీసెయ్యాలంటే కథలో వాటిని అదృశ్యంగా ఉంచాలనీ, వాటిని పాఠకుని ఊహాశక్తికి వదిలిపెట్టాలని అర్థం.

ఆది సంగతి ఎలా ఉన్నా, అంతం విషయంలో చాలా మంది రచయితలకు స్థిరమైన అభిప్రాయాలున్నాయి. ఉదాహరణకు సోమర్సెట్ మాం తన కథల్ని అసందిగ్ధంగా ముగించటానికే ఇష్టపడతా నన్నాడు, “నా కథల చివర వరసగా కొన్ని చుక్కలుండవు. ఒకే ఒక చుక్క (ఫుల్ స్టాప్) ఉండటమే నాకు ఇష్టం,” అన్నాడు మాం. “ముగింపులో పాఠకుణ్ణి విస్మయ చకితుణ్ణి చేసే అంశం నెలకొని ఉండటం సాధారణంగా మంచి కథల లక్షణం,” అంటాడు మధురాంతకం రాజారాం తన “కథన రంగం” అన్న వ్యాసంలో. దీన్ని మరో రకంగా “కొసమెరుపు” అనవచ్చు.

కొసమెరుపే కథా నిర్మాణంలోని ప్రధాన సూత్రంగా ఓ. హెన్రీ ఎన్నో కథలు రాశాడు. బహుశా జీవితాంతం ఒకే శిల్పంతో కథలు రాసిన కీర్తి (లేదా అపకీర్తి) అతనికే దక్కుతుంది.

చివరి మలుపు కథల బలానికీ, బలహీనతకూ ఓ. హెన్రీ రాసిన “ది గిఫ్ట్ ఆఫ్ ది మెజై” కథను ఉదాహరణగా తీసుకోవచ్చు. డెలా, జిమ్ పేద యువ దంపతులు. డెలాకు పొడవైన వెంట్రుకలు అలంకారం. జిమ్ కు పెద్దలనుంచి వారసత్వంగా వచ్చిన బంగారం గడియారం ఒకటే ఆస్తి. క్రిస్మస్ పండగ వస్తుంది. భార్యాభర్తలిద్దరూ ఒకరికొకరు మంచి బహుమతి ఇచ్చుకోవాలని ఒకరికి తెలియకుండా మరొకరు నిర్ణయించుకుంటారు. జిమ్ తన బంగారం గడియారాన్ని అమ్మి డెలాకు చక్కని, దంతపు దువ్వెనలు బహుమతిగా తీసుకొని వస్తాడు. కానీ డెలా తన పొడవాటి వెంటుకల్ని అమ్మి జిమ్ బంగారం గడియారానికి తగిన గొలుసును బహుమతిగా తీసుకొని వచ్చి ఉంటుంది. భార్యాభర్తలిద్దరూ “విస్మయ చకితులై” పోతారు కొస మెరుపును చూసి పాఠకుడు కూడా “విస్మయ చకితుడై” పోతాడు. ఈ కథ చివరి వరకూ చదివిస్తుందనటంలో ఎలాంటి సందేహమూ లేదు. కానీ ఈ కథ జీవితాన్ని గురించి చెప్పింది మాత్రం శూన్యం. పేద దంపతుల

అనురాగం ఇందులోని కథాంశం. కానీ పాఠకుని మనస్సు దానిమీద నిలవలేదు. కొసమెరుపు కారణంగా విస్మయ చకితమై పోయింది. ఓ.హెన్రీ దృష్టిలో కథ ఒక పొడుపు కథ ఒక పజిల్. పాత్రల జీవితాలతో చదరంగం ఆడుతున్న రచయిత దృష్టి ఎప్పుడూ .పాఠకుని మీదే ఉంటుంది. చివర పాఠకుడు ఊహించని విధంగా ఒక ఎత్తు వేసి అతణ్ణి విస్మయపరుస్తాడు.

ఇలాంటి కథలు రాయటానికి జీవితం పట్ల ఒక దృక్పథం అవసరం లేదు అలాంటి దృక్పథం రచయితకు ప్రతిబంధకం కూడా. ఓ. హెన్రీ లాంటి రచయిత జీవితం నుంచి ఇతివృత్తాలను శిల్పదృష్టితో మాత్రమే గ్రహిస్తాడు. అంటే తన కొసమెరుపు శిల్పానికి తగిన ఇతివృత్తాలను మాత్రమే గ్రహిస్తాడు. ఓ.హెన్రీ రాసిన అనేక కథలు కొస మెరుపు నిర్మాణం మీద ఆధారపడ్డ జిత్తులు మాత్రమే. బ్రూక్స్, వారన్ అన్న విమర్శకులు ఓ.హెన్రీని తీవ్రంగా విమర్శించారు. అతని కథల్లో నిజాయితీ లోపించిందన్నారు. లోతుగా ఆలోచిస్తే అతని పాత్రలకు చోదకశక్తి, జీవితం పట్ల ఎరుక కానీ, జీవితాన్ని గురించిన ఆలోచన కానీ, తమ భావోద్రేకాలు కానీ ఉండవు. ఓ. హెన్రీ కథలు "విధి వైపరీత్యం" గా తేలిపోతాయి. జీవితాన్ని నడిపించే ఏకైకశక్తి విధి వైపరీత్యం మాత్రమే – అన్న ప్రమాదకరమైన తత్వాన్ని కూడా అతని కథలు ప్రచారం చేశాయి.

మపాసా రాసిన "ది నెక్ లెస్" అన్న కథ కూడా పాఠకుడు ఊహించినట్టుగా కాక మరో విధంగా అంతమౌతుంది. ఈ కథలోని ప్రధానపాత్ర మేడం లోయెసెల్ ఒక చిరుద్యోగి భార్య. ఆవిడకు విలాసవంతమైన జీవితం – ముఖ్యంగా ఖరీదైన నగలూ, బట్టలూ – అంటే చాలా ఇష్టం. భర్త జీతం, అలాంటి జీవితం తాను జీవించటానికి చాలదు; కాబట్టి ఆవిడ ఎప్పుడూ అసంతృప్తితో చిరచిరలాడుతూనే ఉంటుంది. వీరికి ఒక ప్రభుత్వ విందుకు వెళ్ళవలసిన అవసరం కలుగుతుంది. విందుకు వెళ్ళటానికి తనకు నగలు లేవని మేడం లోయెసెల్ చాలా బాధ పడుతుంది చివరికి తనకు పరిచయం ఉన్న ఒక కలిగిన స్త్రీ, వద్ద ఒక రవ్వల నెక్లెస్‌ను అరువు తెచ్చుకొని, విందుకు వెళ్ళుతుంది. దురదృష్టవశాత్తు ఆ నెక్లెస్ విందు హడావిడిలో ఎక్కడో జారిపోతుంది. లోయెసెల్ దంపతులకు ఇది భరించరాని నష్టం. వాళ్ళు చాలా కష్టపడి చాలా పెద్ద మొత్తాన్ని అప్పుగా సంపాదించి, సరిగ్గా అలాంటి నెక్లెస్‌ను చేయించి స్నేహితురాలికి వాపస్ ఇచ్చేస్తారు. భయంవల్ల అసలు విషయాన్ని దాచి పెడతారు. ఆ తరువాత భార్యాభర్తలిద్దరూ

బానిసల్లాగా బండచాకిరీ చేసి ఆ అప్పు తీరుస్తారు. అప్పు తీరిపోయేలోగా లోయె సెల్ దంపతులకు అకాల వృద్ధాప్యం కూడా వచ్చేస్తుంది.

కొంతకాలం తరువాత మేడం లోయె సెల్ తన స్నేహితురాల్ని ఆకస్మికంగా కలుసుకుంటుంది. ఆవిడ మొదట మేడం లోయె సెల్ ను గుర్తుపట్టలేదు. గుర్తుపట్టిన తరువాత "ఏం ఇలా అయిపోయావు?" అని అడుగుతుంది. మేడం లోయెసెల్ "నీ కారణంగానే ఇలా అయిపోయాను", అని నెక్లెస్ విషయం పూర్తిగా చెబుతుంది. ఆవిడ ఆశ్చర్యపోయి "నా నెక్లెస్ పోతే నువ్వు రత్నాల నెక్లెస్ చేయించి ఇచ్చావా నాది అసలు రత్నాల నెక్లెస్ కాదు. అది చాలా చవకబారు నకిలీ రత్నాల నెక్లెస్. ఆ సంగతి నీకు తెలియదా?" అంటుంది. కథ పూర్తవుతుంది.

"ది నెక్లెస్" కథలోని అనూహ్యమైన ముగింపు చాలామంది విమర్శకులకు చిరాకు తెప్పిచ్చింది. ఈలోగా మపాసా కథల్లో మంచి కథల్ని ఎన్నిక చేసి సంపుటంగా ప్రచురించిన రోజర్ కోలెట్ అన్న విమర్శకుడు. "ది నెక్లెస్" ను అందులో చేర్చటానికి నిరాకరించాడు.

ఓ.హెన్రీ కథ "ది గిఫ్ట్ ఆఫ్ ది మెజై" నీ, మపాసా "ది నెక్లెస్"నూ ఒకే గాట కట్టెయ్యటం ఎంత మాత్రమూ న్యాయం కాదు. మపాసాది కొస మెరుపు కథ కాదు. కొస మలుపు కథ. ఈ కథలోని చివరి సంఘటన కథాంశం మీద కొత్త వెలుగును ప్రసరింప చేస్తుంది. కథాంశాన్ని మలుపు తిప్పుతుంది. చివరి సంఘటనతో కథ అంతం కాదు. ఒక రకంగా ఆరంభమౌతుంది. ఓ. హెన్రీ జీవితపు పైపై మెరుగుల్ని మాత్రమే చిత్రించగలిగిన రచయిత మపాసా జీవితంలోని అగాధత్వాన్నీ, మానవ ప్రవర్తనలోని మూలతత్వాన్నీ ఆవిష్కరించ గలిగిన రచయిత.

ఇటీవల (1991) తెలుగులో వచ్చిన మంచి కొస మలుపు కథ వి. చంద్రశేఖరరావు రాసిన "జీవని". ఈ కథ చివర, జీవని "నాకు నాన్న లేరు" అనటం కథాంశమైన మాతృ ప్రేమను మలుపు తిప్పుతుంది. మాతృప్రేమకు బిడ్డ అందచందాలతో తెలివి తేటలతో సంబంధం ఉండదు. తండ్రి సంగతి ఎలా ఉన్నా తల్లి మాత్రం తీవ్రమైన బుద్ధి మాంద్యంతో పుట్టిన బిడ్డను కూడా తన పేగుగానే భావిస్తుంది. బుద్ధి మాంద్యంతో పుట్టిన ఆ అమ్మాయి స్వయంకృషితో, ఇతరుల ప్రోత్సాహంతో చిత్రకారిణిగా రూపొందితే "షి ఈజ్ మై ఫ్రైడ్ ఛైల్డ్" అని తన హిపోక్రసీని ప్రదర్శించుకుంటాడు తండ్రి. కానీ బుద్ధి మాంద్యపు జీవని మాత్రం "నాకు నాన్న లేరు", అంటుంది.

ఇలాంటి కథల్ని పాశ్చాత్య విమర్శకులు "ఎపిఫనీ"లు అంటారు. "ఎపిఫనీ" అన్న మాటను కథా శిల్పానికి అన్వయించిన వాడు జేమ్స్ జాయిస్. కొత్త నిబంధనలో ఏసుక్రీస్తు "సాక్షాత్కారాన్ని" ఎపిఫనీ అన్నారు. కథలో ఒక పాత్రకు జీవితాన్ని గురించిన అలాంటి సాక్షాత్కారం కలిగితే దాన్ని జేమ్స్ జాయిన్ ఎపిఫనీ అన్నాడు. "డబ్లినర్స్" అన్న తన కథాసంపుటంలోని చాలా కథల్ని అతడు ఎపిఫనీలు అన్నాడు. కథలోని పాత్రకే కాకుండా పాఠకునిక్కూడా అలాంటి సాక్షాత్కారం జరిగితే దాన్ని కూడా "ఎపిఫనీ" అనాలని కొందరు విమర్శకులు భావిస్తారు. కథలోని పాత్రకు అలాంటి జీవిత సాక్షాత్కారం జరక్కుండా, పాఠకునికి జరగటం అసాధ్యమని నేను భావిస్తాను.

జీవిత సాక్షాత్కారం రావిశాస్త్రి, పిపీలికానికీ జరిగింది. సింగమనేని నారాయణప్ప ("అడుసు")కు జరిగింది. తాను కేవలం బలవంతుల సుఖం కోసం చాకిరీ చేసే శ్రమ జీవిని మాత్రమే అని అర్థం చేసుకున్న పిపీలికం, దోపిడీని అంతం చేసే దారి పడుతుంది. తాను చేసిన నారింజతోట వ్యవసాయం వృధాశ్రమ, అన్న సాక్షాత్కారం నారాయణప్పకు కలుగుతుంది. అందులో ఎటువంటి పొరపాటూ లేదు. ఆ తరువాత నారాయణప్ప ఆచరణే మనల్ని "షాక్" చేస్తుంది. తన తోటలో పంట పండక పోలేదు. తన పంటకు తగిన ప్రతిఫలం రాకపోవటానికి ప్రకృతి చేసిన ద్రోహం ఏమీలేదు. ద్రోహం దళారీలవల్ల మాత్రమే జరిగింది. ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకోలేని నారాయణప్ప తన నారింజతోటను నరికేసి ప్రకృతి మీద పగ తీర్చుకుంటాడు. చెట్లును నరకటాన్ని నారాయణప్ప నిరాశతో చేశాడనటానికి ఎలాంటి సందేహమూలేదు. నిరాశను జయించే ప్రయత్నం, దానికి సంబంధించిన సంఘర్షణ లేకపోవటమే నారాయణప్ప సాక్షాత్కారాన్ని అర్థం చేసుకున్న విధానంలోని లోపం ఇలాంటి సందర్భాల్లో మాత్రమే పాత్రకు కలిగే ఎపిఫనీకి, పాఠకునికి కలిగే ఎపఫనీకీ లేడా కనిపిస్తుంది. ఈ విధంగా జరగవలసిన దానికీ, జరిగిన దానికి మధ్య ఉన్న అగాధాన్ని చూపించటం మంచి శిల్పం. ఇలాంటి సందర్భాల్లో పాఠకుడు – పాత్ర అవగాహనా లోపాన్ని, అశక్తతనూ చూసి జాలి పడతాడు.

# ఆధునిక సాహిత్య విమర్శ

**–కొలకలూరి ఇనాక్**

ఆధునిక సాహిత్య విమర్శ, ప్రాచీన సాహిత్య విమర్శకంటే భిన్నంగా ఉంటుంది. క్రీ. శ. 1806 కంటే పూర్వం తెలుగులో వెలువడ్డది ప్రాచీన సాహిత్యం. 1857 తర్వాత వెలువడుతూ ఉన్నది ఆధునిక సాహిత్యం. ఈ మధ్యకాలంలో గొప్ప సాహిత్యంగా పేర్కొనదగ్గది మృగ్యం. దాన్ని అటూ ఇటూ కలుపుకొంటూ చూడవచ్చు. 1806 నుంచి తెలుగులో ముద్రణ ఆరంభమయింది. సంఘంలో నూత్న దృక్కోణం ఉషోదయంగా వెలుగులు వెలసింది. 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం మొదలయింది. ఈ సంవత్సరం నుంచి సాహిత్యంలో నూత్న దృష్టి స్పష్టమయింది. రాజును, పాలకుణ్ణి దేవుడనుకొనే దేశంలో– కొత్తగా మనిషి అనుకోవటం మొదలయింది. మనిషికి ఉండే మంచి చెడ్డలు రాజుకు, చక్రవర్తికి, పాలకుడికి, బ్రిటిషు రాజరికానికి ఉంటాయని భారతీయులు గుర్తించారు. నాటినుంచి వెలుగు చూచిన తెలుగు సాహిత్యంలో ఆధునికత ఆరంభమయింది. ఆధునికత సర్వాంగ సుందరంగా ఒకే కాలంలో సంపూర్ణంగా వికాసం చెందలేదు. క్రమక్రమంగా సంఘంలో మార్పు వస్తున్న కొద్దీ సాహిత్యంలో మార్పు రాసాగింది. ఇంకా ఈ మార్పు సంఘంలోనూ, సాహిత్యంలోనూ వస్తూనే ఉంది.

ఈ నూత్న సాహిత్యం పరిశీలించటానికి అవసరమయిన విమర్శ సూత్రం అన్వేషించటమే ఈ ప్రయత్నంలో ఉద్దిష్టం. ప్రాచీన సాహిత్యం పరిశీలించటానికి కొంత ఆలంకారిక సంప్రదాయం సంసిద్ధమయి ఉంది. అది సంపూర్ణంగా ఆధునిక సాహిత్యానికి వర్తించదు. వర్తింపచేస్తే ఇది సాహిత్యం కాకుండా పోయే ప్రమాదం ఉంది. సాహిత్యం కలిగించే చిత్తవికాసం, చిత్త వికారం, ఆత్మవికసనం, ఇదీ కలిగిస్తున్నప్పుడు, దీని దర్శనానికి నూత్న దృక్పథం అవసరం. అందువల్ల ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం సిద్ధింప వలసి ఉంది.

నేడు వెలువడుతున్న సాహిత్యం ప్రధానంగా రెండు మార్గాలలో ఉంది. ఒక మార్గం ప్రాచీన-సంప్రదాయ-నవ్య సంప్రదాయ క్రమంలో ఉంది. మరో మార్గం సంస్కరణ-పునరుజ్జీవన-భావ-అభ్యుదయ-దిగంబర-విప్లవ-స్త్రీవాద - దళిత సాహిత్య వికాసంలో ఉంది. ప్రాచీన సాహిత్యం 1806 కు పూర్వం తెలుగులో రాజాశ్రయంలోనూ, తదన్యంగానూ వెలుగు చూచింది. ఆ ప్రాచీన సాహిత్య మార్గంలో అంతా అదే పద్ధతిలో నేడు వెలువడుతున్నది సంప్రదాయ సాహిత్యం. దాన్ని వస్తువు, రచన, భాష, విషయం పరిమితంగా మార్పుచేసి సృష్టించేది నవ్యసంప్రదాయ సాహిత్యం. ఈ సాహిత్య దర్శనానికి సంసిద్ధంగా ఉన్న ఆలంకారిక సంప్రదాయం కొంత పనికి వస్తుంది. అయితే ఆధునిక సాహిత్య పరిశీలనకు ఈ సంప్రదాయం అంతగా పనికిరాదు కాబట్టి నూత్న దర్శన మార్గం అవసరం. సమకాలీన సాహిత్యమనీ, వర్తమాన సాహిత్యమనీ 1857నుంచి వస్తున్న సాహిత్యాన్ని ఈ రెండు విధాల సాహిత్యాన్ని పిలవటం అలవాటు అయింది కానీ, ఆధునిక సాహిత్యమని సంభావించే దానిలో సంప్రదాయ, నవ్యసంప్రదాయ సాహిత్యం చేరదు. ఎందుకంటే వాటిలో ఆధునికత ఉండదు కాబట్టి, ఆధునిక సాహిత్యంలోనే విమర్శ సూత్ర దర్శనానికి ఈ ప్రయత్న ముద్దిష్టం కాబట్టి, ఆ సాహిత్యమార్గం ఇందులో చోటు చేసుకోదు. ఆధునికత అన్నది గుణంగా, లక్షణంగా, కొత్త విలువల సమాహారంగా ఉంది కాబట్టి, అది ఉన్న సాహిత్యం ఆధునిక సాహిత్యం. దాని, విమర్శనం ఆధునిక సాహిత్య విమర్శనం.

### 1.1 విమర్శనం:

ఆధునిక సాహిత్య విమర్శ అంటే అర్థం కావలసి వస్తుంది. తెలుగులో విమర్శ ప్రారంభమయి ఇప్పటికి అటూ ఇటూ నూరేళ్ళు. ప్రాచీన సాహిత్యం కూడా నేటి విమర్శ దృష్టితో పరికించటం సామాన్య మయింది. నిజానికి దాన్ని ఆలంకారిక సంప్రదాయంలో అనుశీలించటం సముచితం. కొంత నేటి విమర్శను దానికి అనువర్తింప చేసినా, దాని ఆత్మావిష్కరణం ఆలంకారిక దృక్పథంలోనే ఉంది. ఇది ప్రాచీన సాహిత్య విమర్శ కంటె భిన్నమయిన విమర్శవిధానం. కొంత నూత్న విమర్శ సూత్రం ప్రాచీన సాహిత్యానికి అన్వయించినట్లే, కొంత ఆలంకారిక సంప్రదాయం ఆధునిక సాహిత్య విమర్శకు దోహదం చేయవచ్చు. కానీ,

సంపూర్ణంగా సమన్వయించదు. అందువల్ల ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం అందుబాటులోకి రావాలి.

### 1.2 ఆధునికత

ఆధునిక సాహిత్యంలోనూ, విమర్శనంలోనూ స్పష్టం కావలసిన పదం ఆధునికత. ఆధునికత అంటే విజ్ఞులకు తెలిసినా, విద్యార్థులకు తెలియాలి. అది అంతా అర్థమయిన పదం లాగానే ఉంటుంది. కానీ దీని అస్పష్టతకు కారణం దీన్ని అనేకార్థాలలో ప్రయోగించటం. అర్థ వ్యాప్తితోపాటు, అవ్యాప్తితో ప్రయోగించడంవల్ల అస్పష్టత ఏర్పడింది. ఈ పదం, దీని అర్థం అన్ని కోణాలనుంచి స్పష్టం కావాలి.

### 1.3 ఆధునిక – కాలవాచి

ఆధునిక సాహిత్యం 1857 నుంచి ఆవిర్భవిస్తూ ఉందనటంవల్ల ఈ కాలంలో వచ్చేదాన్ని. ఆధునికం అనవచ్చునని భావం కలుగుతుంది. ప్రాచీన కాలానికి, మధ్యకాలం ఆధునికం. మధ్యకాలానికి వర్తమానం ఆధునికం. నేటికి రేపు ఆధునికం. చిన్నయసూరి దృష్టిలో ఆముక్త మాల్యద ఆధునిక ప్రబంధం.. పెద్దన కంటే కందుకూరి, కందుకూరికి గురజాడ, గురజాడకు శ్రీశ్రీ ఆధునికులు, ఒక దాని తర్వాతి సాహిత్యం, ఒకడి తర్వాతి కవి అనే దృష్టితో ఆధునిక శబ్ద ప్రయుక్తం అవుతూ ఉంది. కాలవాచిగా పేర్కొంటే ఆధునికత పూర్తిగా అర్థం కాదు.

### 1.4 ఆధునికత నూత్నత్వం

ఆధునికతను నూత్నత్వంగా మాత్రమే అర్థం చేసుకొనే ప్రయత్నం జరిగింది, సాహిత్య నిర్మాణ క్రమంలో ఎక్కడ నూత్న లక్షణం, కోణం, దృక్పథం గోచరమయ్యాయో, అక్కడ అధునికత ఉందనుకోవటం పరిపాటి అయిపోయింది. ఈ నూత్నత శబ్దాలను వాడటంలోనో, శబ్ద చిత్రాలను కల్పించటంలోనో, అలంకార ప్రయోగంలోనో ఛందస్సు ప్రదర్శించటంలోనో, ఆధునికత ఉండవచ్చునని, అనేక రచనాంశాలు అనుశీలించారు. ఏ మాత్రం రచనా పరిణామం సాధించినా, ఆ కవి ఆధునికుడయ్యాడు. ఈ దృష్టితోనే నన్నయ్య ఆధునికుడయ్యాడు. శివకవులు ఆధునికు లయ్యారు నవీనగుణ సనాథుడైన నాచన సోమనాథుడూ ఆధునికు డయ్యాడు. ఆ దృష్టితో ప్రాచీన కవులలో ఏదో విధంగా ఆధునికుడు కాని కవే

ఉండదు. ఆధునికం కాని కావ్యమే ఉండదు. కాస్త కొత్తదనం సాధిస్తే చాలు, ఆ కవి ఆధునికుడు, ఆ కావ్యం ఆధునికం. ఈ పద్ధతిలో సాగిన ఆలోచనలవల్ల ఆధునికత అర్థం కాదు.

మార్గ ఛందస్సు కాదని దేశి ఛందస్సు ప్రయోగించటం ఆధునికం. వైష్ణవం కాదని శైవం వ్రాయటం ఆధునికం. గురజాడకంటే కృష్ణశాస్త్రే ఆధునికుడనటమూ ఉంది. వస్తు సంబంధి దృష్టిని ఖండించేది, భావ సంబంధి దృక్పథం వివరించేది, ఆధునికమని అనటమూ ఉంది. అలతి మార్పు వచ్చినంత మాత్రాన, అల్ప నూత్నత్వం ప్రవేశించినంత మాత్రాన, దాన్ని ఆధునికత అనటం ప్రారంభిస్తే అది అర్థంకాకపోగా, అయోమయమవుతుంది.

### 1.5 ఆధునికత - ప్రక్రియ

పురాణేతిహాస ప్రబంధాలలో సృష్టించిన సాహిత్యం ప్రాచీనమనీ; నవలా కథానికా విమర్శనాది ప్రక్రియలూ, సంప్రదాయ, నవ్యసంప్రదాయ, భావ, అభ్యుదయాది కవిత్వాలూ ఆధునికమనీ అంటే ఆధునికత అర్థంకాదు. ఆధునికత నేటి నూత్న ప్రక్రియా గతంగా ఉండటం వల్ల ప్రక్రియలే ఆధునికతా ద్యోతకాలు అనుకోవటం సహేతుకం కాదు తెలుగుమీద ఆంగ్ల ప్రభావం ఉంది; దేశంమీద, జీవితంమీద పాశ్చాత్య ప్రభావం ఉంది. ఈ ప్రభావాలవల్ల నూత్న తాత్త్విక ధోరణులు ప్రారంభ మయ్యాయి; నూత్న రచనా రీతులు మొదలయ్యాయి; వాస్తవికత, అధివాస్తవికత, అస్తిత్వవాదం, క్లాసిసిజం, నియో క్లాసిసిజం మొదలైన అనేక వాదాలు తెలుగులో ప్రారంభమయ్యాయి; కాబట్టి ఆధునికత అంటే పాశ్చాత్య ప్రభావం మాత్రమే అనుకోవటం సహజమయిపోయింది. ఆధునికత అంటే అంత మాత్రమే అనుకొంటే అది అస్పష్టమయ్యే ప్రమాదం ఉంది.

### 1.6 ఆధునికత-సాంఘిక పరిణామం

సాహిత్యంలో ఒక సంస్కారం మారి, మరో సంస్కారం చేరిపోతే, దాన్ని ఆధునికత అనుకోవచ్చునన్నారు కొందరు. ఆధునికత్వం కాలాన్నీ, సాహిత్య రీతుల్ని అనుసరించి ఉండదని గుర్తించారు వీళ్ళు. ప్రాచీన సంస్కారానికి, నూత్న సంసారానికి కలిగే సంఘర్షణలో నిగ్గుతేలే స్వభావం ఆధునికత్వం అని భావించారు. ఇది కొంత మేలు. సంస్కారం అనేది వ్యక్తిపరంగాకంటే వ్యవస్థ పరంగా ఉన్నప్పుడు సంభవించే సంఘర్షణ సంఘ పరిధికి చెందుతుంది. కాబట్టి వ్యవస్థను

గూర్చి చేసిన ఆలోచన కొంత మేలేకానీ, ప్రాచీన నూత్న సంస్కారాల సంఘర్షణల్లో నిగ్గు తేలటమంటే కొరత అస్పష్టత ఉంది. సంఘం పరిణామశీలం కలది అనీ, తాత గతించి మనమడు పుడతాడనీ, గతం చ్యుతమవుతూ వర్తమానం ఆవిర్భవిస్తుందని. గుర్తుంచుకొంటే గత సంస్కారం శిథిలమవుతుందని, దానిమీద నూత్న సంస్కారం ప్రభవిస్తుందని స్పష్టమయి తీరుతుంది రెండు సంస్కారాలు సంఘర్షించటం ఉండదు. నూత్నత ఆవిర్భవిస్తున్నప్పుడు గతం భరించలేక పోతుంది. గింజుకోంటుంది. గొంతు చించుకొంటుంది. సంఘర్షణ దానిలో దానికే ఉంటుంది. అది తిరోగమన సంఘర్షణ. గతంలో నూత్నతకు జరిగే సంఘర్షణలో నూతనతది పురోగమనం. దీనికి తిరోగమనం ఉండదు. అది పురోగమించదు అందువల్ల రెండు సంస్కారాల సంఘర్షణలో పురోగమించేది నూత్నతమాత్రమే. ఎందుకంటే గత సంస్కారంలోని చ్యుతార్య ధర్మం కారణంగా నూత్నత అంకురించి, ఆవిర్భవించి, స్వరూపస్వభావాలు ఏర్పరచుకొనేటప్పటికి అది పురోగామే కాని, తిరోగామి కాదు. అందువల్ల ఆధునికత అంటే వ్యవస్థకు, సంఘానికి సంబంధించిన సజీవ చలన సూత్రంగా గుర్తిస్తే అది అర్థమయ్యే అవగాహన చేరువ అవుతుంది.

### 1.7 ఆధునికత సమన్వయం

ఆధునికత నిజానికి వర్తమాన విషయమే. అది ఒక విధంగా కాలవాచి అనటంలో ఇబ్బంది ఉండనక్కరలేదు. ఆధునికతలో నూత్నసత్వానికి చోటుకూడా ఉంది. ఆధునికత అంటే పూర్వం లేనిది, నేడున్నది కాబట్టి, ఇది నూత్నంకూడా అవుతుంది. ఆధునికతావిర్భావానికి పాశ్చాత్య ప్రభావంకూడా దోహదం చేసింది. ఆంగ్ల విద్యతో ప్రపంచం పరిచయమయి ఉండకపోతే అప్పటికే ఆధునికత వచ్చి ఉండేది కాదు. నూత్న ప్రక్రియలు ఆధునిక తకు వాహికలు కావటం కూడా వాస్తవమే. ఆధునికత శిథిలమయిన గతం నుంచి వర్తమానంలోకి ఉబికి వచ్చిన చైతన్యమన్న మాట కూడా నిజమే! ఏ ప్రత్యేకరంగం నుంచో పరికిస్తే, అస్పష్టంగా ఉన్న ఆధునికత, అర్థమయినప్పుడు ఆయా రంగాలు దాని అస్తిత్వాన్ని సుస్పష్టం చేసి విశాలతమం కావిస్తాయి. ఆధునికత అవగాహనకు సంబంధించింది. ఆలోచనకు చెందింది. అది దృష్టి వైశాల్యం వివరించేది. అది అంతా బైటినుంచే రాలేదు. అస్తిత్వం కలిగి ఉన్నదే అభివ్యక్తి కలిగించుకొంది. అవ్యక్త సత్యం అవగాహన వల్ల స్పష్టమయింది. ప్రథమ భారతీయ స్వాతంత్ర్య సంగ్రామ వీరులకు

రాజు దేవుడు కాడన్న వాస్తవం ఆ విధంగానే అభివ్యక్తమయింది. ఈ దృష్టి దేశంలో లేకపోలేదు. అంతా ఆంగ్ల విద్యవల్ల వెలుపలినుంచి రాలేదు. అవ్యక్త దేశ దృష్టి, అనేక బాహిర ప్రభావాలతో అభివ్యక్తమయింది. ఈ దృష్టి ఇన్ని భిన్న దశలలో కనిపించినప్పుడు ఏ ప్రత్యేక విధానమో ఆధునికం అనిపించే భ్రమ ప్రమాదాలకు కారణమయింది. ఆధునికత సంఘంలో వచ్చిన పరిణామాల సమాహార రూపం. ఇది సమూలంగా వచ్చిన పరిణామం ఈ పరిణామసంఘం పొందిన గుణం ఆధునికత.

### 1.8 ఆధునికత – మౌలికాత్మ

పుట్టిన ప్రాణి మరణించటం పరిణామంలో సహజం. జంతుకోటిలో మనిషి శక్తి ఆలోచన, దాని – అభివ్యక్తి. ఆలోచన పార్శ్వం అనుభూతి. అనుభూతి సుఖదం, భయదం కూడా. భయం నుంచి పరాధీనత పుడుతుంది. పరాధీనత లక్షణం భక్తి. భక్తికి మూలం భగవంతుడు. భగవంతుడు నామరూపరహిత భావం. భయంలో విశ్వం విలవిల్లాడినప్పుడు పుట్టిన వ్యవస్థ భగవంతుడు. వేల, లక్షల, కోట్ల పేర్లు, ఆకారాలు, అవతారాలు భయంనుంచే పుట్టాయి. భారతీయ సంప్రదాయంలోనే ముక్కోటి దేవుళ్ళున్నారు. ప్రతి సమాజానికి ఈ దైవ వ్యవస్థ భయం ప్రతిబింబంగా అవతరించింది. ఏ భాషలో అయినా జిజ్ఞాసువు మరణాన్ని, భగవంతుణ్ణి, మరణానంతర జీవితాన్ని గూర్చి ఆలోచించటం నుంచి కళలు పుట్టాయి. సాహిత్యం కళారూపమే! సాహిత్యంలో అస్తిత్వం ఉన్న దేవుడు మనిషి భయంలో జీవిస్తున్నాడు. మనిషి భయానికి ప్రతీక దేవుడు. విశ్వకళలు మాదిరిగానే సాహిత్యం కూడా త్రిసహస్రాబ్దాలు భగవంతుడి చుట్టూ తిరిగింది. భారతీయ సాహిత్యం దీనికి అపవాదం కాదు. క్రీస్తు పూర్వం సహస్రాబ్దానికి పూర్వంనుంచి పుడుతూ వచ్చిన వేదవాఙ్మయం దైవం చుట్టూ తిరుగుతూ ఉంది.

ప్రజా బాహుళ్యానికి ఐహిక భయం సహజం. జీవించటమే ఒక భయం. జర రుజాది భయాలకు హద్దులులేవు. ఐహిక భయం లేనివాడికి కూడా ఆముష్మిక భయం ఉంటుంది. ఐహిక భయం ఉన్న వాడికి దైహిక దైనందిన భయాలుంటాయి. వాడికి ఆకలికంటే అత్మీయావసరం ఉండకపోవచ్చు. భౌతికావసరాలు బానిస సమాజాలలో యజమాని తీరుస్తాడు. యజమాని రాజుకావచ్చు, చక్రవర్తి కావచ్చు. దేవుడి రూపం పొందిన మానవ మాత్రుడు యజమాని స్థానం ఆక్రమిస్తాడు.

ఆముష్మిక భయం ఉన్న వాడు మరణానంతరం తన ఆత్మ శరీరాలనుగూర్చి తపనపడతాడు. తన తదనంతరం తన సంతానం గూర్చి సజీవంగా సమాధి అవుతాడు. ఆముష్మికభయం ఉన్నవాడు భగవంతుణ్ణి, ఐహికభయం ఉన్నవాడు పృథివీపతిని పూజిస్తారు. ఆరాధిస్తారు. వీళ్ళను కళామూర్తులను కావిస్తారు. సాహిత్యంలో వీళ్ళను నాయకుల్ని, సర్వశక్తి సంపన్నుల్ని, సర్వ అవసరాలు తీర్చేవాళ్ళను, సర్వసద్గుణుల్ని చేసి ధ్యానిస్తారు. అవతారాలుగా దర్శిస్తారు. ఐహికం, ఆముష్మికం అయిన భయాలను జయించినవాళ్ళు ప్రతి నాగరక సమాజంలో చెదురుమదురుగా ఉండవచ్చు. వాళ్ళు భౌతికవాదం ప్రచారం చేయవచ్చు. కాని, వాళ్ళకు ఆదరణ ఉండదు. భూమి గుండ్రంగా ఉందని నమ్మని సమాజంలో వాస్తవం చెప్పినవాడు మరణశిక్ష పొందినట్లే, ఈ విజ్ఞులు అజ్ఞులుగానే సమాజగతిలో అంతరించిపోతారు. ఎక్కడయినా కాలగమనానికి ఎదురొడ్డి నిలబడ్డా, చారిత్రకంగానే మిగిలి ఉంటారు కానీ, సామాజికంగా ఏమీ సాధించినట్లు ఋజువు ఉండదు.

అందువల్ల దేవుళ్ళు శాశ్వతంగా, మిగులుతారు దేవుడి సంతానం అవతారాలు ప్రసిద్ధంగా కనిపించవచ్చు. దైవ ప్రతినిధి, పూజారి, మహర్షులు ప్రాముఖ్యం సంతరించుకొంటారు. దేవుడు కానివాడు రాజు కాదని ప్రఖ్యాతి వస్తుంది. రాజులు, రాజవంశాలు, సామంతులు, వీళ్ళు, వీళ్ళ జీవితాలు ప్రతాపాలు, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, దుష్టులని శిష్టులను శిక్షించటం, శిష్టులని దుష్టులను రక్షించటం సామాన్యమవుతాయి. వీళ్ళ యుద్ధాలు, ప్రయత్నాలు, కుట్రలు, కుయుక్తులు, సాహసాలు, సంరక్షణలు, ప్రేమలు, వియోగాలు, సంయోగాలు ప్రమేయంగా విశ్వసాహిత్యం అవతరించింది. అధికారం చెలాయించింది. ఏ దేశ సృష్టి, చరిత్ర, సాహిత్యం చూచినా ఈ స్థితే గోచరమవుతూ ఉంది.

ప్రపంచవ్యాప్తంగా మనిషి, వైయక్తికంగా కాదు, సామూహికంగా, భయం జయించటం మొదలై త్రిశతాబ్దాలు గుర్తింపవచ్చు. వైయక్తికంగా భయాన్ని జయించిన మనుష్యులు, మహర్షులు, ప్రవక్తలు పూర్వంఉండవచ్చు. ఈమధ్య సామూహిక మానవుడు విశేషరూపం పొందాడు. విరాడ్రూపం సంతరించుకొన్నాడు. దేవుళ్లూ దైవసంప్రదాయాలూ విభిన్న కారణాలవల్ల ప్రశ్నింపబడటం అన్నిచోట్లా ఆరంభమయింది. సంఘంలో ప్రారంభమయిన ప్రత్యంశం సాహిత్యంలో

సమకూరటం ప్రపంచవ్యాప్తంగా నేటి పరిణామం. మూడు వందలలేళ్ళ పూర్వం ప్రారంభమయి, ఈ మధ్యదాకా కొనసాగిన ప్రజాచైతన్యంవల్ల రాజరికాలు ప్రపంచ వ్యాప్తంగా నేలమట్టమయ్యాయి. విప్లవాలు ఒకదాని తరువాత ఒకటి ప్రారంభమయ్యాయి. ఒక దాని ప్రభావం మరో దానిమీద కనిపిస్తుంది. తీవ్రంగా దైవ సంప్రదాయం ఆందోళనకు గురి అయింది. రాజసంప్రదాయం కోటలు బీటలు వారాయి. నివాసయోగ్యం కాకుండాపోయాయి. ప్రయోగ పరంపరకు ఏ వ్యవస్థా నిలవ నీడలేకుండా అయింది. మార్పు తలెత్తింది. ప్రపంచం పరిణామ భ్రమణంలో పడింది. ఈ మార్పులన్నింటికీ మనిషి మూలం. ఈ మనిషి మునుపటివాడుకాడు. భయాన్ని సామూహికంగా జయించినవాడు. విప్లవాలు సృష్టించాడు. యుద్ధాలు చేశాడు. అన్నింటా జయం పొందాడు. విజయుడయ్యాడు.

ఇప్పుడు మనిషి ఏకవచనంకాదు. బహువచనం. సమూహవచనం వీడు ఒక దేశం మనిషి కాడు. ప్రపంచ దేశాల మనిషి. ఈ మనిషి మానవకోటి ప్రతినిధి. వీడిలోనే అవ్యక్తంగా రాజుల్ని దేవుళ్ళను ధిక్కరించిన మేధావులు తాత్వికులు, సన్యాసులు, భవబంధ విముక్తులు, సర్వసంగపరిత్యాగులు, మహర్షులు వైయక్తికంగా ఉండవచ్చు. మనిషి సమష్టిగా భయరహితుడు కావడం వర్తమానం. ఇదే ప్రస్తుతం ఈ మనిషి ప్రాణికోటి సమష్టి రూపం.

దైవవ్యవస్థ ప్రశ్నింపబడ్డా, దాన్ని వదల్లేని దేశాలు, ప్రాంతాలు, ప్రజలు లేకపోలేదు. రాజరికాలు ప్రపంచవ్యాప్తంగా కూలిపోయినా, తూలుతూ నిలబడ్డ దేశాలు, ప్రాంతాలు, ప్రజలు లేకుండా పోలేదు. రాజరికం వ్యవస్థగా అంతరిస్తూ ఉన్నట్లు, దైవవ్యవస్థ ఈ స్థితికి చేరుకొంటున్నట్లు, వర్తమాన సమాజ జీవితాలు ఋజువు చేస్తున్నాయి. విజయుడైన మానవుడు భయం జయిస్తాడని భయరహితుడు భయసహిత వ్యవస్థలు తిరస్కరిస్తాడని ఎవరైనా స్థూలంగా భావింపవచ్చు. రాజరికం, దైవవ్యవస్థలు నిలుపుకోవటానికి వాటివల్ల ప్రయోజనం ఉన్నవాళ్ళు. బ్రతుకుదెరువు ఉన్న వాళ్ళు ప్రయత్నించటం సహజం. ఇక్కడ సంఘర్షణ అనివార్యం, భయరహితుడి విజయం, భయసహితుల పరాజయం నిర్దిష్ట ఫలితాలు.

మనిషి తన ఉనికికి అర్థం తెలుసుకొంటే శాస్త్రీయ దృక్పథం పెరిగితే, హేతుయుత జీవితం స్పష్టమయితే, శాస్త్రదృష్టి విశాలమయితే, డార్విన్ సిద్ధాతం తెలిసిపోతే, దైవవ్యవస్థ అనవసరత అర్థమైతీరుతుంది. ఆజన్మ విశ్వాసాలు అంత

తొందరగా అంతరించవు. కానీ ఆలోచనాపరులు మనుష్యులు పెరుగుతున్నప్పుడు శాస్త్రీయదృష్టి ఏర్పడి, అంధవిశ్వాసాలు, మౌఢ్యాలు, గుడ్డినమ్మకాలు అంతరించిపోవటం తేలికగానే జరుగుతుంది. దేవుణ్ణి సర్వులనూ పోషించేవాడుగా చిత్రించటం గుర్తించదగ్గ విషయం. పేదరికం ఉన్నంతకాలం పోషకుడి అవసరం ఉంటుంది. సోమరితనం ఉన్నంతకాలం పేదరికం ఉంటుంది. వర్ణవ్యవస్థ ఉన్నంత కాలం సోమరితనం ఉంటుంది. అజ్ఞానులున్నంత కాలం వర్ణవ్యవస్థ ఉంటుంది. శ్రమ విభజన జనవిభజనగా ఉంటుంది. అన్ని పనులు అందరూ చేసే వీలు లేకపోతుంది. పని లేనివాళ్ళుగానో, అంతగా పనిలేని వాళ్ళుగానో ఉన్న జనం ఉంటారు. పని చేయరు. ఉత్పత్తి ఉండదు. ఆకలి తీరదు. దోపిడి ఉంటుంది. పీడితులూ పీడకులూ ఉంటారు. వర్ణ వ్యవస్థ ఇక్కడ దోపిడికి గుర్తు, పీడనకు ప్రతీక, నిస్తేజానికి నిదర్శనం. వర్ణవ్యవస్థ ,అందువల్ల, దేవుణ్ణి దైవవ్యవస్థను కాపాడాలని కంకణం కట్టుకొంటుంది. కంకణం బద్ధలవుతుంది. సంకెళ్ళు సిద్ధమవుతాయి. కారాగారం ఎదురవుతుంది. వర్ణ వ్యవస్థ బంధితమవుతుంది. అది నిరాహారదీక్షతో నీరసించి, కృశించి నశించి పోతుంది. అప్పుడు సోమరితనం రూపుమాస్తుంది. ఉత్పత్తి పెరుగుతుంది. ఆకలి నశిస్తుంది. పోషకుడి అవసరం ఉండదు. దైవ వ్యవస్థ తెరమరుగవుతుంది. ఆపైన అంతరించిపోతుంది.

ప్రపంచ వ్యాప్తంగా రెండు విధాల సాహిత్యం అవతరిస్తూనే ఉంది. ఒక దానిది ప్రాచీన మార్గం. దానికి దేవుడు, రాజు ఉంటారు. ఈ సాహిత్య స్రష్టలు నాటి సంప్రదాయం కాపాడుకొనే ప్రయత్నం చేస్తారు. ప్రాచీనతను ప్రతిష్ఠించు కొనే కృషిచేస్తారు. ఈ ప్రాచీన సాహిత్య దృక్పథమే నేడు సంప్రదాయ సాహిత్యంగా నవ్యసంప్రదాయ సాహిత్యంగా మిణుకు మిణుకుమంటూ ఉంటాయి. ఇది అంతరించే సాహిత్య సంకేతం.

రెండో దానిది ఆధునిక మార్గం. దేవుడు రాజు ఉండరు. ఉంటే నామ మాత్రం. ప్రధానం కాదు. మనిషి ప్రధానం. మనిషి నియమాలు ప్రధానం. ఈ సాహిత్యంలో మనిషి పోరాటాలు, వాటి విజయాలు ఉంటాయి. హేతువు ప్రధాన మవుతుంది. శాస్త్ర సత్యం గోచరమవుతుంది. శాస్త్రీయ దృక్పథం నిక్షిప్తమవుతుంది. చారిత్రక అవగాహన ప్రత్యక్షమవుతుంది. భౌతిక సత్యాలు ప్రకటితం అవుతాయి. భౌతిక దృక్పథం పెరుగుతుంది. విజ్ఞానశాస్త్ర విజయాలు వివృతమవుతాయి. ఈ

మనిషి భయానికి, భ్రాంతికి, శ్రమ ప్రమాదాలకు బానిసకాడు. ప్రయోగశీలి, ప్రయోగ పరంపరనుంచి భౌతిక జీవన సూత్రం విశ్లేషిస్తాడు. ఈ దశలో మనిషి శక్తి మానవశ్రమ, మేధస్సు – అన్ని రంగాలలో అన్ని స్థితుల్లో వ్యాప్తి చెందుతుంది. మానవ వ్యక్తిత్వ వికాసం విశ్వవిస్తృత మవుతుంది. ఈ స్థితిలో మానవుడి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం ద్విగుణీకృతం, త్రిగుణీకృతం అవుతాయి. ఈ స్థితిని సాహిత్యం సృష్టిస్తుంది. ఈ సాహిత్యం విశ్వవ్యాప్తంగా వెలువడుతుంది. ఈ సాహిత్యం ఎక్కడ ప్రభవించినా అది ఆధునిక సాహిత్యం. ఈ స్థితిగతులు అభివ్యక్తమయిన సాహిత్యంలో గోచరమయ్యేది ఆధునికత. మత సాహిత్యం ఆధునిక సాహిత్యం కాదు. రాజరికపు సాహిత్యం ఆధునిక సాహిత్యం కాదు. మతగతమైన మానవుడు పరాధీనుడు, పరతంత్రుడు. పారతంత్ర్యంవల్ల మనిషి బానిస. భయం వాడి బంధువు. మతాతీత మానవుడు విముక్త మానవుడు, స్వేచ్ఛాజీవి. స్వతంత్రుడు. వాడు ఆధునికుడు. వాడి సాహిత్యం ఆధునిక సాహిత్యం.

### 1.9 ఆధునికత – చారిత్రకావగాహన

ఆధునిక మానవుడు విజయుడు కావటం వెనుక ఉన్న చలన శక్తుల పరిశీలనం అవసరం. మనిషి తన అస్తిత్వానికి అర్థం వెతుక్కొనే దశల్లో ప్రపంచ మేధావులు తోడ్పడ్డారు. ప్రపంచవ్యాప్తంగా ఆలోచనవరులు మనిషిని శ్రమశక్తిగా గుర్తించి, శ్రమ నుంచి మనిషి విముక్తిని దర్శించారు. శ్రమజీవుల చైతన్యం నుంచి ప్రపంచ పురోగమన సూత్రం పుడుతుంది. ప్రపంచ గమనానికి ఒక క్రమం ఉంటుంది. ఈ గతికి ఒక తర్కం ఉంటుంది. ఈ తర్కం భౌతిక జీవిత వికాసానికి దోహదం చేస్తుంది. దీన్ని బోధించినవాళ్ళు భౌతికవాదులు. వీళ్ళు ప్రపంచ గతితర్కాన్ని గుర్తించి, గ్రహించి, బోధించినప్పుడది గతితార్కిక భౌతికవాదం.

ఈ వాదం జర్మన్ మేధావుల సృష్టి. ఫ్రెంచి ఆలోచనపరులు దీనికి తోడ్పడ్డారు. యూరోపుదేశాలలో గతిశీలంమీద ఆలోచన కలిగింది. ఈ ఆలోచన కారల్ మార్క్స్ గతితార్కిక భౌతిక సిద్ధాంతంగా సంసిద్ధమయింది. ఇది మార్క్సిజంలో భాగం. దీని మీద ఆధారపడి కమ్యూనిష్టు సిద్ధాంతం రూపొందింది. రష్యాలో లెనిన్, చైనాలో మావో ఆలోచనలతో రెండు దేశాల కమ్యూనిజం అవతరించింది. ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు దేశాలు కానీ, కమ్యూనిస్టు దేశాలు కానీ స్థూలంగా

సంకోచ వ్యాకోచాలతో మార్క్సిస్టు సిద్ధాంతం మీద ఆధారపడ్డాయి. ఒక్క ఆలోచన స్రవంతి ప్రపంచ దేశాలలో ప్రజారాజ్య స్థాపనకు జీవనదానం చేసింది

ఫ్రెంచి విప్లవంకానీ, రష్యా విప్లవంకానీ, చైనా యుద్ధంకానీ, భారతదేశ స్వాతంత్ర్య సమరం కానీ, ప్రపంచ దేశాలలో మానవ విముక్తి పోరాటాలు కానీ అన్నీ ఈ నేపథ్యంలో చూడాలి. మొదటి ప్రపంచ యుద్ధంతో మొదలైన ప్రపంచ మానవ చైతన్యం, రెండో ప్రపంచ యుద్ధం నాటికి మానవ విముక్తి పోరాటంగా రూపం దిద్దుకొంది. ప్రపంచ మానవ చైతన్యమంతా, పోరాడే దృష్టి అంతా ప్రపంచ గతి తర్కంమీద, చలనసూత్రంమీద, భౌతిక దృక్పథం మీద ఆధారపడి ఉండటం అర్థమయింది.

### 1.10 ఆధునికత–శాస్త్రీయ దృష్టి

విజ్ఞానశాస్త్ర రంగంలో పరిశోధనలు , ముఖ్యంగా డార్విన్ సిద్ధాంతం మనిషి జననం, జీవనం, మరణం వెనుక ఉన్న ప్రకృతితత్వాన్ని గతితర్కాన్ని విడమర్చి చూపింది. శాస్త్రరంగం సాధించిన అభ్యుదయం మనిషిని శ్రమశక్తిగా నిరూపించింది. మనిషి మానసిక చలనాన్ని గూర్చి పరిశీలించిన శాస్త్రజ్ఞుల్లో ఫ్రాయిడ్ ప్రముఖుడై, మనిషి మనస్సును విశ్లేషించి చూసేసరికి మానవ ప్రకృతి స్పష్టమయింది. మనిషి చర్యకు ప్రతిచర్యకు అవసరాలు, హేతువులు, ఫలితాలు అన్వేషించిన మేధావులు కార్యకారణ సంబంధం విశదం చేసుకోసాగారు. ప్రతిచలనం వెనుక ఉన్న చోదకశక్తిగా హేతువును గుర్తించారు.

చారిత్రక పరిణామాలు, శాస్త్రజ్ఞుల పరిశోధనలు, మేధావుల ఆలోచనలు, హేతువాదుల సిద్ధాంతాలు, మానవ విజయం నిర్దేశించాయి. మనిషి విజయుడై విముక్తుడై, నిలచిన సమాజం ఆధునిక సమాజం. దీన్ని చిత్రించిన సాహిత్యాంశం ఆధునికత. ఈ ఆధునిక సాహిత్యాన్ని విమర్శించటానికి అవసరమైన సూత్రం గుర్తించటం ప్రస్తుత కర్తవ్యం.

### 1.11 ఆధునికత–పరిపాలన

భారతదేశాన్ని మహమ్మదీయులు ఆంగ్లేయులు పరిపాలించినప్పుడు, ద్విజుడైనవాడు, విష్ణువు అవతారమైనవాడు క్షత్రియుడైనవాడు రాజుగా ఉంటాడన్న దృష్టి సంపూర్ణంగా నాశనమయిపోయింది. చాతుర్వర్ణ్యం పేరిట విడదీయబడి

ఉన్న దేశాన్ని పరాయివాళ్ళు పాలించటం, మరీ విడదీసి పాలించటం వాళ్ళకు తేలిక అయిపోయింది. మన మనుధర్మశాస్త్రం, నీతులు, నియమాలు, సంస్కృతి, జీవితం, వేదాలు, ఉపనిషత్తులు, సంహితలు, పురాణాలు, ఇతిహాసాలు ప్రశ్నల పరంపరలకు గురి అయ్యాయి. ఈ ప్రయోగదశలో భారతీయులకు ఆంగ్లం అంది వచ్చింది. ఆంగ్లం చదవటం అన్ని వర్ణాల వాళ్ళకు అవకాశం కలిగేసరికి మన విద్యావ్యవస్థ దాని సంరక్షకుల స్థితి కుప్పకూలిపోయింది. సహస్రాబ్దాలు గుత్త సొత్తుగా సంరక్షింపబడుతూ వచ్చిన సాహిత్యం ఆంగ్లంలోకి అనువాదమయి, అందరికీ అందుబాటులోకి వచ్చేసరికి రహస్యద్వారాల బండారం బయటపడింది.

ఇంగ్లీషు చదువుతో విశాల విశ్వం వినూత్నంగా సన్నిహితమయింది. భావవాదులు, భౌతిక వాదులు బాహాటంగా అర్థం కాసాగారు. దేశంలో భౌతికంగా ఏర్పడ్డ అనేక సౌకర్యాలు – రహదారులు – నేల, నీరు, నింగిమీద తంతి తపాలాలు; ముద్రణ, పత్రికలు; నూత్నపాలన, విద్య, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు, చిల్లర రాజులు అంతరించటం విశాల భారతం రెండు ప్రధాన భాగాలు కావటం – అద్భుత పరిణామాల క్రోడీకరణాలుగా మారాయి. ఈ సమయంలోనే ఆంగ్లేయులు పరాయివాళ్ళని, భారతీయులు సొంతం వాళ్ళని, పరాయివాళ్ళు పాలించరాదని, సొంత ప్రజలే తమ దేశాన్ని పాలించుకోవాలని దేశ ప్రజలు గుర్తించారు. హెచ్చు తగ్గులు తొలగటానికి సంస్కరణోద్యమాలు పుట్టాయి. మతం ప్రశ్నించబడింది. జాతీయత పరీక్షింప బడింది. స్త్రీ జనోద్ధరణం తెలిసివచ్చింది. అందరూ శ్రమ జీవనంలో సోదరులని తెలిసి, ఆధునికత ప్రబలింది.

### 1.12 ఆధునికత-సమకాలీనత

నేటి సాహిత్యంలో ఆధునిక సాహిత్యం సమకాలీన సాహిత్యం రెండూ ఉన్నాయి. ప్రాచీన సాహిత్య మార్గంలో సాగే సంప్రదాయ, నవ్య సంప్రదాయ సాహిత్యాలు సమకాలీన సాహిత్యాలు. సంస్కరణ– పునరుజ్జీవన – భావ – అభ్యుదయ – దిగంబర – విప్లవ – స్త్రీవాద – దళిత సాహిత్యం. ఆధునిక సాహిత్యంలో వికాస మానవుడి వివేక దృక్పథం ఉంటుంది. సమకాలీన సాహిత్యంలో దైవ వ్యవస్థ, రాజవ్యవస్థ ప్రముఖంగా ఉంటాయి. రామాయణ కల్పవృక్షం నవ్య సంప్రదాయ సాహిత్యం. అందువల్ల సమకాలీన సాహిత్యం, కన్యాశుల్కం, విముక్తి మానవ జీవిత చిత్రణం కలిగి ఉంది కాబట్టి ఆధునికం.

అది గతశతాబ్ది సాహిత్యమయినా ఆధునికమే. స్థూలంగా ఆధునిక సాహిత్యంలో మానవ ప్రాధాన్యం ఉంటుంది. సమకాలీన సాహిత్యంలో సంప్రదాయ నవ్య సంప్రదాయ సాహిత్యం నిలిచి ఉంటుంది.

### 1.13. ఆధునిక సాహిత్య విమర్శనం

ఏది ఆధునిక సాహిత్యమో, ఆ సాహిత్యం విమర్శించే విధానం గూర్చిన పరిశీలనం ఇక్కడ ప్రసక్తమవుతుంది. ప్రాచీనసాహిత్యం పరిశీలించటానికి సంసిద్ధమయి ఉన్న ఆలంకారిక సంప్రదాయం ఎంతవరకు వర్తిస్తుందో, ఎంతవరకు వర్తించదో పరిశీలించటం అవశ్యం. అది వర్తించకపోతే, వర్తించే విమర్శ సూత్రం రూపొందించుకోవాలి అందువల్ల నూత్న ప్రణాళిక రూపొందుతుంది.

ఆధునిక విమర్శ సూత్రంలో కవి దృక్పథం మీద పరీక్ష ఉంటుంది. కవి, రచయిత చెప్పేవి కొన్నయితే; చెప్పనివి, చెప్పలేనివి లేక్కలేనన్ని. చెప్పకపోవటం బుద్ధిపూర్వకంగా కావచ్చు. కళాదృక్పథ ప్రేరకం కావచ్చు. శిల్ప రహస్యం కావచ్చు. శైలి సౌందర్యం కావచ్చు. చెప్పలేకపోవటం ఆశక్తత అయినా అవుతుంది. బలహీనత అయినా అవుతుంది. భావానికి ఉన్న అవ్యక్త దశ అయినా అవుతుంది. సంఘజీవి అయిన మనిషి సాహితీ స్రష్ట అయితే, సాంఘిక దృష్టి అనివార్యం అవుతుంది. కవికి, సంఘానికి, సాహిత్యానికి ఉన్న సంబంధం – దాని సమ్యగవగాహన ఆధునిక విమర్శ సూత్రంలో ఉంటుంది. సంఘం – సాహిత్యం పొందే పరస్పర ప్రభావ వాతావరణం ఆధునిక విమర్శ పరిధి నిర్ణయిస్తుంది. ఏ దృక్పథమూ లేని ఉత్తమ సాహిత్యం ఉండదు కాబట్టి, దాని దృక్పథం విశ్లేషించటం, వివరించటం, విశదీకరించటం ఆధునిక విమర్శ సూత్రంలో అవశ్య భాగస్వామ్యం పొందుతాయి.

ఆధునిక విమర్శ సాహిత్య పరిశీలనలో– మానవాభ్యుదయం. పరిపూర్ణ మానవవికాసం లక్ష్యాలుగా కలిగిఉంటుంది. ఒక సాహితీసృష్టి, ఏ సంఘ ప్రయోజనం కోసం ఆవిర్భవించిందో చూచి, దాన్ని విమర్శించటం సాధ్య మవుతుంది. ఆధునిక సమాజ వికాసానికి అవకాశం కల్గించే సాహిత్యం విమర్శించటంలో ఆధునికతకు పురస్కారం లభిస్తుంది. సాహిత్యంలో జనం ప్రమేయం లేని ఉన్నతాదర్శ స్పర్శ ఈ విమర్శ వితర్కిస్తుంది. సామాజిక పరిణామాల సూత్రాలు, వర్గ సమాజ స్వభావ స్వరూపాలు తెలుసుకొంటూ, తెలుపుతూ వర్గ

సమాజంలోని అంతర్గతవైరుద్ధ్యాలు, వర్గపోరాట ఫలితాలు గుర్తించి, వర్గ వర్ణ, వ్యత్యాస ధోరణులు లేని సమసమాజ లక్ష్యంవైపుగా పరిణామంచెందే మానవ జాతిపట్ల విశ్వాసంతో చారిత్రక ఆశాభావంతో వెలువడే, వెలువరించే సాహిత్యం పట్ల సదవగాహన పెంచే విమర్శనమే ఆధునిక సాహిత్య విమర్శ.

## 1.14 సాహిత్య విమర్శ నేపథ్యం

ఆధునిక సాహిత్య విమర్శ ఈ శతాబ్ది ఆరంభంలోనే మొదలయింది. వెన్నేటి రామచంద్రరావు 'మను – వసుచరిత్ర రచనా విమర్శనము'లో సదసత్కవిత్వ వివేచనం గుర్తించాడు. కట్టమంచి రామలింగారెడ్డి ప్రతిపాదించిన విమర్శసూత్రం భావనాశ క్తి. రెడ్డి కావ్యంలో కవి భావనాశక్తి స్వరూపం గుర్తించే కృషి చేశాడు. కట్టమంచి సృష్టితో తెలుగులో నూత్న విమర్శ సంప్రదాయం ప్రారంభమయింది. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ ప్రతిపాదించిన భావవస్తు రచనా దృష్టి త్రిగుణాత్మకంగా కళ విస్తరిస్తుందని వివరించింది. రాళ్ళపల్లి భావనా దృష్టి, ప్రాచీనుల రసదృష్టికి ప్రతిబింబం. దువ్వూరి రామిరెడ్డి భావించిన రామణీయక విమర్శ రమణీయార్థ ప్రతిపాదకమార్గమవలంబించింది. నేటికాలపు కవిత్వాన్ని గూర్చి ఆలోచించిన అక్కిరాజు ఉమాకాంతం సంప్రదాయ మార్గంలో నేటి కవిత్వాన్ని పరిశీలించే పరిశ్రమ చేశాడు. పాశ్చాత్యుల 'ఫాం', 'కంటెంట్' పద్ధతిని అనుసరించి, "ఫాం'ను కళాకృతిగా, భావించి పరిశీలించిన పండితులు సంప్రదాయంగా ప్రక్రియ లక్షణం విశ్లేషించటం దాటిపోలేదు. రమ్యాలోకం దర్శించిన రాయప్రోలు అమలిన శృంగారమన్న నూత్న కోణం రసవిషయికంగా ప్రతిపాదించాడు. కావ్య పరమార్థం గ్రహించే, కృషిచేసిన విశ్వనాథ సత్యనారాయణ కావ్యగతంగా జీవుని వేదన గుర్తించాడు. కవి అనుభూతిని సహృదయాను భూతిగా సంవిధానంలో ఆధునికులు భావించారు. కావ్యం సాంఘిక ప్రయోజనం కలిగించేదిగా రూపొందాలని మార్క్సిస్టు దృక్పథం ఉన్న శ్రీశ్రీ వంటి వాళ్ళు భావించారు. సామాజిక చైతన్యం ప్రతిపాదించిన మార్క్సిస్టు విమర్శకులు కావ్యప్రయోజన లక్ష్యం విస్పష్టం చేశారు. కె.వి.రమణారెడ్డి వంటివాళ్ళు విప్లవసాహిత్యపథం విమర్శ ప్రత్యక్షీకరించాలని భావించారు. గుంటూరు శేషేంద్ర శర్మ మొదలయిన వాళ్ళు సాహిత్య నిర్మాణశిల్పం సందర్శించారు.

ప్రాచీన దృష్టినీ, ఆధునిక దృష్టినీ, ప్రాచ్యసంప్రదాయాన్ని, పాశ్చాత్య సంప్రదాయాన్ని కలగలిపి నూత్న దృష్టితో సాహిత్యావలోకనం చేయటం ఆధునిక

విమర్శసూత్రంగా మారింది. ఈ సాహిత్య విమర్శనమంతా, రచనామార్గం, అనుభూతి విధానం, కావ్య ప్రయోజనం దృష్టితోనే గోచరమయింది 'ఫాం' అంటే కళారూపంగా భావించిన వాళ్ళు కూడా కావ్యాత్మను కంటెంట్‌ను సంప్రదాయ భిన్నంగా గుర్తించలేదు.

### 1.15 విమర్శ – విషయ ప్రాముఖ్యం

కవులు రచయితలు ఎలా రాస్తున్నారన్న దానిమీదే విమర్శకులు దృష్టి లగ్నంచేశారు. వీళ్ళు ఏం రాస్తున్నా రన్న దానిమీద ఆలోచన సాగవలసి ఉంది. భాష, ఛందస్సు ప్రక్రియ ఏదైనా కావ్య ఆత్మ ఏదయినా, కావ్య పరమార్థం ప్రయోజనం – ఏదయినా, ఏ విషయం రాస్తున్నారన్నది ముఖ్యమై, విషయం ప్రాధాన్యం సంతరించుకొంది. ఆధునిక సాహిత్యంలో, ఆధునిక జీవితంలోని విషయంమీద సాహితీ స్రష్టల సమ్యక్ దృష్టి ఉండాలన్న అభిప్రాయం పెరిగింది. క్రమంగా ఎలా రాశారు కంటే ఏం రాశారు అనేది ప్రాధాన్యం పొందింది. ప్రాచీన సాహిత్య విమర్శకు ఆలంకారిక సంప్రదాయం ప్రకారం, విషయం మీదకంటే రచనమీద శ్రద్ధ ఉంది. ఆధునిక సాహిత్యంలో రచన బాగుండటం చూచుకొంటూనే విషయం మీద దృష్టి కేంద్రీకరించటం ఉంది. విషయం రచనకు మార్గ నిర్దేశం చేస్తుంది. విషయం ప్రక్రియను ఎన్ను కొంటుంది. విషయం భాషను నిర్ణయిస్తుంది. విషయం వస్తువుగా, ఇతివృత్తంగా, పాత్రలుగా, సందేశంగా వికాసం పొందుతుంది. ఇప్పుడు కవులు, రచయితలు అన్ని వర్ణాలవాళ్ళు రాస్తున్నారు కాబట్టి వర్ణ దృష్టి, వర్గ దృష్టి, కులం దృష్టి, మతం దృష్టి వాళ్ళ సాహిత్యంలో చోటు చేసుకొంటున్నాయి. వాళ్ళు సాహిత్యానికీ సాంఘిక ప్రయోజనం తప్పకుండా భావించుకొంటున్నారు. ఏ కాలం సాహిత్యం ఆకాలం ప్రజల అవసరాల దృష్టితో అవతరిస్తుందని గుర్తించారు. ప్రతి సాహిత్యసృష్టి, పరిమితంగానో, అపరిమితం గానో, ఆ కాలం జన జీవితం మీద ప్రభావం చూపుతుంది. పోనీ ఆ సాహిత్యం ఉద్దేశించే ప్రజా సముదాయం ఉంటుంది. అందువల్ల ఏం రాస్తున్నారు, ఎవరు రాస్తున్నారు, ఎవరికోసం రాస్తున్నారు అనేది నేటి సాహిత్య విమర్శలో ప్రముఖాంశాలు. ఈ విధంగా సాహిత్య వస్తు ప్రాధాన్యం పెరిగింది.

నేటి సాహిత్యంలో నేటి వస్తువు ఉంటుంది. విషయం సమకాలంలోని సమాజ జీవితంతో సంబంధించి ఉంటుంది. అందువల్ల పాత్రలు కూడా వర్తమాన

సమాజంలోని సజీవ వ్యక్తులులాగా రూపొందుతాయి. భాష కూడా, వ్యావహారికమైనా, మాండలికమైనా, సజీవభాష వస్తుంది. పాత భాష పనికిరాదు. పాత ప్రక్రియలు పనికిరావు, గత జీవిత సంబంధ సమస్త సాహిత్యాంశాలు తెరమరుగై, వర్తమాన సమాజ జీవితం సారస్వత రంగస్థలం మీదికి ప్రవేశిస్తుంది.

ఈ నూత్న విధానంతో సాహిత్యం పరిశీలించే సంప్రదాయం అవసరమవుతూ వచ్చింది. పూర్వ అలంకార గ్రంథంకానీ, మార్గంకానీ ఇందుకు అనుకూలంగా ఉండవు. సిద్ధాన్నం లేదుకాబట్టి, సాధ్యాన్నం సదుపాయం కలిగిస్తుంది కాబట్టి, విమర్శ దృక్పథం సాధించవలసి ఉంది. ఈ దృష్టితోనే, నేటి సాహిత్యానికి నూతన పరిశీలన సూత్రాల ఆవశ్యకం ఉంది.

## 1.16 వస్తువు – విమర్శదృష్టి

సంస్కరణ సాహిత్యంలో, నాటి సమాజం అవసరాలను అనుసరించి నూత్న లక్ష్యాలు ప్రవేశించాయి. స్త్రీల విషయకంగా మనువు చెప్పే ధర్మసూత్రం పనికిరాకుండా పోతుంది. సంస్కరణ సాహిత్యం సంప్రదాయ తిరస్కారం చేస్తుంది. ఈ సాహిత్యం పరిశీలించటానికి సంప్రదాయ మార్గం చాలదు. పునరుజ్జీవనంతో జాతీయత ఉద్యమమై, నూత్న వస్తువులు సాహిత్యంలో ప్రవేశించాయి. అది ఆ కాలావసరం. జాతీయత, దేశభక్తి, నూత్నవస్తు విస్తార సమర్థమయ్యాయి. ఈ నూత్న వస్తు విశ్లేషణకు నూత్న విమర్శ దృక్పథం అవసరం. భావకవిత్వంలో స్త్రీ చైతన్య దృష్టి ఉంది. ఇది సంప్రదాయంలో ఉండదు. దాన్ని దాటివచ్చింది. దీనికి నూత్న విమర్శమాత్రం తప్పనిసరి. అభ్యుదయ సాహిత్యం మానవ సంబంధంలో చారిత్రక గతితర్కం భౌతికవాదం, ఆర్థికకోణం గుర్తిస్తుంది. ఇది పూర్వంలేని పరిస్థితివల్ల విమర్శనంలో నూత్నసూత్రం ఆవశ్యకమవుతుంది. దిగంబర కవిత్వంలో నిరసన బూతుగా భావించే స్థితికి చేరువయింది. నిరసనం సాహిత్యంలో మునుపున్న సంగతి కాదు. అందుకే విమర్శ దృష్టిలో మార్పు వాంఛనీయమయింది. విప్లవ సాహిత్యంలో సమాజంతో సంబంధం సుస్పష్టంగా సంస్థాపితమయింది. మును పెన్నడూ రెండింటికి ఇంత దగ్గర సంబంధం లేదు. సాహిత్యం ఆచరణరూపం ధరించింది. పెన్ను గన్ను గా మారింది. గన్ను పెన్ను అయింది. పెన్నూ గన్నూ పేదల పీడితుల వెన్నుదన్నుగా నిలబడ్డాయి. విషయం, రచన, భాష విశేషంగా మారిపోయాయి. వీటిని పరిశీలించటానికి విమర్శకులకు సాధన సామగ్రి లేదు.

ఈ సాహిత్య విమర్శకు నూత్నప్రమాణాలు ఆవిర్భవించకతప్పదు. పాతపడి కట్టురాళ్ళతో నూత్న వస్తువును తూయటం కుదరదు. కొలత సాధ్యం కాదు అంచనా వేసే వీలులేదు. ఇంతకాలం పురుషులు సాహిత్యం సృష్టిస్తే, ఆ పురుష మార్గంలోనే స్త్రీలు రచన చేయటం మానారు. స్త్రీవాదం పెంచుకొన్నారు. వాళ్ళ వస్తువులు మారాయి. దృక్పథం మారింది. పురుషభాష స్త్రీకి బూతుగా ఉంది. దోషంగా ఉంది. సాహిత్యం అసమగ్రంగా కనిపిస్తుంది. సాహిత్యాంగాలన్నీ సంపూర్ణంగా మారతాయి. తనను గూర్చి సాహిత్యం ఆలంకారశాస్త్రం సృష్టించిన అసహ్యాన్ని స్త్రీ తిరస్కరిస్తుంది. ఇప్పుడు స్త్రీవాద సాహిత్యం పరిశీలించే దృష్టి మారితీరాలి. పేదల ఆర్థికకోణం నుంచి, వర్ణస్థితినుంచి వేరుపడి, కులం నేపథ్యంతో వర్ణలక్షణం గుర్తించి వస్తున్న దళిత సాహిత్యం పరిశీలించటానికి సూత్న విమర్శ సూత్రం అవసరమవుతూ ఉంది.

ఈ మారిన సాహిత్యం – ఆధునిక సాహిత్యం – కోరే ఆధునిక విమర్శ అవతరించవలసిన అగత్యం స్పష్టమయితే, దాని నిర్మాణం, ప్రారంభమవుతుంది. నేటి సారస్వతంలోని విభిన్న ధోరణులు విభిన్న ప్రాంగణాలకు పరిమితం కావటంవల్ల ఆ ప్రాంగణం వెలిగించే విమర్శ విధానం పుట్టవలసి ఉంటుంది. అందువల్ల విమర్శ సూత్రం నూత్న విధానాలను గుదిగుచ్చుకొంటూపోవలసి ఉంటుంది.

### 1.17 విమర్శ సూత్రం

పూర్వం సాహిత్యం దేవుళ్ళే సృష్టించేవాళ్ళని ఒక నమ్మకం ఉండేది. దాన్ని ప్రశ్నించే పరిస్థితి లేదు, ప్రశ్నిస్తే ప్రమాదం. అనంతరకాలంలో సాహిత్య స్రష్టలు మహర్షులయ్యారు. క్రమంగా ఋషులు, ఉత్తమ మానవులు సాహిత్య నిర్మాతలయ్యారు. సర్వశుభలక్షణాలున్న బ్రాహ్మణులు, నియమనిష్ఠలున్న వాళ్ళే భారత భాగవత రామాయణాదులు సృష్టించారు. ఇప్పుడు వాళ్ళు తగ్గిపోయారు. ఇతర లాభసాటి వ్యాపకాలలో చేరిపోయారు. ఇప్పుడు మనుష్యులు, మామూలు మనుష్యులు సాహిత్యం నిర్మిస్తున్నారు. ఇది ప్రజా సాహిత్యం సామాన్యులు స్రష్టలు, చదువురాని వాళ్ళు సాహిత్యం కల్పించే పరిణామం గమనార్హం.

నేడు సాహిత్యం సృష్టిస్తున్న వాళ్ళకు నిబద్ధత ఉండాలంటే నిమగ్నత అంతకంటే ముఖ్యమని భావించటం ఆరంభమయింది. పూర్వం ఈ నియమాలు లేవు. వాళ్ళకీ

దృష్టి లేదు. ఈ కోణం వాళ్ళకు అక్కరలేదు. వాళ్ళు యుగకర్తలు. వాళ్ళు ఏదంటే అది శాసనం. విస్సన్న చెప్పిందే వేదం. ప్రశ్నించటం పాపం. అంగీకరించాలి. ఆ హద్దులు అలంఘ్యాలు. వాడి స్వార్థం పట్టించుకోరు. వాడి అర్హతలు చూడరు. వాడెందుకీ నీతులు బూతులు కలగలిపి బూకరిస్తున్నాడో పరికించరు. వాళ్ళకులేని, వీళ్ళకున్న సాహిత్యంలో వ్యక్తి సంబంధం విమర్శ సూత్రానికి నూత్నదీప్తి తెస్తాయి. రంగు రుచి, వాసన కలిగిస్తాయి.

### 1.18. నిబద్ధత

నేటి రచయితకు నిబద్ధత (Commitment) ఉండాలి తాను నమ్మని విషయం, తాను అనుసరించని నీతి, పాటించని ధర్మం, తెలియని సంగతి చెప్పకూడదు. తన సాహిత్యానికి తాను బద్ధుడై ఉంటే, ఆ సాహిత్యంలో నిబద్ధత ఉందనీ, ఆ కవి నిబద్ధకవి అని భావించటం పరిపాటి అయింది. దీనికి రాజకీయ నేపథ్యం ఏర్పడింది. రచయిత, రాజకీయపక్షం కలిగిఉన్న సామాజిక దృష్టితో తాను సాగుతూ సృష్టిస్తే వాడికా రాజకీయ పక్షంపట్ల నిబద్ధత ఉందని తీర్మానం. రాజకీయ దృక్పథానికి నిబద్ధుడు కాని రచయిత అంగీకరింపదగ్గ సాహిత్యం వ్రాయలేదని దీని తాత్పర్యం. నిబద్ధుడే ఉత్తమ సాహిత్యం వినిర్మిస్తాడని గుర్తింపు. నిబద్ధుడు కాని వాడికి లక్ష్యం లేదని నిర్ణయం. ఎవరు రాస్తున్నారన్న దానితోపాటు ఎవరికోసం రాస్తున్నారన్నదీ ముఖ్యమై, లక్ష్యం స్పష్టమయి, నిబద్ధుడు గొచరమవుతాడు. వ్రాసేది సంఘ విషయం గావటం వర్తమాన జన జీవితం కావటం, రచయితకు పరిచయమయింది కావటంతో పాటు, దానికి బద్ధుడు కావాలన్నది నిబద్ధత తెలుపుతుంది.

### 1.19 నిమగ్నత

ఇంతేకాక , ఇంకా కొంచెం ముందుకుపోయి, నిబద్ధతను మించిన లక్షణాన్ని విమర్శకులు వివరించారు. కవి నిబద్ధుడైతే చాలదు నిమగ్నుడు కూడా కావాలని నిర్ణయించారు. నిమగ్నత (involvement) అంటే మునిగి ఉండటం. ఎవరు మునిగి ఉండటం? కవి! ఎందులో మునిగి ఉండటం? తన వస్తువులో! ఎప్పుడు? సాహిత్య సృష్టిలో. ఎంతవరకు మునిగి ఉండాలి? ఊపిరాడేంతవరకు, నూత్న వాయువులు పీల్చి అనుభవించేంతవరకు! వస్తువు అంటే ఇతివృత్త కేంద్రంగా

భావించి, రచయిత ఇతివృత్తంలో మునిగి ఉండాలని తీర్పు. మునిగి ఉండటమంటే ఇతివృత్తంలో తానుండటం. అంటే వస్తువుపట్ల రచయితకు సర్వాత్మనా మమైక్యం ఉండాలి. తాను ప్రవాహంలో ఉండి దాని గతి చెప్పాలి. గట్టున కూర్చుని కబుర్లు చెప్పటంకాదు. రాజకీయ పక్షంతో సంబంధమే కాదు. తాను సాహిత్యంలో సంస్థాపించే వస్తువుతో తనకు శిరః దఘ్నంగా సంబంధం ఉండాలి. అందులో తాను అంతర్లీనంగా ఉండాలి. అప్పుడే తన నిమగ్నత స్పష్టమవుతుంది. నిమగ్నత ఉన్న సాహిత్యం ఉపదేశంగా ఉండదు ఆచరణగా ఉంటుంది. సిద్ధాంతంగా ఉండదు. జీవితంగా ఉంటుంది. నిమగ్నత ఉన్న సాహిత్యం వాస్తవంగా, అంగీకార యోగ్యంగా ఆచరణ సాధ్యంగా రూపొందుతుంది.

### 1.20 నూత్నావసరం

ఈ రెండూ కాక, మరేదో అవసరంగా ఉంది. ఆ అవసరం పరిశీలించి, దాన్ని సంస్థాపించటం అవశ్యకర్తవ్యం. నిబద్ధతలో రచయిత వస్తువుకు కట్టుబడి ఉంటాడు. దానిపట్ల విశ్వాసం ఉంటుంది. దాన్ని ప్రపంచిస్తాడు. ప్రచారం చేస్తాడు. ఇక్కడ నిబద్ధత భౌతిక దృష్టితో కవిని చుట్టుకొని ఉంటుంది. అది లేకుండా తానుండడు. అది వెంట ఉంటుంది. అంటి ఉంటుంది. నిజానికి తన అస్తిత్వంలో అది భాగంకాదు. తన వ్యక్తిత్వంలో చేరి ఉండదు. తాను దానికి నిబద్ధుడు. తాను వేరు. అది వేరు, తనకది జత అయింది ఇప్పుడే రాజకీయ దృక్పథానికి బద్ధుడైన కవి, రేపు .దాన్ని వదలవచ్చు. మరో ఆలోచన కలిగించుకోవచ్చు. అప్పుడు దానికి తాను బద్ధుడు కావచ్చు. కాబట్టి నిబద్ధత శాశ్వతం కాదు. అది మారుతుంది. మారవచ్చు, తను వేరుగా, తన నిబద్ధత వేరుగా ఉంటాయి.

నిమగ్నత అలా కాదు. తను తన వస్తువులో చేరిపోతాడు. కవి తన వస్తువుతో తాద్రూప్యం పొందుతాడు. తన వస్తువు తనతో ఉండటం కాదు, తన వస్తువులో తానుంటాడు. దాని రంగూ రుచి వాసనా కవివి అవుతాయి. కవి అందులో ఉండిపోతాడు. కరిగిపోడు. ఘనీభవించే ఉంటాడు. లయం కాదు స్వయంగా ఉంటాడు. అందులోంచి తనను వేరు చేయవచ్చు. తన వస్తువు, తాను విడి విడిగా ప్రత్యేకంగా కనబడతారు. తన వస్తువులో తానున్నా, తాను వస్తువు కాదు. తనకు ప్రత్యేక అస్తిత్వం. వ్యక్తిత్వం ఉన్నాయి. ఉంటాయి. వస్తువుకంటే భిన్నుడుగా కవి ఉంటాడు.

నిబద్ధతలో కవి వస్తువుకు బద్ధుడు. నిమగ్నతలో కవి వస్తువులో నిమగ్నుడు. కవికి నిబద్ధత ఒక పార్శ్వం. నిమగ్నత సర్వపార్శ్వాలు. అయితే నిబద్ధత, నిమగ్నత కవికి, వస్తువుకు భిన్నత్వం కలిగిస్తాయి. కానీ అభిన్నత్వం కలిగించే అంశం స్ఫురిస్తుంది. తాదాత్మ్యం కలిగించి స్థితి గుర్తుకు వస్తుంది. దాన్ని పరిశీలించటం ముఖ్యం. వస్తువులో రచయిత మునిగి ఉండేకంటే, రచయితలో వస్తువు మునిగిపోవటం గుర్తింపదగ్గ సందర్భం. కవిలో తన వస్తువు నిండి ఉండటం ఇక్కడ ప్రసక్తం. దీన్ని నిబిడతగా భావించవచ్చు

## 1.21 నిబిడత

నిబిడత (inclusiveness) అంటే వర్ణనీయ వస్తువు వర్ణించే కవిలో ఉండటం. వస్తువే కవి కావటం, వస్తువుకూ కవికీ అవినాభావ సంబంధం. కవి లేకుండా వస్తువు లేదు. వస్తువులో కవి ఉండదు. కవిలో వస్తు వుండటమంటే కవి తన అనుభవమే, జీవితమే, తనను తానే సాహిత్యంగా రూపొందించుకోవటం. కవే సాహిత్యం కావటం. ఇంతవరకు కవి వేరు, తన సాహిత్యం వేరు. ఇప్పుడు కవి తానే, కావ్యమూ తానే కావటం. ఇప్పటిదాకా తాను సృష్టించిన సాహిత్యం ఉంది. ఇప్పుడు తనను సృష్టించిన సాహిత్యం ఉంటుంది. తాను గతించినా తను సృష్టించిన సాహిత్యం ఇంతకాలం ఉండేది. ఇప్పుడు తాను భౌతికంగా గతించినా తన సాహిత్యంలో తాను ఆత్మికంగా ప్రతిష్ఠితుడై ఉంటాడు. తనలో వస్తు వుండటం, తానే వస్తువు కావటం, అభివ్యక్త వస్తువులో తన అస్తిత్వం దాగి అంతర్లీనంగా ఉ ండటం నిబిడతను తెలుపుతుంది.

నిబద్ధత, నిమగ్నతల్లో విషయం వస్తువు రచయిత చుట్టూ ఉంటుంది. నిబిడతలో విషయం రచయితలో ఉంటుంది. నిబద్ధత నిమగ్నతల్లో వస్తువు రచయితా వేరు వేరు. నిబిడతలో వస్తువు రచయిత ఒకటే! ఆ రెండింటికంటే నిబిడత గాఢత కలిగిఉంది. ఇది. నేటి సాహిత్య సూత్రంగా ఉంది. అందువల్ల నిబిడత దర్శించే ప్రయత్నం నుంచి సాహిత్య తత్త్వం విశదమవుతుంది. నేటి సాహిత్య విమర్శ సూత్రంగా నిబిడతను గ్రహించాలి.

## 1.22 విమర్శసూత్రం – సమన్వయం

నిబద్ధతకు కమ్యూనిష్టు సిద్ధాంతం అంగీకరించిన రచయితల సాహిత్యం

ఉదాహరణంగా ఉంటుంది. అంతేకాదు, ఏ రాజకీయ సిద్ధాంతమయినా, సాంఘిక, ఆర్థిక మత సిద్ధాంత మయినా, గ్రహించి సృష్టించినా కవుల సాహిత్యం చూపవచ్చు. సంఘంలోని కవి దృష్టి సాహిత్యంలో నిబద్ధతగా గుర్తింపు పొందుతుంది. పురుషుడు సంఘంలో స్త్రీని గౌరవిస్తూ సాహిత్యంలో గౌరవించాలని ప్రబోధిస్తే అది నిబద్ధ కవిత్వం. ఆ కవి నిబద్ధుడు. అతనికి నిబద్ధత ఉంది. భావకవిత్వంలోని ఉత్తమ కవిత్వం నిబద్ధ కవిత్వమే. సంస్కరణంలోని ఉత్తమ సాహిత్యం నిబద్ధ సాహిత్య మే! నిబద్ధత ఆధునిక సాహిత్యమంతటా గోచరమవుతుంది. నూత్న సాహిత్యంలో చాలా భాగానికి నిమగ్నత వర్తిస్తూ ఉండటం కద్దు. అంతేకాదు, కొంత సాహిత్యంలో నిబద్ధత, నిమగ్నత, నిబిడతలు దర్శనమిస్తాయి.

విప్లవ సాహిత్యం సృష్టించిన మైదానాల కవులు, రచయితలు, మేధావులు దానికి నిబద్ధులు. వాళ్ళ సాహిత్యంలో నిబద్ధత ఉంటుంది. తుపాకీ పట్టుకొన్న విప్లవ కార్యకర్త ప్రజల్లో, ప్రజలతో, ప్రజల కోసం జీవిస్తూ వాళ్ళను చైతన్యవంతుల్ని చేయటానికి కవిత్వం సృష్టిస్తే. అతను నిమగ్నుడు. అతడి సాహిత్యంలో నిమగ్నత ఉంటుంది. కొండల్లో పుట్టి, కోనల్లో పెరిగి, అడవి జాతులుగా అమాయకులుగా ఉన్న తెగల జనం, మారిన పరిస్థితుల వల్ల చైతన్యం పొంది, తుపాకీ తమ విముక్తి మార్గంగా గుర్తించి, అటు పోరాటం చేస్తూ, ఇటు తమ జాతి జనం కోసం కలం పట్టి. కవిత్వం రాస్తే, పాటరాస్తే, పాడితే, ప్రచారం చేస్తే, ఆ సాహిత్యాన్ని నిబిడత ఉన్న సాహిత్యమని, ఆ కవి నిబిడుడని విశదీకరించటం జరుగుతుంది. ఆధునిక సాహిత్యం సందర్శించేటప్పుడు, నిబద్ధత, నిమగ్నత, నిబిడత విమర్శ సూత్రాలు ఆ సాహిత్యంలో సమన్వయించటం సాధ్యమవుతుంది.

పీడితుల పేదల నిర్భాగ్యుల పట్ల అనుకంపతో, ప్రేమతో, దీక్షతో, వాళ్ళ అభివృద్ధి ఆకాంక్షతో సమర్థులు సాహిత్యం సృష్టిస్తే దాన్ని నిబద్ధతగా గుర్తించటం కుదురుతుంది. అధోజగత్తు సోదరులవట్ల సానుభూతితో, సహజీవనంతో, సాహచర్యంతో వాళ్ళ ఉద్ధరణార్థం వాళ్ళతో కలిసి భవిష్యత్తు దర్శించే కాంక్షతో సాహిత్యం వినిర్మించే వాళ్ళలో, ఆ సాహిత్యంలో నిమగ్నత ఉంటుంది. పీడితుల కోసం పీడితులే తాపత్రయపడి, తమ జీవితం తామే, తమ కష్టసుఖాలు తామే, తమ అవసరాలు తామే అభివ్యక్తం చేస్తూ సాహిత్యం రూపొందిస్తే అందులో నిబిడత ఉంటుంది.

నిబద్ధత ఉన్న సాహిత్యం పీడితుల్ని నడిపిస్తుంది. నాయకత్వం వహిస్తుంది. విముక్తి మార్గం చూపుతుంది. నిమగ్నత ఉన్న సాహిత్యం సామాన్యుల వెంట ఉండి రక్షించి విముక్తిపథంలో ముందుకు తీసుకుపోతుంది. నిబిడత ఉన్న సారస్వతం పీడితుల జీవితంగా, వాక్కుగా, పీడితుల ఉద్ధరణార్థం సామూహికంగా విముక్తిపథం అన్వేషిస్తుంది. అభ్యుదయంవైపు ప్రయాణం చేస్తుంది. పీడితులే, సామాన్యులే సాహిత్యం కావటం నిబిడతలో, సామాన్యుల కోసం, వాళ్ళుకాని వాళ్ళు సాహిత్యం సృష్టించి వెంట ఉండి నడిపించటం నిమగ్నతలో, తాడితుల కోసం తాడితులు కానివాళ్ళు సాహిత్యం సృష్టించి విముక్తి మార్గం చూపటం నిబద్ధతలో గుర్తింపు పొందుతాయి.

### 1.28 విమర్శ వివేకం

నేడు సాహిత్యంలోని విషయ ప్రాధాన్యం గుర్తించటం ప్రధాన విమర్శావసరం. విషయం విశ్లేషించి, సాహిత్యవికాసం పరిశీలించటం నేటి విమర్శలో ప్రముఖాంశం. సాహిత్య సౌందర్యం – దర్శించటం, తరించటం, జన్మ చరితార్థం చేసుకోవటం – ఇందులో భాగమే. సాహిత్యం సామాన్యుల సొత్తు కావటం వెనుక వస్తు ప్రాముఖ్యం విస్పష్టమవుతుంది.

ప్రజల సాహిత్యంలో నిబద్ధం కంటే నిమగ్నం ఉత్కృష్టం. నిమగ్నం కంటే నిబిడం విశిష్టం. సారస్వత పరిణామంలో నిబిడత పక్వఫలం. నిబద్ధత నిబిడత లేని సాహిత్యం ప్రజలకు దూరంగా ఉంటుంది. ఏ వర్గం సాహిత్యం ఆ వర్గం విముక్తి కారకమవుతుంది. అందువల్ల వర్గ సాహిత్యం అనివార్యం. విముక్తి దృష్టి అపరిహార్యం. ఏ వర్గం కోసం ఆ వర్గం, ఆ వర్గం సారస్వతం సృష్టించుకోవడమంటే నిబిడ సాహిత్యం అవతరించటమే. క్రమంగా వికాసం చెందుతున్న నేటి సాహిత్యం ప్రజా బాహుళ్యాన్ని విముక్తం చేసే కృషిలో ఉంది. ఈ పథంలో సామాన్యుల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం, సమానత్వం విలువలుగా ప్రతిబింబించే సాహిత్యం దర్శించి మాన్యులవుతారు. ఆధునికాంధ్ర సాహిత్యంలోని ఈ విలువలను వెలువరించటం, వెలార్చటం, వెలకట్టటం నేటి విమర్శ సాధిస్తుంది.

# అడివి బాపిరాజు గారి 'తుపాను'

## - వాడ్రేవు వీరలక్ష్మిదేవి

ఈ శీర్షికలో చాలా నెలల తర్వాత మళ్ళీ ఒక తెలుగు నవలను గురించి రాయాలను కున్నప్పుడు ఎన్నో నవలల మధ్య నుంచి 'తుపాను' నవల గుర్తొచ్చింది. నిజానికి అంతకన్న మంచి నవలలు మరికొన్ని ఉన్నా, 'తుపాను' నవల నా జ్ఞాపకాలలోని ఒక ఉదాత్త మధుర జ్ఞాపకం. ఆ నా చిన్ననాట నా లోపలి కొన్ని సున్నితాల పొరలు కదిలి వ్యక్తిత్వానికి పరిమళాన్ని అద్దిన జ్ఞాపకం అది. గుర్తు రావడానికి అదే కారణం. పొరుగూళ్లలో చదువుకుంటూ ఉండే నేను వేసవి సెలవులకు మా ఊరు వెళ్ళినప్పుడు అక్కడ ఒక చెక్క బీరువా నిండా ఉన్న పుస్తకాలు గొప్పవారి ఇంటి విందుభోజనంలా వుండేవి. ఏవి ఎంచుకుని చదువుకోవాలో తెలియనన్ని పుస్తకాలు. అందులోంచి ఈ 'తుపాను' పుస్తకం ఎలా నా చేతికి వచ్చిందో తెలీదు. వారం రోజుల పాటు అదే పనిగా చదివేను. ఆ కథానాయిక పేరు దగ్గిర్నించీ మోహపెట్టింది – హేమ కుసుమ సుందరీదేవి. తర్వాత కాలంలో నా కంటె ఇరవై ఏళ్లు చిన్నదయిన మా అఖరి చెల్లికి పట్టుబట్టి నేనే ఆ పేరు పెట్టేను.

ఇప్పుడు మళ్ళీ విశాలాంధ్ర పబ్లిషర్లు ఆ పుస్తకం తిరిగి ప్రచురిస్తే మళ్ళీ కొనుక్కున్నాను. పుస్తకం చదవక పోయినా, ఎదురుగా కళ్లముందు కనిపిస్తూ వున్నా ఆ పాత జ్ఞాపకం మధురంగా మెదులుతూనే వుంది. అదే మళ్లీ చదివించి ఇలా రాయిస్తోంది.

అడవి బాపిరాజుగారి నవలల మీద తెలుగు పాఠకులకి ఎన్ని ఆరోపణలు ఉన్నాయో అంత ఇష్టమూ వుంది. అనేక విషయాల పట్ల ఆయన కున్న అపరిమిత పరిజ్ఞానం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తుంది. కానీ అదంతా కథకు అవసరం కాదని ఆయన అనుకోక పోవడం పాఠకులు చేసే ఆరోపణలలో ఒకటి. అదలా ఉంచితే జీవితంలోకి, జీవనంలోకి లలితత్వాన్నీ, భావుకతని, వైభవాన్ని కలగలుపుకుంటూ

జీవించే పాత్రలతో కథను నడపడం వల్ల మన హృదయాలు కూడా వాటితో నిండిపోతాయి. ఈ లక్షణం 'తుపాను' నవలలో మరీ పుష్కలంగా ఉండడం వల్లనేమో అది నా లోపలి సున్నితాలను నిద్రలేపిందనిపిస్తుంది.

అయితే చాలా ఏళ్ల తర్వాత ఇప్పుడు మళ్ళీ ఈ నవల మొదలు పెట్టి చదువుతూనే చాలా ఆశ్చర్యపోయాను. 1930లలో రాసిన నవలేనా? ఇది అనిపించింది. అటువంటి సాధికారురాలయిన అత్యాధునిక స్త్రీ దినచర్యతో కథ మొదలయింది. ఆమె పేరు హేమ ఆమె భావాలు కూడా ఎంతో ఆధునికంగా వుంటాయి. అలాగే ప్రవర్తన కూడా.

హేమ తల్లితండ్రులు గుంటూరుకు దగ్గర్లో ఉండే కొల్లిపర అనే గ్రామం వదిలిపెట్టి చెన్నపట్నం వచ్చి అక్కడ మైలాపూర్‌లో ఒక మేడ కొనుక్కుని స్థిరపడ్డారు... కొల్లిపరలో ఉండగా వారు యుక్త వయస్సులో ఉన్న పెద్ద కూతురు శకుంతల మరణించడంతో ఆ జ్ఞాపకాలకు దూరంగా అప్పటికి ఆరేళ్ల పిల్ల హేమను తీసుకొని చెన్న పట్నం వచ్చేసారు. హేమ అప్పటి నుంచీ అక్కడే పెరిగింది. బి.ఎ. ఆసర్సు యూనివర్శిటీ ఫస్ట్‌గా వచ్చింది. మగవాళ్లను ఓడించేలా టెన్నిస్ ఆడుతుంది. కారు నడుపుతుంది. డబ్బుకులోటు లేకపోవడంతో స్నేహితులతో, షికార్లతో కాలం గడుపుతూ వుంటుంది.

ఆమెకు నలుగురు మగ స్నేహితులున్నారు. వాళ్ళు ఏ సమయంలోనయినా సరే ఆమె ఇంటికి రావచ్చు. మేడ మీద ఉన్న ఆమె గదిలోకి కూడా వెళ్లవచ్చు. వారికి హేమ పెట్టిన పేర్లు నిశాపతి, కల్పమూర్తి, తీర్థమిత్రుడు...నాల్గవ మిత్రునిది మాత్రం హేమ పెట్టిన పేరు కాదు. అతని పేరు త్యాగతి శర్వరీ భూషణుడు. త్యాగతి అని పిలుస్తారు.

ఆమె ఈ నలుగురినీ తన కారులో ఎక్కించుకుని తాను కారు నడుపుతూ సినిమాకి తీసుకెడుతుంది. అటో ఇద్దరు, ఇటో ఇద్దరు మధ్యలో తను కూర్చుంటుంది. ఎవరేనా చొరవ చెయ్యబోతే చురుగ్గా వారిస్తుంది. ఎప్పుడంటే అప్పుడు వాళ్లని తీసుకుని బీచ్‌కి విహారానికి వెడుతుంది. వాళ్లని తమ ఇంట్లో తనతో పాటే భోజనానికి పిలుస్తుంది. వాళ్లతో కూచుని గంటలు గంటలు అనేక విషయాలు చర్చిస్తుంది. తల్లితండ్రులు ఆమె స్వేచ్ఛను కాదనకుండా పెంచారు.

ఆమె స్నేహితుల్లో నిశాపతి నల్లగా వుంటాడని అతనికి ఆ పేరు పెట్టింది. కానీ అతను గొప్ప గాయకుడు. ఉత్తరదేశంలో పెద్దపెద్ద విద్వాంసుల వద్ద శిష్యరికం

చేసి విద్య నేర్చుకుని గాయకుడిగా ప్రఖ్యాతి సంపాదించాడు. అతని పాట మైమరపించి కరిగిస్తుంది. అతని గానానికి ముగ్ధురాలై అతనితో స్నేహం చేస్తోంది. అంత కన్న అతని పట్ల ఆకర్షణ లేదు. కల్పమూర్తి గ్రీకు శిల్పంలాంటి శరీర సౌష్టవం కలిగిన అందగాడు. సామాజిక వ్యవహారాలు నిర్వహించడంలో కడు సమర్థుడు. పెద్ద పెద్ద స్థాయిల్లో పరిచయాలూ, స్నేహాలు ఉన్నవాడు. కానీ చదువు అబ్బలేదు. అతని సంభాషణల్లోని కల్పనా చాతుర్యం చూసి ఆ పేరు పెట్టింది. తీర్థ మిత్రుడు వివాహితుడు. అందమైన భార్య ముగ్గురు పిల్లలూ ఉన్నారు. కానీ హేమ చుట్టూ తిరుగుతూ వుంటాడు. తీర్థమిత్రుడిలో జీవించే కళ వుంది. దాని వల్ల ఎవరినైనా ఇట్టే ఆకర్షిస్తాడు. ఎందులోనూ నిష్ణాతుడు కాకపోయినా అన్నింటినీ తనలో నింపుకున్నట్టుంటాడు. అతని కూడా సంతోష దేవత నడిచి వస్తోన్నట్టుంటుంది. అందుకని హేమ అతనితో స్నేహం చేస్తుంది. త్యాగతి వీరందరి కంటె వయసులో పెద్ద వాడు. ముప్పయి ఏళ్లు దాటాయి. గంభీరంగా ఉంటాడు. అతను గొప్ప శిల్పి, చిత్రకారుడు. అతని తాలూకు వ్యక్తిత్వం ఎంతో గాఢంగా వుంటుంది. అది ఒక సౌందర్యంగా అతనిలోంచి వెల్లివిరుస్తూ వుంటుంది. హేమకు త్యాగతిని చూస్తే పెద్ద అండగానూ, పెన్నిధిగానూ అనిపిస్తుంది. ఈ నలుగురూ కాక హేమకు చాలామంది స్నేహితురాళ్లున్నారు. వాళ్ళలో ఇద్దరు ప్రాణ స్నేహితురాళ్ళు. ఒకరు లోకేశ్వరి రెండవ అమ్మాయి సోఫీ. లోకేశ్వరి పేదింటి పిల్ల. హేమ ఆ పిల్లని తనతో సమానంగా తమ ఇంట్లోనే ఉంచుకుంది. తల్లి తండ్రులూ అలాగే చూస్తారు. సోఫీ ఆంగ్లో ఇండియన్.

హేమ విప్లవ భావాలలో ప్రేమకి స్థానం లేదు. ఆమెకి ప్రేమ అన్న పదం తేమలా వుంది కాబట్టి దాన్ని తీసి పారేసింది. పూర్వకాలంలో స్త్రీ పురుషులకు మధ్య వుండే సంబంధాన్ని రస స్వరూపంలో ఆలోచించారు గానీ మానవ జాతిలోని ఒక పెద్ద సమస్యగా ఆలోచించలేదు. కాబట్టి దాన్ని ప్రేమ అన్నారు, కానీ అది ప్రళయం లాంటింది, కనుక దాన్ని ప్రణయం అందాం అని హేమ అంటుంది. దానికి ఆమె చెప్పే అర్థం "అపారం అద్భుతం, అత్యంత క్లిష్టం, అస్పష్టం, ఆశ్చర్యకరం" అని.

స్త్రీల జీవితాలలో తాను అప్పటిదాకా చూస్తున్నదంతా ఆమెకు నీరవంగానూ, దయనీయంగానూ కనిపించింది. దీనికి వివాహ వ్యవస్థ కూడా కొంత కారణమని

ఆమె అప్పటికి తనకున్న పరిజ్ఞానాన్ని బట్టి భావించింది. వివాహం ఇష్టం లేదు. కానీ తనలో కలుగుతున్న రకరకాల భావాలు గ్రహిస్తూ అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ వుంది. తనకు ప్రణయ నివేదన చేసిన నిశాపతిని తిరస్కరించింది. అతను అవమానంతో ఊరు వదిలి వెళ్ళిపోయాడు.

ఇదంతా గ్రహిస్తున్న త్యాగతి ఆమెకు తన ఆత్మకథ రాసుకున్న పుస్తకాన్ని చదవమని ఇచ్చాడు. అప్పటికి హేమకు త్యాగతి ఒక సంవత్సర కాలంగా తెలుసు. హేమ అతన్ని తనకే తెలీకుండా ఇష్టపడుతూ వుంది. ఇప్పుడు త్యాగతి కథని ఎంతో ఆసక్తితో చదువుతూంది.

త్యాగతి శర్వరీ భూషణుడు మరెవరో కాదు. చనిపోయిన శకుంతల భర్త శ్రీనాథ మూర్తి, హేమకు బావ. శ్రీనాథమూర్తీ శకుంతల ఒకరి కోసం ఒకరు పుట్టారు. చిన్నప్పటి నుండి కలిసి పెరిగారు. ఆపేక్షలు పెంచుకున్నారు. పెద్దలుకూడా వారిని అలాగే చూశారు. క్రమంగా వయస్సుతో పాటు పెరిగిన ఆప్యాయతలు గాఢమైన అనురాగాలయ్యాయి. వాళ్ళిద్దరికి ఎంతో వైభవంగా పెళ్ళి జరిగింది. శ్రీనాథమూర్తి శకుంతలను దేవతగా ఆరాధించాడు. శకుంతలకు భర్తే లోకం. దాంపత్యం ప్రణయారాధనలో అద్వైతంగా మారిపోయింది. వేల గులాబీలు, మల్లెలు తెప్పించి శ్రీనాథమూర్తి ఒక శుభ ముహూర్తంలో శకుంతలను పీఠం మీద కూర్చోబెట్టి పూజ కూడా చేశాడు. షోడశ ఉపచారాలతో అర్చించాడు. అతని ప్రేమకు, ఆరాధనకు ఆమె వివశ అయి సోలిపోయింది. అంతటి అనురాగంతో జీవించే వారి మధ్య విషాద వియోగం సంభవించింది. మందులకు లొంగని జ్వరంతో శకుంతల చనిపోయింది. మరి శ్రీనాథమూర్తి పిచ్చివాడవడంలో ఆశ్చర్యం లేదు.

ఆ పిచ్చి రకరకాలుగా మారింది. కొంత కాలానికి కామోద్రిక్తత పెరిగింది. కానీ ఎవరితోనూ సంబంధం నచ్చేదికాదు. స్త్రీ శరీరం పట్ల కాంక్ష తగ్గేది కాదు. తన భ్రష్టత్వం తనకు తెలుస్తూనే వుండేది. తీర్థయాత్రలు చేసినా భక్తి కుదిరేది కాదు...తల్లి కూడా ఉంది కొడుకు పరిస్థితి చూసి కృశించిపోతూ వుండేది. అతనికి ఎక్కడ చూసినా శకుంతల రూపం నిలవనిచ్చేది కాదు.

అలాంటి రోజుల్లో కాశీలో ఉండగా సుశీల అనే వివాహిత మూర్తిని గాఢంగా ప్రేమించి అతని చేత తిరస్కరించబడి చావుబతుకుల్లోకి వెళ్ళి పోయింది. ఆమె భర్త

ప్రార్థనతో మూర్తి వెళ్లి ఆమెకు సేవ చేసి కోలుకునేలా చేస్తాడు. ఆ తర్వాత ఒక ఏకాంతంలో ఆమెకు దగ్గరవుతాడు. కానీ జరిగిన దానికి తనను తాను క్షమించు కోలేదు. సంఘర్షణతో దూరంగా వెళ్ళిపోతాడు. హరిద్వార్, హృషీకేశ్ తిరుగుతూ ఒకనాడు గంగానదిలో శకుంతల కనిపిస్తోందని వెళ్ళి మునిగిపోబోతాడు. అప్పుడు ఒక సాధువు అతన్ని రక్షించి అతని కథంతా గ్రహించి తన వెంట హిమాలయాలకు తీసుకువెళ్తాడు. శ్రీనాథమూర్తికి భక్తిలేదు. కానీ హిమాలయాల సౌందర్యం అతన్ని సేద తీరుస్తుంది. చివరకు కైలాస శిఖరం చూడగానే శకుంతల అందులో లీనమయినట్టు కనిపించి తిరిగి స్వస్థత పొందుతాడు. ఆ సాధువును గురువుగా స్వీకరిస్తాడు. ఆయన ఆజ్ఞమేరకు దేశమంతా తిరిగి చిత్రకళను, శిల్పకళను అభ్యసిస్తాడు.

యూరప్ అంతా పర్యటిస్తాడు. ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి తల్లి దగ్గరికి వస్తాడు. శకుంతల చెల్లెలు హేమను పెళ్ళి చేసుకోమని గురువు చెప్తాడు. అందుకే చెన్నపట్నంలో కాపురం పెట్టి శిల్పం అభ్యసిస్తూ, హేమకు తనెవరో చెప్పకుండా ఏడాది కాలం స్నేహంగా ఉంటాడు. పసిపిల్లగా ఉండగా అతను వెళ్ళిపోవడం వల్ల హేమ కూడా అతన్ని గుర్తు పట్టలేదు. హేమ తల్లిదండ్రులు, మూర్తి తల్లీ కూడా హేమకు తెలీకుండా అతని కోరిక మేరకు దాచారు.

ఇదంతా హేమ కన్నీళ్ళతో చదివింది. దుఃఖంతో పాటు ఆమె మనసులో రకరకాల భావాలు కలిగాయి. ఉన్నదంతా నిజాయితీగా రాసిన అతన్ని మెచ్చుకోవాలో, నిందించాలో తెలీలేదు. కానీ అతన్ని తన బావగా మాత్రం సంతోషంగా స్వీకరించింది.

ఎనిమిదేళ్లకాలం శ్రీనాథమూర్తిని శర్వరీ భూషణుణ్ణి చేసింది. అది గురువు పెట్టిన పేరు. ఈ మానవ జీవితానికి అర్థం త్యాగంలోనే ఉందని గ్రహించటం వల్ల తన పేరుకి ముందు త్యాగతి అని చేర్చుకున్నాడు. ఈ కాలంలో అతను పడిన క్షోభ అతనిని పతితుడిగా మార్చబోయింది. ఆత్మహత్యవేపు తీసుకెళ్ళింది. కాని పరిణితుడయిన వ్యక్తి పరిచయం, సహవాసం వల్ల అతడు తిరిగి మనిషిగా మారాడు. దానితో పాటు ఎంతో విద్యనూ, జ్ఞానాన్ని సంపాదించాడు.

హేమ తన ప్రాచ్య పాశ్చాత్య జ్ఞానంతో, తను చూస్తున్న సమాజాన్ని అర్థం చేసుకోవడంలో ఒక స్పష్టతకు రాలేకపోయింది. ఆమెకు త్యాగతి మాటల వల్ల

అతను అహంభావిగా కనిపించాడు. ఆమె ఆతని మీద కోపంతో ఏదో ఒక కఠినమైన పని చెయ్యాలనుకుంది. ఎవరికీ చెప్పకుండా తీర్థమిత్రుడితో కలిసి బొంబాయి పారిపోదామను కుంది. అవకాశవాది తీర్థమిత్రుడు ఈ అవకాశాన్ని వదులుకోలేదు. తీరా రైలు ఎక్కాక ఆమెకే ఇది ఎంత హేయమైన పనో అనిపించి దార్లో రైలుదిగి వెనక్కి వచ్చేసింది. హేమ మనసు బాధ పెట్టాననే పశ్చాత్తాపంతో ఉన్న త్యాగతిని పెళ్ళి చేసుకుంటుంది. ఈ నవలలో ఉన్న కథ ఇంత మాత్రమే

కానీ హేమ ద్వారా బాపిరాజుగారు చెప్పిన మాటలు, ఆమె ఆలోచనలు, భావాలూ ఎంత ఆధునికంగా ఉన్నాయో! ఆధునిక స్త్రీ ఎలా ఉండాలో హేమ చెప్పింది. అలాగే ఉంది. తన మంచీ చెడూ ఒకరు చెప్పడంవల్ల కాక తన అనుభవం ద్వారానే తెలుసుకుంది. ఏదో ఒక కారణం చేత ఏ పురుషుడి మీద అయినా ఇష్టం కలిగినా అది స్నేహం వరకే పరిమితం తప్ప ప్రేమ కాదని స్త్రీలు గ్రహించు కోవాలంటుంది. అన్ని విధాలా తాను సాధికారత సంపాదించాక అర్హుడయిన వ్యక్తినే భర్తగా ఎంచుకోమంది. స్త్రీలు, ఇల్లూ, పిల్లలూ చాకిరీ కాక లోకంలో ఇంకా చేయవలసిన పనులు ఎన్ని వున్నాయో చేసి చూపించింది. ఎంతో సంపన్నురాలయిన హేమకు ఇదంతా సాధ్యపడడం పెద్ద కష్టమేమీ కాదని అనిపించవచ్చుగానీ సంపన్న స్త్రీలంతా అలా వుండగలుగుతున్నారా? వీటన్నిటితో పాటు హేమకి ఉన్న అభిరుచి, ఆమె సౌందర్య దృష్టి ఆమె కళాత్మకతను చూపిస్తాయి.

అప్పటికి గురజాడ, చలం రచనల కారణంగా స్త్రీల స్వేచ్ఛ గురించి విద్యావంతులు ఆలోచిస్తూవున్నారు. భావకవులు స్త్రీని దేవతగా ఆరాధిస్తూ కవిత్వాలు మొదలుపెట్టారు. ఇదంతా బాపిరాజుగారి మీద ప్రభావం చూపించింది. దీనితో పాటు ఆయన స్వభావంలోని లాలిత్యం, అన్ని విషయాలపట్ల ఆయనకున్న అపార పరిజ్ఞానం నవల అంతటా నిండిపోయి పొంగి పొరలింది.

ఆ రోజుల్లోని గ్రామాలు, పట్టణాలు, నగరాలూ అప్పటి కుటుంబాలలోని మర్యాదలు, బంధు ప్రేమలు, ఆచారాలు అలవాట్లు, వంటలు సంప్రదాయాలూ, రకరకాల ఉద్యోగులు, వారి ఇళ్లూ వాటి అలంకారాలూ... ఒకటేమిటి ప్రతి విషయమూ కళ్లకు కట్టినట్టు అతి విపులంగా వర్ణిస్తారు. మనని ఎనభయి సంవత్సరాల వెనకటి ఆంధ్ర దేశపు నాగరికతలోకి తీసుకువెడతారు.

లలిత కళలు, వాటిని ఆస్వాదించడంలోని అందం, ఉన్నతమయిన అభిరుచులతో జీవితాన్ని నింపుకోవడం బాపిరాజు గారి నవలల్లో అడుగడుగునా

కనిపిస్తుంది. ఆయన వర్ణనలు కథను మించి పోతే పోయేయి. అది ఆయన ఆనందం అనుకుంటే సరి. కానీ ఆయా అంశాల కోసం మరే పుస్తకమూ వెతకనక్కర లేకుండా ఆయన నవలలు తిరగేస్తే చాలు. ఎన్నో దొరుకుతాయి.

బాపిరాజు గారిది ఈ లోకం కాదని, ఏదో గంధర్వలోకం నుంచి శాపవశాన ఈ లోకంలోకి వచ్చాడని కాటూరి వెంకటేశ్వరరావుగారు 'మా బాపి బావ' అనే వ్యాసంలో రాస్తారు. అందుకే ఆయన తన నవలల్లోంచి గంధర్వలోకపు అందాలూ, లాలిత్యాలూ మన హృదయాలకి అందిస్తారు. ఆ సుగంధం హృదయాలను అంటుకుని వదలదు. ఆ వదలని సుగంధంతో ఆబాల్య పర్యంతమూ అడివి బాపిరాజు గారిని ప్రేమించిన వాళ్లం మేం. నేను తొమ్మిదో క్లాసులో ఉండగా చదివిన ఈ నవల ఇన్నాళ్లకి మళ్లీ చదువుతుంటే హృదయం అప్పట్లాగే సున్నితమైన సంవేదనలకు లోను కావడం గమనిస్తూనే వున్నాను.

అందుకే భారతీయ నవలలో అడవి బాపిరాజుగారు రాసిన నవలల్లాంటివి మరెవ్వరూ రాయలేదని, రాయలేరని అనిపిస్తుంది. మళ్లీ ఒక్కసారి సహృదయ పాఠకులు 'తుపాను' చదివితే నేను మరేమీ చెప్పక్కర లేకుండానే తెలుగు నవలకు బాపిరాజుగారు అద్దిన నీటి రంగుల్ని గమనించగలుగుతారు.

# తెలంగాణ పోరాటం - తెలుగు కథ

**- కాత్యాయని విద్మహే**

దున్నేవానికే భూమి కావాలన్నదొక సైద్ధాంతిక భావన. దాన్ని సాధించు కొనటానికి ఒక సంఘటితశక్తిగా ఆచరణ రూపమైన కార్యక్రమంలో దున్నే వాళ్ళు ముందుకు వచ్చినపుడు వాళ్ళ కార్యక్రమాలకు భూస్వాములెటూ అడ్డుపడతారు. ఆ విధంగా మొదలయిన ఘర్షణ బలపడే క్రమంలో అది అనేక ముఖాల పోరాట రూపాన్ని సంతరించుకొంటూ తుది విజయం దాకా ఎదుగుతూనే వుంటుంది. ఆ పోరాటం ఆగకుండా సాగుతూ అప్పుడప్పుడు ఆగినట్లు కన్పిస్తుంది. దాన్ని మరింత బాగా ఎదగటానికి సరియైన అవకాశాన్ని అన్వేషించుకోటంగా అర్థం చేసుకోవాలి. ఈరకమైన రైతాంగ పోరాటం భారతదేశం మొత్తమీద మొదటిసారిగా తెలంగాణాలో 1946-50 సంవత్సరాల మధ్య కాలంలో ఒక భౌతిక వాస్తవికతగా బయటపడింది. దీని వారసత్వ ప్రభావ ఫలితాలు భారత రైతాంగ పోరాటాల్లో కనిపించటాన్ని అలావుంచితే, అది ఆంధ్రదేశంలోని శ్రీకాకుళం ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లోని రైతాంగ పోరాటాల్లో పునరుజ్జీవనం పొందింది. అంతేకాదు, పునర్నవత్వాన్ని కూడా సంతరించుకొంటూ ఉపరితల సాహిత్య కళారంగాన్ని తన ప్రతిఫలన రూపాలతో సముజ్వలం చేసింది. ఆ సాహిత్యం అటు పోరాటాన్నీ, ఇటు ప్రజా జీవితాన్ని, జీవితానికీ పోరాటానికీ అనివార్యంగా ఏర్పడ్డ గతి తార్కిక సంబంధాన్నీ ప్రతిఫలిస్తూ ప్రజా జీవితంలో నూతన ప్రజాస్వామిక చైతన్యాన్ని మేల్కొల్పటంలో తన ప్రభావ ముద్రను గాఢంగా వేయగలిగింది.

తెలంగాణాలో కొనసాగుతున్న రైతాంగ పోరాటం వర్తమాన చరిత్ర, నడుస్తున్న చరిత్ర, వ్యావసాయిక విప్లవోద్యమ చరిత్ర. దాని ఆరంభకాలం నుండి ప్రజా విప్లవ జీవన సాంస్కృతిక అవసరాలను తీర్చటంకోసం ప్రజలను వాళ్ళవాళ్ళ అనుభవాల నుండి రచయితలను చేసింది. సాహిత్య సృష్టికి దోహదం చేసింది.

నలభై ఏళ్ళ క్రితం తెలంగాణా పోరాట సాహిత్యంలో తెలంగాణాలో నివసించే వాళ్లైనా కాకుండానే కేవలం పోరాటాన్ని గురించి విని, పత్రికల ద్వారా చదివి ఉత్తేజితులై రచనలు చేసినవాళ్ళు ఎక్కువ మంది కనబడతారు. ఆ కారణంగానే వాళ్ళు తమ రచనల్లో పోరాటాన్ని దాని వాస్తవికతా మూలాల నుండి చిత్రించలేక పోయారనీ, పోరాట ప్రాంతాలను భౌగోళికంగా సరియైనవి తమ రచనల్లో గుర్తించలేకపోయారనీ విమర్శకు గురయ్యారు కూడా. ఆ లోపాన్ని అధిగమించి ఈనాటి తెలంగాణా పోరాటకథ, అప్పటికంటె అభివృద్ధికరంగా మరింత ప్రయోజనవంతంగా రూపుదిద్దుకొంటున్నది.

చరిత్ర నేర్పిన గుణపాఠాల నుండి ఉద్యమ స్వరూపంలోనూ, స్వభావంలోనూ అభివృద్ధికరమైన మార్పు చోటు చేసుకొన్నట్లే ఆ ఉద్యమ ప్రతిఫలన కళారూపాల్లో కూడా ఆ అభివృద్ధి కనబడుతుంది. ఈనాడు తెలంగాణా పోరాట కథలు వ్రాసే వాళ్ళు, ఉద్యమంతో ప్రత్యక్ష సంబంధం వున్నవాళ్ళు, కాకపోతే దగ్గర నుంచో, దూరం నుంచో, ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఆ ఉద్యమ నిర్వహణాభివృద్ధుల క్రమంలో వచ్చే ఆటుపోట్లను అనుభవిస్తున్నవాళ్ళు. వాళ్ళు కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో రైతాంగ పోరాటాలకు సాక్షీభూతులుగా వుంటూ పోరాట క్రమంలో అత్యంత వేగంగా మార్పుచెందే ప్రజల జీవితాన్ని, అందులోని సంఘర్షణను అతి సన్నిహితంగా చూస్తూ, అవగాహన చేసుకొంటూ అనివార్యంగా రచయితలై వ్రాస్తున్నారు.

చారిత్రాత్మకమైన తెలంగాణా పోరాటం సాధించిన విజయాలను ఆనాడు తెలంగాణాలో ప్రవేశించిన యూనియన్ సైన్యం ఆనవాలు లేకుండా తుడిచేసిన విషయం తత్ఫలితంగా అంతకుముందు ప్రజల సంఘటిత శక్తికి భయపడి గ్రామాలు వదలిపోయిన దొరలు, భూస్వాములు ఖద్దరు టోపీలు ధరించి గ్రామాలకు తిరిగివచ్చి యధాపూర్వకంగా పెత్తందార్లుగా కొనసాగటం అందరికీ తెలిసిందే. సారాంశంలో దేశానికి 'స్వాతంత్ర్యం వచ్చినా బడుగు జీవుల బ్రతుకు బాగుపడ్డది లేదు. నిజాం సంస్థాన ప్రభుత్వమైతే పోయింది కానీ తెలంగాణాలో భూస్వాముల అధికారాలు, అవకాశాలు చెక్కుచెదరలేదు. 'ప్రజా ప్రభుత్వ' అండదండలతో భూకేంద్రీకరణ కొనసాగుతూనే వుంది. కౌల్దారీ చట్టాలు, భూపరిమితి చట్టాలు ఎన్ని వచ్చినా ఆచరణలో దున్నేవాడికి భూమిమీద హక్కు లేకపోవటం, దున్నటమే

తెలియనివాళ్ళకు భూమి స్వంతమై వుండటం శ్రమదోపిడీకి, భూస్వాముల పీడనకు గురి అవుతూ రైతాంగం కూలిజనంగా మారిపోవటం నానాటికీ ఎక్కువవుతున్నది. ఇటువంటి పరిస్థితులలో పీడిత రైతాంగాన్ని సంఘటితం చేయటానికి ఆనాటి ఆంధ్ర మహాసభలాగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు – లెనినిస్టు, పీపుల్స్‌వార్ గ్రూపు) 1972 నాటికి తెలంగాణా జిల్లాల్లోకి ప్రవేశించి రైతుకూలీ సంఘాలను నిర్మించింది. రైతుకూలీ సంఘం నాయకత్వంలో వివిధ ప్రాంతాల్లో ముఖ్యంగా కరీంనగర్, అదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ప్రజలు భూమిమీద హక్కు కోసం పోరాటాలు ప్రారంభించి చేస్తున్నారు. దొరల అధీనంలో వున్న వివిధ వృత్తుల వారి పట్టాలను, ఆయా వృత్తులవాళ్ళు సాగుకు తెచ్చుకోవటం, రక్షిత కౌలుదార్లు అయివుండి కూడా ప్రభుత్వం యొక్క భూస్వామ్య అనుకూల విధానంవల్ల భూములకు తాము సాగుచేసుకోలేని స్థితిలో వున్నవాళ్ళు తమ హక్కుల సాధన కోసం, బంజరు భూముల పట్టాల కోసం, పోరాటాలు చేపట్టటం, అడ్డుపడి దౌర్జన్యం చేయవచ్చిన దొరలను, గుండాలను ప్రతిఘటించి నిలవటం, కూలిరేట్లు పెంపుదల కోసం సమ్మెలు కట్టటం, ఆ క్రమంలో ప్రభుత్వ రాజకీయ పోలీసులు పెట్టే చిత్రహింసలకు, కుట్ర కేసులకు గురికావటం, అయినా మొక్కవోని ధైర్యంతో అంతిమ విజయం కోసం పోరాటాలను కొనసాగించటం తెలంగాణాలో నడుస్తున్న రైతాంగ పోరాట స్వరూపమూ– స్వభావము. ఈ పోరాట ప్రతిఫలన రూపంగా వస్తున్న సాహిత్యం ముఖ్యంగా కథ, ఆ పోరాట స్వరూప స్వభావాలను సమగ్రంగా సృజనాత్మకంగా తెలుగువాళ్ళ అవగాహనకై అందిస్తున్నది.

## I

తెలంగాణా పోరాట సాహిత్యపు ప్రారంభ రూపం 'మోతుబరి' లాంటి కథల్లో 1971 నాటికే కనబడుతున్నా ఆ సాహిత్యం కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించటానికి అంటే అక్టోబరు 1976 నాటికి దాదాపు ఒక ఏడాది ముందునుండి మాత్రమే విప్లవాచరణ కార్యక్రమంలో ఒక అనివార్య భాగంగా తన అసలైన స్వరూపంతో, స్వభావంతో ముందుకు వచ్చింది. ఈ క్రమంలో వచ్చిన కథాసాహిత్యంలో పోరాటానికి ముందుండిన దోపిడి పరిస్థితులను చిత్రించినవి, ప్రజలు తమ మీద జరుగుతున్న దోపిడి దౌర్జన్యాలను భరించలేక ఎదురుతిరగటానికి సిద్ధమైన స్థితిని చిత్రించినవి.

రైతాంగానికి భూమిమీద వుండే ప్రేమను చిత్రించినవి, ఆ ప్రేమతోనే భూమిని దక్కించుకోవటం కోసం ప్రాణాలకు తెగించటాన్ని చిత్రించినవి, జనం సంఘటితమై 'సంఘా'లను నిర్మించుకోవటాన్ని చిత్రించినవి, రైతు కూలీ 'సంఘం' బలాన్ని చిత్రించినవి, ప్రజా విజయాలను చిత్రించినవి, గ్రామాల్లోకి పోలీసుల ప్రవేశాన్ని చిత్రించినవి, పోలీసుల దౌర్జన్యాలను చిత్రించినవి, విప్లవోద్యమంలోకి పూర్తికాలం కార్యకర్తలుగా వెళ్ళినవాళ్ళ కుటుంబాల సంక్షేమం గురించి, నైతిక ధృతి చెడకుండా వుండటాన్ని గురించి తగుజాగ్రత్తలు తీసుకునే 'సంఘ' చర్యలను చిత్రించినవి, నిర్బంధాల మధ్య పోరాటాల కొనసాగింపును చిత్రించినవి–ఇట్లా విప్లవోద్యమంలోని వివిధ దశలను కోణాలను చిత్రించిన కథలు అనేకం వున్నాయి.

వుప్పల నరసింహం వ్రాసిన 'కనుపాపను కబళిస్తే' అనే కథ పటేళ్ళ కోసం వాళ్ళ భూముల్లో, బావుల్లో పనిచేసే రైతుకూలీలు ప్రమాదాలకు గురవుతూ, శారీరక వైకల్యాలను పొందుతూ, ప్రాణాలను కోల్పోతూ పనికి తగిన ప్రతిఫలమెట్లాలేదో అట్లాగే రిస్కుకు తగిన పరిహారం కూడా లేని పరిస్థితుల్లో బిచ్చగాళ్ళుగా మారుతున్న విషయాన్ని నిరూపిస్తుంది. అల్లం రాజయ్య వ్రాసిన 'ఎదురు తిరిగితే' అనే కథ, తుమ్మేటి రఘోత్తమరెడ్డి వ్రాసిన 'ధిక్కారం' అనే కథ, వుప్పల నరసింహం వ్రాసిన 'కథ అడ్డం తిరిగింది'లాంటి కథలు జనం తరతరాలుగా తమ మీద సాగిస్తున్న దొరల దోపిడీ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు బావుటాలను ఎగురవెయ్యటాన్ని సూచిస్తాయి. వ్యక్తులుగా జనం చేసిన ఈ తిరుగుబాట్లు విజయవంతం కావాలంటే ఒకసారి ఎత్తిన తలలను మరి మళ్ళీ దించకుండా వుండాలంటే 'సంఘ' బలం అవసరం.

నిత్య జీవితంలో తిండికోసం, వసతికోసం తామెదుర్కొనే అనేకానేక సమస్యలను సంఘటితం కావటం ద్వారా మాత్రమే పరిష్కరించుకోగలమన్న చైతన్యాన్ని ప్రజలు పొందే క్రమాన్ని చెప్తాయి తుమ్మేటి రఘోత్తమరెడ్డి వ్రాసిన 'ఒక్కటైతే', అల్లం రాజయ్య వ్రాసిన 'గోడ' అనే కథలు. జనమంతా ఒక్కటి కావటమన్న ఆలోచన, ఆచరణ సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని సాధించుకొనే ఆశయంతో మరింత అభివృద్ధికరంగా పరిణమించే క్రమంలో 'సంఘాలు' ఏర్పడతాయి.

సంఘ నిర్మాణంలో ముఖ్యోద్దేశం దున్నేవానికి భూమి హక్కును కల్పించటం, వెట్టిచాకిరి, అక్రమ వసూళ్ళు, సాంఘిక దౌర్జన్యాలు ఇవన్నీ కీలకమైన భూమి

సమస్యను చుట్టుకొనే వుంటాయి. కాబట్టి భూమి సమస్య పరిష్కరించబడకుండా మిగిలిన సమస్యలను పరిష్కరించటం సాధ్యం కాదు. అందువల్లనే 'సంఘాలు' ప్రధానమైన భూమి సమస్య మీద ప్రజలను ఏకం చేస్తాయి. రైతాంగాన్ని సంఘటితం చేయగల మహత్తరశక్తి భూమికి వుంది. భూమి, ఎద్దులు, నాగండ్లు ఉత్పత్తి సాధనాలు. తన జీవనం ఏ ఉత్పత్తిసాధనాల మీదనైతే పూర్తిగా ఆధారపడి వుందో ఆ ఉత్పత్తి సాధనాల నుండి పరాయీకరణను రైతు భరించలేడు. తాను ఒక్కడుగా ఆ పరిస్థితిని ఎదుర్కొంటున్నప్పుడు అతనికి సానుభూతిని ఓదార్పును యిచ్చి భూమి కోసం పోరాటానికి ప్రోత్సహించే శక్తిగా 'సంఘం' ముందుకు వస్తుంది.

అల్లం రాజయ్య వ్రాసిన 'పుడమిపుత్రులు', 'మట్టిమనిషి', కాలువ మల్లయ్య వ్రాసిన 'ఈభూమినాది', 'పాలేరు', వుప్పల నరసింహం వ్రాసిన 'ఇసప్పూరుగు' మొదలైన కథలు తన జీవనం కోసం భూమిని నమ్ముకొన్న మనిషి దానినెంతగా ప్రేమిస్తాడో, ఆ భూమిని దొరలు చెరపట్టినప్పుడెంతగా ఆక్రోశిస్తాడో, దానిని దక్కించుకోవటం కోసం సంఘంలో ఎట్లా భాగస్వామి అవుతాడో, పోరాట మార్గాలోకి ఎట్లా ప్రవేశిస్తాడో తెలియజేస్తాయి. సూతుడు వ్రాసిన 'సంఘపోల్లు', అల్లం రాజయ్య వ్రాసిన 'దున్నేవానిదే భూమి', 'సృష్టికర్తలు' మొదలైన కథలు– ప్రజలు సంఘటితమై దొరలాక్రమించిన భూములను, బంజర్లను, పోరంబోకులను దున్నటానికి సిద్ధపడటాన్ని చిత్రిస్తాయి.

అయితే ఇన్నాళ్ళ నుండి అణగిమణిగి ఉన్న జనం సంఘాలు కడితే, తమ హక్కుల కోసం పోరాటాలు ప్రారంభిస్తే భూస్వాములు ఊరుకోరు. భూస్వామ్య అనుకూల ప్రభుత్వాలు ఊరుకోవు. ఫలితంగా రకరకాల మార్గాల్లో జనాన్ని భయపెట్టటానికి సంఘం నుండి వైదొలగేటట్లు చేయటానికి ప్రయత్నాలు జరుగుతాయి. పోరాటంలోని ఈ దశను చిత్రించే కథలు కూడా వచ్చాయి. వుప్పల నరసింహం వ్రాసిన 'పంచాది' కథ ఇటువంటిదే దొరలు పంచాయితీలు పెట్టి సంఘ కార్యకర్తలుగా పనిచేస్తున్న యువకుల తల్లిదండ్రులను అదిరించి బెదిరించటం, వాళ్ళ దగ్గర నుండి దండుగలు వసూలు చేయటం ఈ కథకు ఇతివృత్తమైంది.

దొరలు పంచాయతీలు పెట్టటంతో ఆగరు. రాజ్యాంగ యంత్ర సహాయంతో ప్రజలను భయభ్రాంతులను చేసే ప్రయత్నాలు చేస్తారు. ఊళ్ళలోకి పోలీసు

కాంపులను తీసుకువస్తారు. సంఘ కార్యకర్తలమీద దాడులు చేయిస్తారు. చిత్రహింసలు పెట్టిస్తారు. కేసులు పెట్టిస్తారు. న్యాయస్థానాల చుట్టూ తిప్పిస్తారు. కిరణ్ వ్రాసిన 'మనుషులవేట' అనే కథ భూస్వాముల భవంతులు పోలీసు నాకాలై ప్రజలను చిత్రహింసలకు గురి చెయ్యటాన్ని, తత్ఫలితంగా మరణించినవాళ్ళని ఎన్‌కౌంటర్లో మరణించారని ప్రకటించటాన్ని చిత్రీకరిస్తుంది. సాహు వ్రాసిన 'పోలీసుదాడి' అనే కథ భూమి పోరాటాల్లో పాల్గొనే వాళ్ళ నైతిక ధృతి మీద దెబ్బ కొట్టటానికి వాళ్ళ స్త్రీల మానాల నెట్లా దోచిందీ చెప్తుంది. ఈ కథలోని సంఘటన సిరిసిల్ల తాలూకా కొదురుపాక గ్రామంలో జోగినిపల్లి వెంకట్రామారావనే భూస్వామి రైతుకూలీ సంఘ మహిళా విభాగం సభ్యురాలైన రాజవ్వ మీద తన గూండాల చేత 1978 అక్టోబరు 29వ తేదీన చేయించిన అఘాయిత్యాన్ని పోలివుంది. అల్లం రాజయ్య వ్రాసిన 'మట్టిమనిషి', గోపీ వ్రాసిన 'దొరగారి కుక్క', పి. చందు వ్రాసిన 'ఒరిగిన అన్నల కెన్నియాల్లో...' అనే కథలు ఊళ్ళు పోలీసు క్యాంపులై భూమి మీద హక్కుకోసం పోరాడే వాళ్ళను క్యాంపుల్లో పెట్టి చిత్రహింసలకు గురిచెయ్యటాన్ని చూపిస్తాయి. అరెస్టులు, చిత్రహింసలు విప్లవాన్ని ఆపలేవు అని తెలంగాణా పోరాట అనుభవం ఏ విషయాన్నయితే చెబుతున్నదో ఆ పోరాటాన్ని ప్రతిబింబించే కథలు కూడా అదే విషయాన్ని చెబుతున్నాయి. మట్టిమనిషి. దొరగారి కుక్క, ఒరిగిన అన్నల కెన్నీయల్లో... కథల్లో పోలీసు క్యాంపుల్లో చిత్రహింసలకు గురి అయిన రైతులుగానీ, యువకులు గానీ ఒక్క విషయాన్ని బైట పెట్టక పోగా తమ చుట్టూ వున్న చీకటిని గెలవాలనే పట్టుదలతో గెలుస్తామన్న ఆశాభావంతో భూమికోసం ప్రాణాలర్పించటానికైనా సిద్ధపడి వుండటాన్ని గమనించవచ్చు.

భూమికోసం తాపత్రయపడే ఈ జనం దొరలు అక్రమంగా అన్యాయంగా ఆక్రమించుకొన్న భూములను, బంజర్లను, పోరంబోకులను తమ జీవనానికై దున్నుకోవటానికి సిద్ధపడితే అది ఆ దొరల దృష్టిలో దొంగతనం అవుతుంది. దొంగతనాలు, దోపిడీలు చేసే శక్తులను విచారించి శిక్షించటానికి న్యాయస్థానాలు ఉన్నాయి. కాని చాలవరకు ఈ రైతు కూలీలను కోర్టు వరకు తీసుకపోవటం వుండదు. దొరలు పోలీసులై వాళ్ళను పట్టిచ్చి యిస్తే పోలీసులే న్యాయనిర్ణేతలై పోలీసు స్టేషన్లలో, క్యాంపుల్లో వాళ్ళను చిత్రహింసల పాలు చేస్తారు. శిక్షిస్తారు.

ఈ పరిస్థితుల్లో రైతాంగం యొక్క ఆలోచన, వాళ్ళ దృక్పథం వాదం నలుగురిలోకి రాకుండాను, రికార్డు కాకుండాను పోతున్నాయి. ఎప్పుడయినా వీళ్ళు న్యాయస్థానాల వరకు తీసుకోబడ్డా, దొరల ఫిర్యాదులు, పోలీసుల ఆరోపణలు సాక్ష్యాల మీదనే కేసులు నడుస్తాయి– తీర్పులివ్వబడతాయి. అల్లం రాజయ్య వ్రాసిన 'సృష్టికర్తలు', 'అడవి మనిషి', కిరణ్ వ్రాసిన 'శత్రువు నేర్పిన పాఠం' మొదలైన కథలు మట్టి మనుషుల పట్ల న్యాయస్థానాల వైఖరి ఎలా వుంటుందో నిరూపిస్తాయి. సృష్టికర్తలు కథ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు భూస్వాముల, పోలీసుల ప్రయోజనాలకోసం న్యాయస్థానాల్లో పనిచేయటాన్ని చిత్రిస్తుంది. దొరలు రైతాంగం మీద ఏయే దౌర్జన్యాలను జరిపారో వాటిని తలకిందులు చేసి దొరల మీదనే రైతాంగం చేసిన దౌర్జన్యాలుగా చూపటానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్లు చేసే ప్రయత్నాన్ని చిత్రించింది. ప్రజలను భయభ్రాంతులను చేయటానికై వూళ్లోకి తీసుకువచ్చిన పోలీసు క్యాంపును దొర జనం నుండి తనకు భద్రత కోసం తెచ్చుకున్నాడని చెబుతూ ఈ న్యాయ స్థానాలు పేదసాదల్ని దొంగలుగా, దేశద్రోహులుగా ముద్రవేసి చూపుతున్నాయని, ముద్దాయిలుగా కోర్టుకు తీసుకురాబడిన రైతుల గోడును వినిపించుకొనే నాథుడే అక్కడ లేడని ఈ కథ చెబుతుంది. మొత్తంమీద భూస్వాముల ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేసే రాజ్యాంగ వ్యవస్థలో న్యాయవ్యవస్థ కూడా అందులో భాగంగానే వుంటుందని ఈ కథ స్పష్టం చేస్తుంది.

'సృష్టికర్తలు' కథాప్రయోజన విలువ దృష్ట్యానే కాకుండా సౌందర్య విలువ దృష్ట్యా కూడా ఎన్నదగ్గ కథ. కథాప్రారంభంలోనే సూర్యోదయాన్ని ఆ సమయంలో ప్రకృతిలో వచ్చే మార్పుల్ని వర్ణించటం ద్వారా కథకు మంచి వాతావరణ కల్పన చేశాడు రచయిత. ఆ వర్ణన గ్రామీణ వాతావరణాన్ని చిత్రపటంలా కళ్ళకు కట్టిస్తుంది. ఈ కథ భూమిని భార్యను, పిల్లల్ని కోల్పోయి వృద్ధాప్యంలో బర్రెలు కాసుకు బతుకుతున్న ఓదెలు దృష్టికోణంనుండి నడపబడింది. కథలోని సంఘటనలకు – రైతుకూలీలు నూరెకరాల చెలకను ముప్పయి నాగండ్లతో దున్నేందుకు రావటానికి, పొలంలో ఎర్రజెండాలు పాతి పని ప్రారంభించటానికి, ముత్యంరావు దొర, పట్వారీ గోపయ్య పోలీసులతో వచ్చి వాళ్ళు పొలం దున్నకుండా అడ్డుపడటానికి, పొలం వదిలిపోవటానికి యిష్టపడని జనం మీద పోలీసు తుపాకులు పేలటానికి, నాగేటి చాళ్ళను రక్తంతో తడుపుతూ జనం పడిపోవటానికి, అరెస్టులకు, చిత్రహింసలకు అన్నింటికి అతను మౌనసాక్షి.

ఆ మౌనం కోర్టులో ముద్దాయిలుగా కోర్టుకు తేబడిన వాళ్ళమీద పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేసిన అన్యాయపు ఆరోపణలతో బద్దలవుతుంది. అంతవరకు మౌనంగా వున్న బర్ల ఓదెలు అతను మాట్లాడతాడని మాట్లాడగలడని కథలోని తోటి పాత్రలుగానీ, పాఠకులుగానీ ఊహించనైనా ఊహించని సమయంలో మాట్లాడతాడు. నోరెత్తి మాట్లాడుతారనైనా ఊహించటానికి వీల్లేని జనం నోరు మూసుకు పడి వున్నంత సేపు అంతా సజావుగా వున్నట్లే వుంటుంది. వాళ్ళు నోరు విప్పిన మరుక్షణం ఎంతటి అగ్ని పర్వతాలు పేలుతాయో బర్ల ఓదేలు మాట్లాడిన మాటలు స్పష్టం చేస్తాయి. ఆ మాటల్లో తాము మరింత పేదలయ్యే క్రమంలో దొరలెట్లా పెద్దవాళ్ళవుతున్నారో చెప్తాడతను. రైతులంతా కలిసి దొర పొలం పంటను నాశనం చేశారన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆరోపణకు సమాధానంగా సమస్త వస్తూత్పత్తులను సృష్టించే తాము తమ సృష్టిని నాశనం చేసుకోలేమని చెప్పిన మాటలు అతి సహజంగానూ గొప్ప భావోద్రేకంతోనూ కూడుకొని ఉన్నాయి. కథ చివర్లో స్వగతంగా గొణుగుడుగా అతను “మా నెత్తురు – మా మాంసం – మా బొక్కలు, మా మూలుగు, మా బతుకు, మా సుఖం, కట్టం– చెమట– కన్నీళ్లు మేం నాశిడం జేసుకుంటామురా?” అని ఈ వ్యవస్థను వేసిన ప్రశ్న మానవ సహజమైన సెంటిమెంట్లని కదిలించటమే కాదు హృదయాలను కలతపెట్టి విప్లవోద్యమాల పట్ల సానుభూతిని పెంచుతాయి.

‘శత్రువు నేర్పిన పాఠం’ కథ పేదసాదల్ని, భూమి పోరాటాలలో పాలు పంచుకొన్న వాళ్ళని తప్పుడు కేసుల్లో యిరికించి కోర్టుల చుట్టూ తిప్పటాన్ని చిత్రిస్తుంది. ‘సృష్టికర్తలు’ కథలో రైతులు సర్వ సంపదలను తాము సృష్టిస్తున్నామని తెలుసుకొని ఆత్మవిశ్వాసంతో న్యాయస్థానంలో ఎలుగెత్తి ఆ విషయాన్ని ప్రకటిస్తే న్యాయవాదులు, న్యాయమూర్తులు పెద్దగా అది తమకు పట్టనట్లుంటారు. అదే న్యాయవాదులు, న్యాయమూర్తులు ‘శత్రువు నేర్పిన పాఠం’ కథలో కోర్టుల చుట్టూ తిరిగి తిరిగి విసిగిన వ్యక్తి సమస్త శ్రమ జీవులకు ప్రతినిధిగా తాము తమ శ్రమ ఫలితాలను దక్కించుకోవటం కోసం ఆయుధాన్ని పట్టటం శత్రువు దగ్గరనుండే, దొరల దగ్గర నుండే నేర్చుకొన్నామని ప్రకటించినప్పుడు వాళ్ళు తమ పునాదులు కదిలినట్లు చలించిపోతారు. ఈ విషయాన్నే మరింత బలంగా ‘అడవి మనిషి’ కథ చిత్రిస్తుంది.

రైతాంగం భూమి మీద హక్కు కోసమై సాగించే పోరాటంలో నిర్బంధాల నెదుర్కొంటూ కూడా ఎప్పటికప్పుడు కొత్త ఎత్తుగడలతో ముందుకు సాగాల్సి ఉంటుంది అట్లా సాగే దశను చిత్రిస్తాయి. అల్లం రాజయ్య వ్రాసిన మట్టిమనిషి, బి.యస్. రాములు వ్రాసిన జరిమానా కథలు. జనం దొరలకు ఎదురు తిరిగితే, తమ భూముల్ని తాము దున్నుకుంటే పోలీసులు వచ్చి వాళ్ళను అరెస్టు చేస్తారు. చిత్రహింసలు పెడతారు. ఇటువంటి సందర్భాలలో పోలీసు నాకాల్లో నెలల తరబడి బందీలుగా వుండిపోయేవాళ్ళు 'సంఘం' తమ గురించి ఏమైనా ఆలోచిస్తున్నదో కూడా తెలియని స్థితిలో నైతిక ధృతిని కోల్పోయే అవకాశం వుంది. అది ఉద్యమానికి నష్టం కలిగిస్తుంది. దీనిని అధిగమించటానికి సంఘాలు పెట్టిన జనంలో ఎవరో ఒకరు ఏదో ఒకరకంగా బందీలై వున్న వాళ్ళ దగ్గరకు వెళ్ళి వాళ్ళకు ధైర్యం చెప్పే పనిచెయ్యాలి. 'మట్టిమనిషి' కథ ఆ రకమైన ఎత్తుగడ ఇతివృత్తంగా వ్రాయబడ్డ కథ. పక్క వూళ్ళో చేపలు అమ్మటం నిమిత్తంగా ఊరిచివర వున్న పోలీసు నాకా ప్రాంతాలలో తచ్చాడి పోలీసుల కంటపడి, పోలీసుల కోసం చేపలు కడిగి పెడుతూ, పోలీసుల కన్నుగప్పి ఆ నాకాలో వున్న మట్టిమనిషితో మాట్లాడి – ఆ రైతు భూమిని సంఘం దున్నిందని, ఊరి పటేలు అతనికి జమానుతు యిచ్చి విడిపించే ఏర్పాటు కూడా జరిగిందని ధైర్యం చెప్పి వెళ్తాడు ఒక కుర్రాడు ఈ కథలో.

అరెస్టయిన రైతాంగాన్ని విడిపించుకోవటానికి జామీను ఇవ్వాల్సి వుంటుంది. అందుకు తగ్గ డబ్బు కట్టే ఆర్థిక స్తోమత ఆ కుటుంబాలకుండదు. అంత ఆర్థిక స్తోమతే వుంటే ప్రాణాలకు తెగించి వాళ్ళీ పోరాట మార్గంలోకి ప్రవేశించరు. విప్లవిస్తే పోయేదేమీ లేదు కనుక ఆకలితో చచ్చేకంటే పోరాటంలో చావటం మేలనుకొంటున్నారు. కనుక వాళ్ళు ఉద్యమంలో భాగస్వాములవుతున్నారు. అటువంటి వాళ్ళను విడిపించుకోవటం, వాళ్ళమీద మోపబడ్డ కేసుల కోసమై కోర్టుల చుట్టూ తిరగటం– ఇవి డబ్బుతో కూడుకొన్న వ్యవహారాలు. జనమంతా ఒక్కటిగా అయి వూళ్ళో దొరలు, భూస్వాములు, పటేల్ పట్వారీల మీద ఒత్తిడి తెచ్చి వాళ్ళే తమ కష్టాలకు కారణం కనుక వాళ్ళచేతే ఈ ఖర్చులన్నింటినీ భరించటానికి ఒప్పిస్తారు. ఆ రకంగా ఉద్యమాన్ని కుంటుపడనీయకుండా కొనసాగిస్తారు. బి.యస్.రాములు వ్రాసిన 'జరిమానా' కథ ఇట్లాంటిదే. సంఘం

చురుగ్గా పనిచేస్తున్న ఒకానొక వూళ్ళోకి పోలీసు క్యాంపు పెట్టించబడి కేసుల్లో రైతాంగాన్ని కోర్టు చుట్టూ తిప్పుతూ తిప్పలు పెడుతుంటే అందువల్ల నష్టపడుతున్న వాళ్ళు కష్టపడుతున్న వాళ్ళు దానికి పరిహారాన్ని దొర దగ్గర నుండే వసూలుచేసే కొత్త ఎత్తుగడతో ఉద్యమాన్ని ముందుకు నడిపించటం ఇందులో ఇతివృత్తం.

ప్రభుత్వ పోలీసుల అండదండలు ఎంతగా వున్నా నిత్యం ఏ జనంతో కలిసి వుండాలో ఆ జనం సంఘటితమయ్యేసరికి తమ దగ్గర నుండి దండుగలు వసూలుచేసి అప్పులు మాపు చేయించుకొని, కూలీరేట్లు పెంచుకొని తమ మీద వాళ్ళు విజయాలు సాధిస్తుండేసరికి దొరకు మనసులో సంఘం ఎడల జంకు, భయము ఏర్పడటం సహజం. ఈ దశను చిత్రిస్తుంది తుమ్మేటి రఘోత్తమరెడ్డి వ్రాసిన 'సవారీ' అనే కథ. ఇది రెండు విడతలుగా వచ్చింది. మొదటి భాగం 1991 నవంబరు సృజనలో వచ్చింది. దొర తానేదో ఊరికిపోతూ ఆనవాయితీగా బండిముందు చాకలి పిల్లవాణ్ణి వురికిస్తూ మధ్యలో రైతుకూలీ సంఘం సభ జరుగుతుంటే సంఘానికి భయపడి ఆ పిల్లవాణ్ణి పరుగు ఆపి బండి ఎక్కమంటాడు. ఇది మొదటి భాగం కథ. అయితే ఇక్కడితో ఆ కథ ఆగటం రచయితకు తృప్తి కలిగినట్లు లేదు. సంఘానికి దొరలు భయపడుతున్నారని చెప్పటంవల్ల, ఉద్యమానికి ఒరిగే లాభం ఏమిటి? దొరల నైతిక ధృతి సంఘం వల్ల దిగజారినప్పుడు అది అవకాశంగా సంఘం ఇంకా ఎంతోమంది జనాన్ని కలుపుకొని బలపడుతుందని చెప్పటం ప్రోత్సాహకరంగా వుంటుంది. విప్లవోద్యమంలోకి అధికసంఖ్యలో జనాన్ని ఆకర్షించటానికి అదొక అవసరం కూడా. అందువల్ల మొదటి భాగంలో దొర దృష్టికోణం నుండి కథను నడిపిన రచయిత మూడేళ్ళ తరువాత అంతవరకు బండి ముందు పరుగెత్తి ఆ తరువాత దొర ఆదేశం మేరకు బండి ఎక్కిన చాకలి పిల్లవాడి దృష్టికోణం నుండి కథ నడుపుతాడు. అంతవరకూ తన కష్టాన్ని గురించే పట్టించుకోకుండా వున్న దొర హఠాత్తుగా తనను బండి ఎందుకు ఎక్కమన్నాడో అర్థంకాక ఆలోచనల్లో పడ్డ ఆ పిల్లవాడికి రైతుకూలీ సంఘ సమావేశ ప్రాంతాన్ని దాటాక దొర తనను మళ్ళీ దిగమని గద్దించినప్పుడుగానీ దొర సంఘానికి భయపడ్డాడన్న విషయం అర్థం కాలేదు. అందర్ని భయపెట్టటమే తెలిసిన దొరని భయపెట్టగల సంఘం ఒకటి వున్నదన్న విషయం ఆ చిన్న బుర్రకు తట్టేసరికి తానిక ఆ సంఘం మనిషి కావాలనుకుంటాడు. "రైతుకూలీ సంఘం సభ దిక్కు, వేల జనం దిక్కు, తనోళ్ళదిక్కు వురికాడని" చెప్పి కథ ముగిస్తాడు రచయిత.

సంఘ భయం ఎక్కువై దొరలు వూళ్ళను పోలీసుల కప్పగించి తాము పట్నాలకు చేరుకొన్న సంఘటనలున్నాయి – విప్లవోద్యమంలో. ఈ సంఘటనలను ఆధారంగా చేసుకొని భూస్వామ్య వ్యవస్థ విషాదకరమైన ముగింపుకు సన్నిహితంగా వుందని ప్రతీకాత్మకంగా తెలియచేసే కథలు రెండు వున్నాయి. ఒకటి అల్లం రాజయ్య వ్రాసిన 'మార్పు', రెండవది గోపీ వ్రాసిన 'దొరగారి కుక్క'. మొదటి కథలో దొర వదిలిన ఆంబోతు, రెండవ కథలో దొర పెంపుడు కుక్క దొరల్లాగానే పెరిగి ప్రవర్తించి– ఆ దొరలు వూళ్ళోకి సంఘాలు వచ్చాక వూళ్ళు విడిచి వెళ్ళిపోతే మామూలు ఎద్దులాగా, కుక్కలాగా బతకటానికి చాతగాక ఘోరమైన చావు చస్తాయి. అవి అట్లా చాపటాన్ని చిత్రించటం ద్వారా భూస్వామ్య వ్యవస్థ కూడా అట్లాగే వినాశనానికి చేరువగా ఉందని సూచిస్తారు రచయితలు.

తెలంగాణా పోరాటానికి ఇరుసు భూమి సమస్యే అయినా భూమిని దానిమీద స్వామ్యాన్ని చుట్టుకొని అనేక సాంస్కృతిక సమస్యలు కూడా వుంటాయి. భూమిమీద స్వామ్యంగల వర్గాలు దాన్ని ఆధారంగా చేసుకొని ప్రజల సంస్కృతిని సంబంధాలను నిర్ణయించే శక్తులుగా కూడా తయారవుతాయి. వాటిని ఎదుర్కోవటం పోరాటంలో ఒక భాగంగా ముందుకు వస్తుంది. ఈ స్థితిని చిత్రించే కథలు 'చుక్క' వ్రాసిన 'ఎత్తున్రి పిడికిళ్ళు', కాలువ మల్లయ్య వ్రాసిన 'వెలి', తెలంగాణాలో అన్ని వర్ణాల వాళ్ళు ఉత్సాహంగా జరుపుకొనే పండుగలల్లో బతుకమ్మ పండుగ ముఖ్యమైంది. ఇది స్త్రీల పండుగ. భూమిమీద హక్కు కేంద్రీకరింపబడిన తెలంగాణా గ్రామాల్లో స్త్రీలు తమ బతుకమ్మలను దొరల గడీల దగ్గరకు తీసుకువచ్చి తమ ఆటలు, పాటలు, అక్కడే సాగించాలి. అది దొరల గౌరవానికొక గుర్తు, పండుగ అని కాస్తోకూస్తో అలంకరించుకొని వచ్చిన స్త్రీలను హాస్యాలాడుతూ దొరలు ఆ గౌరవాన్ని అందుకొంటారు. ప్రజల ఆటలు, పాటలు, పండుగలు దొరల ఆనందానికే అవుతాయి. దొరలు మాట్లాడే మాటలు, చూసే చూపులు విసిరే ఛలోక్తులు ఆ స్త్రీల హృదయాలను తూట్లు పొడుస్తాయి. అవమాన కారణాలవుతాయి. పండుగ సంతోషమే మాయమైపోతుంది. గత్యంతరం లేక ప్రతి ఏడాది ఈ దుర్భర స్థితిని ఎదుర్కోక తప్పదు.

రైతుకూలీ సంఘాలు వచ్చాక భూమిమీద హక్కు కోసమే కాక ప్రజల సాంస్కృతిక హక్కుల పరిరక్షణ కోసం కూడా పోరాటాలను చేపట్టవలసి వస్తుంది.

ఆ క్రమంలో సంఘం నాయకత్వాన సాంస్కృతిక రంగాలలో దొరల పెత్తనాన్ని ఎదిరించటంలో భాగంగా ఎప్పుడూ దొర యింటిముందు ఆడే బతుకమ్మను ఆడకపోవటం, దసరాకు దొరకు 'మామూలు'గా యివ్వాల్సిన గొర్రెలను యియ్యకపోవటం. విజయదశమి నాడు జమ్మి తెంపే సంప్రదాయంలో మొదటి అవకాశం దొరకు యియ్యకపోవటం. ప్రజల కార్యక్రమాలు అయినాయి. వీటిని ఇతివృత్తంగా కలిగిన పెద్దకథ 'ఎత్తున పిడికిళ్ళు'. సాంస్కృతిక రంగాల్లో కూడా ప్రజలు తమను ఎదిరించటం సహించలేని దొరలు అందుకు నాయకత్వం వహించిన వాళ్ళ పై దొంగకేసులు బనాయింప చేసి, ప్రజల నైతిక ధృతిని దెబ్బకొట్టే ప్రయత్నాలు చేస్తుంటారు. అయినా ప్రజలు పిడికిళ్ళు బిగించి ముందుకే పరిక్రమించాలి అని ఈ కథ చెబుతుంది.

గ్రామంలో నీతిని, ధర్మాన్ని తామే కాపాడుతున్నామనే పేరుమీద రకరకాల కారణాలతో పంచాయతీలు నిర్వహిస్తూ జనం నుండి దండుగలు వసూళ్ళు చేస్తుంటారు భూస్వాములు. అటువంటి ఒక భూస్వామి పెళ్ళి కాకుండానే గర్భవతి అయిందన్న కారణం చేత ఒక స్త్రీని ముద్దాయిగా నిలబెట్టి ఆమె గర్భవతి కావటానికి కారకుడైన యువకుడు ఆమెను పెళ్ళాడటానికి తాను సిద్ధంగా వున్నానని చెబుతున్నా వినకుండా పెద్ద మొత్తంగా దండుగ వసూలు చేయటానికి ప్రయత్నిస్తాడు. దండుగ చెల్లించకపోతే కుల బహిష్కరణ తప్పదని హెచ్చరిస్తాడు. ఈ అధికారాన్ని దుర్మార్గాన్ని, బెదిరింపులను సంఘచైతన్యం పొందుతున్న ఆ యువకుడు ఎదిరించి కాబోయే మామ దండుగ చెల్లించాల్సిన అవసరం లేదని నిర్ణయించి నిలబడటం 'వెలి' కథలో ఇతివృత్తం.

సాంస్కృతిక రంగాలలో దొరల పెత్తనాన్ని ఎదిరించటమే కాదు పోరాట అవసరాల కనుగుణంగా సాంస్కృతిక కళారంగాలు తమ స్వరూప స్వభావాల్ని మార్చుకోవాల్సిన అవసరం కూడా వుంది. ఈ అవసరాన్ని అల్లం రాజయ్య వ్రాసిన 'కథ' స్పష్టం చేస్తుంది. ఇద్దరు జంగాలు పాత కథలు చెప్పి పొట్ట నింపుకోవటం కష్టంగావున్న సమయంలో జనం కథలు చెప్పాల్సిన అవసరాన్ని గుర్తించి అందుకనుగుణంగా కొత్త కథలు చెప్పటం ప్రారంభించి జనాన్ని ఉత్తేజితులను చేయటం తద్వారా తమ బ్రతుకు తెరువును చూచు కోవటం ఇందులో కథ.

భూమి పోరాటమంటే పోరాటంలో పాల్గొనే జనం వుంటారు. వాళ్లను నడిపించే నాయకత్వముంటుంది. జనమన్నా నాయకత్వమన్నా మనుషులే గనక వాళ్ళకు భ్రమలు, భయాలు, ప్రేమలు, మోహాలు, సందేహాలు అనేకం వుంటాయి. జనం నుండి నాయకత్వం నాయకత్వం నుండి జనం అనుక్షణం ప్రేరణ పొందుతూ పురోగమించటం మీదనే విప్లవోద్యమ విజయాలు ఆధారపడి వుంటాయి. అందుగుల మొండయ్య వ్రాసిన 'పంట' అనే కథ నాయకత్వం ప్రజలనుండి నేర్చుకొనే క్రమాన్ని చెప్తే గోపీ వ్రాసిన 'తల్లిచేప', బి.యస్. రాములు వ్రాసిన 'మమకారం' కథలు ప్రజలకు నాయకత్వం ధైర్యస్థయిర్యాల నివ్వటాన్ని, బాధ్యత వహించటాన్ని చిత్రించాయి. పోరాటాలకు నాయకత్వం వహించే పార్టీ కార్యకర్తలు ఒక దశలో నిర్బంధాల మధ్య పోరాటాన్ని కొనసాగించటమెట్లా అన్న సందేహంలో పడ్డప్పుడు ప్రకృతితో పోరాడుతూ భూమిని దుక్కిదున్నే జనమే వాళ్ళకు ధైర్యం చెప్పటం 'పంట' కథకు ఇతివృత్తం. రాళ్ళు రప్పలుగా వున్న భూమిని చదును చేయటం, దున్నటం, విత్తుపెట్టటం ఇట్లా పంట చేతికందేవరకు ఎన్ని దశలుంటాయో, ఎన్ని ఈతిబాధలను ఎదుర్కోవాలో అనుభవంలో తెలిసిన జనం పోరాటం విజయాల పంటలు పండటానికి కూడ అన్ని దశలుంటాయని లౌకిక జ్ఞానం ద్వారా గ్రహిస్తారు గ్రహించిన దానిని కార్యకర్తలకు తెలియచేసి వాళ్ళ ఉత్సాహశక్తిని పెంపొందిస్తారు.

జనం తమ జీవితానుభవాల నుండి చైతన్యం పొందుతూ తమలాంటి అనుభవా లున్నటువంటి జనాలందరి సంక్షేమం కోసం ఉన్నతమూ, ఉత్తమమూ అయిన కార్యాచరణలోకి దిగుతారు. వాళ్లు భూమికోసం పోరాటాలు నిర్వహిస్తారు. వాళ్ళు ఏ మానవ సంబంధాలలో లేని ఏ ఆకాశంనుండో ఊడిపడ్డ కారణజన్ములు కారు. వాళ్ళకు తల్లి దండ్రులుంటారు. ఇతర రక్తసంబంధీకులుంటారు. ఆ రక్తసంబంధీకులు పోరాట మార్గాలలో నడుచుకొంటూ వెడుతున్న తమ వాళ్ళ గురించి ఏమనుకొంటున్నారు? ఉద్యమ నాయకత్వం వహించే పార్టీకి వాళ్ళపట్ల ఎటువంటి బాధ్యత వుంటుంది? అనే ప్రశ్నలకు సమాధాన రూపంగా వచ్చిన కథలు 'తల్లిచేప', 'మమకారం'. తల్లిచేప కథలో తల్లికి పేదరికం తనమీద చేసే దాడులు తెలుసు. ఆ పేదరికం ఊళ్ళో పెద్దల పుణ్య ప్రసాదమనీ తెలుసు. దానికి మూల కారణాలు తెలిపి దున్నేవాడికి భూమి హక్కు కోసమై పెద్దకొడుకు పూర్తి

కాలం కార్యకర్తగా పనిచేస్తున్నాడు. ఆ కొడుకు కోసం ఆచూకీలు తీస్తూ పోలీసులు వచ్చిపోతున్నారు. కనిపిస్తే కాల్చేస్తామంటున్నారు. ఇది ఆ మాతృ హృదయం భరించలేక పోయింది. ముసలి వయస్సులో తన కొడుకు దగ్గర లేకపోయాడనీ బాధపడింది. 'పేదోల్ల సుఖాని'కై 'పేదోల్ల రాజ్జెం' తేవడానికి తన కొడుకే కావలసి వచ్చాడా అని ఆక్రోశిస్తుంది. పార్టీ కార్యకర్తలు ఆ తల్లి పట్ల సాదరపూర్వకంగా ప్రవర్తించి, ఆ తల్లి ధైర్యం, స్థయిర్యం పెంచే ప్రయత్నం చేస్తారు. కొడుకు ఆచూకీ చెప్పమని పోలీసులు తనను చావుదెబ్బలు కొట్టటంతో తనూ కొడుకు మార్గాన్ని అనుసరించటం అనివార్యమన్న విషయాన్ని ఆ తల్లి గ్రహించటం ఈ కథకు ఇతివృత్తం. ఈ కథలో పోరాట మార్గంలోకి వెళ్ళిన కొడుకు. గురించి దుఃఖపడుతున్న తల్లి ధైర్యస్థయిర్యాలను పెంచటానికి పార్టీ కార్యకర్త డేవిడ్ ఆమెకు ఒక కథ చెబుతాడు. కాలానికి, కష్టానికి ఎదురు నిలిచి వేటగాళ్ళకు చిక్కకుండా తాను తప్పించుకొంటూ తన యిద్దరి పిల్లల్ని తప్పిస్తూ మడుగు నుండి మడుగుకు మారుతూ వెళ్ళిన తల్లిచేప కథ అది. కథలో కథగా వచ్చే ఆ కథ మౌఖిక సంప్రదాయ కథన రీతిలో ఝరీ వేగంతో నడుస్తుంది. అసలు కథకు జనాన్ని, జీవాన్ని, సౌందర్యాన్ని యిచ్చిన కథ ఈ అంతర్ కథ. ఆ కథ చెప్పటం పూర్తిచేసి డేవిడ్ లేచి నుంచునేటప్పటికి అతనితోపాటే కథకుడికి ఆ వాతావరణాన్ని చూడటానికి భయమేసిందట. ఆ రకంగా అక్కడి వాతావరణం ఎంతో బరువెక్కిందని, విషాద నిశ్శబ్దం అక్కడ వ్యాపించిందనీ రచయిత సూచిస్తాడు. ఆ కథ పూర్తయ్యేసరికి ఆ వాతావరణ కాదు బరువెక్కేది, పాఠకుల గుండెలు కూడా బరువెక్కుతాయి. జీవిత వాస్తవాలను సెంటిమెంట్లను కలబోసిన ఆ కథ, ఆ కథనం మనలో గొప్ప 'కదలిక'కు ప్రేరణ అవుతుంది.

పోరాట మార్గంలోకి వెడుతున్న కొడుకు గురించి ఆందోళన చెందుతున్న ముసలి తల్లి అప్పటికే కొడుకు పోరాట మార్గంలోకి వెళ్ళిపోగా అతను వెళ్ళిన బాట సరిఅయిందేనన్న అవగాహనతో ఊళ్ళోవుండి సంఘం పనులు చేస్తున్న మరో ముసలి తండ్రినుండి స్ఫూర్తిని పొందటం 'మమకారం' కథకు ఇతివృత్తం. రైతులకు భూమిమీద వుండే మమకారం తల్లిదండ్రులకు పిల్లలమీద వుండే మమకారం లాంటిది. భూమిమీద మమకారం పిల్లలమీద మమకారాన్ని కూడా జయిస్తుంది. తాత తండ్రుల కాలంలో తాము ఏ భూముల నుండి అన్యాయంగా

అక్రమంగా బేదఖళ్ళు చేయబడ్డారో ఆ భూములను తిరిగి సంపాదించటం కోసం పిల్లలను భూమికోసమైన పోరాటమార్గాల ననుసరించేటట్లు ప్రోత్సహించిన తల్లిదండ్రుల కథ ఇది. పెద్దవాళ్ళయి చేతికి అందివచ్చిన కొడుకులు సంఘ కార్యకలాపాలలో పూర్తిగా నిమగ్నమైపోయి తల్లిదండ్రుల పోషణ భారాన్ని స్వీకరించలేని పరిస్థితిలో వున్నప్పుడు సంఘం తానై ముందుకు వచ్చి వారి సంక్షేమాన్ని గురించి పట్టించుకొని వాళ్ళకు అండగా నిలబడటాన్ని గురించి కూడా ఈ కథ చెబుతుంది.

## II

ఈనాడు తెలంగాణా పోరాటం నైజాం తెలంగాణా పోరాటంలాగే కేవలం భూమి పోరాటం మాత్రమే కాదు. ఆనాడు లేని పరిశ్రమలు ఈనాడు కొద్దిగానో గొప్పగానో అభివృద్ధి చెందాయి. అందువల్ల పోరాటం ఆయా పారిశ్రామిక రంగాలకు కూడా విస్తరించి నడుస్తున్నది. ఈనాడు తెలంగాణాలో ముఖ్యమైన పరిశ్రమ బొగ్గు పరిశ్రమ. సింగరేణి, గోదావరిఖని, బెల్లంపల్లి మొదలైనచోట్ల బొగ్గు తవ్వకపు పరిశ్రమలున్నాయి. అక్కడ బొగ్గుబావి కార్మికులు తమతమ సమస్యల పరిష్కారానికై సమ్మెలు కట్టి పురోగమిస్తున్నారు. తమ సమస్యలు, తమ విజయాలు, తమ ఓటములు ఇవన్నీ ఆ బొగ్గుగని కార్మికులను రచయితలను చేశాయి. ఇట్లా వచ్చిన కథలల్లో 'కార్మిక' వ్రాసినవి ఎక్కువగా వున్నాయి.

బొగ్గుబావి కార్మికులు తెలంగాణా భూస్వాముల 'భూదాహం' వల్ల భూములను కోల్పోయి విధిలేక కార్మికులుగా మారినవాళ్ళు, దున్నుకొని బ్రతకటానికి వున్న కాస్త భూమిని పోగొట్టుకొని ఊరు తరుమగా బతుకుతెరువు కోసం బొగ్గు గనుల్లోకి వచ్చి పడ్డవాళ్ళు. బొగ్గుగనుల్లో పరిస్థితులు తాము ఊళ్ళలో ఎదుర్కొన్న వాటికంటే దారుణంగా, భయంకరంగా ఉండటంతో సంఘటితమై చేసిన పోరాటాలను చిత్రిస్తాయి ఈ కథలు. అల్లం రాజయ్య వ్రాసిన 'రాజీ' తుమ్మేటి రఘోత్తమరెడ్డి వ్రాసిన 'బొగ్గుపొరల్లో...' కార్మిక వ్రాసిన "పిచ్చోడు" కథలు బొగ్గు బావుల్లో అనారోగ్య వాతావరణంలో పనిచేసి, శారీరక మానసిక సత్తువలను కోల్పోతూ, రక్షణలేని పని విభాగాలల్లో ప్రమాదాలకు గురి అవుతూ ప్రాణాలను కోల్పోతూ తమ భద్రత కోసం, బ్రతుకు కోసం, విముక్తి కోసం పోరాట మార్గాలను పట్టిన కార్మిక వర్గ స్వభావాన్ని చిత్రించాయి.

బొగ్గు పొరల్లో పనిచేస్తూ తమ శ్రమశక్తులనుపయోగించి వెలికితీసే బొగ్గు ఇవతలికి రావటంతో కార్మికుడిది కాకుండా పోతుంది. ఫలితంగా బొగ్గుబావుల్లో పనిచేసే వాళ్ళ యిళ్ళల్లో కుంపట్లోకి బొగ్గు వుండదు. చుట్టుపక్కల ఎక్కడ పడితే అక్కడ తాము తవ్వి తీసిన బొగ్గు కుప్పలు కనబడుతుంటే కార్మికులు తమ ఇంటి అవసరానికై ఆ బొగ్గు కాస్త తీసుకొంటే అది యాజమాన్యానికి నేరమై కనిపించటంలోని వైరుధ్యాన్ని చిత్రిస్తుంది కార్మిక వ్రాసిన 'కుంపటి' అనే కథ. తను సృష్టించిన వస్తువు తనకంటే భిన్నమైనది అయి తనకు అందకుండ పోతున్న దుర్భర 'పరాయీకరణ' దశలో కార్మికవర్గం వుండటాన్ని ఈ కథ సూచిస్తుంది.

తన శ్రమ శక్తులను వినియోగించి సృష్టించిన వస్తువే తనది కాకుండా అయినప్పుడు మరి ఏదీ కార్మికుడిదిగా వుండదు. తన శ్రమను కూలికి అమ్ముకొన్న కార్మికుడు తత్ఫలితంగా వచ్చిన ఆర్థిక స్థోమతతో తన అవసరాలన్నీ తీర్చుకోలేడు. ప్రాథమికావసరాలైన తిండి, గుడ్డ, నీరు వసతులకోసమే వెదుకులాడుకోవలసి వస్తుంది. బొగ్గు బావి కార్మికులు తాగే నీటికి కూడా నోచుకోకపోవటం, బిందెడు నీళ్ళ కోసం ఆఫీసర్ల ఇంటి చుట్టూ పడిగాపులు పడటం, వాళ్ళచేత చివాట్లు తినటం– సర్వసామాన్యమైనవి. బొగ్గుబావి కార్మికుల భార్యలు నీటి కోసం ఈ రకమైన తిప్పలు పడీపడీ సమ్మె కట్టి తమ వాడకు పంపులు సాధించుకోవటం ఇతివృత్తంగా తుమ్మేటి రఘోత్తమరెడ్డి 'నీళ్ళ తగవు' అనే కథ వ్రాశాడు.

కార్మికులు పనిచేసే స్థలాల్లోనే కాదు సమ్మెలకు దిగేది– నివసించే స్థలాల కోసం కూడా సమ్మెలు కట్టాల్సి వుంటుంది. నీడ కోసం, నీరు కోసం అన్నిటికీ అనుక్షణం జీవన సమరం చెయ్యాల్సి వుంటుంది. అలాంటి సమరాలను చిత్రించే కథలల్లో కార్మిక వ్రాసిన 'నీడకోసం' అన్న కథ మానవ సంబంధాల మూలతత్త్వాలను స్పృశించే కథ. కొడుకు పెండ్లి చేసి కోడల్ని తోలుకరావటానికి ఇంటి వసతి లేక ఇబ్బంది పడుతూ తమ పిల్లల మూగ వేదనలు అర్థం అవుతున్నా కూడా నిస్సహాయులుగా నిలబడిపోయిన వీరయ్యలంతా తమ సామాజిక సమస్యను పరిష్కరించుకోటానికి సంఘటితంగా ప్రారంభించిన పోరాట ప్రయత్నాన్ని ఉత్తేజకరంగా చిత్రించాడు కార్మిక.

అసలు మానవ సంబంధాల మొత్తానికి కొలమానం స్త్రీ పురుష సంబంధ మంటారు. మానవ సంబంధాల మొత్తానికి సారాంశ రూపమైన విస్పష్టమైన

అనివార్యత స్త్రీ పురుష సంబంధంగా వుంటుంది. దాని నుండి కూడా మనుషులను వేరుచేయటానికి అధికార దృక్పథంతో ప్రవర్తించే పాలనా వ్యవస్థ తన దుర్మార్గాన్ని ప్రజలు భరించలేని స్థితికి తీసుకొని పోయినట్లు. ఆ స్థితిని ప్రజలు కొంతకాలం దుఃఖభారంతో కుంగిపోతూ మౌనంగా అనుభవిస్తారు. ఆ కాలంలో కూడా కవులు ఆ దుఃఖభారాన్ని వర్ణిస్తారు – కాళిదాసులాగా. ప్రియా విరహానుభవము సంవత్సరం పాటు శిక్షగా ధనపతి చేత విధింపబడిన ఒకానొక భృత్యుని దుర్భర వేదనను 'మేఘసందేశ' కావ్యంగా రచించాడు ఆయన. అయితే ప్రజలు ఎప్పుడో ఒకప్పుడు తమ స్థితిగతులను బాగు చేసుకోవటానికి ధనపతులకు ఎదురు తిరుగుతారు. అప్పుడనివార్యంగా ప్రజలు పోరాట మార్గానికి నెట్టబడతారు. ఆ విషయాన్నే కార్మిక 'నీడ కోసం' అన్న కథగా వ్రాశాడు. తల్లిదండ్రులుగా సూరమ్మ, వీరయ్యల హృదయా వేదనను, భార్య వియోగ సంతప్తుడుగా వాళ్ళ కొడుకు నారాయణ అనుభవించిన మూగవేదననూ, అది అక్కడి కార్మిక కుటుంబాలందరికీ వున్న "గుడిశె గుడిశె భాగోతమే"నన్న అవగాహన గల లక్ష్మిరాజం నాయకత్వంలో అంతా "ముందుబడి చెయ్యాల"న్న ఉత్సాహంతో ఆచరణలోకి దిగటాన్ని, దాన్ని యాజమాన్యం బలప్రయోగంతో ఎదుర్కొనటంతో – కార్మిక కుటుంబాలు మరొక ఎత్తుగడతో ధైర్యంగా ముందుకుపోవటాన్ని ఆశావహంగానూ, హృదయా వర్జకంగానూ రచించాడు కార్మిక.

సింగరేణి కథలు అనే శీర్షిక క్రింద పరంపరంగా సమ్మె– విస్తరణ, నిర్బంధంలో సమ్మె, విజయం మనదే, లీడర్, ఇంధనం మొదలైన కొన్ని కథలను వ్రాశాడు కార్మిక. ఈ కథలు బొగ్గు గనుల్లో యజమానుల కార్మిక వ్యతిరేక ధోరణిని, ట్రేడ్ యూనియన్ల యాజమాన్య అనుకూల విధానాన్ని నిరసిస్తూ, వ్యతిరేకిస్తూ పనిహక్కుల కోసం కార్మిక వర్గం సమ్మెలకు దిగటాన్ని, పోలీసుల నిర్బంధం మధ్య సమ్మెలను కొనసాగించటాన్ని విజయాలను సాధించటాన్ని చిత్రించాయి. అయితే ఈ విజయాలు శాశ్వతమైనవి కావని మేనేజిమెంటు, ప్రభుత్వము, పోలీసులు, రివిజనిస్టు ట్రేడ్ యూనియన్లు వాటిని భగ్నం చేసే ప్రయత్నాలు చేయటం జరుగుతుందని కార్మికులకు తెలుసు. అందువల్ల తమ పోరాటం అంతిమంగా కార్మిక రాజ్యం వచ్చేవరకు కొనసాగుతుందన్న అవగాహనతో దీర్ఘకాలిక పోరాటానికి కార్మికులు సన్నద్ధమై వుండటాన్ని కూడా ఈ కథలు సూచిస్తాయి.

## III

తెలంగాణాలో మరొక పరిశ్రమ బీడిలు తయారుచేయటం. నిజామాబాదు, ఆదిలాబాదు, మెదక్, కరీంనగర్ జిల్లాలు నాలుగు కలిసి నాలుగు లక్షలకు పైగా బీడీ కార్మికులున్నారు. వీళ్ళల్లో ఎక్కువమంది స్త్రీలు. ప్రభుత్వం బీడీ కార్మికులకు కనీస జీతాలను నిర్ణయించింది. సెలవు, బోనసు, వైద్య సదుపాయాలనిచ్చింది. కానీ ఆచరణలో బీడీ కార్మికులకు ఇవేవీ అందుబాటులో లేవు. బీడి కార్మికుల యూనియన్లు వున్నా అవి యాజమాన్య అనుకూల విధానాన్ని అనుసరిస్తుండటం వల్ల బీడీ కార్మికుల ప్రయోజనాలేవీ నెరవేరటంలేదు. ఇవన్నీ కలిసి- బీడీ కార్మికులను – సంఘటిత శక్తిగా రూపొంది తమ ప్రయోజనాల కోసం సమ్మెలు కట్టి పోరాటాలు చెయ్యడానికి ప్రేరేపించాయి. ఈ విధంగా బీడి కార్మికులు పోరాట మార్గంలోకి అడుగు పెట్టడాన్ని ఇతివృత్తంగా చేసుకొన్న కథలు తెలంగాణా పోరాట సాహిత్యంలో భాగంగా వస్తున్నాయి. ఎన్నార్ భోలా వ్రాసిన 'ఆకలి తీర్మానం' కథ ఇటువంటిదే. వరంగల్లులోని కాశీబుగ్గ బీడీ కార్ఖానాలో పనిచేసే స్త్రీ స్వగతంగా సాగిన ఈ కథ బీడీ కార్మికుల కష్టాన్ని, ఆకలిని వాళ్ళ మీద జరుగుతున్న దోపిడిని, పీడనను చిత్రిస్తుంది. అంతేకాదు, బీడికార్మికులు బీడీ ఆకును కత్తిరించటానికి ఏ కత్తెర్లు పట్టారో ఆ కత్తెర్ల చేతులనే ఏకంచేసి ఒకటై నిలిచి పోరు దారి నడవాలన్న సందేశాన్ని కూడా వాళ్ళ దృష్టికోణం నుండే అందిస్తుంది.

## IV

రోజంతా రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేస్తూ పనికి తగిన ప్రతిఫలం లేక శారీరకంగానూ మానసికంగానూ అలిసిపోయిన కూలీలు, కార్మికులు, శ్రామికులు తమ సమస్త బాధల నుండి విముక్తి పొందటం కోసంగాను ప్రొద్దుగూకే వేళకు సారా కొట్టు చేరి తాము సంపాదించినదాన్లో సగానికి పైగా 'తాగుడు'కు ఖర్చు పెడతారు. శ్రామికులు తాగి తమ సమస్యలను మరచి మత్తులో తూగుతుంటే తనకు క్షేమం కనుక ప్రభుత్వమే సారా వ్యాపారాలను నిర్వహిస్తుంది. ఏడాదికొకసారి వేలం ద్వారా ఆ యేడు సారా వ్యాపారం ఎవరు చేయాలో ప్రభుత్వం నిర్దేశిస్తుంది. పెద్ద మొత్తంలో వేలంపాట పాడిన కాంట్రాక్టర్లు మళ్ళీ చిన్నచిన్న దుకాణాలకు అమ్మకపు అవకాశమిచ్చి లాభాలు చేసు కొంటారు. దానితో పాటు లాభాలను

సంపాదించటానికి వీలుగా సారా ధరలను విపరీతంగా పెంచుతారు. తాగుడుకు అలవాటుపడిన శ్రామికులు అందుకోసం ఇదివరకు తమ ఆదాయంలో సగం ఖర్చు పెట్టినవాళ్ళు ఇప్పుడు మొత్తం అందుకే ఖర్చు చేస్తారు. అంతేకాదు సారా కాంట్రాక్టర్ల సామ్రాజ్యంలో తాగనివాళ్ళు, పెరిగిన ధరల దృష్ట్యా తాగటం మానుకొన్న వాళ్ళు, మానుకోలేక తమ వినియోగం కోసం గుడంబా కాచుకొనేవాళ్ళు నేరస్థులవుతారు. కఠినంగా శిక్షింపబడతారు. తెలంగాణాలో ఈ సారా సామ్రాజ్యంలో కూలివాళ్ళ మీద బడుగువర్గాల మీద, కార్మికుల మీద సాగుతున్న దోపిడి దౌర్జన్యాల నెదుర్కోవటం కోసం, పెరుగుతున్న సారా ధరలను వ్యతిరేకించటం కోసం మూడు నాలుగేళ్ళుగా 'సారా పోరాటాలు' జరుగుతున్నాయి. వీటిని ప్రతిఫలిస్తూ కథలు వచ్చాయి. 'ఆ కళ్ళు చూస్తున్నాయి. ఆ పిడికిళ్ళు బిగుస్తున్నాయి', 'సారాంశం', 'మరో సారాకథ' ఈ కోవలోవే. ఈ కథలు సారా ప్రపంచాన్ని అందులో కాంట్రాక్టర్లు దృష్టి కోణాలను, లాభదృష్టిని అందుకోసంవేసే ప్రణాళికలను, చేసే దౌర్జన్యాలను, తమ మార్గానికి అడ్డు వచ్చిన వాళ్ళను ప్రభుత్వ పోలీసుల మద్దతుతో మట్టుపెట్టించటాన్ని చిత్రిస్తాయి. అంతేకాదు, ప్రజలు చైతన్యవంతమైన నాయకత్వంలో ఈ సారా దోపిడీని గుర్తించటాన్ని దానిని ఎదుర్కొని ఎలుగెత్తి చాటటాన్ని కూడా చూపిస్తాయి. సారా కాంట్రాక్టర్ల పక్షమే అయిన న్యాయస్థానాలు ఈ బడుగు జనాల ఆర్గ్యుమెంట్ వినటానికి ఎట్లా వ్యతిరేకిస్తాయో 'మరో సారా' కథ చిత్రించింది.

## V

ఇప్పటివరకు ప్రస్తావించబడ్డ తెలంగాణా రైతాంగ పోరాట సాహిత్యం, బొగ్గు బావి కార్మిక పోరాట సాహిత్యం- ఇవన్నీ తెలంగాణాలోని మైదాన ప్రాంత పోరాట ప్రతిఫలన రూపాలు. తెలంగాణా పోరాటానికి ఇదికాక మరొక ముఖం కూడా వుంది అది గిరిజన రైతాంగ పోరాట సంబంధమైనది. నిజానికి గిరిజన రైతాంగ పోరాటానికి తెలంగాణాలో మైదాన ప్రాంత రైతాంగ పోరాట చరిత్రకంటే ప్రాచీన చరిత్ర వుంది భారతదేశంలో ఆదివాసీ పోరాటాలు 1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామానికి కాస్త అటూఇటూగా మొదలయ్యాయి. ఆ క్రమంలో తెలంగాణాలో ఆదిలాబాదు జిల్లాలోని ఉట్నూరు తాలూకాలో 1858లో గోండు తిరుగుబాటు జరిగింది. మూడువందల మంది గోండులను చంపటంతో బ్రిటిషు

ప్రభుత్వం ఆ తిరుగుబాటును అణచివేసింది. వాళ్ళ నాయకుడు రాంజీగోండు నిర్మల్‌లో ఉరితీయబడ్డాడు. అప్పటినుండి జరుగుతున్న ఆదివాసీ పోరాటాలల్లో చెప్పుకోతగింది నైజాం సామంతరాజుకు వ్యతిరేకంగా తమ ప్రాంతంలోని సర్వహక్కులు తమకే చెందాలని జోడెన్‌ఘాట్ కేంద్రంగా కొమురం భీం నాయకత్వంలో జరిగిన సాయుధ తిరుగుబాటు, 1925-26 సంవత్సరాలలో ఆదిలాబాద్ ప్రాంతాలల్లో అమలుకు వచ్చిన అడవి సంరక్షణ చట్టాలు, మైదాన ప్రాంతాల నుండి వచ్చే గిరిజనేతర భూస్వాముల షావుకార్ల వడ్డీ వ్యాపారస్థుల క్రూరమైన దోపిడి - ఇవన్నీ కలిసి పోడు వ్యవసాయం చేసుకొనే గిరిజనులను వాళ్ళ భూముల నుండి బేదఖలు చేస్తూ అడవి లోతట్టు ప్రాంతాలకు తరుముతూ వచ్చాయి. ఈ పరిస్థితులు కొమురం భీము నాయకత్వంలో భూమి మీద హక్కు కోసం సాయుధులై తిరగబడటానికి గోండులను ప్రేరేపించాయి. ఈ తిరుగుబాటు ఉద్యమం దాదాపు ఏడు నెలలు నైజాం పోలీసుల దాడిని ఎదుర్కొంటూ సాగి చివరకు 1940 సెప్టెంబరు 1వ తేదీ నాటికి అణచివేయబడింది. అప్పటికి మైదాన ప్రాంతాల రైతాంగం సంఘటితం కావటమే ఇంకా ఒక దారి పట్టలేదు. తెలంగాణా రైతాంగ పోరాటం ఒకదారి పట్టాక కూడా గిరిజన రైతాంగ పోరాటాల గురించి ఎవరూ పట్టించుకొన్నట్లు లేదు తెలంగాణా పోరాటపు వివిధ దశలను కథలుగా ప్రతిఫలించిన తెలుగు సాహిత్యంలో కొమురం భీము నాయకత్వాన జరిగిన సాయుధ తిరుగుబాటును చిత్రించిన రచన ఏది రాకపోవడాన్ని బట్టి అట్లా అనుకోవలసి వస్తున్నది.

అయితే 1975 తరువాత తెలంగాణాలో గిరిజనోద్యమాలకు సిపిఐ(యంఎల్) (పీపుల్స్‌వార్ గ్రూపు) తన నాయకత్వాన్నందించింది. పొరకల పార్టీగా ఆదివాసుల అభిమానాన్ని చూరగొంది ఫలితంగా నలభై ఏళ్ళ క్రిందటి కొమురం భీం పోరాట వారసత్వాన్ని గుర్తుచేసుకొని తెలంగాణా గిరిజన రైతాంగం గిరిజన రైతు కూలీ సంఘాలుగా సంఘటితపై తమపై సాగుతున్న దోపిడీ దౌర్జన్యాలను, అణచివేతను ప్రతిఘటించటానికి పూనుకొన్నది. అందులో భాగంగానే గిరిజన రైతుకూలీ సంఘం తన మొదటి మహాసభను ఆదిలాబాదు. జిల్లాలోని ఇంద్రవెల్లిలో 1981 ఏప్రిల్ 20వ తేదీన జరుపుకోవటానికి నిర్ణయించుకొంది. ఆంధ్రప్రదేశ్ ప్రజా ప్రభుత్వ పోలీసులు ఆ సభ జరగకుండా అడ్డుపడటం కోసం సభకు వస్తున్న జనం మీద

కాల్పులు జరిపారు. దొడ్డి కొమురయ్య మరణంతో ఆనాటి తెలంగాణా పోరాటం పోటెత్తినట్లుగా ఇంద్రవెల్లిలో పోలీసు కాల్పులకు గురి అయి ఆదివాసులు మరణించటంతో గిరిజన రైతాంగ పోరాటాలు మరింత ఉధృతమయ్యాయి.

ఇంద్రవెల్లి సంఘటనకు గిరిజన రైతాంగ పోరాటాలను ఉధృతం చేయటంలో ఎంత చారిత్రక పాత్ర వుందో గిరిజన పోరాట సాహిత్యాన్ని సృజించటంలోనూ అంత చారిత్రక పాత్రవుంది. 1981 ఏప్రిల్ నెలలో ఆ సంఘటన జరిగితే అది తక్షణమే సాహిత్య సృజనకారులను కూడా ఆందోళనకు లోనుచేసి గోండులను, గోండు పోరాటాలను ప్రజలకు పరిచయం చెయ్యమని ఒత్తిడి చేసింది. 1981 మే 1 జూన్ సృజనలో కన్నీటి కథ, నీటి కథ, పెళ్ళికావాలి, వాయిదా, ఐదు రూపాయల కథ, తుడుం అనే అయిదు కథలు ప్రచురించబడ్డాయి. వీటిల్లో మొదటి నాలుగు కథలు వెంకన్న వ్రాసినవి. చివరిది గోదావరి వ్రాసింది. అవి కథలు కావు, గిరిజనుల జీవితాన్ని చూపించే రేఖాచిత్రాలు. మొదటి కథ తాగేనీళ్ళ కోసం గిరిజనులు ఎన్ని బాధలు పడాల్సివస్తున్నదో చెబితే ఆ తరువాత మూడు కథలు ఆచారాల పేరిటనో, సంప్రదాయాల పేరిటనో అప్పులు చేసినవాళ్ళు షావుకార్ల చక్రబంధంలో ఇరుక్కుపోయి తమ భూములను కోల్పోవటాన్ని, షావుకార్ల మోసానికి వంచనకు గురై తరతరాలకు కూడా తీరని అప్పుల కోసమే పంటలు పండించటాన్ని చిత్రిస్తాయి. తుడుం కథ గిరిజన ప్రాంతాల్లో నక్సలైట్ల వేటకని వచ్చిన పోలీసుల దౌర్జన్యాన్ని గిరిజనులు తుడుం పిలుపు ద్వారా ఒక్కచోట సమావేశమై తిప్పికొట్టటాన్ని చిత్రిస్తుంది.

వీటికంటే ముందే జనవరి సృజనలో 'గంగజిమ్మ' కథ వచ్చింది. గిరిజన ప్రాంతాలలో పార్టీ నీళ్ళలో చేపలా ప్రజల మధ్య పనిచేయటాన్ని ప్రజలు గొప్ప క్రమశిక్షణతో పార్టీ కార్యకర్తలను కడుపులో పెట్టి కాపాడుకోవటాన్ని చిత్రిస్తుందీ కథ. సాహూ వ్రాసిన 'రక్తపింజెర' కథ అడవి బొంగును కొట్టి కుప్పలు గట్టి లారీలకెత్తించటంలో, లారీల కోసం కొత్త మట్టిరోడ్లు వేయించటంలో తక్కువ కూలి ఇస్తూ ఎక్కువ పని తీసుకొంటూ గిరిజనులను దోపిడీకి, దౌర్జన్యాలకు గురిచేస్తున్న కంపెనీల స్వభావాన్ని చిత్రిస్తుంది. సంఘ ప్రేరణతో తమ మీద సాగుతున్న అణచివేతకు వ్యతిరేకంగా గిరిజనులు సంఘటితంగా పురోగమించే ప్రథమ దశలను కూడా ఈ కథ చిత్రించింది, 'మరట్ తుడుం పాయానా'

(మనమే తుడుం గొట్టాలె) కథ అడవి నరికి దున్నుకు బ్రతుకుతున్న గిరిజనులు సంఘటితులై భూమి నుండి తమను తరిమివేసే బేదఖలు నోటీసులు తీసుకోకుండా, తమ పంటపొలాలను ప్రభుత్వం పిచ్చితుమ్మల ప్లాంటేషన్లుగా చేయటాన్ని వ్యతిరేకిస్తూ, శత్రువు ఏ ఆయుధంతో వస్తే తాము అదే ఆయుధాన్ని తీసుకొని ప్రతి ఘటించటానికి సిద్ధపడటాన్ని చిత్రించింది.

రగల్ రాజ్జెం మైసివాకట్ (ఎర్ర రాజ్యం గెలిచివస్తాం) కథ గిరిజన రైతాంగ పోరాటంలో భాగమైన కొన్ని యదార్థ సంఘటనలను చిత్రించింది. గిరిజన గిరిజనేతర పేదవర్గాల మధ్య వచ్చిన వైరుధ్యాలను పొరకల పార్టీ పరిష్కరించటం, మాంగనీసు తవ్వే కూలీలు కూలిరేట్ల పెంపుకోసం సమ్మె కట్టడం, సాత్నాలా ప్రాజెక్టు కట్టటం పూర్తయితే ముంపుకు గురి అయ్యే బోయగూడెం, సాత్నాలా, మాంగూరు జనాలు తమకు నష్టపరిహారం చెల్లించకుండా ఆ పనిచెయ్యడానికి వీల్లేదని ప్రతిఘటించి పోలీసు దాడిని తిప్పికొట్టడం మొదలైన సంఘటనలు ఇందులో కథారూపాన్ని పొందాయి.

గిరిజన రైతాంగ పోరాటాలను ప్రతిఫలించిన కథాసాహిత్యంలో 'అడవిలో వెన్నెల'కు ప్రత్యేక స్థానం వుంది. బి.యస్. రాములు వ్రాసిన ఈ కథ ఉత్తమ కథగా కొడవటిగంటి కుటుంబరావు స్మారక బహుమతిని అందుకొంది. (1985). గిరిజన రైతు జీవితాన్ని వాళ్ళ సంస్కృతీ సంప్రదాయాల భూమికలో చూపిస్తూ అనుక్షణం ఫారెస్టు అధికారుల పీడనకు, దోపిడికి గురికావటాన్ని, నిర్బంధంగా వాళ్ళిచ్చే అతి తక్కువ కూలికే కంక బొగ్గు కొట్టటానికి పోవలసి రావటాన్ని, వాళ్ళు దున్నిన భూమిని పంట చేతికొచ్చే సమయానికి ఎవరో ఒక దొర తనదంటూ వచ్చి చేసిన కష్టాన్ని దోచుకోవటాన్ని షావుకార్ల అప్పులు, వడ్డీలు కలిసి పండించిన ధాన్యాన్ని నోటివరకు రాకుండా చేయడాన్ని చిత్రించింది ఈ కథ. పీడితులు, తాడితులు అయివున్న గిరిజనులను సంఘటితం చేసి వాళ్ళను వాళ్ళ శ్రమ ఫలితాలను దక్కించుకోవటానిపై పోరాట మార్గాలలో నడిపించటానికి పార్టీ అడవులలోకి ప్రవేశించటాన్ని కూడా ఈ కథ చిత్రించింది.

ఈ కథ అంతా ఎక్కువగా రచయిత దృష్టికోణం నుండి కథనంగా సాగుతుంది. తన చైతన్యాన్ని గిరిజన రైతాంగ వర్గపు చైతన్యంగా మలుచుకొన్న రచయిత కథనంలో వచ్చే ఉపమానాలు ఆ రైతాంగ చైతన్యాన్ని ప్రతిఫలిస్తాయి. అందువల్లనే

వర్షం వెలిసి తెల్లని మబ్బులు తేలాడే ఆకాశం రచయితకు పండిన పత్తి చేను గాలికి కదిలినట్లుగా అనిపిస్తుంది. వర్షపు నీటితో అప్పటివరకు తడితడిగా వున్న ఆకాశం సూర్యోదయ తొలి కిరణాల సంస్పర్శ పొందటంతో 'మట్టి పెనం మీద కాల్చిన జొన్నరొట్టెలా వెచ్చగా' వున్న భావన కలుగుతుంది. సూర్యోదయంతో అడవిలో వ్యాపించే వెలుగు అడవి జనం జీవితంలో ప్రధాన భాగమైవాళ్ళు సేకరించి తెచ్చి ఆరబోసిన విప్పపూల వాసన వ్యాపించటాన్ని తలపుకు తెస్తుంది. మడుగులో నీళ్ళు చూస్తే పలచగా కాచుకొన్న జొన్న అంబలిలో కదలికలు జ్ఞాపకం వస్తాయి. ఇట్లా ప్రకృతి, గిరిజన రైతాంగ జీవితం, వాళ్ళ శ్రమ, వాళ్ళ తిండి ఇవన్నీ మమేకమై కథకు మంచి వాతావరణాన్ని, సౌందర్యాన్ని సమకూర్చి పెట్టాయి. ఈ కథలో అడవి ఆంధ్రప్రదేశ్ సరిహద్దులు దాటి మహారాష్ట్రలోకి వ్యాపించిన అడవి, ఆదివాసీ పోరాటాలు రాష్ట్రాల సరిహద్దులను చెరిపివేసి ఆదిలాబాదు నుండి మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా మీదుగా మధ్యప్రదేశ్‌లోని బస్తర్ వరకూ వ్యాపించాయి. ఈ పోరాటాల వ్యాపన శీలానికి అక్షర రూపం 'అడవిలో వెన్నెల.'

'అడవిగాచిన వెన్నెల' అనే పాత భావాన్ని తిప్పి కొడుతుందీ కథ. అడవి, అందులోని జనం నాగరికుల దృష్టిలో పనికిరానివాళ్ళు – కనుక అక్కడ వెన్నెల కాయటం వాళ్ళ దృష్టిలో వృధా. వెన్నెల యొక్క చల్లదనాన్ని వెలుగును ఆస్వాదించగల రసికులు తామేకానీ ఆటవికులు కాదు. కానీ పోరాటాల యుగంలో అడవిలో వెన్నెల విప్లవోద్యమానికి ప్రతీక అవుతుంది. అడవిలో వెన్నెల అడివంతా వ్యాపించినట్లుగా విప్లవోద్యమాలు అడవంతా వ్యాపిస్తాయి. వెన్నెల చీకటి రాత్రుళ్ళల్లో అడవి బాటలను చూపించినట్లుగా విప్లవోద్యమం చీకట్లో దుఃఖంలో పీడనలో వున్న జనానికి వెన్నెలలాంటి మార్గాలను చూపిస్తుంది. అప్పుడు శివసాగర్ అన్నట్లు 'అడవిలోని వెన్నెల/ బహు పసందయిన వెన్నెల' అది జనశక్తికి కత్తుల కవాతు నేర్పుతుంది.

ఈ కథేతివృత్తాలు ఇంద్రవెల్లి సాత్నాలా సంఘటనల ఆద్యంతాల మధ్య వున్నాయి. గిరిజన రైతాంగ పోరాటాలు అణచివేతలను ఎదుర్కొంటూ ఎట్లా పురోగమిస్తున్నాయో నిరూపిస్తున్నాయి. 1981 ఏప్రిల్ నుండి 1984 మార్చికి పోరాటం తీసుకొన్న గుణాత్మక పరిణామాన్ని ప్రతిఫలిస్తున్నాయి.

## VI

మొత్తం మీద 1975 నుండి 1985 వరకు పదేళ్ళ మీద వచ్చిన తెలంగాణా ప్రజా పోరాట కథలను, పరిశీలిస్తే విషయ వైవిధ్యంతోపాటు నిర్మాణంలో కూడా ఉన్నత ప్రమాణాలు గలిగివుండటం కనబడుతుంది. తెలంగాణా పోరాటం తెలుగు కథ స్వరూపంలోనూ, స్వభావంతోనూ తెచ్చిన పరిణామం చెప్పుకోతగింది. అందులో భాషకు సంబంధించిందొక ముఖ్యాంశం. తెలంగాణా పోరాట కథ తెలంగాణా జనజీవితం నిత్యం మాట్లాడుకొనే భాషలో వుండాలని దానిని ఆచరణలో చూపిస్తున్నారు. తెలంగాణా రచయితలు, ప్రజలను గౌరవించి వాళ్ళ అభ్యుదయం కోసం, విముక్తి కోసం రచనలు చెయ్యాలన్న నిబద్ధతతో ప్రారంభమైనవారు ప్రజల భాషను కూడా గౌరవిస్తారు. ప్రజల కథల్ని, ప్రజల సమస్యల్ని, ప్రజల పోరాటాల్ని ప్రజల భాషలోనే వ్రాస్తారు. అట్లా వ్రాయటం ద్వారా కథలో, నవలలో ప్రాచీన మౌఖిక సంప్రదాయాన్ని పునరుజ్జీవింపచేశారు. అప్పుడిక కథ, నవల ఎవరికి వాళ్ళు చదువుకొనే సాహిత్య ప్రక్రియలు కావు. ఎవరో ఒకరు చదివి వినిపిస్తుంటే మిగిలినవాళ్ళందరూ విని తెలుసుకోవటానికి వీలుగా వుంటాయి. దానితో అవి సామూహిక ప్రక్రియలవుతాయి. ఒకళ్ళు చదివి వినిపించటమంటే పాటలాగా. నాటకంలాగా హృదయాన్ని కదిలించేటట్లు, ఆలోచనలు రేకెత్తించేటట్లు, దృశ్యాన్ని రూపు కట్టించేటట్లు చదివి వినిపించే అవకాశం వుంటుంది. ఆ రకంగా ఏ జనం ప్రయోజనాల కోసం వ్రాస్తున్నారో ఆ జనం దగ్గరకు కథ, నవలా ప్రక్రియలను మౌఖికంగా తీసుకువెళ్ళే ప్రయత్నం "కొలిమంటుకొన్నది" నవల దగ్గర నుండే ప్రారంభమయింది.

మౌఖిక సాహిత్యానికి కర్త ఎవరో తెలియదు. జానపద సాహిత్యం మౌఖిక స్వభావం కలిగిందే కనుక ఏ పాట ఎవరు వ్రాశారో ఎవరికీ తెలియదు. కథ నవలా సాహిత్య ప్రక్రియలలో మౌఖిక సంప్రదాయాన్ని అంగీకరించిన తెలంగాణా రచయితలు రచనలకు తమ కర్తృత్వాన్ని వదులుకోవటానికి కూడా సిద్ధపడుతున్నారు. అనేకమంది వ్రాసిన పాటలను రచయితల పేర్లు లేకుండా 'జన నాట్యమండలి పాటలు'గా ప్రకటించిన సంప్రదాయం నుండి గిరిజన రైతాంగ పోరాటాల గురించి వ్రాసిన కథలు రచయితల పేర్లు లేకుండా 'అడవిలో వెన్నెల' కథాసంపుటిగా వచ్చాయి. ఈ మధ్య (మార్చి 1985) కొమురం భీము నవలకు (1983) 'తన

చరిత్ర తనే పఠించి ఫక్కున నవ్వింది ధాత్రి...' అనే పేరుతో పరిచయం వ్రాస్తూ వరవరరావు 'అది రాజయ్య సాహులను రచయితలను చెయ్యటం కోసం, చారిత్రక నవలాకారులుగా నమోదు చేయటంకోసం కాదు... అది ప్రజల జీవన సాంస్కృతిక అవసరాన్ని తీర్చటం కోసం' (పు. 511) అని అన్నమాట తెలంగాణా పోరాట సాహిత్య సృజనకారులందరికీ వర్తిస్తాయి. వాళ్ళందరు కథలు, నవలలు వ్రాయటం కోసమే కథలు, నవలలు వ్రాయటంలేదు. రచయితలుగా తామొక ముద్ర వేసుకొని విలక్షణంగా కనిపించాలని వాళ్ళకు లేదు. తాము ప్రజల్లో ప్రజలుగా వుంటూ అనేక పనులతోపాటు ఇదీ ఒక పనిగా కథలు, నవలలు వ్రాస్తున్నవాళ్ళు, ఈలాంటి దశ కమ్యూనిస్టు సమాజంలోగానీ రాదని మార్క్సు, ఏంగెల్సు వ్రాశారు. కమ్యూనిస్టు సమాజం కొరకు కృషి చేస్తూ కళాకారులుగా కలలు కంటూ అందులో భాగంగా తమకు ప్రజలకంటే భిన్నంగా కనిపించాలని లేకపోవటాన్ని తెలియచేయటానికి ఈ విధంగా రచనలకు తమ కర్తృత్వాలను ఉపసంహరించుకొన్నారు అనిపిస్తున్నది. రచయితలు వ్యక్తిత్వం పేరుతో సమాజానికి దూరంగా వుండకుండా ప్రజల జీవన సాంస్కృతిక అవసరాలు తమ అవసరాలు ఒకటే గనుక ఆ అవసరాన్ని తీర్చటం తమకు చేతిలో పని గనుక కథలు వ్రాశారు, వ్రాస్తున్నారు. తెలంగాణ పోరాట సాహిత్య ప్రత్యేకత అది.